'శంబల' - ప్రభువు!

డా. వేదవ్యాస Ph.D., D.Litt.



త్వరలో విడుదల

'శంబల' - ప్రభువు!

రెండవ భాగం

ఇందులో...

- మానవసృష్టి జరిగింది ఇక్కడే
- నదికింద సొరంగంలో
- గంగ పుట్టిన పాద తీర్థం
- మంచు కోతి

'శంబల' - ప్రభువు!

భవిష్యత్తుకై – పరిశోధనాత్మక నవలిక !

మొదటి-భాగము

రచన

డా॥ వేదవ్యాస IAS, Ph.D., D.Litt.

ప్రచురణ :

యోగమిత్రమండలి

Yoga Brotherhood - USA (Inc).

హైదరాబాద్-33

2004

విషయసూచి

★ ముందు మాట .... *i*

1. గుఱ్ఱంమీద వీరుడు ! *1*

2. అంతర్జాతీయ 'అంతరిక్ష–సంస్థ'
"నాసా" – 'శిఖరాగ్ర సమావేశం!–I *27*

3. 'శంబల'కు – మా సాహసయాత్ర ! *47*

4. "సీక్రెట్-ఫైల్"–212 .... *48*

5. శంబలకు దారి ! *57*

6. ఈ 'చార్లెస్ బెల్' ఎవరు ? *81*

7. మంచు–పులి *88*

8. హిమాలయాలలో మా సాహసయాత్ర ! *97*

9. సాహసయాత్ర ప్రారంభం ! *108*

10. 'దేవతాత్మ' – ఈ సిద్ధుల తపోభూమి ! *112*

11. 'స్పటిక శ్రీచక్ర' – దేవాలయం ! *131*

12. వేట-కుక్కలు ! *141*

13. వెళ్ళాల్సిన మార్గమేది *147*

14. కైలాసపర్వతం ! – కైవల్యపర్వతం !! *157*

15. కొండదెయ్యాలు ! 167
16. లామా–దోర్జీ చోగ్యాల్‌తో సమావేశం 191
17. తాషీ-లామా 199
18. దత్తప్రభువు దర్శనం ! 209
19. “అఘోర–మూర్తి !” 213
20. సాహసబృందంలో లామా దోర్జీ చోగ్యాల్ చేరిక ! 231
21. లామా – ఆత్మకథ ! 237
22. ప్రవేశ-పరీక్ష ! 241
23. ‘లామాసరీ’ – గురుకులంలో ! 248
24. లామాసరీ – ఆశ్రమం 254
25. తాంత్రికప్రక్రియ – ఛోడ్ 264
26. నా “విద్యాభ్యాస” – రహస్యాలు! 287
27. ‘మూడవకన్ను’ (ఉప-నయనం) – తెరిపించడం ! 296
28. శరీరం విడిచి – ప్రయాణం ! 307
29. పై‘లోకాలు’ – “గ్రహ-మండలాలూ !” 317
30. అంగారక–గ్రహానికి ప్రయాణం! 325

◆

ముందుమాట!

ఇది — కథ కాదు! ఇదిగనక నాకు జరగకపోతే నేనుకూడా దీన్ని కథలాగే భావించేవాడ్ని!

ఒకరోజున... ... మా ఇల్లు చాలా పాతబడిఉండేది... రిపేర్లు చేయించాలని అనుకుంటూ చేతిలో డబ్బులేక వాయిదావేస్తూ వచ్చాను. ప్రస్తుతం నేను ఆర్థికంగా కొంచెం తక్కువలో ఉన్నప్పటికీ — గతంలో మాపెద్దలు — తండ్రీ, తాతగారు, ముత్తాతగార్లు పెద్దజమిందార్లలా, జాగీర్దారుల్లా పెద్దహోదా అంతస్థులో నడిచేది మాఇల్లు! మాతాతగారు జోడుగుఱ్ఱాల ‘సార్టు’-గుఱ్ఱపు బగ్గిలో, వెళ్ళేవారు — ముందుగా తలపై పెద్ద టర్బన్ ధరించిన జట్కాబండీవాడు ‘కమ్చీ’తో గుర్రాలను అదిలిస్తూ వుంటే!!

తరచుగా ఇంగ్లీషుదొరలతో, కలెక్టరులతోనూ, ‘కమీషనర్’లతోనూ విందులుచేయడమూ వారిని తరచుగా మాఇంటికి ఆహ్వానించటం —

దానికి బదులుగా బ్రిటీష్‌ప్రభుత్వంలోని రెసిడెంట్ (Resident) హోదాలో వున్న ఇంగ్లీష్ "లాట్-సాహెబ్", అంటే లెఫ్టినెంట్ గవర్నరుగారి ఇంట్లో జరిగే టీపార్టీలకు, విందులకూ, డాన్సులకు మాకు కూడా ఆహ్వానాలు వచ్చేవి.

ఆరోజులలో మాతాతగారు ఇంగ్లండుకూడా వెళ్ళివచ్చారు. అంతెందుకు? — ఈ మహానగరంలో మా తాతగారి కొక్కరికే కారుండేది! పోనీండి! — ఇప్పుడవన్నీ గతచరిత్ర! ఆ ఇంటిపేరూ, ఆ హోదా, మా కుటుంబ గౌరవము మాత్రం అలా మిగిలివున్నాయి — ఇంగువకట్టిన గుడ్డలా!

ఒకవిధంగా చూస్తే ఇది మాకు కూడా ఇబ్బందే! మా అంతస్థుకి మించి, లేని హోదాని నిలబెట్టుకోలేకా నానా ఇబ్బందులూ పడి గొప్ప కోసం అర్థమైన ఖర్చులూ అనవసరంగా చెయ్యాల్సివచ్చేది.

నా భార్య, తరచూ అంటూవుంటుంది — "మనకీ, జమిందారీ హోదా, సంపదా, ఆస్తీ, అన్నీపోయినా — ఆ పాతకాలపు ట్రంకుపెట్టెల నిండా పుస్తకాలూ, పాత 'దస్తావేజు'లూ, ఎందుకూ కొరగాని, చెదలూ, దుమ్మూపట్టి పాడైపోతున్న దస్త్రాలూ, ఇలాంటివి, ఇంటినిండా ఎన్నో పేరుకుపోయివున్నాయి! వాటిని పాతపేపర్లవాళ్ళకి అమ్మటంగాని లేదా తగలపెట్టడంగాని చెయ్యాలి!" — అంటూవుండేది, విసుగొచ్చినప్పుడల్లా! నేను ఇంట్లో లేనప్పుడు ఆమె నిజంగానే ఎప్పుడో ఆపని చేసేస్తుందేమో అన్న భయంతో — నేనే మా ట్రంకుపెట్టెలూ, భోషాణాలు తెరిచి, అవసరమైన కాగితాలు మాత్రం జాగ్రత్తచేసి, అక్కర్లేనివీ, పనికిరాని సామానులను వొదలించుకోవాలనీ నిర్ణయించుకున్నాను.

ఈ ఉద్దేశంతోనే ఓరోజున మాఇంటి ప్రహరీగోడ ఎండకి ఎండి వానకి నానిపోయి కూలి పడిపోతున్నదాన్ని బాగుచేయించాలని పునాదులు తవ్వి తీయించాలని — అడుగున్నరలోతు తవ్వేసరికి — ఆశ్చర్యం! "ఖణేల్"-మని పెద్దశబ్దంతో ఓ ఇనుపభోషాణం గడ్డపారకి తగిలిన శబ్దం — వినవచ్చింది.

"లంకె-బిందెలేమో నండీ! — ఏమైనా ధనం దొరుకుతుందేమో? పూర్వకాలపు లక్ష్మీకటాక్షం మళ్ళీ మన ఇంటిని వరిస్తుందేమో?" అన్న నాభార్య మాటలకి నేనూ ఆశపడి ఎంతో జాగ్రత్తగా త్రవ్వితీశాను. ఆశ్చర్యం!! ఒకపెద్ద ఇనుపభోషాణం! మూడున్నర అడుగులపొడవూ, రెండడుగల మందమూ, రెండున్నర అడుగుల లోతూ వున్నది — బైటపడ్డది! ఆశ్చర్యంతో కెవ్వున కేకవేశాడు నాచిన్న మనవడు.

జాగ్రత్తగా భోషాణం పైకితీశాము. తాళం పూర్తిగా తుప్పుపట్టి పోయింది. దాని మూత తలుపులూ, మట్టిలో చాలాకాలం బిగుసుకు పోయివుండటం వలన భోషాణంపైన చెదలూ, పుట్టలు కూడా పోశాయి. కష్టపడి కొడవలితో సన్నగా గీరి భోషాణం మూత పగలగొట్టి పెకలించాను. 'కిర్రు'మని శబ్దం చేస్తూ తెరుచుకున్న భోషాణంలోంచి మరొక నల్లటి ముదురు టేకుకర్ర పెట్టె ఉండటంచూసి ఆత్రుత, ఉక్రోషం ముంచుకొచ్చినా దానిని జాగ్రత్తగా బైటికితీయించి టేబుల్‌మీద పెట్టించాను. నాభార్య తన తలపిన్నీసుతో ఆ చెక్కపెట్టె తాళం తెరిచింది — తెలివిగా!

పెట్టె తెరవగానే — ఎఱ్ఱటి తోలుతో బైండింగ్ చేసిన చిట్టా పుస్తకాన్ని భద్రంగా బైటికితీశాను. అది పసుపురంగు బట్టలో కట్టి

భద్రం చేయబడివుంది. దానిని చూడగానే దానిలో ఏ వజ్రాలో, నగలో లేక మొహిరీలో దొరుకుతాయని ఆశించాను.

కాని, నిదానించి తెరిచిచూస్తే అందులోవున్నది బంగారం, వజ్రాల కన్నా విలువైందే లభించిందని తెలిసింది! ఆశ్చర్యం! అందులో పై అట్ట తెరవగానే ఒక 'గ్రూపు ఫోటో'-వున్నది! ఆ పాతఫోటోలోని బొమ్మలు కాలదోషంవల్ల ఎర్రబడిపోయి వున్నాయి! సన్నని చిల్లులుపడివున్న ఆ గ్రూప్‌ఫోటోలో — ఏడెనిమిదిమంది దొరలు తుపాకులుపట్టుకొని సోఫాలో కూర్చుని ఫోటోలు తీయించుకున్నారు మా బంగళా పచ్చిక లాన్‌మీద! వారిలో ముందు వరుసలో మోకాళ్ళమీద కూర్చున్న ముగ్గురిలో ఎడమవైపు మాతాతగారు శ్రీనివాస చక్రవర్తి కుడివైపు పాటియాలా యువరాజా, వారితో పక్కనే కూర్చుని భావనగర్ మహారాజా — తుపాకీ పట్టుకొని నిలబడివున్నారు. వారి మధ్య ఎవరో ఒక అపరిచిత ఇంగ్లీష్‌దొర సన్నని ఈవినింగ్ హ్యాట్ పెట్టుకొని నోటిలో ఓ పెద్ద పైపుతో కూర్చుని దర్జాగా చూస్తున్నాడు. ఆయన ప్రక్కనే తుపాకీపట్టుకొని ఇంగ్లండుదొర, సుప్రసిద్ధ పులుల వేటగాడూ, ఆరోజులలో చాలామందికి సుపరిచితుడూ నైన **'జిమ్-కార్బెట్'** (Jim Corbet) దొర కూర్చునివున్నాడు.

అందులోని అపరిచిత నూతనవ్యక్తి ఎవరా అని ఆత్రుతగా వెతుకుతున్న నాకళ్ళకి — ఫోటోకింద అచ్చులో రాసినపేర్లలో మాతాతగారు, పాటియాలా యువరాజావారు, 'జిమ్-కార్బెట్' దొరా — వారిమధ్యగా కూర్చున్నది — ఆశ్చర్యం!! **సర్ చార్లెస్ బెల్** (Sir Charles Bell) అనే ప్రఖ్యాత సైనిక గూఢచారి!!

ఆపేరును చూస్తూనే ఎగిరి గంతేశాను "హుర్రా!" — అని!

అప్పటిదాకా నేనూ మీ అందరిలాగే సుప్రసిద్ధ ఇంగ్లీషు నవలా రచయిత లెవరో సృష్టించిన కల్పితపాత్రే అనుకున్నాను **చార్లెస్ బెల్** (Charles Bell) — అంటే!

తీరాచూస్తే ఆయన మా తాతగారితో సహా తీయించుకున్న ఈ ఫోటోఆల్బం నాకే లభించటంతో ఆ చిట్టాలోని దస్త్రాలు చాలా విలువైన వని తెలిసింది. వాటిని కలకత్తాలోని ఓ సుప్రసిద్ధ 'పబ్లిషర్‌కు' చూపించాను. అతను ముందు వెటకారంతో కొట్టిపారేసినా — లోపల ఫోటోచూసి అడుగున చిట్టాపుస్తకంలో టైపుచేయబడ్డ రిపోర్టూ చదివి ఖంగు తిన్నాడు! సుప్రసిద్ధ సైనికగూఢచారి "**చార్లెస్ బెల్**" తోపాటు ఆయన ఇండియా వచ్చినప్పుడు పులివేటగాడు జిమ్ కార్బెట్‌తోసహా, మాతాతగారూ, మరిద్దరు రాయ్‌బహద్దూర్‌లతో కలిసి హిమాలయాలలోని 'డార్జిలింగ్'కూ అక్కడినుండి "కులూ" (Kulu Valley) లోయకూ ఆపైన 'టిబెట్'కు ముఖ్యపట్టణమైన "లాసా" (Lhasa) మీదుగా కైలాసపర్వత' శిఖరం ప్రదక్షిణంగా చుట్టి వెనుకగావున్న గోబీ మంచుఎడారి దాటి '**శంబల**'వరకూ వెళ్ళిన వారిసాహసయాత్రదీ రిపోర్టు!!!

అందుకే ముందే చెప్పాను — "నేను రాసేది కథగానీ, నవలకానీ కాదు"; అని!

ఇప్పుడు జాగ్రత్తగా చదవండి! — తరువాతి అధ్యాయాలలో నమోదు చేసివున్నది — మా పూర్వీకులచిట్టా! ఆదస్త్రాలలోనిది ఓ కుటుంబ నివేదిక వంటి రిపోర్టు! **చార్లెస్ బెల్**తో రహస్యంగా మాతాతగారు కలకత్తా మీదుగా హిమాలయాలకు ప్రయాణంచేసినప్పటి సాహసయాత్ర!

“ఇందులోని వివరాలు — అతిరహస్యం! చాలాగుప్తమైన ఆధ్యాత్మికరహస్యాలు ఇందులో ఎన్నోవున్నాయి. ఇలాంటివి ప్రచురించరాదు — చాలాప్రమాదం!” అంటూ ఆ ‘పబ్లిషర్’ నాకు తిరిగి యిచ్చేశాడు. కావాలంటే సొంతపేరుతో వేయించుకొమ్మన్నాడు. ఆతరువాత మాతాత గారి ఇంగ్లండు స్నేహితుడికి ఫోన్‌చేసి వివరాలు చెపితే వంద సంవత్సరాలనాటి నిజమైన విశేషాలు దొరికిన వంశపు కాగితాలలోని ఈ రిపోర్టు గురించి తనకు తెలిసిన సుప్రసిద్ధ ఇంగ్లీషు పబ్లిషర్‌కి చెప్పగా అతను “లక్షపౌండ్లు వెంటనే ఈ పుస్తకం ప్రచురణనిమిత్తం ఎడ్వాన్స్‌గా ఇస్తామన్నాడని, కాని దానివిలువ ఇంకా చాలా ఎంతో ఎక్కువనీ వ్రాస్తూ ఇలాంటి అమూల్యగ్రంథాన్ని ‘మనమే ప్రచురించటం మంచిది” — అన్నాడు. సరైన హిమాలయాల “మ్యాప్” (Maps) లతో, ‘ప్లాన్’లతో దీన్ని ఈ రిపోర్టుతో అన్నీ జాగ్రత్తగా ప్రపంచానికి అందిస్తున్నానని మీ అందరికీ మనవిచేస్తున్నాను.

“నిజం ఏకథకంటేకూడా విచిత్రమైందనీ” — ఇందులోవి అన్నీ యదార్థమైన విషయాలనీ ఇప్పుడు నా వృద్ధాప్యంలో మీకు సవినయంగా మరొక్కసారి మనవిచేస్తున్నాను.

‘డార్జిలింగ్’ ఇట్లు
మకాం : మానస సరోవర్ మీ
‘గౌరీకుండ్’ శేషాద్రి శ్రీనివాసచక్రవర్తి

1

గుఱ్ఱంమీద వీరుడు!

ఆరోజు, నేను ఉదయమే బైల్దేరి మద్రాసులోని ఓపెద్ద పుస్తకాల షాపులో — అపురూపమైన పుస్తకం “కీరో”-ప్రపంచ భవిష్యత్తు” అన్నది కొనుక్కుందామని మౌంట్‌రోడ్డుమీద నిలబడ్డాను. బుక్‌షాపు ఇంకా తియ్యలేదు, కనీసం ఎయిర్-పోర్టుకి వెళ్లినా ఎయిర్-టిక్కెట్టు O.K. చేయించుకుని రావచ్చని. రావలసిన బస్సు ఎంతకీరాలేదు. వాచీ చూసుకున్నాను — పదోసారికాబోలు!

ఎదురుగుండా జనసమర్థంతో ట్రాఫిక్ కిటకిటలాడుతున్న మౌంట్‌రోడ్డుమీద నిలబడ్డ తెల్లటిగుఱ్ఱం ఎండలో సిల్కులా తళతళా మెరిసిపోతోంది! దానిమీద కూర్చున్న ఒకేఒకవ్యక్తి చేతిలో పొడుగాటి కత్తి, డైమండ్ ఆకారంతో సూర్యకాంతితో తళుక్కున కంట్లోకి గుచ్చినట్టు మెరుస్తోంది. ‘ఎవరో బహుశా మద్రాస్‌లోని పేరుగొన్న పోలీసుశాఖలోని

గుఱ్ఱపుదళంలోని మౌంటెడ్ పోలీసుసిపాయి అయివుంటాడు — అనుకున్నాను. కానీ అతని వేషం, ఆకారమూ చూస్తే పోలీసువాడిగా కనిపించలేదు. ఎవరా ఇతను? ఇంత జనసమర్థంతోవున్న రోడ్డుమీద ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తూ నిర్భయంగా గుఱ్ఱంమీద నిలబడివున్నాడు?' అనుకుంటూ మద్రాస్‌లోని మౌంట్‌రోడ్డుమీద నిలబడ్డ నేను బస్సుకోసం వెయిట్ చేస్తున్నాను.

'నేను విశాలమైన మౌంట్‌రోడ్డు ఎడమవైపు నిలబడివుంటే అదే రోడ్డుకు సరిగ్గా కుడివైపున పాలరాతివిగ్రహంలా నిలబడివున్న గుఱ్ఱంమీద ఆ వ్యక్తిని చూసి యధాలాపంగా నేను 'మన పురాణాలలో వర్ణించిన కల్కిఅవతారంలాగా నిర్భయంగా గుఱ్ఱంమీద కత్తి పట్టుకుని మరీ నిలబడ్డాడే? బహుశా ఎవరైనా V.I.P. గవర్నర్‌గానీ మరెవరైనా ప్రత్యేక ప్రముఖులు రోడ్డుమీద వెళుతున్నారేమో కాపలాగా మౌంటెడ్‌పోలీసు గస్తీదళంలోని గుఱ్ఱపురౌతు అనుకున్నాను. నాకు ఎంతసేపటికీ బస్సు రాలేదు. దాదాపు పావుగంట గడిచింది.

అటుచూస్తే రోడ్డుమీద సరిగ్గా అక్కడే నిలబడివున్నాడు తెల్లగుఱ్ఱం మీద తళతళమెరిసే కత్తిపుచ్చుకుని ఎఱ్ఱటి మందారపువ్వురంగు కోటు లాంటి అంగీ ధరించివున్నాడు. ఛాతీమీద బంగారు జలతారులా మెరిసే తళుకులు నక్షత్రాలవలే సూర్యరశ్మిలో జిగేలుమంటున్నాయి. వయస్సు నడిమధ్య పాతిక ముప్పై దాటకుండావుంటాయి. వెడల్పాటి నుదురు, బాదంకాయలవలె ఎత్తైన నిండైన కనురెప్పలు. అతడు అలానే నిలబడి వుండటంచూస్తే నాకు ఆశ్చర్యంవేసింది! పోలీసుదళంవాడైనా ఎంతోసేపు

నిలబడి వేచివుండటం కఠినమైన డ్యూటీలా తోచింది. కానీ అతడు పోలీసుశాఖకు చెందినవాడైవుండడని అనుమానం కలిగించేలా — రోడ్డు పక్కన నిలబడ్డ ట్రాఫిక్‌పోలీసు సార్జెంటు అతనివద్దకువెళ్ళి తన చేతిలోని సెల్‌ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతూ ఇక్కడెవడో రోడ్డుమీద ట్రాఫిక్‌కు అడ్డంగా నిలబడివున్నాడు గుఱ్ఱంమీద చూస్తే ఇతడు మన పోలీసు మౌంటెడ్‌దళానికి చెందినవాడిలా కనిపించటంలేదు. పంపించెయ్యమంటారా? అన్నాడు. అవతలినుంచి ఏం సమాధానం వినిపించిందోకాని ఆ పోలీస్‌సార్జెంట్ పెద్దపెద్ద అంగలువేసుకుంటూ బూట్లను చప్పుడు చేసుకుంటూ మార్చింగ్‌లా వెళ్ళి గుర్రంపక్కకు నిలబడి ‘ఏయ్ ఎవరు నువ్వు? ఇక్కడ ట్రాఫిక్‌కు అడ్డంగా ఇలా ఈ గుఱ్ఱంమీద నిలబడకూడదు. నీవు వెంటనే తొలగిపోవాలి. ఊ, పో అవతలకు అంటూ గద్దించి చేతిలోని పోలీసువిజిల్‌ను చెవులు రింగుమనేలా వూదాడు. తన డ్యూటీ అయిపోయినట్లుగా ముందుకు నడుచుకుంటూ వంద గజాల దూరం వెళ్ళిపోయాడు.

నాకు చాలా ఆశ్చర్యం అనిపించింది. ఆ గుఱ్ఱంమీదవ్యక్తి ఎవరో అతడు పోలీసువాడయ్యి వుండడు. మరి మద్రాస్ నగరంలో మౌంట్ రోడ్డుమీద ఇలా తెల్లగుఱ్ఱం ఎక్కి ఠీవిగా గస్తీతిరుగుతున్నట్లు విగ్రహంలా కదలకుండా నిలబడివున్నాడు. పైగా పోలీసుసార్జెంట్ వచ్చి హెచ్చరిక చేస్తే సమాధానం ఏదీచెప్పడు సరికదా కనీసం పోలీసువాడని గుర్తించినట్టు కూడా లేదు. వీడెవడో గట్టిపిండంలా వున్నాడు అనుకుంటూ మళ్ళీ ఒకసారి నేను రావలసిన బస్సుకోసం నా వాచీ చూసుకున్నాను. ప్రయాణీకుల గుంపుమాత్రం పెరిగిపోతోంది హనుమంతుడి తోకలాగ

నన్ను మరింత ఆందోళనకు గురిచేస్తూ! దాదాపు అరగంటపైనే గడిచింది. నాబస్సు రాలేదు. నాకు విసుగుపుట్టింది కాళ్ళు చచ్చేలా పీకేస్తున్నాయి. పోనీ నడుద్దామా అంటే నేను గిండీ దాటి మద్రాస్ ఎయిర్‌పోర్టుకు వెళ్ళాలి చచ్చినట్టు. ఇలా అనుకుంటూవుండగానే రోడ్డుమీద నాకెదురుగా వేరొక పోలీసుసార్జెంట్ చేతిలోని వాకీ-టాకీసెట్టులో మాట్లాడుతూ నన్ను చూసి మొహం అదోలాపెట్టి — "సార్! మీబస్సు రావటం చాలా ఆలస్యంకావచ్చు! మీరు వెళ్ళిపోండి వేరే ఆటోకానీ, టాక్సీకానీ చూసుకోండి!" అన్నాడు.

నేను అమితంగా ఆశ్చర్యపోతూ ఆ పోలీసువాడివంక తిరిగి "ఇప్పుడు బస్సు రావాల్సివుందికదా! అరగంటనుంచి వెయిట్ చేస్తున్నాను. ఏక్షణంలోనైనా రావచ్చు ఎక్కి వెళ్ళిపోతాను బస్సురాగానే" అన్నాను.

దానికా పోలీసువాడు పదిఅడుగులు ముందుకుపోయినవాడల్లా వెనక్కితిరిగి నావైపే వస్తూ — "నేను చెప్పేది అర్థంచేసుకోండి సార్ ఈ మౌంట్‌రోడ్డుమీద సిటీబస్‌లు రావు. పోలీసుకంట్రోల్‌వాళ్ళు ఆపేసారు ట్రాఫిక్‌బంద్ అన్నాడు. దాంతో మరింత ఆందోళనపడిన నేను "ఎందుకు? ఏదైనా సమ్మెలు, కార్మికుల మోర్చాలు, ప్రదర్శనలు వున్నాయా?" అనే లోగా అతడే — "కాదుసార్! గవర్నరు ఈ రోడ్డుమీద వెళతారు. ఆయనతోపాటు ఢిల్లీనుండి రాష్ట్రపతి వారి వెనకాతలే ముఖ్యమంత్రిగారి కార్లూ వస్తాయి. అందుకని సెక్యూరిటీ చెక్! ఈరోడ్డులో బస్సులు ఆపి వేసారు అన్నాడు. నాగుండె జారిపోయినంత పనైంది. ఈ పోలీస్‌వెధవలు లేనిపోని ట్రాఫిక్‌సమస్యలు కొనితెచ్చిపెడుతున్నారు అనుకుంటూ యధాలాపంగా రోడ్డు అటువైపు చూసాను. చూసి త్రుళ్ళిపడ్డాను. ఎదురుగా

రోడ్డుమీద తెల్లగుఱ్ఱం. దానిమీద శిలావిగ్రహంలా కదలకుండా కూర్చున్న ఆ పురుషవిగ్రహం! అతడెందుకు అలా అంతసేపటినుంచి ఎవరికోసం వేచివున్నాడు. పోలీసుగుఱ్ఱపుదళం మౌంటెడ్ పోలీసుఅధికారిలా లేడు. వుంటే పోలీస్‌వాడు పొమ్మని హెచ్చరికకూడా ఎందుకుచేస్తాడు? అనుకుంటూ.

ఇంతలోనే ఇంకొక పోలీస్‌సార్జెంట్ రోడ్డుకు అటువైపుగా వేగంగా మోటారుసైకిల్‌మీద వస్తూ ట్రాఫిక్‌సిగ్నల్‌వద్ద టక్కున ఆపి ఆ గుర్రం మీద వ్యక్తిని చూసి మండిపడ్డాడు. “ఏయ్! ఎవరునువ్వు? ఇక్కడ ట్రాఫిక్‌కు అడ్డంగా నిలబడరాదు. వెంటనే తొలగిపో! లేకపోతే నిన్ను సెక్యూరిటీచెక్‌కింద బుక్‌చేస్తాను తెలిసిందా?” అన్నాడు.

దానికాగుఱ్ఱంమీది వ్యక్తి కనీసం విన్నట్టుకూడా లేదు — విగ్రహంలా అలానే ఎటోచూస్తూ తన చేతిలో కత్తిని అలాగే పట్టుకుని గుఱ్ఱంమీద వున్నాడు. నాకు ఆశ్చర్యంవేసింది. ఇతనిని పోలీసుఅధికారి నాముందే వచ్చి హెచ్చరించారు. అతనుమాత్రం ఖాతరుచెయ్యలేదు. అతడెవరైవుంటాడు? విచిత్రంగా వున్నాడు! మద్రాసు మహానగరంలోని మౌంట్‌రోడ్డుమీద ఇరుకు జనసమ్మర్ధంలో గుఱ్ఱంవాహనంపైన కూర్చుని పూర్వపు బ్రిటీష్ సైనికఆఫీసరులాగ గుఱ్ఱంమీద కత్తిపట్టుకుని నిలబడివున్నాడు అనుకుంటూ వింతగా గమనిస్తున్న నాకు మరుక్షణం రోడ్డువెంట ట్రాఫిక్‌ను ఎక్కడివాళ్ళనక్కడే ఆపేసారు. పోలీస్‌సార్జెంట్లు విజిల్స్ వేస్తూ ఆటోలు, వేన్లను ప్రక్కసందులోకి మళ్ళించేసి రిక్షాలను, బగ్గీలను ప్రక్కలకు తోసేసారు. రోడ్డు నిమిషాలమీద నిర్మానుష్యంగా తయారైంది.

కానీ ఆశ్చర్యం! ఆ గుజ్జంమీద వ్యక్తి అక్కడే వున్నాడు! కదలలేదు! మెదలలేదు! ఇంతమంది పోలీసుఅధికారులూ, కమీషనర్‌లు హెచ్చరించినా, పొమ్మని భయపెట్టినా సమాధానంమాట అటుంచి వారివంక తిరిగి చూడనైనాలేదు! నాకు చాలా ఆశ్చర్యంవేసింది. ఇతడెవరో గట్టి పిండం అయివుంటాడు. ఎందుకలా రోడ్డుమీద గుజ్జంపై నిలబడి వున్నాడు? అన్న కుతూహలం, ఆత్రుత పెరిగిపోతోంది! నిమిషాలు గడుస్తున్నాయి.

ఎంత హెచ్చరించినా ఖాతరుచెయ్యని ఆ విచిత్రమైన గుజ్జంమీది వ్యక్తిని చూస్తే ఆ పోలీసుకమీషనర్ ఆగ్రహం కట్టలుతెంచుకుంది. మద్రాసువంటి మహానగరంలో పోలీసుకమీషనరువంటి తనలాంటి అధికారి ఆదేశాలనే నిర్లక్ష్యం చెయ్యడమా? — అదీ నగరం నడిబొడ్డులోని మౌంట్‌రోడ్డుమీద!

దాంతో అతడిలోని పోలీసురాక్షసుడు కట్టలుతెంచుకొని రెచ్చిపోయాడు. క్షణాలమీద జీపుదిగి పెద్దపెద్ద అంగలువేస్తూ తన పోలీసు బూట్లు చప్పుడుచేస్తూ రోడ్డుమధ్యగా నిలబడ్డ ఆ తెల్లగుజ్జంమీది వింత మనిషిని చూసి తన చేతిలోని పొడుగాటి బెత్తంవంటి పోలీసుబేటన్‌ను చాచికొట్టాడు ఇంకొకడైతే ఆదెబ్బకి ముక్కూ, ముఖం బద్దలై స్పృహతప్పి నేలమీద పడిపోయేవాడే!

కాని — ఆశ్చర్యం! చాచికొట్టిన బేటన్ సుడిగాలిలా విసురుగా వెనక్కివచ్చి పోలీసు ఆఫీసరు ముఖానికే తగిలింది! దాంతో ఎత్తుగావున్న అతని కోటేరుముక్కు నుజ్జునుజ్జై పెదవులవెంట రక్తంకారింది. ఆశ్చర్యంతో

దిమ్మెరపోయి క్షణకాలం కళ్ళుతిరిగినట్టూ వికారంగా తల తిరిగిపోతున్నట్టు బాధకలిగి రెండడుగులు వెనక్కివేసి అతికష్టంమీద నిలదొక్కుకున్నాడు. ఆశ్చర్యంగా ఆ గుఱ్ఱంవైపు, ఎదురుగా విగ్రహంవలే కదలకా మెదలకా నిల్చున్న లెక్కలేని ఆ పొగరుమోతువంకా చూశాడు! ఆశ్చర్యం! ఆ గుఱ్ఱంగాని దానిమీద కూర్చున్న హుందాయైన రౌతులో గాని కనీసం ఈగవాలినంతకదలిక కూడా కనిపించలేదు.

'ఏమిటీ! ఈ మనిషి నన్ను కనీసం కంటితో చూసినట్టుకూడా గుర్తింపుగాని చలనంగాని లేదే? నామొహం పగిలి నేను కొట్టిన లాఠీదెబ్బ నా మూతికే వచ్చి ఎలా తగిలింది?' అంటూ విస్తుపోతూ భయంగానే రెండడుగులు వెనక్కువేసి పెద్దగా రంకెలువేస్తూ అరిచాడు.

"డామిట్! ఎవడ్రా నువ్వు? కళ్ళు కనబడ్డంలేదా? ఎదురుగా నేను పోలీస్‌కమీషనర్‌ని నిలబడి ఇలా గొంతుచించుకొని అరుస్తుంటే — కనీసం నీకు ఈగవాలినట్టయినా లేదే? నిన్ను లాకప్‌లోపెట్టి సెల్‌లో బంధించి నీ ఎముకలు ముక్కలుగా విరిగేదాకా చావబాదానంటే అప్పుడు నీకు ఒళ్ళు తెలుస్తుంది. నేనెవరో? సరిగా సమాధానం చెప్పాలన్న జ్ఞానంలేదా?" అంటూ అక్కడే నిలబడి అరిచాడు.

ఫలితం శూన్యం! గుఱ్ఱంఅయినా, అంతపెద్ద ఆజానుబాహుడైన ఆరడుగుల పోలీస్‌ఆఫీసర్‌ని చూసినట్టయినా చెవులన్నా విదిల్చలేదు. కనీసం కదలలేదు. ఏచలనం లేకుండా రాతిశిల్పంలోని గుఱ్ఱంలా అలా నిలబడివుంది. గుఱ్ఱంమీదవ్యక్తి మద్రాసు మౌంట్‌రోడ్డులోని నాలుగురోడ్ల కూడలివద్ద బ్రిటీషు సైనికాధికారి థామస్ రో విగ్రహంలాగా గుఱ్ఱంమీద

స్వారీచేస్తున్నది కదలికలేకుండా వున్నట్టే వీడూ కదలడేమిటి? అనుకుంటూ పొంగివచ్చే అవమానంతో ఉక్రోషంతో పెచ్చుపెరిగిపోయిన క్రోధం అతని పరాభవాన్ని పదిరెట్లు పెంచింది.

"ఇలాకాదు నీపొగరు అణిచేస్తా! — రాస్కెల్!" అంటూ తటాలున తన బెల్టులోంచి రివాల్వర్‌తీసి గుఱ్ఱంమీద కూర్చున్న వ్యక్తివైపు గురిపెట్టి కాల్చాడు. ఒకేఒక బుల్లెట్ అతడి తొడలోంచి దూసుకువెడితే కుప్పకూలి కిందపడాలి గుర్రంమీంచి అనుకుంటూ!

"ఢాం!" అంటూ రైఫిల్‌మోత బజారంతా ప్రతిధ్వనించింది. కెవ్వు మని కేకవేసి బాధతో భయంతో గిలగిలా తన్నుకుంటూ కిందపడిపోయి సాయంకోసం దారినపోయేవాళ్ళను బతిమాలసాగాడు — గుర్రంమీద రౌతుకాదు తుపాకీ పేల్చిన పోలీస్‌ఆఫీసరే! అంత బాధలోనూ ఏడుస్తూ శాపనార్థాలు పెడుతూ తిడుతున్నాడు ఇంకా అతను తన పొగరు అణచుకోలేక!

గుఱ్ఱంమీద వ్యక్తి కనీసం అయ్యో! అని అనలేదు ఆశ్చర్యపడలేదు సరికదా అసలీ పోలీసుఆఫీసరు రివాల్వర్ పేల్చినట్టుగాని దాని చప్పుడు గాని అతనికి వినిపించినట్టే లేదు. కనీసం అతను ఎక్కిన గుఱ్ఱంఅయినా ఆ చప్పుడుని గుర్తించలేదు బెదరలేదు ఈగలు తోలుకున్నట్టయినా తలను విదల్చనైనా లేదు. ఏమిటింత ఆశ్చర్యం ఇదేమయినా భ్రమా లేక గుఱ్ఱంవిగ్రహమా అనుకుంటూ నెత్తురుమడుగులో పాకులాడుతూ మోకాళ్ళు సిమెంటురోడ్డుమీద మోటించి బలంగా ఎలక్ట్రిసిటీ స్థంభాన్ని వూతంగా పట్టుకొని పైకిలేచి నించున్నాడు. బాధగా మూలుగుతూ;

మరుక్షణమే ఆశ్చర్యపడడం అతనివంతయ్యింది తన బాధకి! తిరిగి — తాను గురిపెట్టి పేల్చిన పిస్తోలుబుల్లెట్ గుఱ్ఱానికిగాని గుఱ్ఱంమీద రౌతుకు గాని కనీసం సెగ తగిలినట్టయినా లేదు — అదే బుల్లెట్ సూటిగా తన తొడలో దూరి రెండులీటర్ల రక్తాన్ని చిందించింది!

ఆదెబ్బతో పోలీసుఆఫీసరు కళ్ళు బైర్లుకమ్మాయి. ఎవడీవ్యక్తి? తానెంతోమంది ఉగ్రవాదులని, నక్సలైట్లనీ నూరుగజాల దూరంనుంచి గురిపెట్టి పేల్చాడు; కుప్పకూలారు వాళ్ళంతా మాటలేకుండా. అలాంటిది తన గురితప్పడమా? అందులోనూ తన బుల్లెట్ నేరుగా తిరిగివచ్చి తన తొడలో దూరి — "నాన్సెన్స్! ఇక ఆలోచించలేకపోయాడు. అవమానంతోపాటు గాయంబాధ! రక్తం కట్టకుండా పార్లిపోతోంది.

క్షణాలమీద చుట్టుప్రక్కల జనం రోడ్డుమీద పోలీస్‌కమీషనర్‌చుట్టూ పోగయ్యారు. ఏం జరిగింది? ఏమిటీ గాయం? అంటూ ఒక్కరూ సాయం చెయ్యకపోగా తమాషాచూస్తున్నారు. తాను పోలీసుఅధికారి కావడంతో ఎవ్వరికీ తనమీద జాలికలగలేదు సరికదా కనీసం అయ్యో! అనికూడా అనలేదు ఎవ్వరూ! క్షణాలమీద పెద్దగుంపు మౌంట్‌రోడ్డు పక్కనే పోగుపడింది. పోలీస్‌కమీషనర్‌కు తల తీసివేసినట్టయింది.

ఇదంతా గమనించిన మరొక పోలీసుసార్జెంటు వెనకాలే స్కూటర్ మీద వస్తూ తటాలున బ్రేకువేసి — రక్తంమడుగులోవున్న పోలీస్ అధికారి థామస్ అని గుర్తించి మెరుపులా తన సెల్‌ఫోన్ తీసి కంట్రోల్ రూమ్‌కి ఫోన్‌చేసాడు, అంబులెన్స్‌కోసం!

"సార్జెంట్! అంబులెన్స్ కాదు కావల్సింది. రిజర్వ్‌పోలీస్ కంపెనీ

కావాలి! ఫైర్‌ఆర్డర్స్ ఇచ్చి ఇక్కడికి రప్పించమని పోలీస్ ఐ.జి.కి నామాటగా ఫోన్‌చెయ్యి! ఈ వెధవని ఇక్కడే ఎన్‌కౌంటర్‌చేసి వీడి గుఱ్ఱాన్ని గవర్నమెంట్ వెటర్నరీ హాస్పిటల్‌కి పంపిస్తాము! డామిట్! నాసంగతి వీడికింకా తెలిసినట్టులేదు" అంటూ ఒంటికాలితో కుంటుతూ అలానే చిందులుతొక్కాడు పొగరుబోతు పోలీసు.

వెనకాలే స్కూటర్ ఆపిన సార్జెంట్ చటుక్కున దిగి భుజాలుకింద చేతులువేసి కమీషనర్‌ను పైకిలేపి అంతలో అక్కడికి చేరుకున్న అంబులెన్స్‌లో హాస్పిటల్‌కి పంపించాడు. గుఱ్ఱంగాని, గుఱ్ఱంమీద రౌతు గాని అక్కడే నిలబడివున్నారు కదలకుండా!

ఇంతలోకే "బొంయ్య్" మని గోలగా రొదపెట్టుకుంటూ సైరెన్ మోతతో పోలీసుబలగాలు ట్రక్కువచ్చి ఆగింది. బూట్లు చప్పుడు చేసుకుంటూ బిలబిలా దిగి లైనుగా నిలబడ్డారు. అది మద్రాసు రిజర్వు పోలీసు రెజిమెంట్! కరుడుగట్టిన దుర్మార్గులుగా పేరుపొందినవారు —పిల్లలూ, స్త్రీలు అన్న విచక్షణకూడా లేకుండా లాఠీచార్జితో అనేక మందిని చంపిన పోలీసుదళం! వెనక్కుతిరిగి తృప్తిగా చూసాడు — పోలీసు కమీషనర్ థామస్! కుడిచేత్తో గుఱ్ఱంవైపు, దానిమీదవున్న రౌతును చూపిస్తూ గట్టిగా అరిచాడు.

"అరెస్ట్ హిమ్! వాడిని వెంటనే అదుపులోకి తీసుకోండి! మన మౌంట్‌రోడ్ పోలీసుకంట్రోలురూమ్‌కి ఈడ్చుకువెళ్ళండి. మక్కెలు విరగ దన్ని సాయంత్రందాకా గుక్కెడు మంచినీళ్ళుకూడా పోయకండి! — ఛస్తే ఈలోగా పోస్ట్‌మార్టంకి, మార్చురీకి పంపండి. వాడింకా బతికివుంటే

నా తఢాకా చూపిస్తాను" అన్నాడు తానే అంబులెన్స్‌లోకి స్ట్రెచర్‌మీదికి ఎక్కిస్తూవుంటే కోపంగా!

ఇంతలో వెనకనుంచి పెద్దగా సైరెన్‌మోగిస్తూ ముందస్తు సెక్యూరిటీగా ఏర్‌పోర్టువైపు దూసుకుపోతున్న పైలెట్‌కారు శబ్దం వినిపించింది. అయ్యో! క్షణాలమీద CM గారి కారు, దానివెనకే మా సెక్యూరిటీకారు కూడా ఇక్కడికి వచ్చేస్తున్నాయి! ముందుగా ఈ పైలెట్‌కారు శబ్దం చేసుకుంటూ వస్తోంది. అదిగో ఈలోగా ఈ దొంగవెధవని కస్టడీలోకి తీసుకోండి. లేదా షూట్ హిమ్ అంటూ అరిచాడు. ఈలోగా అక్కడికి చేరుకున్న ట్రాఫిక్ డి.జి. నంబియార్ అంతకుముందే పోలీస్‌వేన్‌నుంచి దిగిన రిజర్వుపోలీసుదళం మూడువరుసలుగా నిలబడ్డారు. ఆశ్చర్యంగా చూస్తూ — గుఱ్ఱంవంక! జరుగుతున్నదేమీ పట్టించుకోకుండా నిలబడ్డ గుఱ్ఱంమీది రౌతువంకా స్కూటర్‌దిగిన డిప్యూటీ కమీషనర్ పొగలు కక్కుతూ పరిగెత్తుకువచ్చి —

"వీడిని మైక్‌లోను మూడే మూడుసార్లు హెచ్చరించండి! తప్పుకోకపోతే 'షూట్ హిమ్'! రాస్కెల్! అంటూ అరిచాడు, పిచ్చకోపంతో అవమానంతో! నిమిషాలమీద రిజర్వుపోలీసు తుపాకీలు నిటారుగా పైకెత్తి-గురిపెట్టి రెడీగా నిల్చున్నారు, ఆజ్ఞకోసం! డిప్యూటీకమీషనర్ మైక్‌లో గట్టిగా హెచ్చరిక మూడుసార్లు చేసారు!

"లొంగిపో! ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్నావు!! గవర్నరుగారు, CM గారి కార్లు క్షణాలమీద ఇక్కడికి చేరుకుంటున్నాయి. అదిగో సైరెన్లుకూడా వినిపిస్తున్నాయి. మైగాడ్! వీడెక్కడ చచ్చాడు మాప్రాణానికి!

ఈ తెల్లగుఱ్ఱమూ! వీడూనూ! — ఏదో పగటివేషగాడిలా! తలకొట్టేసినట్టుంది వీడిని తొలగించలేకపోతే" అనుకుంటూ మూడుసార్లు మైక్‌లో హెచ్చరికచేసి ఆదుర్దాగా చూసాడు స్కూటర్‌మీద నిలబడి!

పరిస్థితి మామూలే! గుఱ్ఱంమీద యోధుడిమాట అలావుంచి కనీసం గుఱ్ఱంకూడా లక్ష్యపెట్టలేదు.

దాంతో ఆ పోలీసుఅధికారి ఆగ్రహం కట్టలుతెంచుకుంది — కనీసం ఎదురుగా నిలబడ్డ రిజర్వు పోలీసుదళాలను చూస్తూకూడా వీడికి ప్రాణభయంఅయినా వున్నట్టులేదు! సరే నీఖర్మం! అనుభవించు. మూడునిమిషాల లోపల నువ్వు లొంగిపోకపోతే నిన్ను షూట్‌చేయవలసి వస్తుంది. ఆతరువాత పరిణామాలకు నువ్వే బాధ్యుడివి. మాదేం తప్పు లేదు. లొంగిపో!!!... లొంగిపో! పో!..." అంటూ గట్టిగా మైక్‌లో హెచ్చరిక చేసి గట్టిగా వూపిరిపీల్చుకున్నాడు.

కనీసం రాతివిగ్రహంలోనైనా ఏదైనా చైతన్యం కనిపిస్తుందేమోకాని ఎదురుగా నిలబడ్డ ఆ గుఱ్ఱంకూడా కనీసం కదలలేదు. తలైనా ఆడించలేదు. తోక విదిలించనుకూడా లేదు. మళ్ళీ పోలీసుఅధికారి ఆఖరి హెచ్చరిక చేసాడు, పోనీలే అన్నట్టు! దయచూపిస్తూ "ఇదే ఆఖరి హెచ్చరిక! నీకిచ్చిన గడువు అయిపోతోంది. ఇక నిన్ను షూట్‌చెయ్యాల్సి వస్తుంది!... నీఖర్మ! అనుభవించు!" అంటూ ముప్పైసెకన్లు ఆగి కింద నిలబడ్డ రిజర్వుడు పోలీసుదళాలను చూసి

"అటెన్షన్! టేక్ ది ఎయిమ్!" అనగానే వారందరూ తుపాకులు పైకెత్తి బుల్లెట్లు దట్టించి గురిపెట్టి నిలబడ్డారు. అయినా ఏమాత్రం

చలనం కనిపించలేదు, గుఱ్ఱంలోగాని ఆ గుఱ్ఱంమీద కూర్చున్న వ్యక్తిలో గాని!"

"షూట్!" అన్నాడు తను నిటారుగా నిలబడుతూ. "ఢాం ఢాం ఢాం" అంటూ నాలుగువరసల పోలీసుల గన్‌రైఫిల్స్ వరుసగా పేలాయి.

గుఱ్ఱంవైపు గురిపెట్టి గుఱ్ఱంమీదనున్న రౌతుమీద కొందరు ఒక్కసారిగా అలా పేల్చారు.

"అయ్యో! అబ్బో! నాయనో! చచ్చాంరో!" అంటూ పెద్ద బాధతో దుఃఖంతో పొలికేకలు ఆకాశానికి మిన్నుముట్టాయి. ఆశ్చర్యం! నాలుగు కంపెనీల రిజర్వుడు జవానులు అగ్గిపుల్లల్లా కుప్పకూలారు నేలమీద మరుక్షణంలో ప్రాణంపోయి!"

పోలీసుఆఫీసరు మతిపోయింది. పరిగెత్తుకువచ్చి మోకాళ్ళమీద కూర్చుని — "మైగాడ్! మీరెందుకు పడిపోయారు? మీకీ గాయాలేమిటి, రక్తమేమిటి", అంటూ విస్తుపోయాడు. అసలా ప్రమాదం ఎలా జరిగిందో అర్థంగాక నాలుగువరుసల పోలీసులు గిలగిలా తన్నుకుంటున్నారు కొనప్రాణంతో! నేలంతా రక్తంతో తడిసిపోయింది. ఒక్కరూ బ్రతికేలా లేరు. అసలీ ప్రమాదం ఎలా జరిగిందో తుపాకులు గురిపెట్టి పేల్చిన ఈ పోలీసులు ఎలా చచ్చారో అంతుపట్టక ఆశ్చర్యం, భయం ముంచుకు రాగా పోలీసుఆఫీసరు రెండుచేతులతో ముఖాన్ని కప్పుకొని గొల్లున విలపించాడు, జరిగిన ఘోరానికి తట్టుకొనలేక బాధ్యతను గుర్తించుకుంటూ!

రోడ్డుమీద జనం పదులనుంచి వందలకొద్దీ ఊపిరిఆడకుండా

జనసమ్మర్ధంలా పోగుపడ్డారు. అందరూ ఒక్కసారిగా హాహాకారాలు చేసారు, జరిగిన ఆశ్చర్యాన్ని చూసి!

ఇంత జరిగినా — ఆ గుఱ్ఱంగాని, గుఱ్ఱంమీద కూర్చున్న వీరుడు గాని కదలలేదు, మెదలలేదు. రాతివిగ్రహాలలా అలాగే నిలబడ్డారు. కనీసం కిందపడిపోయి కొనప్రాణాలతో ఏడుస్తున్న ఆ పోలీసులవంకైనా తిరిగిచూడలేదు. దాంతో ఏంజరుగుతోందీ ఎవరికీ బోధపడలేదు. అంతా అయోమయంగా వుంది పరిస్థితి!

చేతిలో మైకులాంటి 'వాకీటాకీ' లాంటి ఫోన్ పట్టుకొని పైఅధికారులతో ఆయాసంగా ఆత్రంగా భయంగా అరిచేస్తున్నాడు తానేం మాట్లాడుతున్నాడో తెలియని పోలీసుఆఫీసరు.

"ఇక్కడో ప్రమాదం జరిగిపోయింది సార్!! ఇక్కడ వీడ్ని మన ఫోర్త్ బెటాలియన్, ఐదవకంపెనీదళం హెచ్చరికచేసినా ఖాతరుచేయలేదు. దాంతో ఫైరింగ్‌చేయాల్సివచ్చి చేసాం!

"చచ్చాడా!"

"ఎనిమిదిమంది మనవాళ్ళు చచ్చారుసార్! మిగతావాళ్ళు తీవ్రంగా గాయపడ్డారు!"

"డామిట్! మనవాళ్ళెందుకు చచ్చారు. వాడేమైనా తిరిగి షూ చేసాడా? ఎట్లా జరిగిందీ ప్రమాదం?" అవతలనుంచి రణగొణధ్వనిలో సెల్‌ఫోన్ మోగింది.

"ఏమీ అర్థంగావట్లేదుసార్! సార్ మాదేం తప్పులేదు సార్! మ

వాళ్ళంతా చక్కగా రైఫిల్స్ గురిపెట్టి నాలుగుసార్లు పేల్చారుసార్! అన్నీ సక్రమంగా చేసారుసార్! ఒక్కసారే కాదు నాలుగుసార్లు ఫైర్‌చేసారు. రైఫిల్‌లో కూడా తేడాలేదుసార్ అన్నీ పక్కా! ఎ.కె. 47 రైఫిల్స్‌సార్ గురి తప్పలేదు! తప్పేఛాన్సే లేదుసార్!"

"మరెలా చచ్చారు మనవాళ్ళు! ఏమిటి నువ్వు మాట్లాడేది? మతి వుండే మాట్లాడుతున్నావా? వాడిదగ్గరేమైనా ఆటోమాటిక్ రైఫిల్స్‌గాని వున్నాయా? లేక ఏదైనా మైన్ బ్లాస్టర్‌వంటి ప్రేలుడుపదార్థంగాని ఉపయోగించాడా? మనవాళ్ళపై అని అవతలనుంచి అధికారి కంఠం — "గురితప్పలేదుసార్ అంతా ఓ.కె. సరిగ్గానే కాల్చాం! — కాని అవి తగిలి చచ్చిందికూడా మనవాళ్ళేసార్!" — అన్నాడు!

"మీరందరూ సస్పెండ్! బుద్ధిహీనుడా!" అంటూ తిట్లవర్షం కురిపించాడు.

ఒణికిపోతూ సమాధానమిచ్చాడు పోలీసుఅధికారి.

"కాని సస్పెండ్ ఎవరికిసార్! మనవాళ్ళంతా చచ్చారు. కొద్దిమంది చావుబతుకుల్లో వున్నారు. ఇంక సస్పెండ్ ఎవరిని చేస్తారుసార్! ఎలా చేస్తాం!" వొణికిపోతూ అడిగాడు.

"నిన్నే సస్పెండ్!" అని అర్థం!

తలబాదుకున్నాడు పోలీసుఅధికారి.

"నీమూలాన మనవాళ్ళంతా చచ్చార్రా!" నన్ను సస్పెండ్ అంటున్నాడు మా కమీషనర్. నాకింకా ఏంభయం? అంటూ తన రివాల్వర్

పేల్చబోయి — అందులో అప్పటికే బుల్లెట్స్‌లేక ఖాళీగా వుండటం చూసి — గుఱ్ఱంమీద కూర్చున్నవాడి తలమీద గురిపెట్టి గట్టిగా తుపాకీ విసిరాడు. "ఈ దెబ్బతో ఖతమ్ వీడు" అని అరుస్తూ! — మరుక్షణమే చావుదెబ్బ తగిలినట్టు కేక!

"అబ్బో! చచ్చాన్రా! దేవుడో!" అంటూ కుప్పకూలాడు. మిగిలిన రివాల్వర్ తన తలకే తగిలి గుడ్లు తేలవేసి కిందపడిపోయాడు. మునుపటిమాదిరే గుఱ్ఱంగాని, రౌతుగానీ కనీసం తిరిగి చూడలేదు విగ్రహంలా అలానేవున్నాడు. చుట్టూచేరిన ప్రజలు అందరూ తలోరకంగా రకరకాలుగా వ్యాఖ్యానంచేస్తూ సముద్రపుహోరులా రణగొణధ్వనితో హోరెత్తిపోయింది.

ఇంతలో వీడియోకెమేరాలతో తళుక్కున మెరిసే ఫ్లాష్‌గన్‌లతో పత్రికలవారు ప్రవేశించారు. ఆంధ్రజ్యోతి, ఈనాడు ఇంకా ఫారిన్ పత్రికా విలేఖరులు 'క్లిక్ క్లిక్' నిమిషలమీద ఫొటోలుతీస్తూ మెరుపులా పత్రికల ఆఫీసుకు టెలీఫొటోగా క్షణాలమీద అందించారు, వార్తాచిత్రాలు, సంచలన వార్త!

పత్రికలవారి గుంపుకి అవతల ఒక పసుపుపచ్చ వాన్ ఆగింది. అందులోంచి దిగాడు ఒక ఆజానుబాహుడైన వ్యక్తి! తెల్లటిగడ్డం, పొడుగాటి సిల్క్‌వంటి తెల్లని గిరజాలజుట్టూ! బంగారుఛాయతో ఎత్తైన కోటేరుముక్కు పొడుగాటి బురఖాలాంటి కనకాంబరంరంగు కాషాయపు కుఫ్నీవంటి లాల్చీ ధరించి స్వామీజీ వచ్చారు! జ్ఞానానందమహారాజుకీ జై అంటూ కొందరు భక్తులు నినాదాలు చేసారు. పత్రికలవాళ్ళు విసుక్కు

న్నారు. ఈ ప్రమాదంలో ఈ జేజేలేంటి? ఇక్కడికి స్వామీజీ ఎందుకు వచ్చినట్టు?

ఇవేమీ పట్టించుకోకుండా స్వామీజీ జరుగుతున్నదంతా అక్కడ చేరిన గుంపులోని ప్రత్యక్ష సాక్షుల్ని అడిగి తెలుసుకోవడం ప్రారంభించారు.

"పోలీసులు — ఆ తెల్లగుఱ్ఱంమీద కూర్చున్న మనిషిమీద షూట్ చేసారు స్వామీజీ! ఎనిమిదిమంది పోలీసుసిపాయిలు మూడు వరుసలుగా నిలబడి ఒకేసారి షూట్‌చేశారు. అంతే! మరుక్షణమే ఆ ఎనిమిదిమందీ చచ్చిపోయినట్టు పడిపోయారు!" అని నలుగురు స్టూడెంట్స్ సైకిళ్ళు పట్టుకొని తాము చూసింది చూసినట్టు స్వామీజీకి చెప్పసాగారు పూస గుచ్చినట్టు —

ఏం జరుగుతోందో ఎవరికీ అర్థంకావడంలేదు. స్వామీజీ! అంతకు ముందే ఆ గుఱ్ఱంమీదాయన్ని తన వార్నింగ్ ఖాతరుచేయలేదని ఆ పోలీసుకమీషనరే స్వయంగా తన రివాల్వర్ తీసి షూట్‌చేయ్యడం మా కళ్ళారా చూశాము!"

"షూట్ చేసాడా? పోలీసుకమీషనరా? ఏమైంది?" స్వామీజీ ఆందోళనగా ప్రశ్నించారు.

"ఏముందీ! మరుక్షణమే ఆ పోలీసుకమీషనరు కెవ్వన చావుకేకవేసి గుడ్లుతేలేసి కిందపడిపోయాడు. క్షణాలమీద అంబులెన్స్‌వచ్చి తీసుకుని పోకపోతే ఈపాటికి చచ్చివుండేవాడు. అతడు గురి సరిగానే పెట్టి షూట్ చేయడం మేంచూశాం!"

ఆలోచనగా వింటూ స్వామీజీ చేతిలోని జపమాలను వేగంగా తిప్పుతూ అన్నాడు :

"ఖర్మ! ఖర్మ! — ఎవరుచేసిన ఖర్మ వారు అనుభవించారు — క్షణాలమీదే!" అన్నారు తనలోతానే మాట్లాడుకుంటున్నట్టు!

"ఏమిటి స్వామీజీ మీరనేది? ఖర్మ అంటారేమిటి?" అంటూ స్టూడెంట్స్ ఆయనచుట్టూ గుమిగూడి ఆత్రంగా ప్రశ్నించారు.

"ఆ గుర్రంమీద కనిపించే వ్యక్తి ఎవరో దివ్యపురుషుడు! మామూలు మనిషిమాత్రం కాదు! మహాయోగులకు, తాంత్రిక సిద్ధపురుషులకూ లభించని భగవత్‌శక్తి ఆయనకు రక్షణకవచంలా కాపాడుతోంది! కళ్ళకు కనిపించడంలేదూ? జరిగేదంతా!"

"కనిపిస్తున్నది సార్! కాని అర్థమే కావడంలేదు. తుపాకులు పేల్చినవాళ్ళు — కిందపడి చావడమేమిటి? ఆయనకు కనీసం చర్మం ఐనా కందకుండా చెమటకూడా పట్టలేదే? ముఖానికి? — అదెలా సాధ్యం?" అంటూ స్టూడెంట్స్ పత్రికలవాళ్ళు, T.V. కెమెరావాళ్ళు ఇంకా దారినపోయే దానయ్యలూ, ఒకరి భుజాలపైకి ఇంకొకళ్ళు ఎగిరిచూస్తూ కుతూహలంగా ప్రశ్నలమీద ప్రశ్నలు — వర్షంలా కురిపిస్తున్నారు. దాంతో స్వామీజీకి అర్థమైపోయింది — 'మరుక్షణంలో ఇక్కడినుంచి వెళ్ళిపోకపోతే నేనీ జనసమ్మర్థంలో చిక్కుకుపోవడం ఖాయం!' అని. ఆతరువాత పోలీసులుగాని ఇంకెవరైనా గాని వచ్చి చేసేందుకేమీ చేతగాక కాషాయం ధరించిన తననే 'రౌండప్' చేసి అదుపులోకి తీసుకున్నా ఆశ్చర్యమేమీ వుండదని!

“ఒక్కమాట” — అని

“ఎవ్వరు ఏది పేల్చినా — అది పేల్చినవాళ్ళకే తగులుతోంది కనిపించడంలేదా? పోలీస్ కమీషనర్ షూట్‌చేసినా రిజర్వ్‌పోలీసు దళాలు గాని, ఇంకా ఎవరువచ్చినా అంతే — ఆ గుఱ్ఱంమీద వ్యక్తి ఎవరో ఊహాకుమించిన దైవశక్తిగల సిద్ధపురుషుడని!” అంటూ ఆయన తన వేన్‌లో ఎక్కి జనసమ్మర్ధంలో దారిచేసుకుంటూ వెళ్ళిపోయాడు.

క్షణాలమీద రోడ్డుమీద వందలు వేలమంది జనంతో కిటకిటలాడి పోయింది మౌంట్‌రోడ్డుఅంతా! వేయిగజాలు వెనకాలే ఛీఫ్‌మినిష్టర్ కారు ఆగిపోయివుంది. దానివెనకే సెక్యూరిటీకార్లు గౌరవ సైనికదళాలతో వచ్చే గవర్నరుకారు అన్నీకూడా సముద్రంలాంటి జనసమ్మోహంమధ్య ఆగిపోయివున్నాయి — హోరు హోరుమని కార్లు హారనుచేస్తూ! ఎవ్వరూ హారన్ మోత విని తొలగడంలేదు. తొలగడానికక్కడ సందుకూడా లేదు జనసమ్మోహంలో కిక్కిరిసిపోయి.

రోడ్డుపక్కనేవున్న పాదచారులు నడిచే పేవ్‌మెంట్‌మీద న్యూస్‌పేపర్ అమ్మే బాయ్ సాయంత్రం పేపర్ (Evening Edition) ఒకటే పేపరు! కేకలువేస్తూ అమ్ముతున్నాడు. '**మౌంట్‌రోడ్డులో ఆశ్చర్యం!**' తుపాకీగుండ్లు **ఎవరుపేల్చినవి వాళ్ళకే** తగిలి పోలీసు అధికారి దుర్మరణం! పాతికమంది తుపాకీగుళ్ళు తగలకుండా — **తెల్లగుఱ్ఱంమీద రోడ్డుకి అడ్డంగా ఒక వింతమనిషి** సంచలన వార్త!” అంటూ

సందట్లో సడేమియా అని జరిగేది జరుగుతూంటే వేడివేడిగా వార్తలు అచ్చువేసి అమ్మేసుకుంటున్నారు పత్రికలవాళ్ళు! ఈ సాయంత్రం

వార్తాపత్రికల Evening Edition కొందరు ఆత్రంగా ఎగిరి లాక్కుని కొని చదివేస్తు న్నారు. మరికొందరు కొనకుండానే పేపరుకిందకు దూరి చదువుతున్నారు. క్షణాలమీద పేపర్లు చదివేవారి గుంపులు పెరిగిపోయి పేపరు మధ్యగా చీలి రెండుముక్కలైంది! అవే, తలోముక్కా తీసుకొని పరిగెత్తి చదివేవారు చదువుతున్నారు! నిమిషాలమీద వార్తాపత్రిక కుక్కలు చించిన విస్తరిలా ముక్కలుగా చినిగిపోతే తలో అక్షరమూ చదవడానికి ఆత్రపడుతున్నారు.

చదివినవారు వార్తలని ప్రచారం చేస్తున్నట్టు అందరికీ ఆశ్చర్యంగా తెలియజెపుతున్నారు. క్షణాలమీద సముద్రహోరులా ప్రజలహోరు! పత్రికల్లో వార్త దావాగ్నిలా వ్యాపిస్తూ — ప్రచారంగా పెరిగిపోయింది!

“ఏంజరిగింది? ఏంజరుగుతోంది? ఎలా జరిగింది?” అన్న ప్రశ్నలే సర్వత్రా వినిపించాయి.

ఏప్రశ్నకీ సమాధానమే లేదు! — ఆ గుఱ్ఱంమీదకూర్చున్న వ్యక్తి చుట్టూ పొర్లివస్తున్న ‘తుఫాను’ వంటి జనసందోహాన్ని చూసి కనీసం కదలనుకూడా కదలకుండా రాతివిగ్రహంలా అక్కడే నిలబడివున్నాడు. జనసమ్మర్ధం మాత్రం భయంగా ఆదుర్దాగా ఆ గుఱ్ఱానికి పదిబారుల దూరం ఖాళీజాగా విడిచి నిలబడ్డారు వింతను తమాషాగా చూస్తూ! ఎవరూ దగ్గరికి వెళ్ళడానికిగాని గుఱ్ఱాన్ని తాకడానికిగాని సాహసించలేదు — ఆ గుఱ్ఱం ముందు నెత్తురుతో తడిసిన పోలీసుల శవాలు మాత్రం అలాగే పడివున్నాయి.

II

నిమిషాలమీద 'మౌంట్-రోడ్డు'మీద జరుగుతున్న వింత ఆశ్చర్యం, పత్రికలద్వారా వేలు, లక్షల కాపీలలో దావానలంలా మద్రాసు నలు మూలలా వ్యాపించింది.

"మౌంట్‌రోడ్డుమీద – గుర్తుతెలియని వ్యక్తి!" తెల్ల గుఱ్ఱంమీద యోధుడు తుపాకులు పేల్చి, **'నేలకూలిన పోలీసుల వైనం!'** — అంటూ తాటికాయలంత హెడ్-లైను-శీర్షికలతో!!!

అందరూ ఆశ్చర్యపడేవారే! ప్రశ్నలమీద ప్రశ్నలు కుమ్మరించేవాళ్ళే! ఎవరివద్దా ఏం సమాధానంలేదు!! ఎవ్వరికీ ఈ సమస్యను ఎలా పరిష్కరించాలో తోచక తలలుపట్టుకు కూర్చున్నవాళ్ళే!

నిమిషాలమీద ఈ "వార్త" మద్రాసునగరం దాటి తమిళనాడు రాష్ట్రమంతా పాకింది! అదే **"సంచలన–వార్త"**గా సాయంత్రం-TV ప్రసారంలో **"దూరదర్శన్" 'ఈ–టీవీ', "తేజా"**-TV ఇంకా ఇతర వార్తా సంస్థలద్వారా దేశం యావత్తూ భగ్గుమన్నది.

తమిళనాడు-రాష్ట్రం రాజధాని "మద్రాసు నడిబొడ్డులో మద్రాసు **గవర్నరూ, ముఖ్యమంత్రీ, ఉన్నతాధికారులూ** కనీసం **ఎయిర్‌పోర్టుకు చేరలేని వైనం!"** ఆరోజే ఢిల్లీ వెళ్ళాల్సిన **'గవర్నరు–ప్రయాణం రద్దు!!'** కారణం రాజకీయ సంక్షోభం కాదు! సమ్మెలూ కాదు! జనమోర్చానూ కాదు! విద్యార్థుల ధర్నా కానేకాదు! కనీసం కార్మికుల ప్రదర్శనకూడా కాదు! ఏమిటీ? అంటే 'మౌంట్‌రోడ్డుమీద కదలక మెదలక కూర్చున్న — ఒక

యోధుడు! చేతిలో డైమెండ్ ఆకారంతో తళతళా మెరిసే సైనికాధికారుల వద్ద కనిపించేలాంటి వీరచిహ్నంగా సొగలుదీరిన ఖడ్గం! అలా కత్తిపట్టుకొని నిలబడ్డాడేతప్ప ఎవరినీ అదిలించనుకూడా లేదు! కాని కుప్పతిప్పలుగా అతనిమీద ఆయుధాలు ప్రయోగించిన వారందరూ రక్తపుమడుగుల్లో తేలుతున్నారు ఎవరి ఆయుధాలు — వారికే తగిలి!

రాష్ట్రప్రభుత్వంలో ప్రతిష్టంభన! మౌంట్‌రోడ్డునుంచి వెనుదిరిగిన ముఖ్యమంత్రి — మంత్రిమండలితో అత్యవసర కాబినెట్ మీటింగ్! రాష్ట్రంలో కర్ఫ్యూలాంటి "అత్యవసర"-పరిస్థితి సర్వత్రా నెలకొల్పింది! కారణం ఒకేఒక తెల్లగుఱ్ఱం! గుఱ్ఱంమీద ఎక్కినవ్యక్తి! విదేశీపత్రికలు ఈ వింతవార్తను, ముందు స్వీకరించలేదు అసంభవం అన్న దృష్టితో! కానీ ప్రచారసాధనంగా దాన్నే లక్షలాది జనం చూశాక వార్తలు దావానలంలా టెలివిజన్ కెమెరాలద్వారా ఆ వార్త ఢిల్లీకి, న్యూయార్క్, లండన్ — వంటి ప్రపంచంలోని మహానగరాలన్నిటికీ ఒకపెద్ద తుఫానుకెరటంలా సముద్రపు ఉప్పెన అలలాగా వెళ్ళితాకింది! ఏం జరుగుతోందీ ఎవ్వరికీ అంతుపట్టడంలేదు! ఎవ్వరిదగ్గరా సరైన సమాధానం లేదు! నిజంగా అత్యవసర పరిస్థితి — ముందుగా రాష్ట్రంలో తరువాత కేంద్రంలో ఆతరువాత భారతదేశం యావత్తూ "ఎమర్జన్సీ" వంటి పరిస్థితివచ్చి నిత్య-కార్యకలాపాలన్నీ స్థంభించాయి! ప్రభుత్వయంత్రాంగం చేసే మామూలు పనులన్నీ మూలపడ్డాయి. మద్రాసు మౌంట్‌రోడ్డులోని ఈ విపరీతసమస్య గురించే — అందరూ తలలుపట్టుకు కూర్చున్నారు.

ఆరాత్రి సాయంకాలం ప్రసారంలో ఈ వేడివేడి వార్త దావాగ్నిలాగా దేశం నలుమూలలా వ్యాపించింది. అందరూ టీ.వీ.లు పెట్టుకుని దానికే

కళ్ళప్పగించి చూస్తున్నారు! కలకత్తాలో జరుగుతున్న క్రికెట్‌పోటీనికూడా మరచిపోయి మౌంట్‌రోడ్డులోని వింత! వింతలకు వింత, అందరినీ కలవరపరుస్తోంది.

"ఏమండీ! B.B.C.-లో సంచలనవార్త వస్తోందండీ! T.V. లో చూద్దాం రండీ!" అంటూ భర్తను చెయ్యిపట్టి గుంజింది విమల!

ఆమె ఒక పత్రికావిలేఖరి! ఆమెకుకూడా అందనంతటి శరవేగంతో క్షణాలమీద రంగులు మారిపోతూ తాజావార్తలు ఆమెను విభ్రాంతికి గురిచేస్తోంది.

ఇంతలో టెలిఫోన్ మోగింది! కొడుకును "వెళ్ళి ఫోన్ చూడ"మని చెప్పింది — విమల! పన్నెండేళ్ళ స్కూలుపిల్లాడు రమణ, ఫోన్‌ఎత్తి మరుక్షణమే తల్లిని కేకేసి "అమ్మా! న్యూయార్క్‌నుంచి! మామయ్య! అమెరికానుండి కాల్‌చేస్తున్నాడు అర్జెంటుగా మాట్లాడాలట రా! రా!" — అన్నాడు.

"ఇష్టంలేకపోయినా విమల T.V. ముందునుంచి లేచి తన అన్నగారు న్యూయార్క్‌నుంచి ఫోన్‌చేసాడంటే ఆత్రంగా ఫోన్‌ఎత్తి పలుకరించింది.

"హాయ్! సుదర్శన్! ఏమిటి వార్తలు!" మరుక్షణమే నిర్ఘాంత పోయింది తను విన్నదానికి తట్టుకొనలేక వెనక్కితిరిగి భర్తతో "త్వరగా రండీ! మా అన్నయ్య సుదర్శన్!! న్యూయార్క్‌నుంచి కాల్‌చేస్తున్నాడు. అక్కడేదో ప్రమాదం జరిగిపోతోందట! అమెరికాఅంతా గగ్గోలుపుట్టిస్తూ!" పిలిచింది! భర్త నారాయణరావు ఆత్రంగా పెద్దఅంగలువేస్తూ వెళ్ళి —

ఫోన్ అందుకున్నాడు.

“ఏమిటీ! సుదర్శన్!! హలో!! న్యూయార్క్‌లోనా? సంక్షోభమా? ఏమిటి? వరదలా? మంచుతుఫానా? ‘అల్-ఖైదా’ ఉగ్రవాదులా? ఏమిటిలా ఫోన్‌చేసావు?” — అన్నాడు ఆత్రంగా మాట్లాడేస్తూ!

“ఏమిటీ! ప్రపంచ-ట్రేడ్‌సెంటర్‌లోనా, న్యూయార్క్ నడిబొడ్డునా? ఏమిటీ? తెల్లగుజ్జమా! దానిమీద ఎవడో కూర్చున్నాడా? ఎవ్వరూ అతడిని కదలించలేకపోతున్నారా?” అంటూ అదే సంచలనవార్త సరిగ్గా మౌంట్ రోడ్డులో కనిపించిందే సరిగ్గా న్యూయార్క్‌లోనూ కనిపిస్తోందా?” మతి పోయినట్టు అరుస్తూ “విమలా! T.V. ఆన్‌చెయ్యి! ఇక్కడి మద్రాసులోని గుజ్జంమీది మనిషి మాయంఅయ్యి ఇప్పుడు న్యూయార్క్‌లో కనిపిస్తున్నాడా? చూడు T.V. కే అతుక్కుపోయి చూస్తున్న భార్య

“అయ్యో! కాదండీ. ఇతను మౌంట్‌రోడ్డుమీదే, ఇంకా ఇక్కడే వున్నాడు. న్యూయార్క్‌లో కనిపించేది వేరేమనిషి!” — అంది!

“కాదు! కానేకాదు! వేషం, పోలిక అన్నీ భారతీయుడేఅట! అమెరికా అంతా గగ్గోలుపెట్టేస్తున్నారు అతని బొమ్మకూడా T.V. లో చూపిస్తున్నారట! పోలీసులు ఎన్నిరౌండ్లు తలోరైఫిల్ ఉపయోగించినా మరుక్షణమే ఆ రైఫిల్స్ పేల్చినవాళ్లే కుప్పకూలి మరణిస్తున్నారట! అన్ని చోట్లా విమానాలు బంద్! ఎయిర్‌పోర్ట్‌లు మూసేశారట! ఇతనెవరో అరబ్బు ఉగ్రవాదికాని ఆ ‘అల్‌ఖైదా’ వాడుగాని ఈ వింతశక్తులతో ప్రజలను భయపెట్టేస్తున్నాడట!” — అంటూ, బావమరిదితో సుదర్శన్ మద్రాసులో జరుగుతున్న డ్రామాఅంతా చెప్పేశాడు. దాంతో, అవతలి

బావగారుకి మూర్ఛపోయినంత పనయ్యింది; సుదర్శన్‌కి దిగచెమటలు పట్టి! ఫోన్ పెట్టేసి వెనక్కుతిరిగి “విమలా! T.V. ఆపెయ్యి! మనం భోజనం చేయలేదు!” ఫోన్‌పెట్టేసి డైనింగ్‌టేబుల్ దగ్గరకు వచ్చాకగాని గుర్తుకురాలేదు పొద్దుటినుంచీ వంటే చెయ్యలేదని! ఈ సంచలనవార్తకు పొద్దుటినుంచి T.V. వద్దా, ఫోన్‌లవద్దా అతుక్కుని, నిలబడిపోయి వంట సంగతే గుర్తించలేదు! గబగబా బిస్కెట్‌ప్యాకెట్ తీసి బిస్కెట్లూ, పాలు పిల్లలకు తనకూ ‘సర్వ్’ చేసేలోగా “అమ్మా ఈసారి ఆస్ట్రేలియానుంచి పిన్ని ఫోన్‌చేస్తోంది! అర్జెంటుగా మాట్లాడాలని” — ఈసారి చెప్పకుండానే రమణ ఫోన్‌తీసిన తన పిల్లాడి గావుకేక వంటి పిలుపుతో ఉదుటున ఒక్క అంగలో ఫోన్ అందుకుంది! విని నీరుగారిపోయింది!

ఆస్ట్రేలియా ‘క్యాన్-బెర్రా’ నగరంనుంచి ఆమె సోదరి పద్మక్క ఫోన్‌చేస్తోంది! ఆరోజు ఉదయంనుంచీ ఆస్ట్రేలియాలోని ప్రధాన ట్రాఫిక్ కూడలిలో తెల్లగుఱ్ఱంమీద కత్తిపట్టుకుని కనిపించిన అద్భుతవ్యక్తి గురించి పోలీసులు T.V. కెమెరాలు ప్రధానమంత్రి శాసనసభ్యులు అందరికీ అదే అనుభవం! — అదే ఆశ్చర్యం! చివరికి ఆ దేశం — కేంద్ర ప్రభుత్వం సైన్యాన్నికూడా మోహరించారట రాకెట్లు, ఫిరంగులు చుట్టూరా పద్మవ్యూహంలా పెట్టి, మోహరించినా ఆ గుఱ్ఱం కనీసం కదలలేదుట! — మెదలలేదుట! ఆ గుఱ్ఱంమీది వీరుడు వారివంక తిరిగి చూడలేదుట! విగ్రహంలా అలా నిలబడివున్నాడు — మళ్లీ గంటలో “క్యాలిఫోర్నియా’ నుంచి, లండన్‌నుంచీ, “జెద్దా”, “అభూధాబీ”, సౌదీ-అరేబియా, ఆఫ్రికాలోని ‘నైరోబీ’ వంటి అన్ని ముఖ్యపట్టణాలలోంచీ, వారికి తెలిసిన స్నేహితులూ, బంధువులూ ఫోన్‌లమీద ఫోన్‌లు చేస్తున్నారు! ఎవరు

చెప్పినా — అదేవార్త! ఒకే సంచలనవార్త! ప్రభుత్వాలన్నీ సంక్షోభంలో పడ్డాయిట! అన్నిచోట్లా ట్రాఫిక్ అంతరాయం! ఎక్కడిరైళ్ళు అక్కడ నిలబడిపోయాయి! ఎయిర్‌పోర్టులన్నీ ఉగ్రవాదులన్న భయంతో విమానాల సర్వీసులన్నీ నిలిపివేశాయి. ఎక్కడి ప్రయాణీకులు — అక్కడే ఇరుక్కుపోయారు! ప్రపంచ సంక్షోభం! ప్రభుత్వాలలో కల్లోలం! వార్తలవెల్లువల్లో కల్లోలం! అన్నిచోట్లా — కారణం ఒక్కటే! **'తెల్లగుఱ్ఱం'–మీద కత్తిపట్టిన వీరుడు!"** కదలడు, మెదలడు! చిక్కడు దొరకడు! అంతుపట్టని ఆశ్చర్యం బేధించలేని — చిక్కుముడి! — భరించలేని — "సస్పెన్స్".

ప్రపంచమంతా సంక్షోభం — కారణం ఒక్కడే ఒక్కడు — తెల్లగుఱ్ఱంమీద రౌతు!

◆

2

అంతర్జాతీయ అంతరిక్ష సంస్థ - "నాసా" - 'శిఖరాగ్ర సమావేశం!'-I

I

అది 'జెనీవా'లోని అంతర్జాతీయసంస్థ న్యూయార్క్ **'యునైటెడ్ నేషన్స్'**-ఆఫీసు! ప్రపంచంలోని సంచలనవార్తలన్నీ పోగుచేసుకుని ప్రపంచ దేశాల అగ్రనేతలందరూ "ఎమర్జెన్సీ" మీటింగుపెట్టారు! "కిం కర్తవ్యం"-అన్నదొక్కటే సమస్య! నైరోబీనుంచి, పశ్చిమజర్మనీనుంచి, చైనానుండి 'టిబెట్' నుండి — ఇలా నానాదేశాలవారూ ఎవరికి తోచినది వారు సలహాలిస్తున్నారు! కాని ఎవ్వరికీ ఏంచేయాలో ఇదమిద్ధంగా అంతుబట్టినట్టుగా లేదు.

“సార్! ఇదో ‘సీక్రెట్-రిపోర్ట్!’ — 212–ఫైల్!” దొరికింది! ఇది ఇప్పటికి పాతికసంవత్సరాలకు ముందే మన ‘యునైటెడ్-నేషన్స్’ సభలో ప్రసంగించిన ఒక వింతమనిషి రాసిన సీక్రెట్‌రిపోర్టు! — అంటూ ‘సీల్’తో బంధించిన సీక్రెట్ ‘ఫైల్’ను తెచ్చి టేబుల్‌మీద పడేసింది ఆస్ట్రేలియా వనిత ఎలిజబెత్!

“ఇప్పుడీ గోలఏమిటి? అంతా ఈ సమస్య”తో కొట్టుకు ఛస్తున్నాం! — “తెల్లగుఱ్ఱం, కత్తిపట్టిన వీరుడూ! ఎక్కడచూసినా ఒక్కటే గోల!” అంటూ విసుక్కున్నాడు ‘సెక్యూరిటీ-కౌన్సిల్’ అధ్యక్షుడు!

ఆమె మళ్లీ — ఆ ఫైలును చూపిస్తూ “సరిగ్గా ఇదంతా ఇప్పుడు జరుగుతున్నట్టే ఇందులో — రాసివుందిసార్! దీన్ని రాసిందికూడా, ఎవరో ఓ వింతమనిషి! ఎప్పుడో — “రాబోయే ప్రపంచ భవిష్యత్తు” గురించి ఇక్కడ మన యునైటెడ్‌నేషన్స్‌లో ఉపన్యసించాడు — డాక్టర్ వేదవ్యాసట! ఆయన రాసినవే — సరిగ్గా ఇప్పుడూ జరుగుతున్నాయి.

అందులో ఇరవైవ శతాబ్దం చివరి దశకంలో తెల్లగుఱ్ఱంమీద కత్తిపట్టుకుని కనిపించే ఓ దివ్యపురుషుడి గురించి రాశారు — దీనిపేరే **“సీక్రెట్–రిపోర్ట్ 212”** అన్నది. ఆ ‘ఫైల్’నే టేబుల్‌మీద ముందుకు జరుపుతూ!

“ఇదేమిటి? దీనిమీద — రిపోర్టుకు పేరుగాని, హెడ్డింగుగాని లేకుండా ఈ **“212–నెంబరేమిటి?”** అన్నాడు విసుగ్గా ఆశ్చర్యపోతూ!! “అవున్సార్! అది ఈ జరుగుతున్న సంగతులూ, ఇవి జరగబోయే తేదీఅట! దీని అర్థంఏమిటీ, అంటే 21-తేదీ, 12వ-నెలా అంటే —

డిశంబరు, సంవత్సరం 2012. మధ్యాహ్నం — 12 గంటలకూ అవిట! అప్పుడు జరగబోతున్న భవిష్యత్తుఅట ఆ అన్ని అంకెలా కలిస్తే — "212-అని" సింపుల్‌గా సీక్రెట్-కోడ్ వేశారు!" అంటూ ఫైలును విప్పింది! అందులో తళతళా మెరిసే ఆర్టుపేపరుమీద ముత్యంలా మెరిసే తెల్ల గుఱ్ఱం, దానిమీద కూర్చున్న వ్యక్తి, — అతని చేతిలో వెండిలా మెరిసే తళతళమనే కత్తి ఫోటోలా వున్నాయి.

"మైగాడ్!" — అంటూ అందరూ భయంతో — ఊపిరి పెద్ద శబ్దంతో ఆశ్చర్యంగా తీసుకున్నారు. ఈ రిపోర్టు గతంలో ఎప్పుడో రాసిందా! అంటే 1903 సంవత్సరంలో ప్రపంచ పరిశోధకులు రష్యా నుంచీ, జర్మనీనుంచి, ఇంగ్లండునుంచి ఇంకా కొందరు భారతీయ సైంటిస్టులతో కలిసి హిమాలయాలలో పర్యటనచేసి సేకరించిన — "ఆశ్చర్యాలు-రహస్యాల రిపోర్టు!" అట!

"అయితేమాత్రం వాళ్ళ సాహసయాత్రతో మనకేమిటి సంబంధం? మనకెందుకీ తలనొప్పి!" — అన్నాడు ప్రెసిడెంట్ చికాకుగా ముఖం చిట్లించి! ఆ స్టెనో పట్టు-విడిచిపెట్టలేదు!

"సార్! ఇప్పుడీ తలనొప్పికి ఆన్సర్ ఇందులోనే రాసుందిసార్! మన సమస్యకి సమాధానంకూడా ఈ రిపోర్టులోనే వుండివుండవచ్చు! ఎందుకంటే "శంబల ప్రభువు" — అనే భగవంతుడి ఆఖరి-"అవతారం" ఈ రానున్న 20వ శతాబ్దం చివరలో 2012-సంవత్సరంలోగా వచ్చే "భవిష్యత్తు" గురించి హిమాలయపర్వతాలలోకి వెళ్లి ముందుగానే పరిశోధనకోసం "సాహస-యాత్ర" చేసి వారు సేకరించిన రహస్యాల నివేదిక ఇందులో —

“ఎవరెస్ట్ శిఖరం — అడుగున రహస్యంగావున్న సొరంగంగురించీ, దాంట్లో ప్రయాణిస్తే కనబడే వింతలు, విశేషాలూ... మంచుగడ్డగట్టిన నదిఅడుగున సొరంగం, పర్వతంలోపలి గుహలోపలి సిద్ధపురుషులూ, మంచుకొండల మధ్యన దాగివున్న "స్ఫటిక-పర్వతం" దానికింద రహస్యంగా నిక్షేపించబడ్డ “శంబల” అనే దివ్యప్రభావంగల ‘టిబెట్’లోని మంత్రశక్తిగల ద్వీపం!... "స్ఫటిక-శ్రీచక్రం" గడ్డగట్టిన పాదరసంతో తయారయిన నడిచే “చింతామణి” శిలా; వింతగా ఆకాశంలో ఎగిరే తెల్ల గుఱ్ఱంమీద కనిపించే ‘దివ్యపురుషుడూ’! ఇలా ఎన్నో వింతలు... అప్పటికింకా మరణించని 13వ దలైలామాగారు ఆయన గురువు ‘తాషీలామా’ కలిసి రహస్యంగా తాళపత్రగ్రంథాలలో రాసిన “శంబల ప్రభువు” అనే భగవంతుడి దశావతారాలలో ఆఖరి అవతారంగా వస్తాడని రాసిన “సంచలన వార్త!” — ఇది, అంతా ఈ రిపోర్టులో రాసిపెట్టారు!” అంటూ ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవిచేసి చూస్తున్న దేశనాయకులమధ్య టేబుల్‌మీద విసిరినట్టు పడేసింది ‘ఎలిజబెత్’!

II

“అది గుఱ్ఱమూ కాదు — అతడు గుఱ్ఱం స్వారీచేసే రౌతూ కాదండీ!” అన్నాడు ఆందోళనగా ఎదురుగా కంప్యూటర్ స్క్రీన్‌మీద కనపడుతున్న చిత్రవిచిత్రాలైన అంకెలూ, గణితసూత్రాలూ ఈక్వేషన్లవంక ఆందోళనగాచూస్తూ న్యూక్లియర్ సైంటిస్ట్‌గా మారిన హారీ పోటర్ (Harry Potter).

అది 'నాసా' (NASA) అంతరిక్షకేంద్రంలో అణుశాస్త్రవేత్తలందరూ సమావేశమైన ఉన్నతాధికారుల రహస్యకాన్ఫరెన్సు. 'హ్యారీ' ఒక ప్రఖ్యాత కంప్యూటర్ సైంటిస్టుగా మాత్రమేకాక కంప్యూటర్ రహస్యాలతోపాటు మంత్రాలు, తంత్రాలు, ఆధ్యాత్మిక రహస్యాలగురించి అతిమానసిక సైన్సు-పారా సైకాలజీలో శిఖరాగ్ర సైంటిస్టుగా పేరుతెచ్చుకున్నాడు. అతడు చిన్నతనంలో ప్రఖ్యాత నావలిస్ట్‌గా రాసిన నవలలు — "హ్యారీ పోటర్" అన్న మాంత్రికశక్తులుగల ఒక పిల్లవాడి గురించిన కథలు ప్రపంచంలోని బాలబాలికలందరినీ వేల లక్షలసంఖ్యలో చదివించాయి.

"ఇది సైన్సుయుగం! మహిమలు, మంత్రాలు, అతిమానసిక శక్తులు అంటూ ఎవరినీ నమ్మించలేరు! ఎవరినీ మభ్యపెట్టలేరు!" — అంటూ ప్రతీవాడూ వాగే ఈ మిథ్యా సైంటిస్టులకాలంలో కూడా — యోగసిద్ధులు, తాంత్రికశక్తులు, సాయిబాబావంటి మహనీయులు సృష్టించిన విభూతి మహిమలూ వంటి అద్భుతశక్తులగురించి ప్రిన్స్టన్ యూనివర్శిటీలో (Princeton University) పదిసంవత్సరాలుగా పరిశోధన చేసి ప్రపంచ ప్రఖ్యాతిపొందిన సైంటిస్టుగా, కంప్యూటర్ నిపుణుడుగా అమెరికా, యూరప్‌లలో తనకు ఎదురులేని ఖ్యాతినీ, సరిలేని గౌరవాన్నీ, సంపాదించుకున్న అంతర్జాతీయ అగ్రశ్రేణి సైంటిస్టుగా స్థిరపడిపోయాడు.

నాసా (NASA) అంతరిక్షకేంద్రంలో చాలాకాలంగా ప్రపంచంలో జరిగే వింతలూ, ఆశ్చర్యాలపైన పరిశోధన జరిపి వాటి వెనక దాగిన నిగూఢమైన సైన్సురహస్యాలను ఆధ్యాత్మిక సత్యాలను యోగ, అతిమానసిక తాంత్రికసిద్ధులపైన సూపర్‌కంప్యూటర్ స్థాయిలో అతడుచేసిన

విశ్లేషణ అద్భుతం, అపూర్వం అన్న ప్రశంసలు ప్రపంచమంతటా వెల్లువలా వ్యాపించి, తనని గౌరవించే ఉన్నతాధికారిగా నాసాలో "హ్యారీ పోటర్" ఈనాటి రహస్య కాన్ఫరెన్స్‌కు ఛైర్మెన్‌గా కూర్చున్నాడు. అతని మాటంటే అందరికీ గౌరవం, సైంటిస్టులకు అపారమైన విశ్వాసం, ఆధ్యాత్మిక పరిశోధకులకు ప్రమాణవాక్యం.

అలాంటి కాన్ఫరెన్స్‌లో ఈనాడు చర్చకువొచ్చిన విచిత్రమైన అంశం ప్రపంచమంతటినీ పట్టి కుదుపుతున్న సంచలనవార్త — వింతలలోకెల్లా వింత. అది, టి.వి.లో, వార్తాసంస్థలలో గగ్గోలుపుట్టిస్తున్న **"తెల్లగుఱ్ఱం మీద వీరుడు"** అన్న అంశం.

ప్రపంచదేశాల ప్రభుత్వాలన్నీ కలిసినా, పరిష్కరించలేని సమస్యగా మారిపోయాడు — తెల్లగుఱ్ఱంమీద ఎక్కి తళతళా మెరిసే కత్తి పట్టుకున్న వీరుడిగా ప్రపంచ దేశాలన్నింటిలోనూ ప్రత్యక్షంగా ఒకేసారి కనిపిస్తున్న విచిత్రం.

"అతడెవరు? అతడెక్కింది మామూలు గుఱ్ఱంకాదా? అతని చేతిలో ఎప్పుడో పురాతనకాలంలో ఉపయోగించే — కాలదోషంపట్టిన కత్తి — ఈ అణుయుగంలోని తుపాకులకు, బాంబులకు, రాకెట్లదాడికి ఎదురు తిరిగి చెక్కుచెదరకుండా ఎలా నిలబడింది?" అన్నదే ఈనాటి ఉన్నతాధికారుల కాన్ఫరెన్స్ అయిన "నాసా" అంతరిక్ష పరిశోధనా కేంద్రంలోని నిపుణుల బృందంముందర వున్న చర్చనీయాంశం.

"గతంలో మీరు విన్న ప్రఖ్యాత **'అతిమానసిక-సిద్ధులు'** గల యూదుజాతి యువకుడు "యూరీ గెల్లర్" (Yuri Geller) చూపిన

అతిమానుషమైన అతీంద్రియ శక్తులకన్నా ఇది విచిత్రమా?" అంటూ ప్రశ్నించాడు జార్జి హేరిసన్.

ఇతడు ప్రపంచ సైంటిస్టులలోనేకాక కంప్యూటర్ సైంటిస్టులలో కూడా, శిఖరాగ్రస్థాయి నిపుణుడూ — గతంలో "యూరీ గెల్లర్" (Yuri Geller) అనే యూదుజాతి యువకుడు తన అద్భుత శక్తులతో ప్రపంచ మంతటినీ ఉర్రూతలూగించిన కేసు రహస్యాలను పరిశోధనచేసిన బృందంలో ప్రముఖుడు.

యూరీ గెల్లర్ అనే ఆధ్యాత్మికశక్తులుగల యువకుడి గురించి 1970–1980 మధ్యన విననివారు లేరు. అతడొక యూదుజాతి (Jewish) యువకుడు. పది పన్నెండేళ్ళ పిల్లవాడిగా స్కూల్‌లో పాఠాలు శ్రద్ధగా వినకపోతే అతని టీచరు గట్టిగా మందలించాడు — ఆ పరధ్యానం గురించి! ఉలుకూ, పలుకూ లేని యూరీ గెల్లర్‌ను తుళ్ళిపడేలా చేసి మనస్సును ఏకాగ్రతవైపు తిప్పాలని ఆ టీచర్ — "గెల్లర్? నీకు నేను చెప్పేది తలకెక్కుతున్నదా? కనీసం గడియారం చూసి ఇప్పుడు టైమ్ ఎంతయిందోనైనా చెప్పగలవా?" అంటూ మందలించాడు యూరీని! క్లాసులో అందరికళ్ళూ ఎదురుగావున్న గోడ గడియారంవైపు చూసాయి. టైమ్ పన్నెండుంపావు కావస్తోంది.

క్లాసరూమ్ మధ్యలో లేచినిలబడ్డాడు యూరీ. చేతులుకట్టుకుని టీచర్ ప్రశ్నకు సమాధానంగా "ఇప్పుడు టైమ్ పావుతక్కువ పన్నెండయ్యింది!" అన్నాడు. అందరూ తుళ్ళిపడ్డారు. స్పష్టంగా గడియారంలో కనిపిస్తున్న టైము చెప్పలేకపోవడమేమిటి? "సరిగ్గా చూసిచెప్పు! లేదా

లేక చూడటం చేతకాక చెప్పలేదా?" అనుకుంటూ గోడ గడియారంవంక చూసిన టీచర్ తుళ్ళిపడ్డాడు!! గడియారంలోని నిమిషాలముల్లు ముప్పై నిమిషాలు వెనక్కితిరిగి పావుతక్కువ పన్నెండును చూపిస్తున్నది!! విస్తుపోతూ తన చేతి వాచీవంక చూసుకున్నాడు. తన కళ్ళముందే తన చేతివాచీలోని నిమిషాల ముల్లు — వెనక్కితిరిగి పావుతక్కువ పన్నెండును చూపిస్తున్నది. టీచర్ మళ్ళీ అదిరిపోయాడు. ఈసారి క్లాసులోని విద్యార్థులందరి వాచీలు వెనక్కితిరిగి యూరీ చెప్పినటైమునే చూపసాగాయి.

అప్పటినుంచీ గెల్లర్ గడియారం టైమ్‌ని వెనక్కితిప్పగల విపరీత యోగ-శక్తులుకలిగిన, సిద్ధులుగల పిల్లవాడిగా ప్రసిద్ధిపొందాడు. ఆరోజు నుంచి ప్రపంచవార్తలలో యూరీ గెల్లర్ ప్రఖ్యాతవ్యక్తి.

ఇంకొకసారి రోడ్డుమీద నడుస్తున్న యూరీ గెల్లర్ ఎదురుగావున్న ఎలక్ట్రిక్‌దీపం వెలుగుతున్న కరెంటు ఇనుపస్తంభంవైపు తదేకదీక్షగా ఏకాగ్రతతో చూసాడు. క్షణాలమీద తొమ్మిది అంగుళాల మందంకలిగిన ఆ ఉక్కుస్తంభం — వెన్నలా కరిగి ఒక మైనపు కొవ్వొత్తిలాగా మెలికలు తిరిగి వొంగిపోయింది — పిండితో చేసిన జంతికలాగ మెలికలుగా తిరిగి వొంగిపోయింది. ఆనాటినుంచి యూరీ గెల్లర్ — అద్భుత మానసిక శక్తులు కలిగిన వ్యక్తిగా ప్రపంచ ప్రఖ్యాతిపొందాడు.

అతడిని ప్రపంచంలోని శిఖరాగ్రదేశాలకు తీసికెళ్ళి, ఎన్నో ప్రదర్శనలు ఇప్పించాయి తమతమ దేశాలలో. సోవియట్ రష్యాలోని కమ్యూనిస్టు పరిశోధక బృందంవారు యూరీ ప్రదర్శించిన వింతప్రదర్శనల్లో అతని 'అతి-మానసిక శక్తులు' చూసి విస్తుపోయారు.

తాము చదువుకున్న సైన్సుసూత్రాలకు అందని ఏదో అతీంద్రియ శక్తి అణుశక్తికన్నా, ఎలక్ట్రిక్ విద్యుత్తుకన్నా, అయస్కాంత శక్తికన్నా బలమైనదేదో శక్తి — యూరీ మెదడులోంచి ప్రసరిస్తూ అతడి కళ్ళల్లోంచి కిరణాల్లా దూసుకుపోయి రోడ్డుమీది ఇనుపస్తంభాలను, గడియారాలను, లైట్లను చివరికి ఎలక్ట్రానిక్ కంప్యూటర్లను కూడా మార్చివేసే శక్తి అని గుర్తించారు. ఇది యదార్థమైన యూరీ జీవితచరిత్రా — అతని ఆత్మకథ చదివితే మీఅందరికీ తెలిసే యదార్థవిషయం!"

అలాంటి యూరీపై పరిశోధించిన ప్రఖ్యాత సైంటిస్టు, మేధావీ కచ్చితమైన జ్ఞానంకలిగిన నోటోవిచ్... "అది అసలైన గుఱ్ఱమూకాదు! ఆ గుఱ్ఱంమీద కూర్చున్న వ్యక్తి వీరుడూ కాదు!" అంటున్న అతని మాటలు విని తుళ్ళిపడ్డారు ఆ కాన్ఫరెన్స్‌లోని సభ్యులందరూ. తాము విన్న మాటలనే ఏమిటని మళ్ళీ అడిగారు.

జాన్ హారిసన్ మళ్ళీ నిబ్బరంగా అందరినీ చూస్తూ చిరునవ్వుతో అవేమాటల్ని ధృవీకరించాడు తన మాటలని. "నిజమే నేను చెప్పేది! నా నిశ్చితాభిప్రాయం" — "అది గుఱ్ఱమూ కాదు! ఆ గుఱ్ఱంమీద కూర్చున్న వ్యక్తి వీరుడూ కాడు!" — అని.

"ఏమిటి? అతడెక్కినది గుఱ్ఱంకాదా? తెల్లటి సిల్కులాగా మెరుస్తున్న తెల్లగుఱ్ఱంమీద వ్యక్తి వీరుడు కాదా? ఇలా ఈ తెల్లగుఱ్ఱంపై వీరుడిని ప్రపంచమంతా చాలామంది ప్రేక్షకులుగా చూసారుగదా? ఇండియాలోని మద్రాస్‌లోనూ, కలకత్తాలో, ఢిల్లీలో, బొంబాయి, బెంగుళూరులోనూ ఇంకా అన్ని నగరాలలోనూ — అందరూ ఒకే

విధంగా, అన్నిచోట్లా ఒకే సమయంలో — సరిగ్గా అదే సమయంలో అమెరికాలోని న్యూయార్కు, బోస్టన్, వాషింగ్లన్, పిట్స్‌బర్గ్, లాస్‌ఏంజిల్స్ వంటి అన్ని ముఖ్య నగరాలలోనూ సరిగ్గా అదేవిధంగా అలాగే నాలుగు రోడ్లు కలిసిన ట్రాఫిక్‌కేంద్రంలో — నిలబడిన ఆ తెల్లగుఱ్ఱంమీద వీరుడు అలానే కత్తిపట్టుకుని కనిపించాడు! అందరికీ అదే అనుభవం — తుపాకులు పేల్చినా, A.K-47 వంటి ఆటోమేటిక్ రైఫిల్ పేల్చినాసరే ఆ పేల్చినవాళ్ళే — తమ ఆయుధాలకూ బుల్లెట్లకూ — తామే ఆహూతియై కుప్పకూలి మరణించారు. సైనికులు ట్రక్కులలో దిగి వందల సంఖ్యలో తమ రైఫిళ్ళను, మోర్టార్ గన్‌లు, ఫిరంగులూ అతనిపైన పేల్చారు. కాని — బలమైన రాకెట్లవంటి క్షిపణులను ఎన్ని షూట్‌చేసినా ఎనభైనుంచి ఐదువందలపౌన్ల బాంబులుపేల్చినా, రాకెట్లను అంతరిక్షం నుంచి అతనిపైకి ప్రయోగించినా — ఆ మనిషినిగాని, ఆ గుఱ్ఱాన్నిగాని పేల్చి తుత్తునియలు చెయ్యాలని యావత్తు సైనికశక్తినీ, పారామిలటరీని వినియోగించినా, ప్రపంచంలోని అన్నిదేశాల ప్రభుత్వాలూ — కలిసి ప్రయత్నించినా — ఆ బాంబులు, రాకెట్లు, అంతరిక్ష క్షిపణులు పేల్చిన వారికే గురితప్పకుండా వెళ్ళి — వారినే క్షణాలమీద భస్మంచేస్తాయి కనీసం బూడిదకూడా మిగలకుండా. గుర్రంమీద వ్యక్తి కనీసం వారివైపు చూడనైనా చూడకుండా తన కత్తిని ఎప్పటిలాగే ఎత్తి పట్టుకుని నింపాదిగా సిగపువ్వైనా వాడకుండా అలాగే గుఱ్ఱంపై కూర్చున్నాడు. ఏమిటి ఈ వింత? ఈ విచిత్రం? ప్రపంచంలోని అన్నిచోట్లా ఒకేసారి — ఒకేగుఱ్ఱం, ఒకేవ్యక్తి ఒక్కలాగే కూర్చుని ఒకే డిజైనుతో చేసిన కత్తిపట్టుకునివున్నాడంటే — ఇతనెవరు? ఎందుకిలా చేస్తున్నాడు? ప్రపంచంలోని ప్రభుత్వా

లన్నీ వాళ్ళ సైనికశక్తులూ, సమస్త ఆయుధాలు, మిలిటరీశక్తి యావత్తూ ఆయన తలవెంట్రుకనైనా కందజేయకుండా అవే నిర్వీర్యం కావటం అనేది సైన్సుకే సవాలు!

ఈ తెల్లగుఱ్ఱంపైన కూర్చుని చేతిలో కత్తి పుచ్చుకున్నవాడిని ఎదుర్కోవటం ఎలా? ఇతని ఉద్దేశ్యం ఏమిటి? కనీసం, అదైనా చెప్పవచ్చు కదా? అతనికి కావలసినది కోట్ల డాలర్లా, వజ్రాలా లేక అతడి అనుచరులైన టెర్రరిస్టులను — ఎవరినైనా విడుదలచెయ్యాలా? అసలు అన్నిచోట్లా ఒకే సమయంలో ఎలా కనిపిస్తున్నాడు? అతనేమన్నా దేముడా? మామూలు మనిషేకదా?" అన్నవే ఇప్పుడు మనముందున్న ప్రశ్నలు?

"దానికి మీసమాధానం ఏమిటి?" — అంటూ ఆశ్చర్యంగా ప్రశ్నించారు కాన్ఫరెన్సులోని సభ్యులంతా!

"అది గుఱ్ఱమూ కాదు! దానిమీద కూర్చున్నది వీరుడూ కాదు!" — మళ్లీ అన్నాడు.

"అదేమిటి? ఎదురుగ్గా స్పష్టంగా కనిపిస్తున్న గుఱ్ఱాన్ని "గుఱ్ఱమూ కాదు — వీరుడిని వీరుడూ కాదు" అంటారు? అంటూ సైంటిస్టులంతా ఏక కంఠంతో భయాందోళనలతో ప్రశ్నించారు!

"ఔను! సరిగ్గా అదే నేనూ చెప్పేది" — అన్నాడు హ్యారీ పాట్టర్ వారి ఆందోళనను ప్రశాంతపరుస్తున్నట్టుగా!

'నేను నా కంప్యూటర్ పరికరాలతో ప్రపంచంలోని అన్ని ప్రధాన కేంద్రాలవారూ పంపిన వార్తలను కంప్యూటర్‌లోకి ఫీడ్‌చేసుకుని విశ్లేషణ చేసాను. దానితోపాటు ఆధునిక సైన్సులైన కెమిస్ట్రీ, ఫిజిక్స్, అంతరిక్ష

యానం, అణుశక్తికి సంబంధించిన ఆటమిక్ ఎనర్జీకి సంబంధించిన సైన్సుల ఫార్ములాలతోనూ నా ఏడవఅంతస్థు కంప్యూటర్‌లోకి ఫీడ్‌చేసి పరిశోధించాను!

ఈ పరిశోధనాఫలితాలన్నీ ఒక్కటే! అదే "అది గుళ్ళమూ కాదు! అతడు మనిషీ కాడు!" అని అన్నాడు. సర్వత్రా అన్ని కంప్యూటర్లు ఏకంగా చెబుతున్నది సంగ్రహంగా చెప్పాను అన్నాడు "హ్యారీ పోటర్".

"అయ్యా! మీరు చెప్పినమాటల తాత్పర్యం మాకు అర్థం అవుతోంది స్పష్టమైన ఇంగ్లీషులోనే చెబుతున్నారుకాబట్టి! కానీ మీరు చెప్పదలచిన మహాసత్యమేదో మాబుద్ధికి అందకుండా వుంది — ఆకాశంలోని నక్షత్రాలలాగ! దయచేసి మాకు అర్థమయ్యేలా విశ్లేషించి చెబుతారా?" అంటూ ప్రశ్నించారు రష్యన్ అంతరిక్ష పరిశోధకుడు ఇవాన్ ఛోల్స్‌స్కీ, జర్మన్‌సైంటిస్ట్ 'హెర్ర్-ట్రాయిన్ జిమ్‌లర్' అన్న అంతర్జాతీయ పరిశోధకులు!

సమాధానంగా 'హ్యారీ' తనప్రక్కనేవున్న వేరొక సైంటిస్టూ, పరిశోధకుడూ 'పాల్ బ్రంటన్' వైపు తిరిగి — "అయ్యా! మీరు చేసిన పరిశోధనల ఫలితాలను దయచేసి మీరేచెప్తారా వాళ్ళకి?" అన్నాడు!

పాల్-బ్రంటన్ నిదానంగా తన టై సర్దుకుని ఇలా మొదలుపెట్టారు — "నేను సైన్సు సూత్రాలపై ఆధారపడి అణువులు, పరమాణువులు, ఎలక్ట్రానిక్‌శక్తి తరంగాలపై విస్తృతంగా పరిశోధనలు చేసినవాడిని — గత పదిఏళ్ళుగా! ప్రపంచంలోని అన్నిచోట్లనుంచి వచ్చిన వార్తలు నా కంప్యూటర్‌లో 'ఫీడ్' చేసి విశ్లేషించి న్యూక్లియర్ ఫిజిక్స్, అంతరిక్షశాస్త్రంతో

ఫలితాలు జోడించి వారంరోజులపాటు నా తల బద్దలుకొట్టుకుంటే తెలిసింది ఒక రహస్యం. అదే మీకు చెప్తాను. ఏమని అంటే — "ఇది గుజ్జమూకాదు! అతను మనిషీ కాదు." — అని!

"మరేమిటి? ఎదురుగా గుజ్జం కనిపిస్తూంటే అది గుజ్జంకాదంటా రేమిటి? దానిమీద ఎక్కి కూర్చున్న మనిషిని — మనిషే కాదంటా రేమిటి? కాకపోతే మరి అదేమిటో చెప్పండి మహాశయా" అంటూ ఆశ్చర్యంతో ప్రశ్నించారు కాన్ఫరెన్సులోని మిగతా సభ్యులందరూ.

"అయితే — జాగ్రత్తగా వినండి! నాకు తెలిసింది చెబుతాను పిల్లలకు కూడా అర్థమయ్యే భాషలో! అది గుజ్జంలా కనిపించే ఒక విచిత్ర పరికరం వంటిది. దాని కదలికలను నడిపించే శక్తి — బయట నుంచి ఎక్కడినుంచో 'రేడియో తరంగాల' రూపంలో ప్రసరిస్తూ ఆ గుజ్జాన్ని కదిలిస్తోంది!

ఎలాగంటారేమో! మీరందరూ ప్రతీరోజూ టి.వి. చూస్తారుకదా? ఆ టి.వి. ప్రోగ్రాంను మార్చే పరికరం రిమోట్‌కంట్రోల్‌ను నొక్కితే టి.వి.లో కనపడే వేరువేరు దృశ్యాల్లోని టి.వి. కేంద్రాలున్న, నగరాలతో లింక్ ఏర్పడుతుంది కదా! సరిగ్గా అలాంటి కాంతి అయస్కాంత ఆటమిక్‌శక్తి వంటిదే — వేరొకశక్తి ఆ గుజ్జాన్ని కదిలిస్తోంది! అంటే అది, "రిమోట్ కంట్రోల్" వల్ల కదిలించబడుతున్నది! ఆ గుజ్జాన్నికానీ, దానితోకలోని వెంట్రుకనికానీ మన తుపాకీలూ, బాంబులు, అణుశక్తీ కూడా ఏమీ చెయ్యలేవు! అది మన సైంటిస్టులకు తెలిసిన శక్తి, తరంగాలకంటే బలమైన తరంగాలతో ఫోటోఎలక్ట్రిక్ రేడియేషన్ వంటి తీవ్రమైన శక్తి

తరంగాలతో నడిపించబడుతోంది! అలాంటిది మామూలు గుఱ్ఱం అంటారా? అనండి!

నేనుమాత్రం అలా అనుకోను!! అది అంతరిక్షకేంద్రంలో ప్రయోగించబడిన "వాయేజర్" వంటి సూపర్ స్ఫుట్నిక్ లాంటి ఊహకందని అంతరిక్ష-కేంద్రం నుంచి రిమోట్‌కంట్రోల్‌తో పనిచేస్తున్నది. అందుకనే ఈ గుఱ్ఱం ఎగిరితే దుమ్ములేవదు — మామూలు గుఱ్ఱాల్లా! అది నేలమీద పరిగెత్తదు. ఒక్కసారిగా హెలీకాప్టర్‌లాగ నేరుగా ఆకాశంలోకి ఎగిరి భూగోళంలోని అయస్కాంతశక్తిని మించిపోయి — భూమి ఆకర్షణ శక్తిని మించిన "అంతరిక్ష అయస్కాంతశక్తి"తో పనిచేస్తోంది రిమోట్ కంట్రోల్‌ద్వారా.

"ఆ శక్తిని ప్రసారంచేసే కేంద్రాన్ని పట్టుకుని ధ్వంసంచేస్తేనో? అప్పుడా ఆటోమేటిక్‌గా? — ఆ గుఱ్ఱం పనిచెయ్యదుకదా?" అంటూ ప్రశ్నించాడు రాకెట్‌సైంటిస్టూ, జర్మన్ పరిశోధకుడూ 'హెర్‌ట్రాయిన్‌స్కీ' ప్రశ్నించాడు.

జార్జ్ జిమ్లర్ మహాశయా! మీకు వచ్చిన అనుమానమే నాకూ కలిగింది! రిమోట్‌కంట్రోల్‌తో పనిచేస్తున్న ఆ వాహనాన్ని స్థంభింపచెయ్యాలంటే — దాన్ని కదిలించే శక్తితరంగాలు ప్రసారంచేస్తున్న రిమోట్‌కంట్రోల్ వంటి పరికరంనుండి వస్తున్నాయి గనక — దాన్ని ఎలా ధ్వంసంచేయవచ్చు అన్నదే నా పరిశోధన!

"తెలిసిందా సార్! ఆ రిమోట్‌కంట్రోలు కేంద్రం ఎక్కడవుందో!"

"ఆ! తెలిసింది! అది ఎక్కడో అంతరిక్షంలోని మన 'గెలాక్సీ'

నక్షత్రమండలం వెనక పాలపుంత అనబడే "మిల్కీ-వే" అవతలనుంచి — పదివేల కాంతి-సంవత్సరాల దూరంనుంచి ప్రసారంకాబడి, సూర్యుని మీదకి దూకి — రబ్బరు బంతిలా గెంతి — భూగోళంమీదకి దిగింది! — ఎక్కడో హిమాలయాలలో వున్న అంతరిక్ష కేంద్రంలోకి!

నా పరిశోధన ఇంతవరకూ వెళ్ళి ఆగింది! మిగతా పరిశోధన మన ట్రాన్సిస్టరు రేడియో పరిశోధకుడు "మర్ఫీ" చెబుతారు అన్నాడు. గాజు కళ్ళూ, పిల్లిగడ్డమూ, మధ్యనలేకుండా మీసాలు పెదవులకు రెండుకొసలా వున్న వింతవ్యక్తి — మర్ఫీని చూపిస్తూ!

అందరికళ్ళూ ఆయనవైపే తిరిగాయి. మర్ఫీ ఒక "మండారిన్" (Mandarin) మాంత్రికుడిలా కనిపించాడు.

"నేను ట్రాన్సిస్టర్‌లపై పరిశోధనచేసిన రేడియో-సైంటిస్టును. ట్రాన్సిస్టర్ అంటే మీకందరికీ తెలుసు! ఈ కంప్యూటర్ల యుగం రాకముందే ఈ ట్రాన్సిస్టర్ సర్వత్రా ప్రచారంలో వుంది! ఉపయోగాన్నిబట్టి వేరు వేరు సైజులలో పాకెట్ ట్రాన్సిస్టర్, చేతిపెట్టె లేక సూట్‌కేస్‌సైజులోనూ, ఇంకా పెద్దది ఇలా అనేకరకాలుగా జపానీస్ టెక్నాలజీతో వాటి వ్యాపారకేంద్రాలలో ప్రొడక్షన్ అయింది. అందులో ఇప్పుడు మనకి కావలసినది — ఒక్కటే!

"అదే! ఏమిటి? ఈ ట్రాన్సిస్టర్‌కు, తెల్లగుఱ్ఱానికీ, దానిపైన వున్న అతిలోకవీరుడికీ సంబంధం ఏమిటి?" అంటూ ప్రశ్నించారు సైంటిస్టులందరూ ముక్తకంఠంతో!

"ఆగండాగండి! అలా పరిగెత్తి పోకండి! నేను చెప్పే విశ్లేషణ

జాగ్రత్తగా మనస్సుకు పట్టించుకుంటూ వినండి!" అన్నాడు తన పిల్లి గడ్డాన్ని నిమురుకుంటూ!

క్షణకాలం నిశ్శబ్దం! చిన్నగా దగ్గి గొంతు సవరించుకుని ఇలా మొదలుపెట్టాడు —

"ట్రాన్సిస్టర్ పనిచేసేది దూరంనుంచి శక్తికేంద్రాలనుంచి ప్రసారమయ్యే అయస్కాంత తరంగాలను ఆకర్షించే ఒకానొక "క్రిష్టల్" ఆధారంగా! అని మీకందరికీ తెలుసు. ఇంగ్లీషులో — క్రిష్టల్ అనే పదానికి సంస్కృతంలో సరైన అర్థం "స్ఫటికం" అని! ఇలాంటి స్ఫటికం ఏదో ఒకటి వుండివుండాలి ఈ భూమ్మీద — అంతరిక్షంలోంచి ప్రసారమయ్యే శక్తితరంగాలను గ్రహించి రిమోట్‌కంట్రోల్‌లా శక్తితరంగాలను తిరిగి ప్రసారం చేసే కేంద్రాన్ని!! నేను కొన్ని నెలలపాటు నిద్రాహారాలు మాని దానికోసం రాత్రింపగళ్ళు ప్రపంచదేశాల అట్లాసును ముందుపెట్టుకుని కళ్ళు కాయలుకాచేలాగ వెతికాను — ఇలాంటి క్రిష్టల్‌కేంద్రం ఎక్కడ వుందా? అని. చివరికి కనుక్కున్నాను అతికష్టంమీద."

"ఎక్కడవుందది? త్వరగా చెప్పండి!! దానికీ ఈ తెల్లగుడ్డానికీ ఏమిటి సంబంధం?"

మర్ఫీ గ్లాసులోంచి కొంచెం మంచినీరు సిప్‌చేసి నెమ్మదిగా ఇలా అందుకున్నాడు!

"అది, హిమాలయాలలో ఎక్కడో మంచుకొండల మధ్యన వున్నది! ఈ స్ఫటికం ఒక మంచులాగా తెల్లగా అటునుంచి ఇటు కనిపించే గాజు పలకలాగ మంచుకొండలతో కలిసిపోయివుండటంతో దానిని గుర్తు

పట్టడం దాదాపు అసంభవం! ఎవరో యోగులు, తాంత్రికసిద్ధులు కలిగిన లామాల వంటివారికి మాత్రమే సాధ్యం — ఇలాంటి స్ఫటికపర్వతాన్ని వెతికి పట్టుకోవటం! ఇలాంటి స్ఫటికకేంద్రం హిమాలయాలలో ఎక్కడో వుండివుండాలని మాత్రమే నాకు తెలుసు. మిగతా పరిశోధన టిబెటన్ లామాసరీలో చిన్నప్పుడు చదువుకున్న అమెరికన్ సిటిజన్ '**లామా దోర్జీ ఛోవ్స్కీ రాంపా** గారు దానిని అన్వేషించారు. దాని వివరాలు గౌరవనీయులైన లామా ఛోవ్స్కీ రాంపాగారే మనకు వివరిస్తారు!" అంటూ మైకును అతడికి అందించాడు మర్ఫీ.

ఎత్తుగా, గుండ్రంగా శివలింగాకారంలో వున్న అతడి, గుండుమీద లైటుపడి తళుక్కున మెరుస్తూంటే బొద్దుగా పసిపిల్లవాడిలాగా నిండుబుగ్గలతోవుండే నిండైన విగ్రహం! పసిపిల్లవాడి అమాయకపు చిరునవ్వుతో 'రాంపా' ఇలాఅన్నాడు.

"నేను చిన్నప్పుడే అంటే ఇరవై ఐదుఏళ్ళక్రితం టిబెటన్ ఓ లామాసరీ ఆశ్రమంలో చదువుకున్నాను! అక్కడ నాతోపాటు చదువుకున్న టిబెటన్ లామా పిల్లవాడు ఇంకొకరు గొప్ప యోగసిద్ధులు కలిగిన మీడియంగా తయారయ్యాడు — ప్రత్యేక శిక్షణలో! అతనే చెప్పేడు హిమాలయాలలో రహస్యంగా దాగివున్న ఆధ్యాత్మికకేంద్రం ఒక స్ఫటిక పర్వతం అని!

అంటే మంచుకొండలమధ్య మంచుశిఖరాలలో కలిసిపోయే రంగులో స్ఫటికం లాంటి రాయితో తయారైన "క్రిష్టల్‌పర్వతం" ఎవరెష్టు శిఖరానికి వాయవ్యంగా, టిబెట్ రాజధాని లాసాకు ఉత్తరంగాను రహస్యంగా వున్నదని. దానిని చేరాలంటే 'శంబల' అనే ఆధ్యాత్మిక కేంద్రం

నుంచి వెళ్ళాలి! భూమి అడుగునవున్న స్ఫటికమందిరం క్రిందనుంచి ప్రయాణించి!

ఈ స్ఫటికమందిరం సంవత్సరమంతా మంచుతో కప్పబడి వుంటుంది! ఎప్పుడో ఒక్కసారి సూర్యకిరణాలు అయనాంశ రేఖమీద పడి మంచులోయను కరిగిస్తే శంబలకువెళ్ళే సొరంగమార్గంమీదవున్న మంచు కరిగి ఆ గుహద్వారం కనిపిస్తుంది. కాని, ఇది ప్రతి సంవత్సరం జరుగదు! ఎప్పుడు జరుగుతుంది? అంటే పన్నెండుఏళ్ళకు ఒక్కసారి పుష్కరం వస్తుంది భారతీయులలాగే మా టిబెటన్‌లకు కూడా! ఈ పుష్కరంలో ఆకాశంలో బృహస్పతి (గురుగ్రహం) మీనం చివర మూడువందల అరవైయ్యో డిగ్రీనుంచి — మేషం మొదటిడిగ్రీ ౦° మధ్యకు కదిలే టప్పుడు మాత్రమే — సూర్యుడు ఇక్కడవుండి ప్రసరించే కిరణాలవల్ల ఆ మంచుకరిగి ఆ ద్వారం తెరచుకుంటుంది!

అప్పుడే ఆ గుహలోకి ప్రవేశించగలం. అందులో భారతీయులు **"శ్రీచక్రం"** అని పిలిచే ఒక యంత్రంవంటి ఆకారంతో — స్ఫటిక మందిరంగా గోపురంలాగా, టిబెటన్ పిరమిడ్‌లాగా త్రిభుజాలు పేర్చి నట్టు నిర్మాణంచేయబడింది — తంత్రశాస్త్రంలో వర్ణించబడిన 'శ్రీచక్రం' ఆకారంతో!! దాని అడుగున "చింతామణి" అనే అద్భుతమైన పాదరసం గడ్డకట్టగా ఏర్పడిన సిద్ధమణి వున్నది! ఆ శిల — మన భూగోళంమీద పుట్టినది కాదు!

మన భూగోళం తయారుకాకముందే నూటతొంభైఏడు (197) కోట్ల సంవత్సరాలకు పూర్వమే సూర్యునికంటే ప్రాచీనమైన ఒక గ్రహ గోళంనుండి పుట్టింది ఈ శిల!

“ఇప్పుడా గ్రహం కనిపిస్తుందా?” — అడిగాడు అంతరిక్ష ఖగోళ శాస్త్రజ్ఞుడు హోయల్.

“కనపడదు! ఎందుకంటే ఎప్పుడో కొన్నికోట్ల సంవత్సరాల క్రితం జరిగిన “గ్రహప్రళయం”లో రెండుగ్రహాలు ఢీకొని నశించిపోయాయి! అందులోని శకలాల్లోంచి భూమ్మీద పడిందే ఈ “చింతామణి” శిల — శంబలలోని స్ఫటికపర్వతంలో రహస్యంగా దాచబడివున్నది! దానికి వున్న అపూర్వశక్తితో! **'కాంతి–అయస్కాంత అణుశక్తి తరంగాల'**ను — అంతరిక్షంలోని చాలాదూరం నుంచి ఆకర్షించి, భూమ్మీదకి దింపి తిరిగి ఆకాశంలోకి వేగంగా ప్రసారం చేస్తుంది!

సరిగ్గా ఈ శంబలనుంచి ప్రసారమయ్యే కాంతిశక్తి తరంగాలు మన మామూలు తరంగాల్లా టి.వి. రిమోట్‌లాగా ఈ తెల్లగుజ్జాన్ని పనిచేయిస్తాయి! అందుకే ఈ గుజ్జాన్ని కనీసం తాకేశక్తికూడా ఈ భూమ్మీదవున్న అణుశక్తికిగానీ, ఎలక్ట్రిక్ విద్యుత్‌శక్తి, అయస్కాంతశక్తి, యురేనియం, రేడియం వంటి తరంగాలకుగానీ మరి దేనికీ లేదు!

ఇలాంటి శక్తి ఈ భూగోళంమీద పుట్టనేలేదు — అంతరిక్షంలోని పాలపుంత అవతలనుంచి వచ్చే ఈ శక్తితరంగాలు ఆకాశంలోని ధనుస్సు రాశి అంచునుంచి మాత్రమే ప్రసరిస్తాయి!

మీలో జ్యోతిషం తెలిసినవారు వారఫలాల్లో చదివే పన్నెండు రాశులపేర్లు వినేవుంటారు. అందులో తొమ్మిదవరాశి — ధనుస్సురాశి! అంటే దైవశక్తి, దయ, భగవంతుడిమీద విశ్వాసం, నిజాయితీమీద నమ్మకం ధర్మం అంటే గౌరవం — అనే లక్షణాలను ఈ ధనుస్సురాశి సూచిస్తుంది!

భూమ్మీద ఈ ధర్మం తగ్గినప్పుడు ప్రసారమయ్యే ఈ కాంతి తరంగాలు 'శంబల'లోని స్ఫటిక శ్రీచక్రంపై పడి భూమికి అవతారంగా దిగివచ్చే దివ్యపురుషుడిపై ఈ ధర్మశక్తిని సరఫరాచేస్తుంది.

అందుకే ఈ ధనుస్సురాశి ఆకారంలో సగం గుఱ్ఱమూ, సగం మనిషి — ఆకారంతో కనిపిస్తారు! కాని చాలామంది జ్యోతిష్కులకు ఈ రహస్యం తెలియదు! దీనినే మా టిబెట్‌లో "గుఱ్ఱంమీద మనిషి" గా వర్ణించారు — ఈ **శంబల ప్రభువునే!** ఇంతకంటే నేను చెప్పాల్సింది ఏమీ లేదు.

అంతరిక్షంనుంచి వచ్చిన ఈ "తెల్లగుఱ్ఱం గుఱ్ఱమూకాదు! దానిపైన కూర్చున్న వ్యక్తి వీరుడూకాదు!" అయస్కాంతశక్తి వంటి అంతరిక్ష శక్తితో శంబల కేంద్రంనుంచి నడిపించబడుతున్న అతడి రానున్న భవిష్యత్ కార్యక్రమం కూడా టిబెట్‌లోని 13–పదమూడవ దలైలామా ముందుగానే తాళపత్రాలమీద రాసివుంచిన **భవిష్యాలుగా** 1933 లోనే రాసిపెట్టారు."

"శంబలప్రభువు అన్న ఈ రహస్యగ్రంథంలోని సారాంశమే 1903 లో హిమాలయపర్వతాలలో పర్యటించిన రష్యన్ పరిశోధకులు నికోలాస్ రోరిఖ్ వంటివారు తిరిగి సేకరించిన వివరాలే — ఈ ముందరి అధ్యాయాలలో వివరించిన ఫైలు–212 అన్న అంకెలలోని సాంకేతిక రహస్యం" — అంటూ ముగించాడు. సైంటిస్టుల కరతాలధ్వనులతో యునైటెడ్‌నేషన్స్‌లోని ఆ కాన్ఫరెన్స్ హాలు దద్దరిల్లిపోయింది.

ఈవిధంగా మానవజాతికి సవాలుగా మిగిలిన సమస్య విడిపోయింది!

* * *

3

‘శంబల’కు – మా సాహసయాత్ర !

ఇలాగ, ప్రఖ్యాత బ్రిటీష్-సైనిక గూఢచారి బ్రిటీషుప్రభుత్వము — టిబెట్‌లోని ప్రభుత్వాన్ని కూలదోసి దాన్ని తమ రాజ్యంలో కలిపేసుకోవాలనే దుష్టసంకల్పంతో — భారత భూఖండం యావత్తూ తన గుప్పెట్లోకి తెచ్చుకోవాలని — గూఢచారిగా రహస్యాలు తెలుసుకుని అతి-‘సీక్రెట్’రిపోర్టుగా, దాన్ని పంపుతూవుండాలని ‘చార్లెస్-బెల్’ (Charles Bell) అనే తన ఏజంటును అందుకోసం సెలెక్టుచేసింది.

అతడు ‘డిటెక్టివ్’ని మించిన సాహసికుడు! టిబెట్‌లోని రహస్యాలన్నీ కనుక్కుని తన ప్రభుత్వానికి రహస్యంగా ‘నివేదిక’ పంపే పనిమీద బ్రిటీష్‌ప్రభుత్వంచే నియమించబడినవాడు ఆ రిపోర్టు — సారాంశమే ఈ **ఫైల్-212** !

"సీక్రెట్-ఫైల్-212"

Govt. of Great Britan

డార్జిలింగ్

India

12-12-1912

"నేను" — అనగా 'చార్లెస్-బెల్' అనబడే బ్రిటీషు ప్రభుత్వపు సైనికాధికారిని, లండన్‌లోని సూర్యుడు అస్తమించని ప్రపంచ సామ్రాజ్యాధికారిణీ విక్టోరియా-మహారాణీ చక్రవర్తిని గారికి సమర్పించిన ఈ "సీక్రెట్-రిపోర్టు" - ఫైల్ 212 గా సమర్పించే ఈ "రహస్య రిపోర్టు.

★ బ్రిటీషుప్రభుత్వం ఆదేశాల ప్రకారం నేను టిబెట్‌లోకి ప్రవేశించే 'నిమిత్తం' కోసం ఇంతవరకూ నిరీక్షిస్తూ వేచివున్నాను — ఎందుకంటే నాకు బ్రిటీష్ చక్రవర్తిని విక్టోరియా మహారాణి ఆదేశమిచ్చిన "రహస్య-కార్యక్రమం" కోసం అతి రహస్యంగా మరెవ్వరికీ తెలియనివిధంగా టిబెట్‌లో ప్రవేశించడానికి ఇంత కాలమూ, వేచివుండాల్సివొచ్చింది.

చివరికి ఇక్కడ ఈ హిమాలయ పర్వతాలలోని —

వేసవి 'టూరిస్టుకేంద్రం'గా పేరుమోసిన ఈ డార్జిలింగ్‌నుంచే — ఒక సాహసయాత్రా బృందం హిమాలయ పర్వతాలను పరిశోధించి ఆధ్యాత్మిక రహస్యాలను దర్శించాలన్న కోరికతో బయలు దేరుతున్న సంగతిని — గమనించాను.

వీరితో కలిసి నేనుకూడా ఒక "వినోద యాత్రికుడుగా" హిమాలయ పర్వతాలలోని "శంబల" రహస్యాలను పరిశోధించే "టూరిస్టు"గా చేరిపోయాను.

ఇలా చేయడంవల్ల నేను బ్రిటీషు ప్రభుత్వానికి రహస్య సైనిక గూఢచారినని ఎవ్వరికీ ఎటువంటి అనుమానం రాకుండా టిబెట్‌లోని బలాబలాలు తెలుసుకోవడానికి టిబెట్ ప్రభుత్వం "పర్మిట్"— సంపాదించుకోవచ్చు! తద్వారా నా హిమాలయయాత్ర వెనుక నా అసలు సంకల్పం — బ్రిటీషు ప్రభుత్వానికి గూఢచారిగా టిబెట్‌లో పాగా వెయ్యాలని అక్కడి రహస్యాలను మన బ్రిటీషు ప్రభుత్వానికి చేరవేస్తున్నాననిగాని ఎవ్వరికీ "అనుమానం" రాకుండా వుంటుంది!

★ అందుకని నేను కేవలం సాహస యాత్రికుడుగానే ఈ రహస్య రిపోర్టును మన బ్రిటీషు ప్రభుత్వానికి అందజేస్తున్నాను. ఇది "ముందస్తు-రిపోర్టు"గా ఒకవేళ ఎవరైనా దీనిని చూసినా రాజకీయ రహస్యాలు ఇందులో ఏవీ లేకుండా కేవలం — "యాత్రారిపోర్టు"గానే ఈ మొదటి రిపోర్టు పంపుతున్నాను.

★ దీని ఈ నకలు ఎవరికంటా పడకుండా 'సీక్రెట్‌ఫైల్'గా సీల్‌చేసి ఒక బోషాణంలో పెట్టి మాసాహస యాత్రికులలో అమాయ కుడూ, దక్షిణాది శ్రీవైష్ణవ మతానికి చెందిన భక్తుడూ అయిన — శ్రీనివాస చక్రవర్తిగారి ఇంటి ప్రహరీ గోడ క్రింద రహస్యంగా భూస్థాపితం చేస్తున్నాను.

ఇలా చేయడం ఎందుకంటే ఒకవేళ నా రిపోర్టు అసలు నివేదిక ప్రభుత్వానికి అందకపోతే — ఆ రిపోర్టు మీకు చేరేవరకు దాని నకలు కాపీగా ఇది భద్రపరుస్తున్నాను. నా రిపోర్ట్ బ్రిటీష్ ప్రభుత్వానికి చేరాక దీని అవసరం ఏమీలేదు. గనుక భూస్థాపితం చేస్తున్నాను.

★ ఇదేమిటో ఎవ్వరికీ అనుమానం కలుగకుండా నా ఈ రహస్యనివేదికను — శ్రీనివాస చక్రవర్తి వ్రాసిన "మా సాహస యాత్రా-బృందం నివేదికతో" జతచేసి ఒక ఫైల్‌గా కుట్టి — అందులో మాఅందరి గ్రూప్‌ఫోటోస్‌తోసహా భద్రపరిచాను.

సభ్యులు :-

మా సాహసయాత్రా బృందంలో ఈ సభ్యులు — 12మంది వున్నాం :-

1. **ఛార్లెస్-బెల్ (Charles Bell) (ఔత్సాహిక పర్వతారోహకుడు - టూరిస్టు - ఇంగ్లండు)**

2. నికోలాస్-రోరిఖ్స్ (Nicholas Roerich) (చిత్రకారుడు-హిమాలయ యాత్రికుడు - రష్యా)
3. శ్రీ మేఘనాద్ సాహా (Dr. M.N. Saha) (సైన్సు పరిశోధకుడు - కలకత్తా, ఇండియా)
4. అలెగ్జాండర్ నోటోవిచ్ (Alexander Notovitch) (రష్యన్ రాయబారి - మాస్కో, రష్యా)
5. జగదీష్ చంద్రబోస్ (భారతీయ వృక్షశాస్త్రజ్ఞుడు - కలకత్తా, ఇండియా)
6. ఔస్పెన్స్కీ (P.D Ouspensky) (ఆధ్యాత్మిక పరిశోధకుడు మరియూ యోగా టీచర్, రష్యా)
7. యువరాజా ఆఫ్ పాటియాలా (మహారాజా, ఇండియా)
8. లామాదోర్జీ-చోగ్యాల్ (Lama Dorjee Chogyal) (టిబెట్ మతగురువు, యోగి, పూజారి)
9. పండిట్ శ్రీనివాస చక్రవర్తి (Pandit S.V. Chakraborty) - హిందూ శ్రీవైష్ణవుడు, ఆధ్యాత్మిక పరిశోధకుడు, సంస్కృత పండితుడు - మద్రాసురాష్ట్రం, ఇండియా)
10. షేర్పా టిన్జింగ్-చోగ్లాం (Sherpa Tinzing Chogyal) (ఖాట్మాండూ, నేపాల్)

11. భావనగర్ మహారాజా వారు

12. ప్రొ. రే లంకాస్టర్ (Prof. Lankaster FZS, F.R.S.) (జంతుశాస్త్రజ్ఞుడు)

పరిశోధనాంశాలు :–

1) జరగబోయే భవిష్యత్తును తెలిపే టిబెట్ "భవిష్యాలు!"

2) నా పూర్వీకుడు బ్రిటీష్ ఆఫీసరు "ఛార్లెస్ యంగ్-హజ్బండ్" (1950) బ్రిటీష్ కల్నల్ పోగుచేసిన **"శంబల–భవిష్యాలు"** సేకరించటం.

3) (i) **కైలాసపర్వతం,** (ii) **ఓంకార శిఖరం,** (iii) **మానస సరోవరం,** (iv) **నర–నారాయణుల** ఆశ్రమం, (v) టిబెట్ పీఠభూమి, (vi) స్ఫటిక పర్వతం (Crystal Mountain), (vii) చింతామణి శిల, (viii) శంబలప్రభువు గురించిన రహస్య భవిష్యత్తు!

లక్ష్యం :–

★ పై అంశాలగురించి యదార్థ విషయాలు తెలుసుకోవటం, వీలైనంత భోగట్టా సమాచారం, కథలూ, గాధలు సేకరించటమూ, రహస్యదారులు, గుహలు, చిక్కుమార్గాలనీ, వాటిని దాటే విధానం అన్వేషించటం.

★ టిబెట్‌కు రానున్న "భవిష్యత్తు"ను పరిశోధించటం — బ్రిటీష్ రాజకీయ రహస్యాల సేకరణ! దలైలామా అధికారులతో బ్రిటీష్ సైనిక పరిపాలన ఏర్పాటుచేసి చైనా అధికారం అంతంచేసే సావకాశం పరిశీలించటం.

★ పై అంశాలతో ఈ 'సాహసయాత్రా-రహస్య రిపోర్టు' ను నేను తయారుచేశాను. ఇందులోని ప్రతి అంశమూ ఒక్కొక్కటి కొన్ని నోట్స్ రూపంలోనూ, మరికొన్నిచోట్ల కధారూపంలోనూ, మిగతాది సాహసయాత్ర వర్ణనగానూ ఈ రహస్య నివేదిక (Secret File) లో నిబంధన చేసి బ్రిటీష్ ప్రభుత్వ ప్రధానమంత్రి ద్వారా ప్రభుత్వానికి సమర్పించడమైనది.

★ ఆ 'రిపోర్ట్' నకలును సీలుచేసి ఈ ట్రంకుపెట్టెలో పెట్టి — ఎవ్వరికీ కనిపించకుండా భారతదేశంలోని హిందువుడు, శ్రీవైష్ణవ బ్రాహ్మణుడూ అయిన 'శ్రీనివాస **చక్రవర్తి**' ఇంటిగోడ పునాది క్రింద చెక్కపెట్టెలో భద్రం చేసిన భోషాణంలో లాక్ (Lock) చేసి శాశ్వతంగా భూస్థాపితం చేస్తున్నాను.

ఇట్లు
బ్రిటీష్‌రాణికి విధేయుడు
మీ

(ఛార్లెస్ బెల్)
బ్రిటీష్ సైనిక అధికారి

12-12-1912
'డార్జిలింగ్'
India

తాను టిబెట్ చేరుకునేదెలా? అందులోనూ ఎవరికీ, అనుమానాన్నీ సందేహాన్నీ రేకెత్తనివిధంగా మంచుకొండలమీద యాత్రకు వెళ్లటం — ఆరోజుల్లో దాదాపు అసాధ్యం! అందులోనూ 'గూఢచారి'గా సీక్రెట్-ఏజంట్‌గా టిబెట్‌లో ప్రవేశించటం అసంభవం!

ఎందుకంటే ఆరోజుల్లో — విదేశీయులు టిబెట్‌లో అడుగుపెట్టటం టిబెటన్ ప్రభుత్వం అనుమతించదు! ఆ ప్రభుత్వం అనుమతి లేకుండా టిబెట్‌లో ప్రవేశించటం — అసాధ్యం!

ఆపరిస్థితిలో — కొందరు భారతీయులు హిమాలయాల్లో దాగి వున్న కొన్ని 'దేవరహస్యాలు' ఆధ్యాత్మిక కేంద్రాలనీ కనుగొని భక్తితో దర్శించి తమ జన్మ చరితార్థం చేసుకోవాలని హిమాలయాలకు "సాహస యాత్ర" చేపట్టారు. అందులో శ్రీనివాస చక్రవర్తి అన్న మా ముత్తాతగారు ముఖ్యులు! హిందువులకు అత్యంత పవిత్రమైన 'కైలాస-పర్వత" శిఖరం చూసి తరించాలని శ్రీనివాస చక్రవర్తి, బెంగాలీ బ్రామ్మణుడూ వృక్ష శాస్త్రజ్ఞుడూ అయిన 'జగదీష్-చంద్రబోస్' బాబూ, సైంటిస్టూ సైన్సు వింతల్ని పరిశోధించాలని మంచుకొండల్లో నెలకొన్న గంగానది పుట్టుక స్థానమైన 'గౌముఖ్' కుండాన్ని దర్శించి స్నానంచేసి తన మనస్సూ శరీరమూ పునీతం చేసుకోవాలని డా. మేఘనాథ్ సాహా వీరికి తోడ య్యాడు. అప్పటికే మందుమొక్కలు 'సోమ-లత' వంటి దేవతా "మూలికా-వృక్షాల్ని" కనుగొనాలని ఈ బెంగాల్ సైంటిస్టు జతకలిసాడు వీరితో!

హిమాలయపర్వత అందాలని సోయగాల్నీ చూసి మురిసిపోయి వాటిని ఇంద్రధనుస్సు రంగులతో చిత్రించిన ప్రఖ్యాత రష్యన్ చిత్ర

కాయుడు 'నికోలాస్ రోరిఖ్' — కైలాస్ పర్వత్‌కి పైన టిబెట్‌లో ఎక్కడో రహస్య స్థావరమైన "స్పటికపర్వతాన్ని" చూసి చిత్రించాలని మంచు కొండలలోకి ఈ సాహసయాత్రా బృందంలో తనూ ఒకడుగా చేరాడు — ఎన్నో ఏళ్ళుగా భూటాన్, సిక్కింలలోని 'హిమిస్' బౌద్ధమటం ఆమాసరీ దర్శించి అక్కడ తపస్సుచేసిన 'జీసస్-క్రైస్టు'గా ప్రఖ్యాతిపొందిన "యోగి-ఈశా" జీవితరహస్యాల్ని గుప్తంగా నమోదుచేసిన అలెగ్జాండర్ నోటోవిచ్ అనే రష్యన్ రాయబారి వీరికి తోడయ్యాడు! ఇతడికి మంచు కొండలలోని రహస్యదారులు, కనుమలు, కొండచరియాలు, లోయలూ తన అరచేతిగీతల్లా పరిచయం — రాయబారిగా అనేకసార్లు ప్రభుత్వ దూతగా ప్రయాణించడంవల్ల.

ఇలా చిలికి చిలికి గాలివానైనట్టుగా ఈ బృందం పెరిగిపోయి వీరితో — మరిఇద్దరు (1) రష్యన్‌యోగి 'గుర్జీఫ్' (Gurdjieff) శిష్యుడూ యూరవులోని మేధావులకు ఆధ్యాత్మిక రహస్యాలని బోధించిన "ఔస్పెన్‌స్కీ" (Ouspensky) అనే ఇంకొకడూ తోడయ్యారు — 'శంబల' రహస్యాలు తెలుసుకోవాలని, (2) ప్రళయాల్ని పరిశోధించిన ఇమ్మాన్యువల్ వెలికోవ్స్కీ, రెండో రష్యన్ సైంటిస్టు ఆధ్యాత్మిక పరిశోధకుడూ మంచుకొండల్లో యాత్ర చెయ్యాలంటే ఎంతో కర్చుతో కూడుకున్నపని.

ఇదంతా నిర్వహించాలంటే — దానికి ఎందరో పరివారమూ, వంటవాళ్లూ, సామన్లు మోసుకెళ్లే కూలీ "షేర్పా" (Sherpa) లూ, ఇంకా డేరాలు, తోపాకులూ, ఆహారపదార్థాలు, మందులు, కొండప్రదేశాన్ని తెలిపే దేశ-పటం అంటే "మ్యాప్" (Maps) కావాలి! ముఖ్యంగా శంబల కైలాస్ ఎవరెస్ట్ "K-2" అనే శిఖరం స్పటికపర్వతం చూపేది కావాలి.

కొంచెమైనా ఆధ్యాత్మికాలలో ఆసక్తి, డబ్బూ, హంగూ, పరివారమూ, పలుకుబడీ గల "పాటియాలా" యువరాజు కూడా వీరికి తోడు అయ్యాడు కొండలెక్కాలన్న పిచ్చితో 'పర్వతారోహకుడు' అనిపించుకోవాలన్న తృప్తికోసం!

ఇందరున్నాగాని వీరికి స్థానికులూ కొండదారులూ, రహస్యాలు తెలిసిన గురువూ, మార్గదర్శకుడూ, నిజాయితీపరుడూ అయి 'బౌద్ధ లామాసరీ'లతో పలుకుబడీ, గౌరవం, పరపతీగల పీఠాధిపది పూజారి వంటి ఒక 'బౌద్ధ-లామా' సహాయం లేకుండా ఇటువంటి యాత్ర అసంభవం! సుడిగాలికి ఎండుటాకులు పోగైనట్టు ఇలా దైవసంకల్పంగా వీరంతా తోడై ఒక బృందంగా కలిసి, చేసిన 'సాహసయాత్ర' రిపోర్టే — ఈ "ఫైల్-212" మాఇంటి అడుగున బోషాణంలో దొరికిన రహస్య నివేదికను తయారుచేసిన — 12-గురు కథానాయకుల నేపథ్యం!

వీరందరినీ కలిపివుంచిన 'ఆసక్తి' ఒకే విషయంమీద! — అదే "శంబల"! 'శంబల ప్రభువు' ఆయన అవతారంగురించిన రహస్యాల సేకరణ!

ఈ సంకల్పంతో 1909 ప్రాంతంలో వీరు చేసిన సాహసయాత్ర యొక్క పరిశోధన సారాంశమైన రహస్యనివేదిక — రిపోర్టులోది! ఇదీ ఈ ట్రంకుపెట్టెలో దొరికిన దస్త్రాల్లోని గూఢచారి రిపోర్టు!

◆

5

శంబలకు దారి !

(1) శ్రీనివాస చక్రవర్తి నివేదిక :-

అది న్యూయార్క్ మహానగరం! తేదీ 23-10-1985 సాయంత్రం 3.30 గంటల ప్రాంతంలో "ప్రపంచ భవిష్యత్తు - రానున్న ప్రపంచ యుద్ధం" అన్న విషయంపై ఒక — ఉపన్యాసం ఏర్పాటుచేయబడింది! యునైటెడ్ నేషన్స్‌లో పనిచేస్తున్న ఎలిజబెత్, ఇంకా గుప్తయోగ సమాజ సభ్యులు అనేకమంది ఈ సమావేశానికి హాజరయ్యారు. ఆ ఉపన్యాసం కాగానే ముగ్గురు విచిత్రవ్యక్తులు ఆజానుబాహులైనవారు, విదేశీయుల వలే కన్పిస్తున్న యోగసాధకుల ముఖవర్చస్సూ, యోగినేత్రములూ కలిగిన వారు అభినందించి ఉపన్యాసకుని అంటే, నా అడ్రసు తీసుకున్నారు!

కాని మర్నాడు మధ్యాహ్నామే నేనున్న బసకు చేరుకుని నాకీ రహస్యగ్రంథాలను శంబలగ్రామానికి వెళ్ళేదారి (The Secret Path to Shambala) అన్న పుస్తకంగురించి తెలిపే 'నికోలాస్-రోరిఖ్స్' గ్రంథాలను కూడా యిచ్చి (మహాత్ముల) అనుగ్రహాన్నీ, ఆశీస్సులనూ తెలిపి సెలవు తీసుకున్నారు. వారి అడ్రస్ చెప్పటానికి మాత్రం నిరాకరించారు. ఇందులో ఎన్నో రహస్యవిషయాలు ఉన్నాయి! ఈనాడు ఈ **'శంబల రహస్యవిషయాలు'** ఈ నా రెండో 'రిపోర్టు' సీక్రెట్-212 File గా కొంతవరకూ పొందుపరచగలిగాను.

నేను తలవనితలంపుగా 1959 లో కులూలోయను సందర్శించటం జరిగింది. నమ్మశక్యం కాని సౌందర్యంగల మంచుశిఖరాలతో మైమరపించే ఈ కులూలోయలో మూడురోజులు గడిపాను! ఆ సమయంలోనే **'బియాస్'** నదిఒడ్డున కాలినడకన ప్రయాణించి, అక్కడ మంచుకరిగిన నీళ్ళతో ప్రవహించేనది ప్రక్కనే ఉడుకుతో పొగలుకక్కే వేడినీళ్ళ సెలయేరును దర్శించి దానిఒడ్డున వశిష్ఠులవారి ఆశ్రమాన్ని చూసి విస్తుపోయాను! ఆప్రక్కనే మనువు దేవాలయం (వైవస్వత మనువు) అత్రిమహర్షి ఆశ్రమంకూడా ఉన్నాయి! అక్కడి వేడినీళ్ళ కుండం (Sulpher springs) లో స్నానంచేసి ఆ నదీతీరానేవున్న **'హిడింబ దేవాలయం'** చూసి ఆశ్చర్యపోయాను!!!

అక్కడే కూర్చుని జపంచేసుకొంటున్న ఒక ముసలిసాధువు ఎవరా అని అడిగితే "అసలిది వ్యాసుడు తపస్సుచేసిన చోటు! ఈ నదిపేరు 'వ్యాస-నది'! దీనిని సరిగ్గా పలుకలేక బ్యాస్‌నది (Beas River) అంటారు" — అంటూ ఇంకా అనేక వింతలనూ విశేషాలను

ఒకనాడు రోరిఖ్ తన పరిశోధనా యాత్రలో భాగంగా మైళ్ళు మైళ్ళు నడిచి పన్నెండువేల ఎత్తున్న మజిలీని చేరుకున్నాడు! గుడారాలు వేసుకొని వేడివేడిగా ఆహారాన్ని తిన్నవెంటనే అలసటకు నిద్రముంచుకొచ్చింది! ఇతని భార్య పదిగంటలప్రాంతంలో పడుకోబోతూ రగ్గును కదిలించగానే భగ్గున ఒక వైలెట్ ఊదారంగు కాంతితో మంట దిక్కులు మెరిసిపోయేలాగ వెలిగింది! ఆమె భయపడి "మంటలు! మంటలు!" అంటూ అరచింది! నికోలాస్ రోరిఖ్ తృళ్ళిపడి లేచిచూస్తే తన గుడారంలో 26 అడుగుల ఎత్తున నిలిచి ఊదారంగు మంటతో ఒక తేజస్సు వెలుగుతోంది! కాని ఆశ్చర్యం!!! ఆ మంట వెలుగేకాని ఎక్కడా వేడి లేదు!

మంటలను ఆర్పడానికి చేతితో ప్రయత్నించగా చల్లగా తగిలింది కొంచెం గోరువెచ్చగా!!! అదే అనుభవం ఇతడి భార్యకూ కలిగింది! ఎంతో వింతపడి అక్కడివాళ్ళను ప్రశ్నిస్తే ఇలాంటి ఊదారంగు మంటలు శంబల గ్రామం సంబంధించిన వారికి తరచూ కలుగుతూంటాయని చెప్పి మిగతా వివరాలను చెప్పడానికి నిరాకరించారు! ఇతడి అనుభవాలను అతని స్వంత వాక్యాలలోనే ఈక్రింద పొందుపరుస్తున్నాను!

> "In Nimu, a small village before Leh, 11,000 feet high, we had an experience which can under no circumstances be overlooked. It would be most interesting to hear of analogous cases. It was after a clear calm day. We camped in tents. At about 10 p.m. I was already asleep when Mrs. Roerich approached her bed to remove the woolen rug. But

hardly had she touched the wool, when a big rose-violet flame of the colour of an intense electric discharge shot up, forming a seemingly whole bonfire, about a foot high. A shout of Mrs. Roerich, "Fire! Fire!" awoke me. Jumping up, I saw the dark silhouette of Mrs. Roerich and in front of her, a moving flame, clearly illuminating the tent. Mrs. Roerich tried to extinguish the flame with her hands, but the fire flashed through her fingers escaping her hands, and burst into several smaller fires. The effect of the touch was slightly warming, but there was no burning, nor sounding, no odour. Gradually the flames diminished and finally disappeared leaving no traces whatsoever on the bed cover. We had occasion to study many electric phenomena, but I must say that we never experienced one of such proportions."

Repeatedly in descriptions of Himalayan travellers one reads of the Himalayan glimmer and Himalayan lights, something similar to the 'aurora borealis'. Perhaps these latter phenomena could also be elucidated by additional experiences. Such a colosal mountain region as the Himalayas indeed embraces many wonders.

In the desert you may come across a lonely shepherd who is singing but, if you ask him to repeat the song, he will tell you that this song of Shambala is only for the desert.

"Chang Shambalin Dayin".
The war of Northern Shambala!
Let us die in this war
To be reborn again
As knights of the Ruler of Shambala".

The latest movements in Mongolia, therefore, are connected with Shambala.

తరువాత 1928 లో మంగోలియాలో ఆకాశంలో అకస్మాత్తుగ తెల్లని గుండ్రని అరిశె వంటి వస్తువులు ఎగురుతూ కనిపించాయి. హడావుడిగా అందరూ పరుగెత్తి చూస్తే అది విమానం కాదు! బెలూన్ కాబోలు అనుకుని బైనాక్యులర్స్‌తో చూడగా అది తెల్లని లోహంవలె వెండిలా మెరిసే గుండ్రని ఆకారం ఒకమెరుపుమెరసి మంచుకొండల వెనుకగా మాయమైంది. ఇది చదివితే ఈనాడు ప్రపంచమంతా వందల మందికి కనిపిస్తున్న "ఎగిరే పళ్ళాలు" లేక UFO లేదా Flying Sauccers వంటి వస్తువులే యివి అని నిశ్చయంగా తెలిసింది! ఈ విషయాలను ఇక్కడ తపస్సుచేసుకునే యోగులను ప్రశ్నించగా ఇవి శంబలనుండి వచ్చే రహస్య సంకేతాలు అని తేలింది.

క్రీ.శ. 1206 లో మంగోలియాలో జన్మించిన "కురులుత్తాయి" (Kurulutai) అనే మహావ్యక్తి సగం ప్రపంచాన్ని జయించి "ఛెంఘీజ్ ఖాన్" గా ప్రఖ్యాతి పొందాడు! ఇతడినే గెస్సార్‌ఖాన్ అనే పేరుతోకూడా విదేశాలలో పిలుస్తారు! ఈ గెస్సార్‌ఖాన్ సరిగా 800 సంవత్సరాల తర్వాత మళ్లీ జన్మిస్తాడని ఆ సమయంలో "శంబల" గ్రామంనుండి కల్కి భగవానుని అవతారంకూడా వస్తుందనీ, మంగోలియాలో భవిష్యత్‌ను

తెలిపే గాథలు తెలియజేస్తాయి! ఎఱ్ఱని రాతితోచేయబడ్డ రాతిగుఱ్ఱం సకిలిస్తుందనీ, 'అదే అతడిరాకకు గుర్తు' అని నికోలాస్ రోరిఖ్స్ తన పుస్తకంలో స్పష్టంగా తెలియజేసాడు!

"శంబల గ్రామానికివెళ్ళే దారి!" అన్న రహస్యగ్రంథం ఒకటి టిబెటన్ మతగురువు 'తాషీ-లామా' (Tashi Lama) వ్రాసినది ఈ శతాబ్దం మొదట్లో ఇంగ్లీషులో ప్రచురితమైంది.

"శంబల"కు వెళ్ళేదారి ! :-

దానిలో హిమాలయ పర్వతాలకు ఉత్తరంగా 'కారకోరం' (Karakoram) పర్వతాలకు ఈవలగా మంచుకొండల పర్వతపంక్తిలో ఒక రహస్యస్థావరం సృష్టి ప్రారంభంనుంచీ వుండేదని ప్రపంచంలోని చెడుకర్మలకూ, పాపాలకూ స్వార్థపూరిత ఆలోచనలూ — అక్కడికి అందకుండా ఒక పవిత్ర దేవలోకంనాటి 'సిద్ధుల-తపోభూమి' ఉన్నదని తెలియవస్తున్నది! అక్కడ పరమగురువులు నింతర యోగసమాధిలో అఖండ తపస్సులో మునిగివుండేవారని అనేక ఆధారాలు పరిశోధనా రహస్యాలు మనకి లభిస్తున్నాయి! అంతేకాదు మానవులలోని 'దివ్య శక్తులు' (Spiritual Powers) యోగసిద్ధులూ మేల్కొలిపే ధ్యాన, ప్రాణాయామ, యోగసాధనలూ, ఇంకా అనేక మూలికారహస్యాలు — మనిషి శరీరంలో వయస్సును స్థంభింపచేసేవి, నిత్యయవ్వనాన్ని ప్రసాదించేవీ, 'కాయకల్పం' లేక 'కాయసిద్ధి' వంటి "సిద్ధ-ఆయుర్వేద" ఔషధ రహస్యాలు వుండేవని ఇప్పుడిప్పుడే విదేశీ పరిశోధకులుకూడా తెలుసుకుంటున్నారు.

శంబలనుండి ఒక రహస్య ప్రభావం కల “జీవశిల” (Sacred Stone) అన్ని దేశాలలో సంచారం చేస్తూవుంటుందని రష్యన్ పరిశోధకుడు ‘నికోలాస్ రోరిఖ్’ వ్రాయడమేకాక తాను ఆ సాలగ్రామశిలవంటి దివ్య శిలను చూశానని ఎన్నో వింతలు విశేషాలు వర్ణించాడు.

అందులో ఆశ్చర్యకరమైన వింత ఏదేశంలో అయితే ఇలాంటి చైతన్యశిల లేక ‘జీవించే శిల’ రహస్యంగా వుంటుందో ఆదేశం రాజకీయంగా ఎప్పటికీ స్వాతంత్ర్యం కోల్పోదు! అలాంటి పవిత్ర శిలాఫలకం ఒకటి బ్రిటీష్‌రాజుల సింహాసనంకింద రహస్యంగా గుప్తపరచబడివున్నదని ప్రపంచ జ్యోతిష్కుడు ఆధ్యాత్మిక పరిశోధకుడైన ‘కీరో’ (Cheiro) తన ఆత్మకధలో తెలిపాడు!

ఇంగ్లండు–సింహాసనం–క్రింద ‘దివ్యశిల’ :–

ఈ దివ్యశిలనుగురించి “ప్రపంచ భవిష్యత్తు” (Cheiro's World Prediction) అన్న గ్రంథంలో మరికొన్ని వివరాలు వర్ణించాడు! ఇంగ్లండు రాజు జాన్ (King John) కాలంలో ఈ రహస్య శిలాఫలకం ఇంగ్లండు రాజు జాన్ సింహాసనం కింద నిక్షిప్తమైందనీ అప్పటినుంచీ ఈనాటివరకూ ప్రతీ బ్రిటీష్‌రాజూ, రాణీ పట్టాభిషేకం విధిగా ఆ శిల నిక్షిప్తమైవున్న సింహాసనంపైనే కూర్చుని, జ్యోతిష్కులు నిర్ణయించిన శుభముహూర్తంలోనే రాజ్యాభిషేకం చేసుకున్నారనీ తెలిపారు!

రెండవ ప్రపంచయుద్ధ కాలంలో జర్మన్‌కు ఈ రహస్యశిల గురించి సమాచారం అంది, బ్రిటీష్ రాజు సింహాసనంనుంచి దాన్ని తొలగించి రహస్యంగా తస్కరించుకొనిపోవడానికి గూఢచారి ముఠా ఒకటి ఏర్పాటు

కాబడిందని కూడా తెలిసి బ్రిటీష్ రహస్య పోలీసు 'స్కాట్లండ్-యార్డ్' శాఖ (Scotland Yard) ప్రత్యేకమైన నిఘాను, ఏర్పాటుచేసి రహస్యమైన బందోబస్తుకూడా చేసింది!

కాని, కీరో మహాశయుడు తన "ప్రపంచ భవిష్యత్తు"లో ఒకనాడు ఈ రహస్యశిల — ఇంగ్లండు నుండి అపహరించబడే ప్రమాదమున్నదనీ అది జరిగిన కొద్దికాలానికే ఇంగ్లండు సముద్రగర్భంలో మునిగిపోతుందనీ ఆకాలంలో మూడవ ప్రపంచయుద్ధం ప్రళయంగా ఏర్పడి ఆ యుద్ధంలో అనేకదేశాలు నాశనమవుతాయనీ, "తూర్పు దేశాలలో జన్మించిన" ఒక మహాపురుషుడు లేక అవతారమూర్తిద్వారా ఈ శతాబ్దం చివరికి ఒక — నూతనశకం ప్రారంభిస్తుందని తన జ్యోతిష భవిష్యత్తు పరిశోధనల్లో కీరో తెలిపాడు!

'నికోలాస్ రోరిఖ్చ్' (Nicholas Roerich) మహాశయుడు అలానే పరిశోధించిన వింతలలో **"నడిచే రహస్య-శిల"** ఒకటి హిమాలయ పర్వతాలలో అనేకచోట్ల సంచరిస్తూ వుంటుందనీ అది ఏడురంగులు మారుతూవుంటుందనీ అది, ఎక్కడవుంటే ఆ ప్రదేశంలో దివ్యప్రభావాన్ని అదృష్టాన్ని, యోగశక్తినీ ప్రసారంచేస్తూ వుంటుందనీ, అది హిమవత్పర్వతాలలో ఒక్కొక్కరోజు ఒక్కొక్క హిమాలయ పర్వత శిఖరంవద్ద సంచారంచేస్తుందన్న రహస్య భోగట్టా తనకు టిబెటన్ లామాలు, యోగులవల్ల తెలిసినట్లు వివరించాడు!

అంతేకాక "శంబలప్రభువు" అవతారంగా వచ్చినపుడు శంబల అనే గ్రామంలో జన్మిస్తాడని ఆయనను గుర్తించే దివ్యసూచనలలో

ముఖ్యమైనదీ దివ్యశిల లేక జీవించేశక్తి కల ప్రాణశిల వుంటుందని, దానినే '**చింతామణి**' అంటారని తెలిపాడు! కల్కిభగవానుని "రానున్న అవతారాన్ని వర్ణించే ప్రాచీన శిల్పాలూ, చిత్రాలలో ఈ "చింతామణి" కూడా చిత్రించబడివుంటుంది.

అమెరికా డాలర్లపై "చింతామణి" :–

అమెరికా స్వాతంత్ర్యం చిహ్నంగా డాలరుపై ముద్రించిన '**ఈజిప్టు పిరమిడ్**' (Pyramid) కట్టడం పైగా ఒక దివ్యతేజస్సులో వెలిగే "ముక్కోణపు శిల" — మనకింకా కన్పిస్తుంది!

దానిచుట్టూ సూర్యకిరణాలవంటి తేజస్సు కిరణాలుగా చిత్రించబడి వున్నాయి. అంతేకాదు, అసంపూర్ణంగా వున్న ఈ పిరమిడ్‌పైన ముక్కోణాకారంగావున్న 'జీవశిల' దిగుతూవుండగా సూర్యతేజస్సువంటి తేజస్సుతో ఆ శిల వెలుగుతున్నట్టూ, దానికి మధ్యగా ఒక నేత్రం లేక కన్ను (All Seeing Eye) అమెరికా డాలరునోట్లపై చిత్రించివుండటం ఈనాటికీ మనం చూడవచ్చు!

దీని గురించి అమెరికాలో నేను ఎవర్ని ప్రశ్నించినా ఎవరికీ అసలు డాలరుమీద ఈ పిరమిడ్ బొమ్మ ఎందుకువేశారో కూడా అర్థం కావడంలేదని ఆశ్చర్యం వెలిబుచ్చారు! శంబల గ్రామంలోని "జీవించే శిల" గురించి అమెరికా స్వాతంత్ర్య ఉద్యమాన్ని స్థాపించిన రహస్య పురుషులకేమైనా తెలిసి వుండవచ్చా? లేకుంటే చింతామణియొక్క చిత్రం ఈ డాలరునోటుపైన ఎలా చోటుచేసుకుంది?

'చింతామణి' – శిల :–

ఒక పెద్ద నల్లనిరాయి వంటి — 'సాలగ్రామశిల' లాంటి పవిత్ర పూజాశిల గురించి హిమాలయ పర్వతాలలో వున్నట్టు వీరికి తెలిసింది.

అది అనేకచోట్ల సంచారంచేసే రాయి! అది ఒక్కొక్క దేశంలో కొన్ని కొన్ని సంవత్సరాలు అది కనిపిస్తూ, తిరిగి మాయమైపోతూ వుంటుంది. ఎక్కడ ఆ 'శిల' కనిపిస్తుందో అక్కడ అనేక గొప్ప గొప్ప మార్పులూ చారిత్రాత్మకమైన సంఘటనలూ, ఇంకా అనేక **ఆధ్యాత్మిక వింతలూ** (Miracles) జరుగుతాయి.

అంతేకాదు! **'ఆ సంచారంచేసే–శిల'** గురించి ఇంగ్లండు రాజ వంశీకులకు కూడా రహస్యమైన సమాచారం వున్నదట!

ఆ శిల మాయమైన దేశంలో విప్లవాలు, ప్రభుత్వాలు పతనం కావడం, యుద్ధాలు రావటం వంటివి జరుగుతాయి!

అది తిరిగి తిరిగి, చివరకు **'కలియుగాంతా'**నికి ఒక నిర్ణీతమైన సమయానికి **'శంబల'** గ్రామం చేరుకుంటుంది!!!

ఈ శిల కొన్నాళ్లు పదమూడవ దలైలామా వారివద్ద రహస్యంగా 1933–దాకా వుండినది! ఆ "శిల" టిబెట్‌నుండి అంతర్ధానం కావడంతో, ఆ టిబెట్ దేశానికి శత్రువులవల్లా చైనావారి దండయాత్రలవల్లా జరగబోయే కష్టాలు ఆయనకు ముందే తెలుసు! అవే టిబెట్‌లోని **"భవిష్యాలు"** గా రాయబడివున్నాయి!

"స్ఫటిక"–పర్వతం :–

ఇంకో విశేషమైన వింత — మంచుతో కప్పబడి నిరంతరం తెల్లగా వజ్రాలలాగా తళతళా మెరుస్తున్న మంచుకొండలమధ్యగా, ఒక – **'స్ఫటిక పర్వతం'** (Crystal Mountain) ఒకానొక రహస్యమైన ప్రదేశంలో వున్నదనీ, ఆ స్ఫటిక పర్వతాన్ని గుర్తించి, చుట్టూవున్న మంచుకొండలతో కలిపేసుకోకుండా — ప్రస్ఫుటంగా గమనించగలిగినవారికే అది తెలుస్తుందనీ! అది శంబలవెళ్ళే దారిలో అతిముఖ్యమైన ఆధ్యాత్మికస్థావరం (Spiritual Centre) అని వింతవార్త!

హిమాలయ పర్వతాలను దాటి — **'కారకోరం'** (Karakoram) పర్వతాలకు దిగువగా ప్రయాణిస్తుంటే అక్కడొక 'తెల్లని–నీళ్ళు' కలిగిన జలపాతం (White Cascade) ఒకటి అతిరహస్యంగా వుంచబడింది! అందులోని నీళ్ళు తాగినవారికి — అప్పటికి, వారి వయస్సు, ఎంత వుంటుందో అక్కడే వారికి, ఆ వయస్సు అప్పుడే స్థంబించిపోయి — నిత్యయవ్వనం — సిద్ధిస్తుందని!

"కల్కి భగవానుని" – "చింతామణి" :–

చైనాలో, మంగోలియాలోని 'బురియాత్' (Buriyat) అనే చోటా, ఆఫ్ఘనిస్తాన్, టిబెట్ ప్రాంతాలలోనూ శంబల ప్రభుని పవిత్రమైన – "చింతామణి" శిల గురించి తెలియని వారెవరూ లేరు!

ఇది ఎప్పటికప్పుడు రంగులు మారిపోతూ వుండడం, ఆ మారుతున్న రంగులనుబట్టి ఆ దేశాలకి యుద్ధంకాని, ఆధ్యాత్మిక అభివృద్ధికాని,



కరువు కాటకాలుకాని, ఆ పవిత్రశిల మార్పే — రంగునుబట్టి అక్కడి యోగులు ఏమి జరుగనున్నదో ముందే గ్రహించి భక్తులకు హెచ్చరిక చేస్తారు!

ఇలాంటి వింతలూ, విశేషాలు ఎన్నో, **'నికోలాస్ రోరిఖ్'** (Nicholas Roerich) రాసిన **'శంబల వెళ్ళే మార్గం'** వర్ణనలో కనపడతాయి!

ఇవికాక ప్రొఫెసర్ గ్రూమ్ వెడెల్ అనువాదం చేసిన **"శంబలకు వెళ్ళే మార్గం"** (Way to Shambala - Translated by Grum Wedel) శంబలవెళ్ళే దారి, దాని రహస్య గుర్తులను తెలిపే ఇంకొక పురాతన గ్రంథంలో 'శ్రీ తాషీ-లామా' (Tashi Lama) అనే సిద్ధగురువు వర్ణించారు! ఇవన్నీ "శంబలకు - సాహసయాత్ర" అన్న "ఫైలు-212" కి ముందస్తు-రిపోర్టుగా తయారుచేసిన 'నివేదిక'!

శంబల – 'భవిష్యాలు!'

జరగబోయే "భవిష్యత్తు"ను — ముందే తెలుసుకోవడం సాధ్యమా?" అన్న ఈ ప్రశ్న — ప్రతీ ఆలోచించే మనిషి మనస్సునూ మధనంచేసే 'ఛాలెంజీ' సమస్య!

దీనికి సమాధానం తర్కంతోనూ, హేతువాదంతోను లేదా "సైన్సు" తోనో ముడిపెట్టి — సంజాయిషీవంటి సమాధానం ఏదోవొకటి వ్రాయచ్చు! సాధ్యమని ఋజువుచేయనూవచ్చు, అసాధ్యమనీ — వాదించవచ్చు! కాని, ఈ రెండూ అభిప్రాయాలే!

అసలు చరిత్రలో నిజంగా జరిగిన 'అనుభవాలు' — ఈ వాద-ప్రతివాదాలకంటే ఎక్కువ నమ్మదగ్గవి! ఎందుకంటే ఇవి, ఎవరి అభిప్రా

యాలూ కాదు! — "కాలం" — ఎవరి హేతువాదంతోనూ నడవదు! కాలంలోకి, వెనక్కివెళితే హిమాలయపర్వతాలలోని మంచుకొండలమధ్యన కొన్నివేల సంవత్సరాలుగా పవిత్ర 'పీఠభూమి'గా పేరుపొందిన 'టిబెట్' జాతియొక్క చరిత్ర — ఎన్నో వింతలూ, విశేషాలూ, తనలో దాచుకొని వుంది!

విదేశీయుల సంపర్కం లేకుండా కొన్ని వేల సంవత్సరాలుగా రకరకాల విదేశాల సాంస్కృతిక సాంకర్యం, — సంకర-జాతుల ప్రభావమూ తనమీద పడకుండా — నిర్మలంగా మంచులో పూసిన పువ్వులాగ వికసించింది — ఈ టిబెటన్ 'లామా-మతం', — దానికి ప్రాణమైన టిబెటన్ ఆధ్యాత్మికతా, అందులోని మంచుకొండలమధ్య వికసించిన అపూర్వ అమరగాధయే "శంబల" గురించిన ఆశ్చర్యాలూ, వింతలు, "భవిష్యాలూ!"

అవి — 1850వ సంవత్సరానికి పూర్వపురోజులు! బ్రిటీష్‌సైన్యం ప్రపంచాన్ని అంతట్నీ జయించాలన్న సామ్రాజ్యదాహంతో ఒక జలగలాగ ప్రపంచంఅంతటా నాలుకలుచాస్తున్న రోజులవి! "సిపాయిల తిరుగుబాటు" అనబడే బ్రిటీష్‌వారి అహంకారంమీద భారతజాతి తిరగబడిన — 1857కు పూర్వమే ఇద్దరు బ్రిటీషు సైనికాధికారులు టిబెట్‌లో అడుగుపెట్టారు! అందులో ఒకడు, ఒక సైనికఅధికారి "కర్నల్-యంగ్-హజ్‌బెండ్ (Colonel-young-husband) — తనవెంట ఒక బ్రిటీష్ సైనిక పటాలం తీసుకొని టిబెట్‌లోకి ప్రవేశించాడు! అక్కడచూసిన ఎన్నో ఆశ్చర్యాలూ, వింతలూ అతడి మతిపోయేలాచేసి అతడిలోని తెల్లవాడి అహంకారాన్ని వేళ్ళతోసహా కుదిపేశాయి!

టిబెట్ రాజధాని "లాసా"లో ప్రవేశించిన ఈ సైనికఅధికారి — జరగబోయే 'భవిష్యత్తు'ను ముందే దర్శించి, జ్యోతిశ్శాస్త్రం ఆధారంగా వ్రాయబడ్డ "కాలజ్ఞానం" — 'భవిష్యాలూ' అన్నీ అతడు స్వయంగా చదవడం జరిగింది! జ్యోతిషశాస్త్రంమీద హిమాలయాలలో యోగులకూ, దివ్యదృష్టిగల 'లామా'లకూ వున్న ఎంతో దృఢమైన విశ్వాసం బ్రిటీష్ వాళ్ళకి అప్పుడే కళ్ళు తెరిపించింది. ఎందుకంటే ఈ సైనికఅధికారి టిబెట్‌లోని కొన్ని 'తాళపత్రాలు' చదివి — గతంలో అంటే, 1027 A.D. సంవత్సరంనుంచే టిబెట్‌లోని ముఖ్యమైన ప్రభుత్వనిర్ణయాలన్నీ జ్యోతిష శాస్త్రం ఆధారంగానే అక్కడ మునులు చూసిన "దివ్యదృష్టి" ఆధారంగా ముఖ్య ప్రభుత్వనిర్ణయాలు జరిగేవి!

అందులో ఈ 'చార్లెస్ యంగ్-హజ్‌బెండ్'ను విపరీతంగా ఆశ్చర్యానికి గురిచేసిన **'భవిష్యాలు'** —

(1) "రానున్న Wood-Dragon-సంవత్సరం"లో దలైలామాకు వ్యతిరేకంగా మ్లేచ్ఛులైన తెల్లవారి సేనలు పవిత్ర 'లాసా'లో అడుగుపెడతాయి!

(2) సర్వత్రా టిబెట్‌లో సైన్యాలూ యుద్ధ-వాతావరణంతో వీధులన్నీ రద్దీగా దొంగలతోనూ సైనికులతోనూ అల్లకల్లోలంగా వుంటుంది.

(3) దేశానికి "శత్రువులవల్లా", ఆయుధాలవల్లా, అగ్నివల్ల, దొంగతనాలవల్లా ప్రమాదం సూచిస్తున్నాయి గ్రహాలు!

(4) "ప్రజలు యుద్ధానికి దిగుతారు! తెల్లవారికి, టిబెట్‌వారికీ, రక్తంచిందే పోరాటం — జరగబోతోంది!

(5) "దలైలామా టిబెట్ వొదిలి పారిపోయే పరిస్థితివొస్తుంది!" అంటూ వ్రాయబడిన "భవిష్యత్తు" గురించిన వాక్యాలు "Wood-Dragon-సంవత్సరం" అంటే 1910-11 గురించే!

(6) సరిగ్గా అదే సంవత్సరంలో చైనావారు టిబెట్‌పై దండెత్తారు!

(7) పవిత్రమైన 'లాసా' ముఖ్యపట్టణాన్ని ముట్టడిచేశారు. టిబెటన్ లకూ చైనావారికీ హోరాహోరీ ఘోరమైన యుద్ధం జరిగింది.

(8) దలైలామా భవనాన్ని విదేశీయులు చుట్టూరా ముట్టడించారు!

(9) ఆతర్వాత 1914 సంవత్సరంలో ఇంగ్లాండు, జర్మనీ, ప్రపంచ యుద్ధం జరిగింది!

(10) చైనాలో అంతర్యుద్ధం జరిగి 1911 లో జాతీయప్రభుత్వ ఏర్పాటుఅయింది. ఫలితంగా 1914 టిబెట్‌నుండి చైనావారిని తరిమివేయడానికి 'భవిష్యాల'లో చెప్పినట్లుగా 'తెల్లవారు' అంటే బ్రిటీషుసేనలు పవిత్రమైన లాసాలో అడుగుపెట్టాయి.

పైనచెప్పిన భవిష్యత్తులో యుద్ధాలు, అంతర్యుద్ధాలు గురించిన జ్యోతిషం కల్నల్-యంగ్-హస్‌బెండ్ చూడటమే కాదు బ్రిటీషు సైన్యాధికారి 1902 లో లాసాకు వెళ్ళినపుడు రాబోయే భవిష్యత్తును తెలిపే గ్రంథాలలో వాక్యాలను తన కళ్ళతో తానే చూసాడు.

ఇవేగాక అనేక ముఖ్యమైన సంఘటనలు అవి జరగబోయే చాలా కాలంముందుగానే దర్శించి రికార్డుకాబడినాయి. టిబెట్‌లో 13వ దలైలామా పీఠాధిపతి 1933 లో మరణించడం జరగడం, 1935 సంవత్స

తంలో 14-4 దలైలామా జన్మించడమూ, అన్నీ ముందుగానే వ్రాయబడి వున్నాయి.

అదేవిధంగా — "దుష్టశక్తులు, ఈశాన్యంలోని క్రూరులు, హింసాత్మకులైన చైనావారినుండి టిబెట్‌పై దండయాత్ర 1950లో జరుగుతుందని వ్రాసినట్లే సరిగ్గా అక్టోబరు 1950 లో చైనా ప్రధాని బేగన్లే-టిబెట్‌మీద చైనా దండయాత్ర జరిగింది. నెహ్రూ అసమర్థతవల్ల, చేతకానితనంవల్ల టిబెట్ చైనావారికి దాసోహం అనవలసివచ్చింది. ఫలితంగా టిబెట్ స్వాతంత్ర్యం కోల్పోయింది.

భవిష్యత్తులో **"యుగసంధి"** సూచనలుగా ఈ భవిష్యత్తు వ్రాయబడి వున్నది. ఇవి అన్నీ బ్రిటీష్ గూఢచారిగా లాసాలో ప్రవేశించిన చార్లెస్ బెల్ (Charles Bell) చూసి — తనకళ్ళను తానే నమ్మలేకపోయాడు.

'ఏమి దేశం! ఏమి మతం! ఎవరీ భవిష్యత్తు తెలిసిన దివ్యదృష్టి గల లామాలు?" అని ఒక్కసారిగ అతనికున్న ఆలోచనలు అన్నీ పటాపంచలు అయిపోయాయి. భవిష్యత్తును ముందే తెలుసుకోవడం నిజమని కాలమే ప్రత్యక్షంగా నిరూపించింది.

అలాగే రానున్న కాలంలో జరిగే భవిష్యత్తులో శంబలనుంచి భూమికి అవతరించనున్న భగవంతుని దశావతారములో పదవ అవతారంగా శంబలప్రభువు రానున్నాడని ప్రధాన నాడీగ్రంథాలలో, తాళపత్రాలలో రాసివుండటం ఇప్పటికి విదేశీయులను సైతం ఆశ్చర్యంలో ముంచెత్తివేస్తోంది.

"ఎవరీ శంబలప్రభువు? ఈయన జన్మించే శంబల ఎక్కడవున్నది? శంబలకు చేరే మార్గము ఏది? ఇంతవరకు నరమానవుడు కాలుపెట్టని

పవిత్రమైన తెల్లటి మంచుకొండల మధ్య దాగివున్న తామర పద్మంలోని రేకలమధ్య దాగిన బొడ్డులాంటి "మణిపీఠం" అని అర్థంఇచ్చే మంత్రం **ఓం మణిపద్మ హుం'** — అని 'టిబెటన్ యోగులు, లామాలు గత మూడువేల సంవత్సరాలుగా భక్తితో జపించేదాని అర్థం ఏమిటి?

మణిపద్మం అంటే తామరపూవు రేకలవలె ఒక ప్రహరీగోడలాగ దాగివున్న ఈ స్ఫటికపర్వతంయొక్క మహిమ ఏమిటి? అక్కడా అక్కడా రహస్యంగా యోగులు, మునులు ధ్యానంచేసుకునే లామాలు పెదవి విప్పి నిజం బయటపెట్టని — దేవరహస్యాలు ఈ శంబల గురించి ఏమిటి?

ఈ స్ఫటికపర్వతంలో ఏదైనా శ్రీచక్రం అనబడే మహత్తర శక్తిగల యంత్రం వున్నదా? దానినుంచే రెండువేల సంవత్సరాలకు పూర్వం ఆదిశంకరుడు తన బ్రహ్మజ్ఞానాన్ని ఉపదేశంగా పొందారా?

కైలాసం, మానస సరోవరం, స్ఫటిక పర్వతం, నర-నారాయణ ఆశ్రమం, శంబల ఇవన్నీ టిబెట్ పీఠభూమి గుండెలలో దాచుకున్న ఆధ్యాత్మిక రహస్యాలు! ఇవి కేవలం టిబెట్ ఒక్క దేశానికే సంబంధించినవి కావు! మానవజాతి మొత్తానికి సంబంధించినవి. ప్రపంచభవిష్యత్తుకు సంబంధించినవి.

వ్యాసమహర్షి – రాసిన 'భవిష్యత్తు!' :-

ఈ కలియుగం ప్రారంభం దాదాపు వెయ్యేళ్ళకుముందే వేదవ్యాస మహర్షి ఈ మంచుకొండలలో తపస్సుచేసి దశావతారాల్లో రాబోయే శంబలప్రభువు గురించి శ్రీమద్ భాగవతంలో చివరి స్కందంలో స్పష్టంగా

వ్రాసాడు. శంబలలో భగవంతుని పదవ అవతారం దిగివస్తుందని ఆయనే మ్లేచ్ఛులను నాశనంచేసి అనేక పాపాలకు కారణమైన వాటిని నాశనం చేసి ప్రపంచంలో సత్యాన్ని, న్యాయాన్ని మనిషిలో నిజాయితీని తిరిగి స్థాపించి మానవజాతి ఆత్మను నిర్మలంగా ఒక స్ఫటికంలాగ వెలిగించే ఒక ధర్మప్రభువు వస్తాడని టిబెట్‌లోని భవిష్యాలలోకూడా ఇలాగే వ్రాసి వుంది.

ఈ నిగూఢ రహస్యాలను పరిశోధించాలని వీలైతే వాటిని విచ్ఛిన్నం చేయాలని అంటే భంగంచేయాలని కూడా బ్రిటీష్‌వారి గూఢచారి చార్లెస్ బెల్ ఈ హిమాలయాలకు సాహసయాత్రలో పరిశోధించే బృందంలో రహస్యంగా చేరాడు.

అతను ఒక పర్వతాలు ఎక్కడంలో ఉత్సాహంమాత్రము చూపిస్తాడనిమాత్రమే మిగతా సాహసయాత్రికుడనీ అనుకున్నారు. అతడు మొదట్లో గూఢచారిగా, దుష్టబుద్ధితో యాత్రను ప్రారంభించినాగాని హిమాలయాలలోని నిర్మలత్వం, అయస్కాంత, ఆధ్యాత్మిక, మానసిక తరంగాలూ మంచుతుఫాను రేపి అతని చెడుసంకల్పం భస్మంచేసాయి. అతడిని మానవతావాదిగా మార్చివేసాయి. అదంతా తర్వాత.

ఇప్పుడు అతను చూసిన వింతలో వింత — "జరగబోయే భవిష్యత్తు" ముందుగానే తెలుసుకోవచ్చు అని!!

అలా తెలుసుకోవడం రోడ్డుమీదపోయే ప్రతీ సన్యాసివల్లా కాదని, దానికి మనస్సు నిర్మలంచేసుకుని, మనస్సు ఆకాశంలా పవిత్రంచేయాలని అలా స్ఫటికంలా నిర్మలంగా పాలిష్‌చేయబడ్డ అంతరాత్మలో

కాలంలో జరిగే భవిష్యత్తు అద్దంలా కన్పించే చందమామలాగ చూడవచ్చని.

మనస్సులాగ నిర్మలంగా అడుగున మంచు నీలపుటద్దంలా ప్రతిఫలించే మానస సరస్సు నిజంగా హిమాలయాలలో వుందని చార్లెస్ బెల్ తన కళ్ళతో చూసినప్పుడు నమ్మక తప్పలేదు.

అసలు "మానస-సరస్సు" అంటే ఏమిటి? మనస్సులాగ నిర్మలంగా వుండే చెరువు అంటే నిర్మలమైన మనిషి అంతరాత్మ అతడి మనస్సు లోంచి అద్దంలా కన్పిస్తుంది లాంతరులో దీపంలా. అలానే అడుగున వున్న నేల ఆ చెరువులూ, స్ఫటికం 'మనస్సులా' స్పష్టంగా కనిపించేది! ఆ సరస్సు చూసినప్పుడు ఆశ్చర్యపోయాడు చార్లెస్ బెల్ ఈవిధంగా సాహసయాత్రలో చేరిన బెల్‌కు తన జీవితమే ఒక సాహసయాత్రలాగ — అసత్యంలోనుండి సత్యంలోకి, గతంలోనుండి భవిష్యత్తులోకి అడుగు పెట్టింది. అదంతా ఆశ్చర్యంగా ఈ సాహసయాత్ర బృందం స్పష్టంగా వ్రాసిన రిపోర్టులో అడుగు అడుగునా కనిపిస్తుంది. ఇప్పుడు ఈ సాహస యాత్రికులు శంబలకు అని ఎవరికీ చెప్పకుండా పైకిమాత్రం "మంచు కొండల్లో హిమాలయ పర్వతాల అందాలు, సోయగాలు చూసి ఆనందించాలని ఫోటోగ్రాప్‌లు తీసుకోవడానికి మాత్రమే సాహసయాత్ర ప్రారంభించారు. ఈ యాత్ర రిపోర్టు చదివిన మనల్ని — యదార్థంగా మనమే ప్రయాణిస్తున్నట్లుగా ఒక సినిమాలో బొమ్మల్లాగ చదువుతున్న నన్ను అంటే శ్రీనివాసచక్రవర్తి అలరించి మానసికంగా ప్రయాణం చేయించాయి. అదెలాగో ఈ పేజీలు చదివితే మీకూ తెలుస్తుంది.

"మానస" సరస్సు (దగ్గిర నుంచి)

II

'ప్రపంచ భవిష్యత్తు' గురించి ముందుగా తెలియచేసే భవిష్యాలు టిబెట్టులో దాదాపు వెయ్యేళ్ళక్రితమే అక్కడ చాలామందికి తెలుసు! అవి జ్ఞానదృష్టితో చూసి యోగులైన మహర్షులు రాసిన తపోవాక్యాలనీ, అవి తప్పక జరుగుతాయని టిబెట్‌లో రోడ్డుమీద తిరిగే అలగాజనం నుంచి లామాసరీల్లో తపస్సుచేసుకునే పండుముసలి లామాలు తాషీలామా 'రింపోచి' అన్న గౌరవపదంతో సంబోధించబడే పరమాచార్యులకు దృఢమైన నమ్మకం!

ఆ భవిష్యత్తులోని అనేక విషయాలు చాలాకాలం మంచుకొండలు దాటి బయట ప్రపంచంలోని వారికి రహస్యాలుగా నిగూఢంగా వుంచబడినాయి! కాని, 13వ దలైలామా 1933 లో యోగమార్గంలో శరీరాన్ని విడిచి మరణించేముందు రాబోయే టిబెట్ భవిష్యత్తులో ప్రజలకు చెప్పలేని కష్టాలు కలుగుతాయని అందులో చాలామంది జ్ఞానులు తపస్సుచేసుకునే లామాలు సాధువులు అమాయకప్రజలు బాధించబడతారని హింసించబడతారని టిబెట్‌లో రక్తపాతం జరగబోతోందని పవిత్రమైన లామాసరీ ఆశ్రమాలు తపస్సుచేసుకునే పీఠాలు అపవిత్రం చేయబడతాయని ఆయన స్పష్టంగా చివరిక్షణాల్లో తనచుట్టూ చేరిన లామాలనుద్దేశించి చేసిన ప్రసంగంలో సందేశంగా చెప్పారు! ఇనపపక్షి ప్రాణంలేకుండా ఎగురుతుంది! తీగలద్వారా మనుషులు మాట్లాడుకుంటారు! కోతులవంటి తెల్లనిజాతి మనుషులు గోమాంసం భక్షించేవారు పవిత్రపీఠభూమి టిబెట్‌లో అడుగుపెడతారు! టిబెట్ ప్రజలకు

కష్టకాలం వచ్చినట్టు ఇదే సూచన! అన్నాడు అప్పటి 13వ దలైలామా! ఆయన ఇంకా ఇలా జరగబోయే భవిష్యత్తు కాలజ్ఞానంద్వారా దర్శించి చెప్పాడు! ప్రపంచమంతా మ్లేచ్ఛజాతి చీడపురుగుల్లా పెరిగిపోతుంది! ఎక్కడచూసినా మధ్యపానం, మాంసాహారం, స్త్రీలు కులటలలగా స్వేచ్ఛాచారం పిల్లలు పెద్దలు బహిరంగంగా అనాచారం ఈనాడి అడుగుపెట్టిన చోటల్లా జ్వాలలాగా వ్యాపిస్తాయి! ప్రపంచమంతటా ధర్మం అడుగంటిపోతుంది! మానవజాతి వినాశంకోసం వైజ్ఞానిక పరిశోధనలు వినియోగిస్తారు మేధావులు తన ఇంటికి తానే నిప్పుపెట్టుకున్నట్టుగా మానవజాతి తన వినాశానికి తానే గోతులు తవ్వుకుంది, అనేక విధాలుగా! అందులో భాగంగానే టిబెట్‌లోకి అధర్మం ప్రవేశిస్తుంది! క్రూరులైన మంగోలీ నాస్తికజాతికి చెందిన ఎర్రబోయలు ఈశాన్యభాగంనుంచి పవిత్ర పీఠభూమి టిబెట్‌లో ప్రవేశిస్తారు! స్త్రీలను, పసిపిల్లలను, ముసలిలామాలను పనిగట్టుకొని హింసించి చిత్రహింసలుచేసి వేలసంఖ్యలో చంపేస్తారు! మూడు పుష్కరాలకాలం ఘోరపాపం ప్రజావినాశం టిబెట్‌లో సర్వత్రా తాండవిస్తాయి! ఘోరమైన ఈ కష్టకాలాన్ని ధైర్యంతో ఎదుర్కోడానికి సమర్థులైన గురువులు తాషీలామా! అప్పటికి నేను జన్మించే 14వ దలైలామాగా ఎదుర్కోవలసివుంటుంది! బుద్ధదేవుని ధర్మచక్రం టిబెట్ పవిత్రభూభాగాన్ని వదిలి భారతదేశానికి అక్కడినుండి విదేశాలకు వ్యాపిస్తుంది! ఈ ఘోరమైన యుగసంధి అంతమయ్యాక దుర్మార్గులందరూ నశించాక శంబలప్రభువు సందేశం ప్రపంచానికి వినిపించే పుణ్యకాలం వస్తుంది! శంబలప్రభువు వస్తాడు! అనేక మహిమలు చూస్తారు ప్రజలు స్పష్టంగానే! ధర్మం సర్వత్రా వసంతఋతువులాగా వెల్లివిరిసి ఇంటింటా పుష్పిస్తుంది! కాని ఈ

సూర్యోదయం జరిగేలోపల ముందువచ్చే చీకటిని భరించాల్సివుంటుంది మానవజాతి!

అధైర్యపడే అమాయకులందరికీ ఇదే నా సందేశం! ఈ టిబెట్ ఎంత నల్లటిదైనప్పటికీ రాత్రి ఎంత గాఢంగా, భయంకరంగా కనిపించినా సరే సూర్యోదయానికి ముందుగా సూచించేదే ఈరాత్రి! అది గుర్తుంచుకోండి! అంటూ 13వ దలైలామా తన సందేశాన్ని వినిపించాడు! ఆతర్వాత కొద్దిగంటలకే ఆయన శరీరాన్ని విడిచిపెట్టి తన అవతారాన్ని చాలించాడు! తాను మరణించిన రెండేళ్ళలోగా తిరిగి టిబెట్‌కు ఈశాన్యంలో జన్మిస్తానని తన భక్తులు తనను గుర్తించి తిరిగి 14వ దలైలామాగా తనకు పట్టాభిషేకం చేస్తారని — కాని టిబెట్‌ను సర్వనాశనం చేస్తున్న శత్రువులు మాత్రం దలైలామాను కూడా చంపాలని ప్రయత్నిస్తారని ఈ భవిష్యత్తులోని కాలజ్ఞానవాక్యాలు స్పష్టంగా తెలుపుతున్నాయి! ఈ భవిష్యత్తును తెలిపే దేవునివాక్యం అనబడే పురాణసంహిత వేదాలకంటే ప్రాచీనమైంది! శంబలలోని మహామునులు నిర్మలమైన మనస్సుతో దివ్యదృష్టితో చూసిన భవిష్యత్తును మానవజాతికి అందించేదే ఈ పురాణసంహిత!

ఇందులోని భవిష్యత్తులో ప్రపంచయుద్ధాలగురించి కలిమాయలో పడి ప్రజలు చేసే పాపాలు మధ్యపానం వ్యసనాల ఫలితంగా ప్లేగు, ఎయిడ్స్, ఎయిడ్స్‌ను మించిన సూపర్‌ఎయిడ్స్ వంటి వ్యాధులు ప్రబలి ప్రపంచజనాభా మూడవవంతు నశించిపోతుంది! భూగోళం తిరుగులో గ్రహాల పరిభ్రమణం గల్లంతుపడి కాలచక్రమే కాలవైపరీత్యానికి గురి అవుతుంది! గ్రహమండలాలు గల్లంతుకాగా సంవత్సరచక్రమే వ్యతిరేకంగా

తిరుగుతుంది! అదే కలియుగం అంతమై తిరిగి వెనకటి సత్యకాలం అనబడే సత్యయుగం వెనక్కి తీసుకురావడానికి మహాత్ములు ఎందరో అవతరిస్తారు! ఈ సత్యయుగారంభంతో మానవజాతి చరిత్రలోనే ఒక కొత్తశకం ప్రారంభిస్తుంది! వీటన్నిటికీ ఒకటే ఋజువు! శంబలలో రహస్యంగా దాగివున్న స్పటికపర్వతాన్ని కనుగొనడం జరుగుతుంది! స్పటిక పర్వతంలోని రహస్యాలు దివ్యమైన చింతామణి ప్రభావం జ్ఞానకిరణాలు సర్వత్రా ప్రపంచమంతా వ్యాపిస్తాయి! విద్యుత్తువంటి ఆ కిరణాలు తగిలి మనుషుల మనస్సులు మేలుకొంటాయి! మేలుకొనివుండగానే నిద్రావస్థలో బతికే కలిమాయలోని మానవుడి మనస్సులోనే వెలుగు కనిపిస్తుంది, చింతామణి ప్రభావంచేత శంబలప్రభువు అనుగ్రహంవల్ల! దీనికి అనువైన కాలం అతిచేరువలోనే దగ్గరగానే వున్నది! దానికిముందు సూచనగా ఆకాశంలో ఇంద్రధనుస్సు కనిపించినట్లు ఈ శంబలప్రభువు కనిపించిన నివేదిక గ్రంధంగా ప్రపంచమంతటా వ్యాపిస్తుంది; చీకటిలో దివిటీలాగా భగవంతుని ఊరేగింపుకు రధానికి ముందుగా వెలిగే జ్ఞాన కాగడావలే!

“శుభమస్తు! సర్వమానవజాతికి శాంతి, ఆనందం, మేలు కలుగు గాక!” అని బోధిసత్త్వులు, ప్రత్యేకబుద్ధులు, పరమగురువులు పరిపూర్ణ అనుగ్రహంతో తమ ఆశీస్సులను సన్మార్గంపై వర్షిస్తున్నారు! ఇదే పరమానుగ్రహం అంటూ ఆ నివేదిక మంగళాశాసనం చేసింది!

* * *

6

ఈ 'చార్లెస్ బెల్' - ఎవరు ?

ఇదివరకెప్పుడూ నేను 'చార్లెస్ బెల్' జీవితకథని పూర్తిగా చదివి వుండలేదు — అవన్నీ కల్పిత గూఢచార కథలన్న భావంతో!

అసలీ 'చార్లెస్ బెల్' ఎవరు? ఆయన ఎక్కడ వుండేవాడు? అతడి సాహసకార్యాలు బ్రిటీష్-గూఢచారిగా ఆయన సాధించిన ఆశ్చర్యమైన, అద్భుతమైన సైనికపరిశోధనలూ ఇంగ్లండు మొత్తం మారుమోగి పోయాయే! ఆతరువాత ప్రపంచమంతా అతడి, కీర్తి టిబెట్ చరిత్రతో మెలివేసుకుపోయి అలా వ్యాపించడానికి కారణం ఏమిటి? — అన్న ఈ సందేహాలు, సంశయాలూ నా మనస్సులో పురుగులా తొలిచేస్తున్నాయి.

క్షణం విశ్రాంతిలేకుండా రాత్రనక, పగలనక ఇదే ఆలోచన! ఆగలేని ఉత్కంఠ! ఇంక నా తలలోని నరాలు పేలిపోతాయేమో అన్నంత టెన్షన్, కలిగి — వెంటనే నేను బజారుకు పరుగెట్టి ఓ పుస్తకాలషాపులోకి జొరబడి "టిబెట్ ప్రాచీనచరిత్ర" — రహస్య కథల'-పుస్తకాలు ఏవి దొరికినా అవన్నీ కొనేశాను — ఆకలిగొన్న వాడిలాగా! రాత్రీ, పగలూ చదివేస్తున్నాను! నా వాలకం చూసి నాభార్య ఆశ్చర్యపోయింది! ఆతరువాత ఖంగారుపడింది. చివరికి మరింత ఆందోళనపడి ఇంక ఉండబట్టలేక అడిగేసింది!

"ఏమిటండీ! అంత రాత్రీపగలు చదువుతున్నారు! నిద్రాహారాలు కూడా మాని? పరీక్షలకు చదివే పిల్లవాడికంటే టెన్షన్‌తో ఉత్కంఠంతో చదివేస్తున్నారు! పొద్దున్న కాఫీతాగుతున్నా నవలే — భోజనంచేస్తూ డైనింగ్‌టేబుల్‌మీదా 'డిటెక్టివ్' నవలల్లాగే అవి పెట్టుకుని అన్నంతింటూ కూడా అవే చదువుతున్నారు! చివరకు మంచంమీద కూడా — బోర్లా పడుకుని రాత్రనక, పగలనక చదివేస్తున్నారు! ఏదడిగినా ముక్తసరిగా ఆలోచించకుండానే దులిపేసుకున్నట్టు సమాధానం చెప్తున్నారు. నాకేదో భయంగావున్నదండీ! మీ వాలకం చూస్తూంటే! అన్నిపుస్తకాలు పక్కన వేసుకుని చదివేస్తున్నారు — ఏదో వడలో, దోశలో వరసపెట్టి ఫలహారం చేస్తున్నట్టుగా?" — అన్నది ఉత్కంఠగా!

చివరికామెను వొదిలించుకోవాలన్నా సమాధానం చెప్పక తప్పలేదు!

"ఇదిగో! నన్నూరికే విసిగించకు! ఈ చదువుతున్న దానిలోంచి డిస్టర్బ్ చెయ్యకు! అన్నీ నిదానంగా నేనే చెబుతాను! నాకేమీ కాలేదు!

— అవదు! నీ మంగళసూత్రం గట్టిది! నిశ్చింతగా భోంచేసి, హాయిగా నిద్రపో!'' అన్నాను.

ఆమె ఆశ్చర్యంగా కళ్ళార్పకుండా విస్తుపోతూ జాలిగా నావంకచూసి చివరికి ఉసూరుమంటూ తన గదిలోకివెళ్ళి పడుకుంది! నేనుమాత్రం 'చార్లెస్ బెల్' — సాహసాలు టిబెట్‌లోని ఆధ్యాత్మిక పరిశోధనలకథలూ, ఆశ్చర్యాలు, అద్భుతాలూ అన్నీ వరసపెట్టి చదివేస్తున్నాను. కథలు మించిన ఈయన కథలు చదువుతున్నకొద్దీ నా ఉత్కంఠం ఇంకా ఎక్కువైంది.

కాని, నిజానికి నాఉద్దేశం ఈ చార్లెస్ బెల్ టిబెటన్ సాహస యాత్రల కథలమీద పరిశోధన చేద్దామనికాదు. ఆయనెవరో జీవితచరిత్ర రాసి టిబెట్‌మీద "డాక్టరేట్ థీసిస్" వంటిది రాయాలనీ కాదు. నా అన్వేషణ ఒక్కటే!

ఈ చార్లెస్ బెల్ పాత్ర — చివరికి టిబెట్లో ఎలా అంతమవుతుంది? ఎక్కడ అంతమైంది? చివరికి ఆయన ఏమయ్యాడు? ఎవరైనా ఆయన్ని చంపేశారా? లేక అపహరించుకుపోయారా? అదీకాకపోతే మారువేషంలో టిబెట్‌నుంచి మాయమయ్యాడా? ఆయన చైనీస్ శత్రువులు అంత బలమైనవాళ్ళా?

'చార్లెస్ బెల్' వంటి కాకలుతీరిన బ్రిటీష్ గూఢచారి-007 "జేమ్స్‌బాండ్ అంతటి ఘటికుడు! శత్రువుల చేతిలో చిక్కి అంతమొందేటంత అసమర్థుడేంకాదు. ఒక రిపోర్టులో అతడు మరణించాడని, ఎవరో హంతకుడు ఆయనను వెంటాడి మట్టుపెట్టాడని ఆకథ అంతమవుతుంది.

కానీ ఆశ్చర్యంగా మళ్లీ ఎక్కడో మునిగితేల్తాడు వేరే అవతారంలో! ఇలా ఒకదానివెంట ఒకటి చదువుకుంటూ పోగా చివరి రిపోర్టులలో ఆయన ఒక జలపాతం దగ్గర స్నానంచెయ్యడానికని వెళ్ళి, ఆ జలధార కిందకి పోయి — ఏమయ్యాడో కనిపించలేదు! దాంతో నాకు ఉత్కంఠం మరీ ఎక్కువైంది.

ఆయన ఇండియా ఎలా వచ్చాడు? ఆరోజుల్లో సముద్రప్రయాణం ఓడమీద కొన్నినెలలు పట్టేది! ఎంతో ధనవంతులో, సంపన్నులో, పలుకుబడికలవారో మాత్రమే విదేశాలకు ఓడప్రయాణంచేసేవారుగాని అందరికీ సాధ్యంకాదు.

II

లండన్‌కి పదిమైళ్ళదూరంలో ఒక సుప్రసిద్ధమైన వేలంపాటపాడే షాపు వున్నది. నెలకోసారో, లేక వారానికి ఒకసారో మంచి వింత వింత వస్తువులు, చిత్రమైనవీ, ఏవస్తువులైనాసరే — అమ్మకానికి వచ్చేవాటిని అక్కడ వేలంవేస్తారు. దానికి లండన్‌లోని సంపన్నులో, పెద్దపెద్ద వ్యాపారస్థులో, కోటీశ్వరులో హాజరవుతారు. ఆరోజు వేలంపాటలో చివరి బెంచీమీద కూర్చున్న చార్లెస్ బెల్‌ని ఎవరూ గమనించినట్టు లేదు. కావాలనే ఆయన ఎవరికీ కనబడకుండా చివరివరసలో కూర్చున్నాడు. పైగా వేలంపాటలోని వస్తువుల వంక కన్నెత్తి, చూడనైనా చూడటంలేదు. వేలంపాట దేనికోసమో పాడటంకానీ, లేదా జరుగుతున్న వేలంపాటమీద ఆసక్తిఉన్నట్లుగానీ లేదు — మరెందుకు వచ్చినట్లు!

అది తెలిస్తే ఆయన చార్లెస్ బెల్ ఎందుకవుతాడు? రాత్రి పొద్దు పోయిందాకా వేలంపాట సాగింది. దాదాపు అన్నివస్తువులు అమ్ముడై పోయాయి! వేలంపాటకు వచ్చినవాళ్ళు — తాము కొనుక్కున్న వస్తువులను నీట్‌గా ప్యాకింగ్ చేయించుకుని, ధనం చెల్లించి వెళ్ళిపోతున్నారు ఒక్కొక్కరే! హాలు దాదాపు ఖాళీఅయిపోయింది ఒకరిద్దరు తప్ప.

చార్లెస్ బెల్ ఆఖరు వరుసలోని బెంచీమీదనుంచి అప్పుడే లేచాడు — నోట్లోంచి పైపును బయటకులాగి చేతిని ఎత్తి పిలుస్తున్నట్లు సైగ చేశాడు. వేలంపాటవాడు వెంటనే ఆయనను గుర్తుపట్టి సగౌరవంగా వేదికవద్దకు ఆహ్వానించాడు.

"సార్! మీరేమిటి? మంచి మంచి వస్తువులన్నీ అయిపోయిందాకా వున్నారు! మీరు వచ్చారని తెలిస్తే మీకేంకావాలో అది ముందే తీసి వేలంపాట సంగతే ఎత్తకుండా పాట మీపేరుతో కొట్టేసి ఇచ్చేవాడిని" అన్నాడు.

"ఇంకా ఏంమిగిలివున్నాయో చూడండి!" అన్నాడు నవ్వుతూ!

వేలంవాడు విచారంగా ముఖంపెట్టి — "ఏమున్నాయి! పాతవి, మాసినవి, చిరిగిపోడానికి సిద్ధంగావున్నవీ, పొడుగాటి బురఖాలు, అంగీలూ! ఇవి ఎవరిక్కావాలి? పైగా పాతవి కనీసం పాతికేళ్ళనుంచి చూస్తున్నాను ఈ పాత బురఖాలు!" — అన్నాడు.

"ఇవే కావాలి నాకు! చక్కగా బ్రష్‌చేయించి, శుభ్రంచేసి నాపేర పార్సిల్ కట్టించండి!" అంటూ చెక్కు సంతకంచేసి — దానిమీద సొమ్ము ఇంతని వ్రాయకుండా వేలంవాడి జేబులో కుక్కి చిలిపిగా నవ్వాడు

చార్లెస్ బెల్.

"అమ్మో అంత డబ్బా! ఇవి చాలాపాతవి! ఎవరో కొండజాతివాళ్ళో, ఆదిమవాసులో, ఏదో మారుమూల — టిబెట్, డార్జిలింగ్, సిమ్లా లాంటి కొండప్రాంతపు గిరిజనులు వేసుకునే అంగీలు. ఇవి ఏ మాంత్రికులో కొనేవి" అన్నాడు.

"అవే నాకు కావాలి!"

అంటూ పార్శిలు కట్టించుకుని క్షణంలో పరిగెత్తుతూ వేగంగా మెట్లుదిగి, సందుతిరిగి మాయమయ్యాడు. ఆతరువాత ఇంగ్లండులోగాని ఇండియాలోగానీ — ఇక ఆ ప్రాంతాల్లో బెల్ మహాశయుణ్ణి చూసినవారే లేరు! అంతటి "గూఢచారి" "సీక్రెట్-ఏజంట్" చార్లెస్ బెల్!

చివరికి ఆయన సైనికగూఢచార్ల పరిశోధనలలో అనుక్షణం నీడలా వెంటవుండే అతడి P.A వాట్సన్‌కు కూడా ఐపులేదు. ఎలా మాయమయ్యాడో ఆ మహాశయుడు!

ఆరునెలలతరువాత మాత్రం ఒకరోజున లండన్‌నుండి హాంకాంగ్ వెళ్లే కొందరు చైనావారితో కలిసి — హిమాలయాలలోని కొండజాతివారు ధరించే బురఖావేసుకొని ఇంగ్లీషు మాట్లాడే ఒక విచిత్రమైన వ్యక్తి తూర్పుదేశాలవైపు టిక్కెట్టు తీసుకొని ప్రయాణంచేశాడని అతనిని చూసినవారు, అతనితో మాట్లాడినవారూ, తెలియచేశారు.

ఇంకా అతను ఎవ్వరితోనూ కలుపుగోలుగా మాట్లాడేవాడుకాదని, ఎప్పుడూ నోట్లో ఓ పెద్ద పైపు, పెట్టుకుని, పొగ వదులుతూ వుండేవాడనీ చూచాయగా తెలిసింది!

దీన్నిబట్టి నాకు తెలిసిన వివరాలతో కూపీలాగగా అతడే, మారు వేషంలోవున్న చార్లెస్ బెల్ అయివుంటాడు — అని!

అంతవరకే వెళ్ళగలిగాను నా గూఢచర్యం పరిశోధనలో. 'నేను కొన్న ఆ రహస్యపరిశోధన పుస్తకాలన్నీ కట్టగట్టి నా మంచంకిందకి తోసేశాను. ఇంకా ఏంచెయ్యాలా? అని ఆలోచిస్తూ లండన్‌లోని అన్ని షిప్పింగ్ కంపెనీలపేర్లు గాలించసాగాను ఒక టెలిఫోన్ డైరెక్టరీతో!

కళ్ళమీదకు ఎప్పుడూ రానంత నిద్ర ముంచుకు వస్తుంటే టైము చూస్తే — తెల్లవారుజామున మూడున్నర గంటలైంది.

అలా తెరపడింది నా ఆలోచనలకి.

❀

7

మంచు-పులి!

నేను మాఇంటి ప్రహరీగోడ పునాదికింద దొరికిన ట్రంకుపెట్టెలో లభించిన రిపోర్టు మొదటిపేజీ తిప్పగానే నన్నెవరో మంత్రించినట్టు, నేనేదో ఊహాలోకంలోకి తేలిపోతున్నట్టుగా — ఆ రిపోర్టులోని సాహస యాత్ర నన్ను పరవశుడ్నిచేసి ఒక సూదంటు రాయిలాగ ఆకర్షిస్తూ నాలో మరింత ఆసక్తిని పెంచసాగింది.

నిజానికి అది నూరు సంవత్సరాలక్రితం మాతాతగారి టైములో జరిగిన సాహసయాత్రల రిపోర్టులా లేదు! అందులో ప్రయాణిస్తున్న **'శంబల'**-సాహసయాత్రికులలో 'శ్రీనివాసచక్రవర్తి' అన్న అదేపేరుగల నేనూ ఒక సభ్యునిగా తాతగారిరూపంలో ప్రయాణిస్తున్నట్టే నాకళ్ళముందు సినిమాలా కనిపించసాగింది!

ఎదురుగా ఎత్తైన ఎవరెస్టు పర్వత శిఖరం, కోసుగాతేలి మంచు పొరలతో కప్పబడిన పర్వతంపై ఏటవాలుగా పడుతున్న నీరెండ ప్రతిఫలించి మేలిమి బంగారం పూతపూసిన ఆలయశిఖరంలాగా వెలిగిపోతోంది! వెనకాతల ఆకాశం ముదురు నీలంరంగులో ముందుకువొంగి నీలంరంగు సిల్కుతెర కట్టినట్టుగా మనమీదికి వొచ్చినట్టుగా మంచు కొండలపై ప్రతిఫలిస్తోంది! దూదిపింజల్లాంటి మేఘాలు పర్వత శిఖరాల్ని కప్పుతూ శిఖరాలమధ్యనుంచీ — లోయల పైనుంచి కొండచరియల మీదుగా ఎగురుతూ కొంగలబారుల్లా కుడినుంచి ఎడమవైపుకి దాటుతూ పోతున్నాయి. మధ్యలో మెరుపులు, ఉరుములతో లోయలోకి ధారాపాతంగా వర్షిస్తున్నాయి. ఇవేవీ శిఖరం పైభాగాన్ని తడపటంలేదు! హిమాలయ శిఖరాలపైకి పోయినకొద్దీ తెల్లని పంచదార పొడి చల్లినట్టు — మంచుపొడి గాలికి లేచి ఇసుకలా రేగుతోంది.

పర్వత శిఖరం కొండమొదలులో — పసుపుపచ్చ ఎరుపురంగుల మైనపుగుడ్డతో గట్టిగావేసిన గుడారాలు గాలికి రెప రెపలాడుతున్నాయి. భూమిలో గడ్డపారల్లాంటి గూటం మేకులు చివరికంటా దింపి పెద్దపెద్ద తాళ్ళతో మోకులతో బిగించి గట్టిగా కట్టి టెంట్‌లు వేసినా సరే! కొండగాలి వీచే ఈదురు వేగానికి డేరా అంతా ఎగిరిపోతుందేమో? అన్నంతగా రెపరెపలాడుతూ ఏక్షణంలోనైనా గుడారం ఎగిరి గాలి గుమ్మటంలా ప్రక్కనున్న లోయలోకి ఎగిరివెళ్లిపడిపోతుందేమో అన్నంతగా వీస్తోంది — ఈదురుగాలి!

నీలాకాశంతో సంజవెలుగు! తెలతెలవారుతుండగా సుమారు నాలుగు గంటల ప్రాంతంలోనే మేలుకున్న బ్రిటీష్-గూఢచారి చార్లెస్

బెల్-మహాశయుడు, తన టెంట్‌లోంచి బయటకువచ్చి తన పొడుగాటి కొండజాతివాళ్ళు ధరించే బురఖాలోంచి ఒక పొడుగాటి కొమ్ము బూరా తీసి "**ఖం!... ఖం!!**" అంటూ నోటితో గట్టిగా ఊదాడు!

ఆ శబ్దం ఓ పెద్ద బాకా ఊదినట్టు కొండచరియ అంతా ప్రతిధ్వనించింది! ఆ శబ్దానికి నిద్రలో వున్న మిగతా సాహసబృందమంతా ఉలిక్కిపడి మేలుకొని అందరూ తమ గుడారాల్లోంచి బయటకు వస్తున్నారు.

— తటాలున తన మంచంకింద వున్న తుపాకీ అందుకుని బయటకు పరిగెత్తుకువచ్చాడు — పులివేటగాడైన **జిమ్ కార్బెట్!** కలత నిద్రలోనే ప్రమాదాన్ని పసిగట్టినట్టు, ఏదైనా పులి గుడారాలపై దాడి చేసిందేమో అన్నట్టుగా మెరుపు మెరిసినట్టు బయటకువచ్చి గుడారాల మధ్య మండుతున్న నెగడును చూశాడు. "ఎక్కడ? ఏది? ఏమిటి?" — అంటూ కుడి ఎడమలకు తుపాకీ తిప్పుతూ గురిచూడటానికి ప్రయత్నిస్తున్న జిమ్ కార్బెట్‌ను వెనుకనించే వీపుమీద అభిమానంగా చరుస్తూ 'చార్లెస్ బెల్'...

'వండర్-ఫుల్!' — "మిత్రమా! నువ్వుమాత్రం నిజంగా పులివేటగాడు జిమ్‌కార్బెట్‌వే! — సందేహంలేదు! నేను ఊదిన కొమ్ము బూరా ధ్వనికే పులిలా ముందుకి దూకావు!!

"మనం ఈరోజు పెందరాళే కాలి నడకనే బయలుదేరాలి! నేనే మన మిత్రులకు ఇలా వినోదంకలిగిద్దామని షేర్పాలు ఊదే ఈ కొమ్ము బూరా ఊది — మనవాళ్ళని తుళ్ళిపడేలా చేశాను!! ఏదైనా వినోదం

లేకపోతే సుదీర్ఘపు ఈ కాలినడక ప్రయాణం బోరుకొట్టదూ ?'' — అంటూ తమాషాగా మాట్లాడుతున్న "చార్లెస్ బెల్'' వంక బెదురుగాను, చిత్రంగాను చూసాడు జిమ్ కార్బెట్! ఒక్కక్షణం ఆశ్చర్యపడి, మరు క్షణంలో పగలబడి నవ్వాడు.

ఇంతలోకే మిగతా మిత్రులందరూ వొచ్చి పోగుపడ్డారు. అలా నికోలాస్ రోరిఖ్బ్, 'వెలికోవ్-స్కీ', రే-లంకాస్టరూ, ఔస్పెన్స్కీ, పాటియాలా మహారాజూ ఇంకా ఆజానుబాహువులైన ఇతర పర్వత ఆరోహకబృందం లోని సభ్యులందరూ — నిమిషంలో గుమికూడాం.

అందరూ కోలాహలంగా మాట్లాడుకుంటూ వారి ఆనాటి ప్రోగ్రామ్‌ని చర్చించుకుంటూంటే — ఇంతలో మా షెర్పా అనుచరులు వేడివేడి పొగలుకక్కే టీని కలిపి రేకు పింగాణీ మగ్గులలో పోసి అందించారు — బయట చలిగాలిని తట్టుకొనేందుకు!! వారికి **"థాంక్యూ!"** ("Thank You !") — తానే చెప్పి వేడివేడి టీని వెచ్చగా జుర్రుకుంటూ తాగారు. అలా మొదలయ్యింది! ఆనాటి ప్రయాణం శుభారంభంగా!

బాగా ఎనిమిదిగంటల పొద్దులేచే వేళ అయ్యేసరికి ఎండ ఏటవాలుగా మంచు ఇసుకపై పడి నక్షత్రాలపాడిలాగా తళుక్కున మెరుస్తూ హిమాలయ పర్వత లోయఅంతా కురిసిన తెల్లటి మంచుపై ప్రతిఫలిస్తోన్న ఎండకి వెండిలా జిగేల్‌మని కళ్ళు మిరుమిట్లుగొలుపుతూ వెలిగిపోతోంది! అంత మిరుమిట్లు గొలుపుతున్న ఎండవెలుగుకి కళ్ళ చెదిరి — దారి సరిగ్గా కనిపించక చేతిలోని కర్రతో కష్టంమీద మంచులో ఎత్తుపల్లాలు తట్టి, దారిచూసుకుంటూ నడుస్తున్నారు — దూరాన్నుంచి

ఒక చీమలబారులాగా, ఒకరివెంట ఒకరు ఎక్కుతూ! అలా హిమాలయ పర్వత శిఖరాలకి వాయవ్యంగా శిఖరాలను అంచెలంచెలుగా ఎక్కుతూ ఒక్కొక్క వరసనే దాటి చేతిలోని కుడి ఎడమల కర్రలతో బరువు ఆనిస్తూ మంచు-గొడ్డలిని నేలలోకి దట్టించి దాని బలంతో ఎక్కడం మొదలైంది!

మధ్యాహ్నం పన్నెండు గంటలుకావచ్చేసరికి — తాము దాట వలసిన కొండచరియలో సగంవరకు ఎక్కి శిఖరంపైకి నిటారుగా పోకుండా ప్రదక్షిణంగా ఎడంవైపుకు లోయవెంబడే తిరిగి కొండవెనుకగా మాయమయ్యారు ఆ సాహసబృందం!

కొండ అవతలప్రక్కకిచూస్తే — నిటారుగా దిగుడు బావిలా వుంది — మార్గం! ఏమాత్రం అజాగ్రత్తగా నడచినా జర్రున జారి ఐసుమీద స్కేటింగ్‌చేసే వాడిలాగా దూసుకుపోయి పదివేల అడుగుల లోతుగా అగాధంలోకి... ఎక్కడపడ్డాడో తెలియనంతగా పడి, మాయమౌతాడు మానవుడు!

మధ్యమధ్యలో గూడ్సురైలు పెట్టెలంత మంచుగడ్డలు, విరిగిన మంచుబండలు శిఖరంపైనుంచీ దొర్లి పెద్దశబ్దంతో కొండమీంచి ఎగురు కుంటూ వంకరటింకరగా పైనుంచీ దూకుతూ ఉరుములా వచ్చి వెంట్రుకవాసి దూరంలో నికోలాస్ రోరిఖ్ ప్రక్కనుంచీ దూసుకునివెళ్ళి దుమ్ము రేపుకుంటూ లోయలోకి వెళ్ళిపడింది!

మధ్యాహ్నం ఒంటిగంట దాటేసరికి యాత్రికులందరికీ ప్రయాణ బడలికతో... ఆకలితో రొప్పుతూ... అన్నివింతలూ వినోదంగా చూసు కుంటూ — అందరూ ఒకచిన్న మైదానప్రాంతానికి చేరి తమ సామాను

లతో తెచ్చుకున్న గుడ్డసంచీని తెరిచి అందులోని ఊచలుతెరిచి — తీసి గొడుగు టెంటులా ఏర్పరచుకున్నారు. నున్నటి ఏటవాలుగా అడుగునవున్న ఒక చెక్కని బైటికిలాగి దాని ఊచలు తెరచి టేబులు లాగా ఏర్పాటుచేశారు.

ఇంతలోనే నలుగురు షేర్పాసేవకులు వేడిగా ఆవిరులుగక్కుతూ వస్తున్న పులుసులూ, కూరలూ వండినవి వొండినట్టే త్వరత్వరగా తెచ్చి వడ్డించారు. వడ్డిస్తుండగానే ప్లేట్లు ఖాళీఅవుతున్నాయి. అలా అరగంటలోనే భోజనాలు పూర్తిచేసుకుని మంచుపై చతికిలబడ్డారంతా. అందరూ చుట్టలు, పైపులూ వెలిగించారు — క్షణకాలం విశ్రాంతిని ఆనందించారు! ఇంతలో వెనకనుండి ఓ ఉరుములాంటి గర్జన విని అందరికంటే ముందు మెరుపులా లేచి నిలబడ్డ నికోలాస్ రోరిక్హ్ మహాశయుడు తన బైనాక్యులర్స్‌తో చుట్టూ కలియజూస్తూ ఉద్రేకంగా అరిచాడు — “అదిగో! మంచు-పులి '**హూమా**'! దాని దర్శనం అంత సులువుగా లభించదని ఇక్కడి కొండజాతి షేర్పాల నమ్మకం! అలా హిమాలయపర్వతాల పైన వుండే భూతములో, దేవతలో — ఆ మంచు పులిరూపంలో తిరుగాడుతూవుంటాయని — వీళ్లు నమ్ముతారు!” అంటూనే కొండచరియ ప్రక్కనుంచి ఏటవాలుగా పరిగెత్తాడు బైనాక్యులర్స్ ఫోకస్ చేస్తూ!

మిగతావాళ్ళందరూ ఆదుర్దాగా ముందుకు పరిగెత్తారు! కాని, ఎవరికీ ఏమీ కనపడలేదు!

జిమ్‌కార్బెట్ మంచులో గుంటలోపడ్డ హూమా పంజాగుర్తులు చూపిస్తూ — “ఇదిగో ఇటుగా వెళ్ళిన మంచుపులి అడుగుల జాడలు!

దాన్ని 'హూమా' అంటారు. దాని గుర్తులు ఇవే! అక్కడక్కడ మంచుపై కనిపిస్తున్నాయి! చూడండి!!" అన్నాడు.

దాని గర్జన అరుపుకు భయపడ్డ జింకలూ, లేళ్ళు చెంగుచెంగున గెంతుతూ కొండచరియలపైకి ఎక్కుతూ పోతున్నాయి.

"అవి పర్వతప్రాంతపు జింకలా? అన్నారు ఒక సాహసయాత్రికుడు" చేతితో చూపిస్తూ!

"కాదు! అవి కస్తూరిమృగాలు! ఇంత విపరీతమైన చలివుండే ఎత్తులోనే అవి జీవిస్తాయి. వాటి దవడలనుంచి కారే మదంనుండి ఘుమ ఘుమ పరిమళించే పునుగు కస్తూరి వస్తుంది" అంటూ!

హిమాలయపర్వతాలలోని రకరకాల పక్షులు, కొండగొర్రెలు, మంచుతోడేళ్ళు, నక్కలు ఎలా తిరుగాడుతాయో ఎలా వేటాడుతాయో అన్నీ వర్ణించి చెపుతున్నాడు — వీరి బృందంలో వున్న జంతుశాస్త్రజ్ఞుడూ, స్పెషలిస్ట్ సర్ రేలంకాస్టర్.

అందరూ ఆసక్తిగా వింటున్నారు...

... ఇంతలో వున్నట్టుండి చీకట్లు మూసుకువచ్చాయి. పైనుంచి నల్లగా దిక్కులన్నీ మూసేస్తూ! మబ్బులు వచ్చి చూస్తుండగానే ఫెళఫెళా ఉరుములు, మెరుపులతో ఎముకలను కొరికే చలితో దబ్బనాలతో గుచ్చినట్టు జడివాన మొదలైంది! పర్వతశిఖరాలకు ఒకవైపున ఇలా వానపడుతూంటే రెండవ ప్రక్కనుంచీ వెండిలా ఎండ ప్రసరిస్తోంది! మబ్బుల అంచున నీరెండ ప్రసరించి రంగురంగుల ఇంద్రధనుస్సు వెలిగింది.

మిత్రులు భోజన విరామసమయం ముగించి మళ్ళీ ప్రయాణం కొనసాగించారు. అలా నడిచి నడిచి కొండదారికి ఏటవాలుగా దిగి, ప్రక్కనుంచి కిందలోయలోకి చేరుకున్నారు.

సంజచీకటి పడుతోంది! దూరాన కుక్కల మొరుగులతో పొగ రింగురింగులుగా లోయపైకి సాంబ్రాణిపొగలాగ లేస్తోంది.

"ఇక్కడేదో షేర్పాల గ్రామంవున్నట్టుంది! ఈరాత్రి మనకి వెచ్చటి బస, వేడివేడి భోజనం హాయిగా నిద్రా లభిస్తాయి!!" అంటూ అందరూ ఉత్సాహంగా అక్కడికి చేరుకున్నారు.

సాహసబృందం నాయకుడు ముందుగా నడిచి షేర్పాలతో వారి భాషలో ఆత్మీయతతో మాట్లాడుతున్నాడు. కొండలలో నివసించే ఈ కొండజాతివారు అమాయకులు. నిర్మలహృదయం కలవారు. బస్తీలలో, నగరాలలో వుండే మనలాగా స్వార్థం డబ్బుకాపీనం ఎరుగరు! ఎవరైనా కాలినడకన వచ్చిన యాత్రికులు కనిపిస్తే వీరికి పండగ! ఈ హిమాలయ పర్వత శిఖరాలలో ఎప్పుడోగాని కొన్ని రోజులకో లేక కొన్ని నెలలతరబడి మానవసంచారం లేక మనిషి పిట్టపురుగు కనబడదు! అందుకని ఎవరైనా కనిపిస్తే ఆత్రంగా ఎదురొచ్చి ఆతిధ్యమిచ్చి ఆనందిస్తారు — హిమవంతుని ముద్దుబిడ్డలైన ఈ షేర్పాలు! మాటలలోనే వారు పెద్దపెద్ద దుంగలు, కలప తెచ్చి ఎదురుగా పేర్చి గాడిపోయి వెలిగించారు.

సాహసబృందంతో వచ్చిన మరికొందరు షేర్పాలు అక్కడేవున్న దుకాణానికి వెళ్ళి గోధుమపిండి, పాలు, వెన్న ఇంకా భోజనానికి కావలసిన రకరకాల వస్తువులు కొని తెచ్చారు. మన పచ్చకాయితాలు కానివి

డాలర్లనోట్లు ఇస్తుంటే — ఆ డాలర్లనోట్లు ఎప్పుడూ చూడని ఆ కొండజాతివారు అవి తీసుకోకుండా వొద్దనిచెప్పి వారికి తెలిసిన రూపాయలనే లెక్కపెట్టి ఇవ్వాలని పట్టుబట్టారు. ప్రతిఫలంగా వారికి వెయ్యిరూపాయలు ఇవ్వచూపిన మిత్రులు — వారు కొన్ని వందలరూపాయలకే సంతోషించడం చూసి విస్తుపోయాను.

ఒక గంటలోనే పెద్దపెద్ద గంగాళాలు గాడిపొయ్యిపై కెక్కించి కళపెళా ఉడుకుతున్న వంటలు ఘుమఘుమా పరిమళిస్తూ ఆవిరులు కక్కుతూంటే వేడివేడిగా వంటలు తయారుచేశారు. ఆరాత్రి షేర్వానగరంలోని మకాముచుట్టూ మొరిగే కుక్కల అరుపుల మధ్యనే — నెగడుల సెగ, వెచ్చగా వీపులకి తగులుతూవుంటే — చలి తెలియకుండా అందరూ విశ్రమించారు.

అలా మరి రెండురోజులు నడకతో మాబృందంవారు **"ఎవరెస్టు"**- పర్వతం పాదపీఠం దగ్గర్లోకి చేరుకున్నారు.

✿

8

హిమాలయాలలో - మా సాహసయాత్ర !

మా సాహసయాత్ర వెనక్కితిరిగి ఆలోచిస్తే ఆశ్చర్యం వేస్తుంది — అనేకదేశాల వ్యక్తులు అద్భుతంగా పోగుపడ్డ గాధఅంతా ఓపెద్ద కథ!

ప్రపంచంలో దేశదేశాలనుంచీ హిమాలయపర్వతాలంటే ఆసక్తిగల సాహసికులు ఆ సాహసయాత్రలో వచ్చి చేరటానికి ఉత్సాహంతో ముందుకు రాసాగారు.

అలా రష్యానుంచీ, ఇంగ్లండూ, భారత్‌వంటి అనేక దేశాలనుంచి ఉత్సాహంగా ముందుకు వచ్చినవారిలో — ప్రత్యేకించి ఏదోవొక శాఖలో విశేషమైన కృషిచేసినవారిని, పరిశోధనాదృష్టికలవారినీ, ఎంతో కొంత

డాలర్లనోట్లు ఇస్తుంటే — ఆ డాలర్లనోట్లు ఎప్పుడూ చూడ
కొండజాతివారు అవి తీసుకోకుండా వొద్దనిచెప్పి వారికి తెలిసిన రూ
లనే లెక్కపెట్టి ఇవ్వాలని పట్టుబట్టారు. ప్రతిఫలంగా వారికి వెయ్యి
యలు ఇవ్వచూపిన మిత్రులు — వారు కొన్ని వందలరూపా
సంతోషించడం చూసి విస్తుపోయాను.

ఒక గంటలోనే పెద్దపెద్ద గంగాళాలు గాడిపొయ్యిపై
కళపెళా ఉడుకుతున్న వంటలు ఘుమఘుమా పరిమళిస్తూ అ
కక్కుతూంటే వేడివేడిగా వంటలు తయారుచేశారు. ఆరాత్రి షేర
లోని మకాముచుట్టూ మొరిగే కుక్కల అరుపుల మధ్యనే —
సెగ, వెచ్చగా వీపులకి తగులుతూవుంటే — చలి తెలియకుండా
విశ్రమించారు.

అలా మరి రెండురోజులు నడకతో మాబృందంవారు "ఎ
పర్వతం పాదపీఠం దగ్గర్లోకి చేరుకున్నారు.

◆

సమాజంలో గుర్తింపు, పేరుప్రతిష్ఠలూ, గౌరవం కలవారిని మాత్రమే ఎంపిక చెయ్యాలని ఆయాత్ర నిబంధనల్లో ఏర్పాటుచేశారు.

ప్రపంచంలో అనేకదేశాలనుంచి వచ్చిన అభ్యర్థులను ఓ నిపుణుల బృందం నిశితంగా పరిశీలించారు. ఉత్సాహంగా ముందుకువచ్చినవారి ఫోటోల దగ్గరనుంచి చేతి దస్తూరీదాకా పరిశీలించింతరువాత వీరిలో ఇలాంటి సాహసయాత్రల అనుభవంవున్నవారుగానీ, వేరు వేరు దేశాల సంస్కృతిలోనూ భిన్న భిన్న మతాల సామాజిక సంస్కృతుల కలగూర గంపతోనూ అనుభవంవున్న వారిని మాత్రమే ఎంపికచెయ్యాలని నిర్ణయించారు. ముఖ్యంగా దృఢకాయులు, కఠినమైన శరీరశ్రమతో రోజులతరబడి నిరంతర పర్వతారోహణకు అలవాటైనవారిని మాత్రమే ఎంపికచేశారు. అలా చేసినవారిలో అనేక వడపోతలు చేసినమీదట — చివరికి ఏకొద్ది మందో మిగిలారు.

అందులో ప్రధానంగా రష్యాప్రభుత్వ రాయబారిగా టిబెట్, సిక్కిం, భూటాన్‌లలో తిరిగి బాగా అనుభవం గడించిన రష్యన్ రాయబారి అలెగ్జాండర్ నోటోవిచ్ ఒకరు. ఈయన హిమాలయపర్వతాలలోని 'లామాసరీ' బౌద్ధమఠాలలోని ప్రాచీన తాళపత్రాలలో జీసస్‌క్రైస్ట్ రహస్యజీవితం గురించిన నాడీగ్రంథాన్ని సేకరించి **"యోగి–ఈశా అద్భుతచరిత్ర!"** — అన్న పేరుతో ఓ పుస్తకంగా ప్రచురించి క్రైస్తవప్రపంచాన్ని భూకంపంలా కుదిపేశాడు.

అలానే తన జీవితంలో ముప్పైసంవత్సరాలు తీవ్రపరిశోధనకు ధారపోసి — గతంలో జరిగిన భూమిమీది ప్రళయాలు, భూమిని

ఢీకొనవచ్చిన గ్రహగోళాలు, ఉల్కలు, తోకచుక్కలగూర్చి పరిశోధనచేసిన సైంటిస్టూ, ప్రాచీన మతాలపై పరిశోధకుడూ ఐన ఇమ్మానుయేల్ వెలికోవ్స్కీ (Immanuel Velikovsky) — రెండవవాడు. ఈయన రాసిన గ్రంథం "**భూగోళంతో ఢీకొన్న గ్రహ-ప్రళయం!**" (Worlds in Collission) అన్న పరిశోధనాగ్రంథం ప్రపంచాన్ని కుదిపేసింది.

అదేవిధంగా భారతదేశంలోని సైన్సు పరిశోధకుడు నోబుల్ ప్రైజు గ్రహీత, వృక్షశాస్త్రంలో అపూర్వమైన ఆశ్చర్యాలను కనుగొన్న ప్రొఫెసర్ J.C. బోస్ భారతీయసభ్యులలో ముఖ్యుడు.

అలాగే సాహస యాత్రీకులకు సహాయమూ, పెట్టుబడి, ఇతర మహారాజులకు లేఖలు పంపి ఈ సాహసయాత్రను మరింత సౌకర్యం చేయగల సమర్థుడైన పాటియాలా యువరాజా ఇందులో ఉత్సాహక సభ్యుడుగాచేరాడు.

ప్రపంచంలో ప్రాచీనదేశాలైన ఈజిప్టు, చైనా, భారత్, మెక్సికో వంటి దూరదేశాలు తిరిగి యోగము, ఆధ్యాత్మిక రహస్యాలమీద పరిశోధనలూ జరిపిన దివ్యజ్ఞాన పరిశోధకుడు, రష్యన్ మేధావీ ఐన ఔస్పెన్స్కీ (Ouspensky) ఒక ముఖ్యుడు. ఈయన రష్యన్ సద్గురువూ, యోగీ, పరమ గురుమండలితో సంబంధము, పరిచయము వున్న సద్గురువు "గుర్జీఫ్" (Gurdjieff) కు శిష్యుడుగా అనేక ఆధ్యాత్మిక గ్రంథాలు ప్రచురించాడు.

అలానే భారతదేశంలో ప్రఖ్యాత వృక్షశాస్త్రజ్ఞుడు, తత్వవేత్త మేఘనాథ్ సాహా ఇంకొకసభ్యుడు. వీరికితోడు రష్యన్ చిత్రకారుడు నికోలాస్

రోరిఖ్‌తో (Nicholas Roerich) పాటు బ్రిటీష్ గూఢచారి, సీక్రెట్ ఏజెంటూ అయిన చార్లెస్ బెల్ ఈ పరిశోధనాబృందాన్ని ఎంపికచేసిన ప్రముఖులు.

ఈ పరిశోధనా బృందానికి సహాయకులుగా కొందరు టిబెటన్ లామాసరిలో పనిచేసే లామా, షేర్పాలు, నేపాలీలు, భూటాన్‌దేశీయులు హిమాలయపర్వతాలలో దారులు, కనుమలు, పర్వతాలతో పరిచయం వున్న గైడ్లు ఎంపికచెయ్యబడ్డారు. వీరందరూ ప్రపంచంలో అనేకదేశాల నుంచి వేరువేరు మార్గాలలో వచ్చి ముందుగా ఢిల్లీలోని మౌర్య షెరాటన్ హోటల్‌లో కలుసుకుంటారు.

అక్కడ పరస్పరం పరిచయమూ, జీవితవిశేషాల పరిశీలనా అన్నీ పూర్తయినవెంటనే ఈ సాహసబృందంలో ఎవరువుండాలి? ఎందరుండాలి? వంటి అంశాలపై ఎంపిక పూర్తయ్యింది!

వాళ్ళకి చూచాయగా యాత్ర కార్యక్రమం తయారుచేసి — ముందుగా పఠాన్‌కోట్‌నుంచి బయలుదేరి ఒక బృందం నేపాల్‌మీదుగా ఖాట్మండూవెంబడే హిమాలయ శిఖరాల పాదపీఠంవద్దకు చేరుకోవాలి. డెహ్రాడూన్‌వద్ద "ధర్మశాల" అనే టిబెటన్ కేంద్రం వైపునుండి హరిద్వార్, ఋషీకేశం, దేవప్రయాగ, రుద్రప్రయాగ, కర్ణప్రయాగలను దాటుకుని హనుమాన్ చక్కీ దగ్గర మజిలీచేసి బదరీనాథ్ మీదుగా కేదార్‌నాథ్, గంగోత్రి దాటి రెండోబృందం కైలాసపర్వతం చేరుకోవాల్సివుంది. అక్కడ నుంచి మానస-సరోవరం మీదుగా చుట్టి కాశ్మీర్‌కు ఉత్తరంగా అమర్‌నాథ్ మీదనుంచి కుడివైపుమళ్ళీ ధౌళగిరి, కాంచనగంగ, నందాదేవి పర్వత



“హిమాలయపర్వతాలు” కాంచన-గంగ శిఖరం

శిఖరాల్ని దాటి 'ఎవరెస్టు' పాదపీఠం దగ్గరకు అందరూ చేరుకోవాలి! ఇది వారి యాత్రలో మొదటి మజిలీ.

అక్కడినుండి ఎవరెస్టు శిఖరంపైకి ఎక్కాలా? లేక దానిని ఎలాగ అవతలికి, దాటిపోవాలి? అన్నది ఈ పర్వత ఆరోహకబృందమే తర్వాత నిర్ణయించుకుంటుంది — అప్పటి వాతావరణాన్నిబట్టి మంచు కురియడం, మంచు తుఫాన్లు, యాత్రికుల ఆరోగ్యం, వారి ఓపికలనిబట్టి నిర్ణయిస్తారు.

ఇలా సమావేశమైన ఆ సాహసయాత్రికుల బృందం పఠాన్‌కోట్, డెహ్రాడూన్‌లవద్ద ఆగి మిలిటరీ యూనిఫారమ్‌లు సప్లైచేసే కంపెనీల నుండి — వారికి కావలసిన దళసరి ఉన్నికోట్లు, తోలువంటి దళసరి జర్కిన్స్, చలిటోపీలు, మంచు కళ్ళద్దాలు, పర్వతాలెక్కడంలో అవసరమయ్యే మంచుగొడ్డలి, తాడు, మంచుబూట్లు, ఆక్సిజన్ డబ్బాలు వంటి సరంజామా సమకూర్చుకోవడం — ముఖ్యంగా అనుభవంగలిగిన రష్యన్ సాహసికులు నికోలస్ రోరిఖ్, అలెగ్జాండర్ నోటోవిచ్, పాటియాలా యువరాజా వంటివారి పర్యవేక్షణలో తుదిమెరుగులు దిద్దుకున్నది. ఇలా మొదలైంది వారి సాహసయాత్ర.

మా యాత్రాబృందం ఆవిధంగా ప్రపంచంలోని నాలుగుమూలల నుంచి పోగైన వాళ్ళమంతా కలిసి ముందుగా కాశ్మీరులోని శ్రీనగర్‌లో మాకార్యక్రమాన్ని ప్రారంభించాం — ఒక విహారయాత్రతో! అదృష్టవశాత్తు వాతావరణం ప్రశాంతంగా వున్నది. వానగాని, మంచుగాని లేకుండా! శ్రీనగర్‌లో రెండురోజులు జీలంనదిమీద తేలుతున్న పడవలలో కట్టబడ్డ

షికారా విహారచోట్లలో గడిపాం, ఆనందంగా! మాలో కొందరు షాపింగ్‌కు వెళ్ళారు మధ్యాహ్నం.

నిజంగా షాపింగ్ చేస్తే కాశ్మీర్‌లోనే చెయ్యాలి! ఎందుకంటె ప్రపంచంలో లక్షలు, వేలు ఖరీదు చేసే వజ్రాలు కెంపులు పచ్చలు మార్కెట్‌లోని దుకాణంలలో తిరుగుతూ కూరగాయలు, పండ్లు కొన్నంత తేలికగా చూడడం మాత్రమేకాదు కొనవచ్చు. అక్కడి నవరత్నాలరాళ్ళు పటికబెల్లంగడ్డవలె గులకరాళ్ళలాగా — చెక్కకుండా కొండలలో తవ్వి తీసినవి ఊహించనంత తక్కువ ధరకి లభిస్తాయి! ఆ మాటవిన్నాంకాని నిజంగా మార్కెట్‌లో చూస్తే ఆశ్చర్యపోయాం! నిమ్మకాయంతసైజులో పచ్చలరాయి చెక్కుబడిలేకుండా కంకరరాయిలాగా వుండేది మూడు వందలరూపాయలకే లబించింది. నిమ్మకాయకంటె పెద్ద కెంపులు కుంకుడుగింజంతేసిముత్యాలు — అది కాశ్మీరులో మాత్రమే సాధ్యము. అలాఎందుకు లభిస్తాయని వాకబుచేస్తే — హిమాలయపర్వత కొండ చరియలన్నీ — ముఖ్యంగా కాశ్మీరు ఈశాన్యభాగాన తవ్వితే గులకరాళ్ళ మాదిరిగా తట్టలతో బుట్టలకొద్దీ రాలిపడుతాయి. ఏం దేశమిది! నిజంగా రత్నగర్భ అన్నపేరు భూదేవికి నిజంగా ఈ శ్రీనగర్‌లోనే సార్ధకమవుతుంది.

అలా మా సంచులనిండా నవరత్నాల రాళ్ళు కొని మాతోవుంటే క్షేమంకాదని ప్రత్యేక విమానసర్వీసులో లండన్‌కు, మాస్కోకు, పారిస్‌కు, ప్రత్యేక కొరియర్ పార్సిల్ ద్వారా పంపించాము, మా ఇంటిలోని ఆడవాళ్ళకు ఉపయోగంగా! వాళ్ళెంత ఆశ్చర్యపోతారో? — తలచుకుంటే ఇక్కడ మాకే ఉక్కిరిబిక్కిరవుతోంది.

కాశ్మీర్‌లో దొరికే అమూల్యవస్తువులలో నవరత్నాలు అతి చిన్న విషయాలు అని వెంటనే తేలింది. కుంకుమపువ్వు కిలోలకొద్దీ కుప్పలు పోసి బజారులో అమ్మడంచూస్తే — శ్రీనగర్ అన్నపేరు మహాలక్ష్మీ నివాసంగా మాకుతోచింది. ఇలా కస్తూరి పునుగు జవ్వాజి అసలుసిసలైన పచ్చకర్పూరము — ఒక్కసారి ముట్టుకుంటే వారంరోజులదాకా మా బట్టలన్నీ పరిమళంతో ఘుమఘుమా గుభాళించిపోవడం చూసి మాకు మతిపోయినట్టయింది. ఇలా రాస్తూపోతే ఇదంతా ఒక కాశ్మీరు పర్యటనకే సరిపోదు.

అలా శ్రీనగర్‌ను అయిష్టంగానే విడిచిపెట్టి సాహసయాత్రలోని మొదటిమజిలీ నేపాల్‌తో మొదలుపెట్టాం. నేపాల్ అంటే చాలా మందికి కాయితం మీదరాసిన పేరుమాత్రమే తెలుసు — కాని నిజంగా అది ఒక ఆశ్చర్యాలపుట్ట.

ఆ వివరాలన్నిటిలోకి ఇపుడు పోవద్దు! మా సాహసయాత్రకు దైవ సహాయం అవసరమనితోచిన మా బృందంలోని కొందరం నేపాల్‌లోని పశుపతినాధుడినీ నీటిలో ఆదిశేషునిమీద పవ్వళించిన అనంతపద్మనాభ స్వామినీ, దర్శించి సాలగ్రామ పర్వతం వైపు తిరిగి నమస్కరించి ముక్తి నాధస్వామిని ఇలా ప్రార్థించాం. "స్వామీ! మా యాత్ర దిగ్విజయంగా పూర్తిచేస్తే నీ క్షేత్రాన్ని తప్పక దర్శిస్తాను. సాలగ్రామ పర్వతం ప్రవహించే గండకీనదిలో స్నానంచేసి నిన్ను తప్పక దర్శించుకుంటాను!" అని!

ఆ తరువాత అందరమూ ఆరాత్రి హోటల్లోని 'కాన్ఫరెన్స్-హాలు' లో సమావేశమైయ్యాం! విశాలమైన పెద్దటేబుల్‌మీద నేను మేం సాహస

యాత్ర చేయబోయే హిమాలయపర్వతాల 'ప్లాను' ని పరిచి మిత్రులందరికీ పరిచయంగా ఒకచిన్న సమావేశాన్ని ఏర్పరచాము. దాని సారాంశం మాత్రం ఇక్కడ మీకోసం సంగ్రహంగా నమోదుచేస్తాను.

మా కార్యక్రమం :-

హిందూదేశానికి ఉత్తరంగా కాశ్మీరుకు తూర్పుగా మూడుదేశాలు నడిమధ్యన మంచుకొండలు ముఖద్వారంలా ఏర్పడి వున్నది నేపాల్ మా పర్వతాలప్లానులో నేపాల్‌లోని ఖాట్‌మండూకి ఈశాన్యంగా వెడితే ఎత్తైన టిబెటన్ పీఠభూమి మానససరోవరము, కైలాసపర్వతము కనిపిస్తాయి. షేర్పాల జన్మభూమి నేపాల్. అని చెపితే ఆ విషయంలోతు తెలుసుకోలేరు. అసలు విషయం ఏమిటి? అంటే ఎవరెస్ట్ శిఖరాన్ని ఎంతమంది జయించినా ఎడ్మండ్ హిల్లరీగానీ లేక షేర్పా టెన్సింగ్ గానీ లేక తరువాత ఎంతోమంది ఆడవాళ్ళుకూడా ఎవరెస్ట్‌ని ఎక్కినట్లు గొప్పగా నమోదుచేసుకున్నప్పటికీ నిజంగా వాళ్ళ బరువైన సామానులు మోసిందీ ప్రతీ క్యాంప్ వద్ద వంటలుచేసి గుడారాలు వేసి ముందుకు ప్రయాణిస్తుంటే గుడారాలు ఎత్తివేస్తూ నిజంగా ఈ సాహసయాత్రికుల బరువు బాధ్యతలు వీపుమీద మోసేది నేపాల్‌లోని హిమాలయం ముద్దు బిడ్డలైన షేర్పాలే!

వీళ్ళకి పేరులేదు. ప్రతిష్ట అవసరంలేదు. అమాయకులైన ఈ కొండజాతివారు ధృఢమైన ఆరోగ్యవంతమైన శరీరాలతో ఎత్తుగా వుండే హిమాలయాలమీది దుమ్ము ధూళీ అంటని నిర్మలమైన గాలిని పీలుస్తూ ఊపిరితిత్తులు నిజానికి సాహసయాత్రచేసే వీరులకన్నా పదిరెట్లు బలం

గానూ ఆరోగ్యంగానూ వుంటాయి. లేకపోతే వాళ్ళు పర్వత యాత్రికుల వెనుకే వాళ్ళసామానులుగూడా మోస్తూ ఎవరెస్ట్‌దాకా ఎక్కడం ఎలా సాధ్యం?

మేంకూడా మా హోటలులో దిగిన ఒక మేనేజరు సాయంతో షేర్పాల గుంపును కాంట్రాక్టు పద్ధతిలో కుదుర్చుకున్నాం ఇక్కడినుంచే! వారి సాయంతో మేము ఎక్కవలసిన హిమాలయ పర్వత శిఖరాల గురించి లోతైనలోయల గురించి చిత్రపటం సహాయంతో బాగా పరిచయం చేసుకున్నాం! ముఖ్యంగా హిమాలయంలో ఎత్తైన ఎవరెస్ట్ శిఖరం 29,035 అడుగుల ఎత్తున నేపాల్ చైనా సరిహద్దుకు ఉత్తరంగానూ కాస్తంత వాయవ్యదిక్కుగా వెళితే వస్తుంది. మ్యాప్‌లో కుడివైపు కిందిభాగాన అంటే దక్షిణంగానూ ఉత్తరంగానూ — చైనా నేపాల్ సరిహద్దు వస్తుంది. ఖాట్‌మండు నేపాల్ ముఖ్యపట్టణానికి తూర్పుగా డార్జలింగ్ దానికి ఉత్తరంగా భూటాన్ పర్వతప్రాంతం వున్నది. ఖాట్‌మండూకి పడమరగా కాస్తంత ఉత్తరంగా అన్నపూర్ణ శిఖరం 26,503 అడుగుల ఎత్తులో ఆకాశంవంక సూదిలా పెరిగిన శిఖరంలా కనబడుతుంది.

అలానే మా హిమాలయపర్వతాల మ్యాప్‌లో ముఖ్యంగా కనిపించే శిఖరాలలో అన్నపూర్ణ తరువాత కళ్ళకుకట్టినట్టు కాంచనగంగా శిఖరం మన దృష్టిని ఆకర్షిస్తుంది. దీన్ని ఇంగ్లీషువారి సంకరజాతి ఉచ్ఛారణలో 'కించన్‌జుంగా' (Kinchanjunga) అంటారు. అపభ్రంశంగా! 'ధవళగిరి' మౌంట్-కైలాస్ 'అన్నపూర్ణ' 'దామోదర్' వంటివి మన దృష్టిని ఆకర్షిస్తాయి.

చాలా పర్వతాలు నేపాలీ కొండలు ఎక్కే సాహసయాత్రికులకు టిబెటన్ భాషల్లో పరిచయం! చైనా నేపాల్ సరిహద్దులోని — 'ఛోవ్‌లా' (Chooyu) శిఖరం (26,906)! అది ఎవరెస్ట్ శిఖరానికి ఉత్తరంగానూ వక్రంగా వాయవ్యదిశగానూ వున్నాయి! 'నంగాపర్వత్' దీనికి పశ్చిమంగా దక్షిణంగాపోతే 'కోషీనది' పుట్టుకస్థానంలో కనబడుతుంది. ''ఖుంబూ'' పర్వతం ఆతర్వాత 'తాషీలేప్చా' (Tashi Lepcha) శిఖర (19,213) వొస్తుంది!

ఇలాంటివి ముఖ్యమైన కొండగుర్తులుగా భారత్ చైనా నేపాల్ టిబెట్ దేశాలమధ్యన మంచు మైదానంలాగా పర్వతశిఖరాలు, లోయలు, నదులు — అందులో ఎన్నో దారితెలియని కొండలు, కోనలు ఏ ప్రపంచ చిత్రపటంలోను గుర్తుపట్టని అనేక వింతలూ విశేషాలు — ఈ 'దేవతాత్మ' లాంటి హిమాలయాల ఒడిలో దాగివున్నాయి. ఇప్పటికీ పర్వతారోహకులు కనిపెట్టినవే చాలావున్నాయి. కాని ఎవ్వరూ చూడనివీ ప్రపంచం తుళ్ళి పడేటంతటి ఆశ్చర్యాలూ వింతలూ కలిగిన హిమశిఖరాల రహస్య స్థావరాలు ఇంకా బయటపడనివి ఎన్నోవున్నాయి.

అందులోని ముఖ్య స్థావరమే మా సాహసయాత్రకు నిజమైన లక్ష్యం! — రోడ్డుమీద అమ్మే న్యూస్‌పేపర్‌లో ప్రచారంచేసే ఎవరెస్ట్ శిఖరం వంటి బజారువస్తువు కాదు!

ఇలాంటి పవిత్రస్థానాలలో ముఖ్యమైనది "స్పటిక–పర్వతం!" మంచుకొండల మధ్యన మంచుతో కప్పబడిన శిఖరాల మధ్యగా గుర్తించటానికి అసాధ్యంగావుండే ఈ స్పటికపర్వతం అతి కొద్దిమంది యోగు

లకూ, లామా-లకూ తపస్సుచేసుకునే సిద్ధపురుషులకూ మాత్రమే వీటిని గురించిన భోగట్టాతెలుసు.

తరువాత ఈ స్పటికపర్వతం ఎక్కడా కాగితంమీద మచ్చుకైనా అంతుపట్టనిది — ఎవరెస్ట్ శిఖరం అడుగునుంచి భూగర్భంలో ప్రయాణించే సారంగమార్గం — ఈ స్ఫటిక పర్వతం పీఠం దగ్గరకు చేరుస్తుందని!

ఇక ఇవే న్యూస్-పేపర్లమీద ఆధారపడి బ్రతికే ఈనాటి ప్రజలకి ఒక '**శంబల**' గురించి అక్కడి వింతల గురించీ — అసలు వాళ్ళ ఆత్మ గురించిమాత్రం ఎంత తెలుసో, సరిగ్గా అంతే తెలుసు! అంతే-రహస్యంగా నెలకొనివుంది! అంటే నా ఉద్దేశం ఒక్కటే! — మనలోనే వుంటూ మనకంటే దగ్గిరగా ఆత్మీయతగా వున్న మనకే తెలియని మనలోని **జీవాత్మ** లాగే హిమాలయ పర్వతాలకి కూడా **ఆత్మవంటి** రహస్యస్థావరమే ఈ — **శంబల!**

ఇది మానవజాతి యొక్క రహస్య ఆధ్యాత్మిక విజ్ఞానానికి అగాధమైన గని వంటిది!! ఇక 'స్ఫటిక మందిరం' లేక స్ఫటిక శిలలతో నిర్మాణమైన శ్రీచక్రదేవాలయమైన **మేరు–ప్రస్థారం** వంటి గర్భాలయం! దీనిగురించి అసలు విననివారే ఎక్కువమంది కనిపిస్తారు మీలో! అందుకే దానిని గురించి ఇప్పుడు చెప్పక పోవటమే మంచిది, దానిని మీరు నిజంగా కనుగొనేదాకా!

◆

9

సాహసయాత్ర - ప్రారంభం !

ముందుగా మా సాహసయాత్ర ఎక్కడినుంచి బయలుదేరాలి? హిమాలయపర్వతాల పాదపీఠంవద్దకు ఏమార్గాన మేం ఎలాచేరాలి? అన్న అన్వేషణతో సాహసయాత్రికుల బృందం తమ కార్యక్రమాన్ని ప్రారంభించటానికి పావులు కదపటంమొదలుపెట్టారు.

ముందుగా భారతదేశం చేరుకోవాలి! మనకున్న హిమాలయయాత్ర ఉత్తరభారతంలోవున్నది కాబట్టి మనం నేరుగా ముందుగా ఢిల్లీ విమానాశ్రయం చేరుకోవాలి. అక్కడ మూడు, నాలుగురోజులు మంచి హోటల్‌లో బసచేసి, సాహసయాత్ర బృందంలోని ఇతర సభ్యులందరినీ కాంటాక్ట్‌చేసి ఒకరినొకరు పరిచయం చేసుకోవాలి. ఆతరువాత సాహస

యాత్రకు వెళ్ళేమార్గం నిర్దేశించుకొని ఒక కార్యక్రమం రూపొందించాలి, ఇలా ప్రారంభించాలని అనుకొని అందరూ ముందుగా ఢిల్లీ చేరుకున్నాము. హోటల్ "కనిష్కా"లో మా సాహసయాత్రీకుల బృందం సభ్యులు అందరం కలుసుకోవాలని, అక్కడనుండి యాత్రాప్రయాణం ప్రారంభించాలని నిశ్చయమైంది.

ఢిల్లీనుంచి "పఠాన్‌కోట్" వెళ్ళే "తుఫాను-ఎక్స్‌ప్రెస్" లోని A.C. Ist క్లాస్‌లో పదిమంది సాహసయాత్రీకుల బృందంసభ్యులు కలిసి బయలుదేరాము. ఆరాత్రి అంతాప్రయాణించి, మర్నాడు సాయంత్రానికి రైలు "ఫఠాన్‌కోట్" స్టేషన్ చేరింది. "పఠాన్‌కోట్" — సైనికుల శిక్షణకు ప్రధానకేంద్రము. ఎక్కడచూసినా మిలిటరీ ట్రక్కులు, కాఫీరంగు యూనిఫారంలో తిరుగుతూ మిలిటరీసిబ్బంది కనిపిస్తూండే, రద్దీగావుండే సైనిక కేంద్రం అది!

అక్కడ "మాల్" బజారుకు వెళ్ళి చౌకగా అమ్మే మిలిటరీ బూట్లూ, టోపీలు, దళసరి కాఫీరంగు ఊలన్, షర్టులు, చలికోట్లు, చేతికి చలి నుండి కాపాడే గ్లౌజ్‌లు, మఫ్లర్ల వంటివి కొనుగోలు చేశాము! ఆపైన వేడినీళ్ళ బాటిల్స్, మంచినీళ్ళు వేడిగా మోసుకువెళ్ళే వాటర్‌బాటిల్స్, అవసరమైన మందులూ, టార్చిలైట్లు, మంచు హెల్మెట్లు వంటి సాహస యాత్రీకులకు కావలసిన పరికరాలు కొన్ని సేకరించాం.

"పఠాన్‌కోట్" నుండి అలా బయలుదేరిన ఒక పెద్ద మిలిటరీ వ్యాన్ వంటి ట్రక్కుసైజు వాహనంలో ఒక రాత్రి, ఒక పగలు నిరంతరాయంగా ప్రయాణంచేశాం! పగలు సాయంత్రం అయ్యేసరికి కొండ

చరియపైన "ఘాట్" రోడ్డుమీదకు ఎక్కి ట్రక్ ప్రయాణం ప్రారంభం అయ్యింది. ఎదురుగా దారికి ఎడమప్రక్కన ఎత్తైన పర్వతాలు, కుడివైపుకు చూస్తే కళ్ళుతిరిగిపోయే "అగాథం" వంటి లోయ!! ఆ లోయకు అడుగున పదివేల అడుగుల లోతున పాదరసంలా మెరిసే "బియాస్ నది" మెలికలు మెలికలుగా పాకే కొండచిలువలా ప్రయాణిస్తోంది. సముద్రం హోరు లాంటి నీటి హోరుతో! కొండకు మధ్యలోని గోడ మడతలాంటి ఘాట్‌రోడ్డు మెలికలు మెలికలుగా తిరుగుతూ కొండలపైకి పాకిపోతూ, అంచెలు అంచెలుగా కొండలోని ఎత్తుకు, ప్రతిమైలుకు 2000 అడుగుల చొప్పున ఎత్తుకు ప్రయాణించాము — ఆరోజు "పూర్ణిమ" అని తెలిసింది.

అలా అర్థరాత్రి అయ్యేసరికి కళ్ళు తిరిగిపోయే అందాలుచిమ్ముతూ పెద్ద ఫుట్‌బాల్ అంత సైజులో "చంద్రబింబం" కొండలమధ్య ఉదయిస్తూ కనిపించింది! ఆహా! ఆ దృశ్యం అందం చెప్పలేము! మాటలతో వర్ణించలేము. చుట్టూ ప్రకృతి అందాలకు ఆనందంతో అక్కడే నిలిచిపోవాలనేటంత సంతోషంకలిగింది.

రోడ్డుప్రక్కనే ట్రక్కును ఆపి పుచ్చ పువ్వువంటి పండువెన్నెలలో, అందాలతో మెరిసిపోయే హిమాలయ పర్వతాలను మొట్టమొదటిసారిగా చూసి, ఆశ్చర్యంతో స్థంభించిపోయాము. ఊహించనంత ఎత్తైన పర్వత శిఖరాలు ఎత్తుగా, ఇంకా ఎత్తుకూ నిటారుగా ఆకాశంలోకి పెరిగిపోతూ, మెలికలు చుట్టుకున్న పర్వతాలు! బియ్యాస్‌నది గురించి చెప్పుకుపోతున్నాడు మాతో ప్రయాణించిన మిలిటరీ గైడు. "ఈ 'బియ్యాస్' నది

— "బ్యాస్' అనే బెంగాలీ మాటకి ప్రతిరూపం. 'వ' కు 'బ' అని పలకటంతో — "వ్యాస-నది" పేరుకాస్తా "బ్యాస్-నది"గా మారిపోయింది! ఈ నది వొడ్డునే వ్యాసమహర్షి ఆశ్రమవాటిక వుండేదట! అందుకనే — ఈపేరు!" అంటూ ఈ బియ్యాస్‌నది దారి పొడుగునా ఇలా మన వెంటనే ప్రయాణిస్తుంది!"

మళ్ళీ మా ప్రయాణం కొనసాగించి పూర్తి రాత్రి ఆగకుండా ప్రయాణించాము. తెల్లతెల్లవారుతుండగా "మాండీ" సంస్థానం సమీపించాము.

అది "మాండీ" రాజుల రాజధాని. ఉదయం 9 గంటలకల్లా అక్కడ ఒక విశ్రాంతికేంద్రంలో ఆగాము. వేడివేడి టీలు, చపాతీలు అందించారు, ఆవురు ఆవురుమంటూ తిన్నాం మా బృందం.

◆

10

"దేవతాత్మ" - ఈ సిద్ధుల తపోభూమి !

అలా ఆరాత్రి — ఆ హిమాలయ పర్వతాల సాహసయాత్రికుల బృందం — ఆ వెచ్చటి చలిమంటలాంటి గాడిపొయ్యిల మంటసెగలు వాళ్ల వొంటికి గోరువెచ్చగా తగిలి — నడుమునొప్పి, కీళ్ళనొప్పులూ, పగలంతా మంచులో చచ్చిచెడి కొండచరియల వెంట నడిచిన అలసటా — ఓ వైద్యుడు వేడి కాపడంపెట్టి నెప్పులు తీసేసినట్టుగా పోయి హాయిగావుంది!

వంటలు వేడివేడిగా సిద్ధంచేస్తున్నారు వంటవాళ్ళు. పులుసులు, కూరల తాళింపులు, మసాలా ఘుమఘుమలు అన్నివైపులా గుబాళిస్తూంటే పిచ్చాపాటి కబుర్లలోపడ్డారు మిత్రులందరూ.

అదేచోట ఆ కుగ్రామంలోని పెద్దలు కొందరు ఈ బృందాన్ని విచిత్రంగా చూడటంతో ఆసక్తిగా వారిచర్చల్లో పాల్గొనటం మొదలైంది. ఓ టిబెటన్ లామా కొందరు ముసలి సాధువులూ, మధ్య వయస్సులో వున్న షేర్పాలు, దారినపోయే బాటసారులూ ఇలా రక రకాలుగా ఆ వంటల చుట్టూరా గుంపుగా చేరివున్నారు ఉల్లాసంగా మాట్లాడుకుంటూ.

హిమాలయపర్వతాలలోని రహస్యాలూ, వింతలు, విచిత్రాల గురించిన రహస్యభోగట్టా ఈ షేర్పాలకి ఎంతో తెలిసివుంటుంది. సరిగ్గా ఇదే అదను అని దానిని రాబట్టే ప్రయత్నం మొదలుపెట్టాడు చార్లెస్ బెల్ మహాశయుడు. ప్రత్యేకించి అక్కడున్న ముసలి లామాలు, టిబెటన్ వృద్ధులు చాలాఏళ్ళుగా అక్కడే నివాసంవుంటున్న ముసలి రైతులను “షెర్పా”ల్ని పిచ్చాపాటిలోకి దించటం ఇలా మొదలయ్యింది — “రండి! మీరుకూడా మా విందులో పాల్గొనండి! ఈ గ్రామంలో మీరు మాకు ఆతిథ్యం ఇచ్చినట్టే మీరుకూడా మావిందును స్వీకరించండి” అంటూ కళపెళా ఉడుకుతున్న పాలు, జీడిపప్పువేసిన పాయసం ‘సూప్’ల వంటి వంటకాల్ని కొబ్బరిచిప్పలో వేసి అందించారు ఒక ముసలివాడికి.

“ఎందుకండీ మీకీ శ్రమ!” — అంటూనే మొహమాటంగా ఆ ఫలహారాన్ని స్వీకరించాడు ఆ గ్రామపెద్ద. అలా క్రమంగా విందు ప్రారంభమైంది. కబుర్లు, పిచ్చాపాటి వార్తలు, జోకులు మొదలయ్యాయి. మరికొందరు గ్రామపెద్దలూ పాల్గొన్నారు. “మంచి విదేశీసరుకు!” అంటూనే విస్కీబాటిల్‌ని బైటికితీసి కొద్దిగా గ్లాసులోకి పోసి అందించాడు. మందు పడితేనేకదా మా మాటవిడిపడేది, అసలు సంగతులు బయటకువచ్చేది”

— అనుకుంటూ. అలా మొదలైంది కబుర్లు వింతల్లు విశేషాలతో వాళ్ళ సంభాషణ! అందులో ముఖ్యపాత్ర వహించాడు రష్యన్ చిత్రకారుడు సాహసయాత్రికుడైన 'నికోలాస్ రోరిఖ్స్'! ఆయనెవరో కొంచెం పరిచయం చేస్తాను.

నికోలస్–రోరిఖ్స్ :-

ఈ శతాబ్దం మొదట్లో అంటే 1901 — 1903 మధ్యకాలంలో ఒక రష్యనుచిత్రకారుడు అపురూపమైన హిమాలయశిఖరాల్ని చిత్రించాడు. అందమైన ఇంద్రధనుస్సు వంటి రంగులలో ఎవ్వరూ చూడని దుర్భేధ్యమయిన మంచుశిఖరాలను స్వయంగా ఎక్కి ఉదయించే బాలసూర్యుడి కిరణాలలో కరిగించి పోతపోసిన బంగారంలా మెరిసే హిమాలయ శిఖరాలను అద్భుతంగా చిత్రించాడు!

అంతేకాదు. అస్తమిస్తున్న సూర్యుడి కనకాంబరంరంగు కిరణాలలో కరిగించిన కుంకుమ ద్రావకంలో ముంచిన ఎర్రటి సంధ్యారుణ కాంతులతో మెరిసే గౌరీశంకర్-శిఖరాన్ని చిత్రించాడు సజీవంగా! ఈ రష్యా చిత్రకారుడి — పేరే '**నికోలస్–రోరిఖ్స్**' (Nicholas Roerich).

బెంగుళూరులోనూ, అమెరికాలోని న్యూయార్కు ఆర్ట్‌గ్యాలరీలోనూ ఇప్పటికీ ప్రదర్శించబడుతున్నవి — ఆయన గీసిన హిమాలయాల రంగులచిత్రాలు! ఈ వర్ణచిత్రాలను చిత్రించిన రష్యన్ చిత్రకారుడు నికోలస్-రోరిఖ్స్ అని — చాలామందికి తెలుసుగాని ఆయనే హిమాలయ పర్వతాలను గాలించిన సాహసబృందాలతో కలిసి ప్రయాణించిన పర్వతా రోహకుడని — ఈయన గురించి చాలామందికి తెలియదు.

ఈయన ఏకాంతంగా హిమాలయాల్లో రహస్యంగా జీవించినప్పుడు జవహర్‌లాల్‌నెహ్రూ ఒకసారి విశ్రాంతికోసం "దేవతలు విహరించే '**కులూ**' లోయలో వారంరోజులు గడిపాడు. అప్పుడాయన స్వయంగా నడిచివెళ్ళి **నికోలస్-రోరిఖ్** బంగళానీ, రోరిఖ్ ఆర్ట్-గ్యాలరీనీ, దర్శించి విస్తుపోయాడు — ఆయన గీసిన హిమాలయశిఖరాల సొగసులు, అందాలను చూసి! వాకిట్లోపెట్టిన విజిటర్స్ పుస్తకంలో స్వీయదస్తూరితో అద్భుతంగా రాసి సంతకంచేశాడు నెహ్రూ.

కాని, నెహ్రూకి కూడా తెలియని రహస్యం ఏమిటంటే — శంబల కోసం పరిశోధించి అన్వేషించిన సాహసయాత్రికుల బృందంలో ఈ **నికోలస్-రోరిఖ్** కూడా ఒక నాయకుడని!!

ఆయన చూసినవి — విన్నవి, కన్నవి ఎన్నోవింతలూ, విశేషాలు తన డైరీలో రాసాడు. దానితరువాత **"ది హిమవత్"** (Himavat) అన్న పుస్తకంగా ప్రచురించాడు ఆతర్వాత తన సాహసయాత్రల్ని కొన్ని సంపుటాలు ప్రచురించాడు — అందులోని ఒక ముసలి షేర్పాతో ఆసక్తికరమైన సంభాషణ ఎంతో ఆసక్తికరంగా సాగిందిలా :-

"ఈ ప్రాంతంలో ఎన్నో వింతలు ఎన్నెన్నో ఆశ్చర్యాలూ వుంటాయని దారిలో మేము ఎంతగానో విన్నాం! కాని, మీరు ఇక్కడే నివసించే స్థానిక నివాసులుకదా! మీకు తెలిసినంత ఖచ్చితమైన భోగట్టా దూరంగా నివసించే మాలాంటివారికి ఏంతెలుస్తుంది?" అంటూ మొదలుపెట్టాడు నికోలాస్· రోరిఖ్ ఒక ముసలిషేర్పాతో.

జిమ్ కార్బెట్ మహాశయుడు పొగలు కక్కుతున్న పులావును వేడిపులుసుతో చప్పరిస్తూనే — "మంచుపులి హూమా" గురించి మేం

చాలావిన్నాం. ఈ ప్రాంతంలో అలాంటి మంచు పులులు తిరగటం ఎప్పుడైనా చూశారా మీరు?'' — అనిఅడిగాడు. చాలాసేపు ఆధ్యాత్మిక రహస్యాల గురించి నోరువిప్పని టిబెటన్ షేర్పాలు డొంకతిరుగుడుగా పేచీకోరు సమాధానాలు ఇచ్చి జారుకుంటున్నారు గాని — ఎంతకీ, నిజమైన నిగూఢమైన దైవికవిషయాల జోలికిపోవటంలేదు.

“ఈ ప్రదేశమంతా పవిత్రమైన యోగభూమి కదా?'' అన్నాడు చార్లెస్ బెల్ — “యోగభూమి'' అనే మాటను ఒత్తిపలుకుతూ! దాంతో ఆ ముసలివాడి గుండెల్లో వీణతీగెలు మీటినట్టయ్యింది.

“బాబూ! అసలీ ప్రాంతమంతా ఒకప్పుడు **'సిద్ధుల తపోభూమి'**గా వుండేదని మా పెద్దలు చెపుతూండేవారు నా చిన్నతనంలో! ప్రతీ వాగూ వంకా ప్రతి జలపాతం వద్ద ఎందరో యోగులు, మహాఋషులు చాలా కాలం క్రితం తపస్సు చేసుకునేవారు.”

“ఇక్కడి ప్రతి వాగూవంకా, ప్రతి కొండా గుట్టవద్దా, మహ మునులూ, ఋషులూ చాలాకాలంక్రింతట తపస్సుచేసేవారు! అందుకనే ఇక్కడి జలపాతాలూ, నదులూ, గుహలూ ఆ యోగుల తపశ్శక్తితోనిండి కరెంటువలే శక్తివంతంగా వుంటాయి! కొన్నిచోట్ల అద్భుతమైన మహిమలు కూడా కనిపిస్తాయి” అన్నాడా ముసలి లామా! ఆలోచనల్లో ఊహల్లో తేలిపోతున్నట్లు మైకంలో.

“అందుకే — ఇది సిద్ధుల తపోభూమి! వందల సంవత్సరాలు ఇక్కడ మహాఋషులు, యోగులు, పవిత్రంగా జీవిస్తూ పరిశుద్ధ గంగా జలం మాత్రమే త్రాగుతూ వాయుభక్షణ చేస్తూ — పరమాత్మ శక్తిని

ఒక విద్యుత్తు కరెంటు వలే శరీరంలోకి ఆకర్షించుకొని ఈ హిమవత్ పర్వతాలను ఒక దివ్య ధామంగా మార్చారు!!

సిద్ధుల తపోభూమి

"ఇక్కడి భూమి, నీళ్ళు, గాలీ అన్నీ అపరిమితమైన శక్తికలిగి కరెంటువంటి శక్తినీ, తేజస్సునూ కలిగివుంటాయి. ఇక్కడి గాలిపీలిస్తే మనస్సు నిర్మలమౌతుంది. ఆలోచనలన్నీ నశిస్తాయి. ఇక్కడి మట్టి ఒక్క చిటికెడు నోటిలోవేసుకున్నా శరీరంలోని చెడుకోరికలన్నీ మందువేసుకున్నట్టుగా మటుమాయంగా నిర్మూలనం అవుతాయి.

ఎందుకంటే ఇది సిద్ధుల తపోభూమి! అందుకే పరమాత్ముడు అనేకసార్లు ఈ భూమిమీద ఎక్కడ అవతరించాలా? అని చూసి చూసి — పవిత్రమైన స్థలంగా ఇక్కడే తన పాదపద్మాలను మోపి అవతరించినది. నిజానికి — ఈ హిమాలయ పర్వతరూపంలోవున్న, ఒక దేవతాత్మ!

"దైవశక్తి అంటే మాటల సందర్భంగా గుర్తొచ్చింది — ఇక్కడి రాళ్ళుకూడా జీవం కలిగి చైతన్యంతోవుంటాయని చెప్తుకుంటారు. అదంతా నిజమేనా? లేక గొప్పలు చెప్పే డప్పాలా?" అని అడిగాడు సాహసయాత్రికుల బృందంలోని ఒక సభ్యుడు.

నిటారుగా కూర్చుని తను తింటున్న ఆహారం చప్పరిస్తూనే అతిథిగా ఆహ్వానించబడ్డ ఆ షేర్పా (Sherpa) రైతు — "ఇక్కడ ప్రతిరాయీ జీవంగల శిల! ఇందులో అతిశయోక్తికానీ, విచిత్రంగానీ ఏమీలేవు" అన్నాడు.

"ఇదంతా నిజమే నంటారా?" మళ్ళీ ప్రశ్నించాడు — మొదటి వాడు. ఇది కేవలం ఊహకాదని ఎవరి కథలు, గాథలు కవిత్వాలూ కానేకావని పచ్చినిజాలని, యదార్థ గాథలని — ఇందుకు సాక్ష్యంగా ఇక్కడి ప్రతి గులకరాయీ ఒక సాలగ్రామంగా మారిపోయింది!

ఆ వృద్ధుడు తటాలున క్రిందికి వొంగి వారు భోంచేస్తూన్న గుట్ట మీదినుంచీ ఓ గుండ్రని గులకరాయివంటి రాయి తీసుకుని — దాన్ని అరచేతిలోపెట్టుకుని దానివంకే చూస్తూ అన్నాడు.

"ఇదిగో దీనిని చూడండి! మీముందే ఇక్కడ గుట్టలోని ఈ గులకరాళ్ళనుంచే తీశానుగదా? పైకిచూస్తే మామూలు రాయిలాగే వుంది — ఔనా? మీలాంటి పెద్దలు రాళ్ళంతా ఒక్కటే అనికూడా అనవచ్చు" — అంటూంటే, మధ్యలో :

— "కాదా? ఇది మామూలు రాయికాదా?" అన్నాడు!

చూపులకి ఎర్రగా కనకాంబరం రంగులోవున్న ఈ రాయి గుండ్రంగా అరిగిపోయి ఉసిరికాయలావుంది! దాని చుట్టూరా గీరలు — ఒక సుడిగుండంలా బండిచక్రంలోని ఆకుల్లాగా ప్రదక్షిణగా తిరిగి, తిరిగి శంఖంలోని సుడిలాగా ఏర్పడివున్నాయి.

అతడా రాయిని తన బొటనవేలిమీద నిలబెట్టి రెండవ చేతిని ఆ రాయికిపైన "జ్ఞానముద్రలా" చేసి, పెట్టి, — రెండుచేతులకీ మధ్యగా బొటనవేలిపై ఆ రాయిని త్రాసువలే పెట్టి నిలబెట్టాడు. దానితో ఆరాయి తటాలున కుడివేపుకి ప్రదక్షిణగా గిర్రున తిరిగింది! మరుక్షణమే ఆగిపోయింది.

ఎదురుగా భోజనంచేస్తున్న అంతటి ఆరడుగుల పొడుగాటి సాహస వీరుడూ కంగారులో తాను భోంచేస్తున్న ప్లేటులోనే స్పూను పడేశాడు ఆదుర్దాగా! ఇలా అంటూ "**అరె! అరెరే! — ఆ రాయి బొంగరంలా** సర్రున **అలా ప్రదక్షిణగా తిరుగుతోందే?** అది మీచేతిలోవున్న హస్తలాఘవమా? లేక ఎవరికైనా అలాగే తిరుగుతుందా?"

"ఇది రాయిలోనే వుంది! మీరూ చూడవచ్చు — మీ చేతిమీదగా!! మా టిబెటన్ యోగులు "వజ్రం" లేక 'దోర్జీ'లా ముద్రలాగా పట్టివున్న వేళ్ళను మడిచి రెండు బొటనవేళ్ళమధ్యగా ఆరాయిని సున్నితంగా నిలబెడితే అది గిర్రున భూగోళంలా ప్రదక్షిణగా తిరుగుతుంది!

"మీరూ చూడవచ్చు. భోంచేస్తూవున్న మీ ఎంగిలిచేయి కడుక్కుని, కుడిచేతి వేలిపై రాయిని నిలిపి రెండవచేతివేలు దీనిపైన బోటుగా పెట్టుకుని రెండువేళ్ళమధ్యా ఆరాయినిలా సున్నితంగా నిలబెట్టాలి."

"దీనిని మా యోగులు '**సాలగ్రామశిల**' అంటారు! దీనికి ప్రాణం వుంటుంది. ఈ భూగోళం తిరిగినట్టే ప్రదక్షిణగా కుడివైపుకూ — మళ్ళీ కాసేపు ఎడమవైపుకు, ఇలా మార్చిమార్చి — కుడి ఎడమలకు తిరుగుతుంది" అన్నాడు!

"ఇక్కడ సాలగ్రామ శిలలవంటి పవిత్రమైన దివ్యశక్తిగల శిలా మూర్తులు మాత్రమేకాదు — ఎన్నో ఓషధులూ, లతలూ దివ్యప్రభావం కలిగినవి — మనిషిలోని నాడులూ, యోగకేంద్రాలలోని శక్తినీ, మేలుకొలిపి ఒక ఆధ్యాత్మిక చైతన్యాన్ని దివ్యప్రభావం కలిగించేవి అనేకంవున్నాయి."

"అవి జ్యోతిర్లత వంటి వెలిగే దివ్యమైన ఓషధులా?" — ప్రశ్నిం

చాడు వృక్షశాస్త్రం, వనమూలికలతో వైద్యంచేసే హెర్బల్ శాస్త్రంమీద ఆసక్తిగల నికోలాస్ రోరిఖ్ అనే రష్యన్ చిత్రకారుడు.

లామామహాశయుడు ఆయన ప్రశ్న వినిపించుకోకుండానే – వినబడనట్టుగా చెప్పుకునిపోతున్నాడు, ఏదో ధ్యాసలో తన్మయతతో తనలో తనే మాట్లాడుకుంటున్నట్టుగా...

"జ్యోతిర్లత అనేది రాత్రిళ్ళు చీకటిలో వెలిగే లక్షణం కలిగింది మాత్రమే! అదేమీ బ్రహ్మాండమైన దివ్యలక్షణమేమీ కాదు. ఇలా వెలిగే లక్షణం మామూలు మిణుగురుపురుగులకు కూడా వుంటుంది – కాని, వానిలో ఎట్టి దివ్యజ్ఞానంకానీ మరే భగవద్గుణంకానీ కనపడదు. కానీ ఈ దివ్యమైన లతలూ, ఓషధులూ అలాకాదు! ఒక ఉదాహరణ చెపుతాను, జాగ్రత్తగా వినండి. ఇక్కడ హిమాలయాలలో 'దామోదర కుండం' అనే సరస్సున్నదని మీలో చాలామంది వినేవుంటారు. దాని గురించి ఏ విషయం తెలిసినా, తెలియకపోయినా మీకు అందరికీ తెలిసేదిమాత్రం — మోకాలుకంటే ఎత్తైన, నిటారుగా పైకి ఎక్కివెళ్ళే మెట్లమార్గం — ఊపిరి అందకుండా ఆయాసపడుతూ ఎట్టకేలకు ప్రయాసపడుతూ ఎక్కితేగాని ఈ దామోదర కుండం చేరడం అసాధ్యమనే విషయం మీకు అనుభవంలో బాగా గుర్తేవుండివుంటుంది.

ఈ దామోదరకుండం — సరస్సు అడుగున దొరికే సాలగ్రామాలకు చాలా ప్రసిద్ధి! ఈ సాలగ్రామాలు నల్లగా, పాలిష్ చేసినట్టు గుండ్రంగానూ, సుదర్శనచక్రాకారంగానూ, నత్తగుల్లలాగా శంఖాకారంగానూ వుండేవి ఇందాక నేను చెప్పానుకదా — అలాంటివి రకరకాలు దొరుకుతాయి.

ఈ సాలగ్రామాలలో లోపలిగర్భంలో బంగారం, అంటే సువర్ణం వుంటుంది. సాలగ్రామాలు అమ్మే వర్తకులు చిల్లుపొడిచి ఆ బంగారం లాగేసి వాటిలోని ప్రకాశం, శక్తీ తగ్గిపోయిన నిస్తేజమైన సాలగ్రామాల్ని మాత్రమే మీకు అమ్మజూపిస్తారు. అలాకాకుండా గుండ్రంగా, లోపల బంగారంవున్న సాలగ్రామాన్ని "హిరణ్యగర్భం" అంటారు. హిరణ్యగర్భం అంటే గర్భంలో హిరణ్యం లేక బంగారం వున్నది అనిఅర్థం.

ఇంకోఅర్థం, 'హిరణ్యగర్భుడు' అంటే బ్రహ్మదేవుడు. 'ఈ హిరణ్య గర్భ సాలగ్రామాన్ని యోగశాస్త్రవిధానం ప్రకారం శరీరంమీద తాకించి పూజా, సాధనా చేస్తే — హిరణ్యగర్భుడు అంటే బ్రహ్మయొక్క సాక్షాత్కారంకలిగించి బ్రహ్మజ్ఞానాన్ని ప్రసాదించగలశక్తి గలదీ సాలగ్రామం' అనికూడా దీని అర్థం!

ఇకపోతే బల్లపరుపుగా చక్రంవలే వుండి దాని కేంద్రంలోని గర్భం దాకా ప్రదక్షిణగా తిరిగే రేఖ — శంఖంపైన సుడులు తిరిగినట్టు తిరుగుతూవుంటుంది. ఈ చక్రాకారపు రేఖనుండి బయటికి దీపావళి భూచక్రంలోని నిప్పురవ్వల కిరణాలు బయటికి చిమ్మినట్లుగా గీతలు అంటే బంగారురంగులోని రేఖలు కనిపిస్తాయి. ఇది సుదర్శన సాలగ్రామం.

దీనిని 'దోర్జీ' అనే వజ్రముద్రతో రెండు బొటన వేళ్ళమధ్య వుంచితే ప్రదక్షిణగా తిరుగుతుంది. ఎడమచెయ్యి, కుడిచేతులను పైకీ క్రిందకీ మార్చితే మళ్ళీ అప్రదక్షిణంగా తిరుగుతుంది. ఒకటి సంహార చక్రం, ఇంకోటి సృష్టి లేక రక్షణకవచమైన చక్రాయుధం.

ఈ సుదర్శన సాలగ్రామం శరీరంలోని సహస్రారచక్రాన్ని వెలిగించే దివ్యలక్షణం కలిగినది! అందుకే దీని ఆకారం సహస్రకిరణములుగల సూర్యుని గుర్తుచేసే సుదర్శనచక్రంలాంటి 'సహస్రార-చక్రం'లా వుంటుంది — దానిని పూజించితే దాని ప్రభావమూ అలాగేవుంటుంది.

ఎర్రటి రక్తంగడ్డకట్టినట్లుగా కొంచెం ఉగ్రంగా కనిపిస్తూ — నారసింహసాలగ్రామం వుంటుంది. ఇది భూతప్రేతపిశాచాలు, చెడ్డగాలి వంటి బాధలనుంచీ, ప్రయోగాలు, చేతబడుల వంటి బాధలనుండి రక్షణను కలిగించి, శత్రువులను సంహరించే శక్తిని కలిగివుండటంతో దీనికి "నారసింహసాలగ్రామం" అనేపేరు సార్థకం అని చెప్పవచ్చు. ఇలా చెప్పుకుంటూపోతే ఇదంతా ఒకగ్రంథమే అవుతుంది, సాలగ్రామాల గురించి చెప్పే శాస్త్రగ్రంథంలా! వీటిగురించి మీకు పరిచయం చేయడమే నా సంకల్పం."

"దివ్యమైన ఓషధులు, మొక్కల గురించి చెపుతానన్నాను గదూ! వినండి!! దామోదరకుండం వెళ్ళేదారిలో ఎత్తైన రాళ్ళమధ్య మొలిచే మరుగుజ్జు ఆకులుగల, దవనం ఆకులవంటి చిన్న ఆకులుకలిగి, ఎండాకాలంలోకూడా వాడిపోని ఆకులతో ఎండిపోయినట్టు కనిపించే అతిపొట్టి, శనగ బద్దలంతేసి ఆకులతో కనిపిస్తుందే అది — **'రుదంతి'** అనే మహౌషధీ లత. దీనిపైన పడిన మంచుబిందువులు ఆకులమధ్యలో తెల్లవారు జామునే ముత్యములవలే పేరుకునివుంటాయి. వాటిని జాగ్రత్తగా, ముట్టుకోకుండా తీసి పాదరసంపైన వుంచితే — ఆ పాదరసం వెంటనే గడ్డకట్టి 'రసబంధం' అవుతుంది! — ఇదే **'సువర్ణయోగం'** అనగా పాదరసాన్ని బంధించి, బంగారం తయారుచేసే యోగంలోని

మొట్టమొదటి మెట్టు ఇది అని చెపుతారు.

దీనికి కారణం రసాయనశాస్త్రంలో — పాదరసానికి 'శివవీర్యం' అని పేరు! శివవీర్యం స్తంభనంచేయడం గనక జరిగితే — శివుడు మృత్యువును జయించి మృత్యుంజయుడైనాడు గనక, అలానే పాదరసాన్ని బంధించినవాడూ రోగాన్నీ, మృత్యువునూ జయించి వయస్సును స్తంభింప చేసే — 'శివయోగి' అవుతాడు! ఇలాంటివాడు వందల సంవత్సరములు జీవించినా వయస్సు అతని శరీరంపై పనిచేయదు. అతడు జీవించినన్ని రోజులూ జీవించి, దీర్ఘాయుష్షుమీద విసుగుపుట్టిం తరువాతే యోగ మార్గంలో శరీరాన్ని వదిలేస్తాడు. ఈ 'రుదంతి' అనే మందు-మొక్కకు అటువంటి ప్రభావంవున్నది.

ఇకపోతే సోమలతగురించి ఆయుర్వేదగ్రంథాలలో మీరు చదివే వుంటారు. నేనిప్పుడు విడిగా చెప్పను! ఇందులో చాలా రకాలున్నాయి. — దుంపగా పెరిగేవీ, సన్నగా లతలా పొడుగ్గా పెరిగేవీ, బంగారు రంగు పాలతో దళసరి మట్టలతో ఎదిగేదీ — ఇలా నాలుగువర్ణాల జాతులూ సోమలతలో వున్నాయి! బ్రహ్మజాతి సోమలత ఒక్క కృత యుగంలోనే లభించేది అంటారు.

నడిచే-శిల! :-

అన్నిటికన్నా చిత్రవిచిత్రమైనది — నడయాడే శిల! ఇది ఒకచోటు నుంచీ ఇంకోచోటికి ప్రయాణంచేస్తుంది! ఇవాళ ఇక్కడ కనిపిస్తే, రేపు పదిమైళ్ళదూరాన, ఆ ఎదురుగా కనిపించే కొండశిఖరానికి అప్రక్క లోయలో తిరుగుతూవుంటుంది! అంతేకాదు, ఈ శిల నవరత్నాల

రంగులలోనూ రంగులుమార్చి ప్రకాశిస్తూవుంటుంది. ఒకసారి బంగారు రంగులోనూ, ఇంకోసారి నెమలిపింఛంలా ఆకుపచ్చా, నీలం కలిసిన ఇంద్రధనుస్సు కాంతులతోనూ ప్రకాశిస్తుంది. దీనిని **'శంబల-రాయి'** లేక **'చింతామణి'** అంటారు. దీని జాతిదే భగవంతుని అవతారమైన శంబల ప్రభువువద్దవుండే — **చింతామణి!**

పూర్వం పురాణాలలో శమంతక మణిగురించి మీరు చదివే వుంటారు — అదికూడా వుంగరాలలో ధరించే వజ్రంవంటి రాయి కానేకాదు. రోజూ ఎన్నో అన్ని బారువుల బంగారం ఇస్తుందని మీ పురాణాలలో వ్రాశారుకదా? ఎలా ఇస్తుందనుకుంటున్నారు? పుట్టెడు బంగారాన్ని మీఇంటికి పాట్లంగట్టి ఏమీ ఇవ్వదు.

ఇది కేవలం 'ధనాకర్షణి' చింతమణి — అర్హతలేనివారికి ప్రాణాన్ని హరించే మృత్యుమణి! ఇప్పుడు నేనుచెప్పిన దివ్యమైనవస్తువులన్నీ అటువంటి దివ్య లక్షణములు కలిగిన మహాపురుషుల వద్దనే వుండాలి!

ఎందుకంటే ఈ మణుల్లో, సాలగ్రామశిలల్లో, దివ్యౌషధులలో ఎటువంటి దివ్యలక్షణములున్నాయో సరిగ్గా — ఆ మహావ్యక్తిలో కూడా — అతడి శరీరం మీద శంఖ చక్రరేఖలు, తామరపూలవంటి పద్మరేఖలు, శరీరంలో ఒకవిధమైన పరిమళం — ఎప్పుడూ చెమటవాసనా, కుళ్ళువాసన లేని పరిశుద్ధ యోగశరీరంగలవారికే ఇలాంటి దివ్యమణులను ధరించే లేక పూజించే అధికారం వుంటుంది.

ఇటువంటివెన్నో శంబలకు పోయేదారిలో వుంటాయి! వాటిలో కొన్నిమీకు తారస పడవచ్చు — హెచ్చరికగా దానిని గమనించి,

గౌరవించి, వీలుంటే పూజించి — మీదారిన మీరు పొండి! అంతేకానీ వాటిని ఇనప్పెట్టెలో భద్రంగా తాళంవేసి మీ ఇంగ్లాండుకో, అమెరికాకో తీసుకువెళ్ళి ఒక ప్రదర్శనశాలలోపెట్టి టిక్కెట్లుపెట్టి అమ్మి లాభాలు సంపాదించాలనుకుంటే మీకు ప్రమాదం తప్పదు.

ఒకవేళ అటువంటిదేమైనా మీదేశంలో పెట్టివుంటే, మీ దేశానికి అణుబాంబులవంటి విధ్వంసకరమైన మారణాయుధాలతో యుద్ధం జరిగి లక్షలు, కోట్లమంది క్షణంలో నశిస్తారు. ప్రపంచంలో ఎన్నో అన్ని ప్రళయాలకి కారణాలు — ఇలాంటివే! ద్వారకలో పుట్టిన **'ముసలం'** — **శమంతక-మణి** ధరించిన వారు మరణించడం, **కోహినూరు** వజ్రం కిరీటంలో పెట్టుకున్న గజనీ మహమ్మదు, నాదిర్షా, ఔరంగజేబు, విక్టోరియా మహారాణిల రాజ్యం పోవడం — కథలు కాదు — యదార్థం! అందుకే ఇటువంటి దివ్య వస్తువులజోలికి అర్హులుకానివారు పోరాదు!!

తలమీద మెరుస్తున్న మణితోవున్న మహాసర్పాన్ని చూసి జాగ్రత్తపడినట్టు వీటితో ఎంతో భద్రంగా మసలుకోవాలి గౌరవంతో! ఇప్పటికే మీకు శంబల గురించి, ఎన్నో ఆశ్చర్యాలూ, వింతలూ చెప్పాను.

ఇటువంటి విషయాలు — అసలు నోరువిప్పకుండా గుట్టుగా వుంచడం అందరికీ మంచిది!”

మాటమధ్యలో — పాటియాలా యువరాజు అడిగాడు :

“రుద్రాక్షలు” అనే ఒక పవిత్రమైన చెట్టుయొక్క విత్తనాల్నికూడా పూజలో ఉపయోగిస్తారట కదా?”

“అవునండీ! సాధకులు మెడలోనో, లేక జుట్టుకో కట్టి తలమీద ముడిపైన — ధరించేవి! ముళ్ల ముళ్లగావుండే కుంకుడు కాయలవంటి ఒకచెట్టు విత్తనాలే — ఈ రుద్రాక్షలు! అందులోని కొన్నిరుద్రాక్షలకి కూడా ఇలా ప్రదక్షిణగా తిరిగే శక్తి వుంటుంది.”

“మీరు నన్ను నిగూఢమైన రహస్యాలగురించి అడుగుతున్నారు. కదిలే శిలగురించి అడిగారు. సాలగ్రామశిల ప్రతి దేవాలయంలోనూ గుండ్రటి చలువరాయిలాగా పాలిష్‌చేయబడి వుంటుంది! మీరెపుడైనా చూసివుంటే — దానిపైన సుడిగుండంలా చక్రాకారంలోవున్న రేఖ స్పష్టంగా కనిపిస్తుంది శంఖంలాగా! ఒక నత్తగుల్లపైన చుట్టూరా ప్రదక్షిణగా తిరిగే శిఖరందాకా తిరుగుతూ ఒక గీతకనిపిస్తుందే — అలాగ ఇక్కడి శిలలపై కనిపిస్తుంది! ఇవి శంఖముద్రగల విష్ణుమూర్తి శిల అనవచ్చు. ఇప్పుడు కొన్ని మీకు తెలియనివి చెపుతాను!

“సాలగ్రామ శిలలలో రెండురకాలున్నాయి. ఒకటి శ్రీమూర్తి! అనగా మహాలక్ష్మీస్వరూపం. ఇటువంటి శ్రీమూర్తి సాలగ్రామశిలను పూజిస్తే అపరిమితమైన సంపద కలుగుతుంది. పూజించేవారికి ఎన్నడూ అన్నవస్త్రాలకు కానీ భోగభాగ్యాలకు కానీ ఏలోటూ వుండదు. కావలసినవి అంతా ఈ శ్రీమూర్తి సన్నిధివల్లనే సర్దుబాటు అయిపోతూవుంటుంది అద్భుతంగా! ఇక రెండవరకం సాలగ్రామశిలలు — మహావిష్ణుస్వరూపాలు! ఇందులో అనేక రకాలున్నాయి — మత్స్యమూర్తి, నారసింహమూర్తి, సాలగ్రామ మూర్తి, కూర్మమూర్తి, సుదర్శనసాలగ్రామం, షట్చక్రసీతారామ మూర్తి, మహా సుదర్శన సాలగ్రామంవంటివి!”

“అవన్నీ ఇప్పుడు మీకు అనవసరం. అవి తపస్సు చేసుకునే మహా మునుల వంటివారికే లభిస్తాయి. నిత్యమూ శుచిగా, శరీరం మడిగా, మలమూత్రములుగానీ, మైలగానీ, అంటుగానీ, నీచ వస్తువుల గాలికానీ మరే అశుభ్రతా తాకని పవిత్రప్రదేశాలలోనే అవి వుండాలి! అప్పుడే వాటి ప్రకాశం, శక్తీ ప్రజ్వలించి వానిని పూజించేవారికి జ్ఞానం, పరమానందం, నిత్యారోగ్యం, ఏ విచారమూలేని పరిపూర్ణసంతృప్తి — నిత్యం భగవంతుడు తనలోనే వుండే ఆనందాన్నీ, హుందానీ ఒక మహారాజు హోదానూ, అధికారాన్నీ నిత్యం అనుభవంలో కలిగిస్తుంది.

నిజానికి బయటి ప్రపంచంలో రాజులూ, మహారాజులూ, ప్రధాన మంత్రులూ, ముఖ్యమంత్రులూ పగటివేషగాళ్ళవలే అధికారం బురఖా ధరించి కనబడ్డా, ప్రతివాడికాళ్ళూ పట్టుకుని, అధికారం నిలబెట్టుకోవడం కోసం తాపత్రయపడే వాళ్ళుకాదు — నిజమైన రాజులు! ఎట్టి లోటూ ఎరుగని నిత్యానందస్వరూపులు, నిత్యసంతోషులూ అయిన యోగిరాజులే — నిజమైన రాజులు!

“మరి, మీరేమో నిత్యం గొడ్డుమాంసంతిని, నిత్యం కల్లుతాగి తెల్లగా తెల్లారే బ్రతుకులతో శరీరమే శాశ్వతం అనుకునే మాయజీవితంలో బ్రతికే దేశాలనుంచి వొచ్చినవారు — ఇంగ్లాండు, జర్మనీ, అమెరికా ఇంకా తురుష్క దేశాలనుంచీ వచ్చినవారూ. మీలో చాలా మందికి దేవుడంటేనే విశ్వాసం లేదు!

శరీరాన్నే నమ్ముకుని, కోరికలే సుఖమనుకుని ఇహమే — సర్వం అని నమ్మి క్షణకాలం మారిపోయే సుఖదుఃఖాలమీద ఆధారపడి బ్రతికే

మీది జీవితంకాదు — నీటిబుడగ!

సాయంత్రం దీపంపెడితే దీపంచుట్టూ ముసురుకుంటాయే వందలకొద్దీ దీపంపురుగులు — అలానే జీవిస్తారు మీలో చాలామంది! మిమ్మల్ని కాల్చి బూడిదచేసే మంటనే పండులా అనుకుని ఆకర్షించబడి దానిచుట్టూ తిరుగుతూ చివరికి దానిలోపడి మాడి మసైపోతారు దీపపు పురుగుల్లాగే! ఇహలోకాన్ని నమ్మి పరం ఎరుగని అభాగ్యుల జీవితం ఇలానే ముగుస్తుంది.

చెట్టుకి కాసిన కాయలోపలే చెట్టుని మొలిపించే గింజవుందని తెలియనివాడు — గింజపై పొట్టుమాత్రమే చూసి లోపల పప్పుని చూడని వారు, లేదా పప్పుని మాత్రమే చూసి ఆ లోపల మొలకెత్తే ప్రాణ కేంద్రాన్ని చూడలేనివాడూ, ఎలాగో, ఈ శరీరాన్నే సర్వం అని, నమ్మి ఇహలోకమే అన్నీఅనుకుని దాన్నే నమ్మే పిచ్చివాళ్ళుకూడా అంతే! ఏడుస్తూ, నవ్వుతూ పిచ్చివాని కలలా బ్రతుకుతూ ఈడ్చుకుపోయే కాల ప్రవాహంలో ఎటుపడితే అటుపోయే చుక్కాని లేని నావలాగా వుంటుంది వారి జీవితం.''

“శంబల అలాంటివారికేమీ ఇవ్వదు! శంబల ఈ విశ్వానికే సారం!! ఈ సృష్టి యావత్తూ జల్లెడపడితే సారంగా మిగిలేది ఏదైతేవుందో — నిత్యమూ, సత్యమూ, అనందమూ, సంతృప్తీ — మళ్ళీ మళ్ళీ జన్మలకు ఎగబడకుండా మనలోని కక్కుర్తినీ, వాపిరిగొట్టుతనాన్నీ నిర్మూలింపచేసి శాశ్వతంగా కోరికలను సంతృప్తిద్వారా నాశనంచేసి శాశ్వతమైన ఆనందాన్ని ఇచ్చేదే శంబల యొక్క అసలు సారం!

అందుకే అన్నాను, మీకెందుకీ శంబల రహస్యాలు! ఈ సాలగ్రామ శిలలు, యోగులు తపస్సుచేసిన గుహలూ, సిద్ధుల తపోభూమీ గురించి, మీకెందుకు?” అంటూ ఆ ముసలియోగి, లామా ఎత్తుగా బాదంకాయల వలే వున్న తన కనురెప్పలు అరమోడ్చి సగం తెరుచుకున్న కళ్ళతో తన ఆత్మలోకే చూస్తూ జలజలా చెంపలమీదకు కారే ఆనందభాష్పాలతో తన ధ్యానంలో తానే మునిగిపోయాడు.

ఆయనను మాట్లాడించాలంటేనే భయంవేసింది! ఆయన ఆనందాన్నీ, యోగసమాధినీ మన పిచ్చిప్రవర్తనతో భగ్నంచేస్తామేమో అన్న సందేహంవలన.

అలా ఎంతసేపు గడిచిందో తెలియదు. ఒక అరగంట! గంట...!! కాలమే నిలిచిపోయింది... కొంతసేపటికి ఆయన మా ఆలోచనలవల్ల ఇబ్బంది కలిగినట్టుగా బాధగా కన్నులుతెరచి చుట్టూరా చూశాడు — మళ్ళీ మేము ఇంకా అక్కడే నిలబడివుంటే చిరాకు చిరాకుగా ముఖం చిట్లించి, మళ్ళీ మావంక జాలిగాచూశాడు.

మట్టిపూసుకుని మురికిలో ఆడుకుంటూవుంటే చిన్నపిల్లలవంక తల్లిచూసే చూపులోని దయ అది! అందుకే ఓర్పును కూడగట్టుకుని ఆయన మళ్ళీ మాతో మాట్లాడాడు.

“బాబూ! మీరు నొచ్చుకున్నారా! నామాటలకు? మిమ్మల్ని నొప్పించాలనీ బాధపెట్టాలనీ నాసంకల్పం కాదు. మీ జీవితాలు వ్యర్థం కాకూడదనే నా తపన. పరమాత్ముడు మనల్ని ఈలోకంలోకి పంపించింది అమూల్యమైన సందేశంతో అపురూపమైన మానవజన్మ ఇచ్చి పంపాడు.

దానిని వృథా చేసుకోరాదనే మీతో ఇంత గట్టిగా మాట్లాడాను."

"మనిషై పుట్టినవాడు భగవంతుని తనలో చూడకుండా మరణించరాదు. అలా దర్శించి మరణించినవాడు తిరిగి పుట్టడు."

"అలా కానివాడు ఎన్నిసార్లు మరణించినా — ఎన్నిసార్లు జన్మించినా అతడికి బుద్ధిరాదు! అదే కోరికలవెంట అదే సుఖదుఃఖాల వెంబడీ పడుతూ, లేస్తూ, నడుస్తూ, పరుగు తీస్తూ — తనని తానే తిట్టుకుంటూ, తనని తానే పొగుడుకుంటూ — తన నీడను పట్టుకుని తానే ఆడుకునే పిల్లవాడిలాగా మాయాజీవితం అనుభవిస్తూవుంటాడు!

ఈ ప్రపంచం అంతా ఎండమావులతో నిండివుంది. క్రీనీడలాగ వాటికి ఆకారమేగాని, అస్తిత్వం లేదు. ఈ సుఖదుఃఖాలూ, డబ్బూ, ఇల్లూ, హోదా అన్నీ మాయ...! అంటే ఊహమాత్రమే! నిజానికి — ఆనందం, శాంతం — ఈరెండే సత్యం!

"ఇంకా ఏంకావాలో మీకు? అడగండి! పాపం, చాలాసేపటినుంచీ వేచివున్నారు కాబోలు" — అంటూ మావంక జాలిగా చూస్తూ అడిగాడు.

ఆయన అనుగ్రహానికీ దయకూ చలించిపోయాము. ఆహా! ఇటువంటి మహనీయులూ, పవిత్రమూర్తులూ మాత్రమే జీవించదగ్గ పుణ్యభూమి కదా ఈ హిమాలయపర్వత పంక్తిలోని శంబల పవిత్రక్షేత్రం!

ఇది నిజంగా సిద్ధుల **తపోభూమి!**

◆

11

'స్పటిక శ్రీచక్ర' - దేవాలయం!

అది ఒక పెద్ద గుడారం! దళసరి కేన్వాస్‌గుడ్డతో రంగురంగుల డిజైను కనిపించేలా అల్లిన డేరాగుడ్డతో సంధ్యవెలుగులో కాగడాలు బంగారుకాంతితో మెరుస్తున్నాయి! ఈదురుగాలి రివ్వున తుఫాను శబ్దంతో హిమాలయపర్వతాల మంచుశిఖరాల చలిని మూటకట్టుకొని జివ్వున నరాలు పీకేసేలాగా విసురుగా లోయవైపు వీస్తున్నాయి ఎడతెరిపి లేకుండా! తుఫానుగాలిలా వీచే ఆ సుడిగాలికి కొండచరియపక్కగా బిగించిన ఆ టెంట్ ఒక పేరాచూట్‌లా ఎగిరిపోయేలా కనిపిస్తోంది ఏక్షణంలోనైనా! లోపల ఏదో మీటింగులాంటిది నడుస్తున్నది!

ఎత్తు తక్కువగావున్న ఓ పొట్టిబల్లపైన వెడల్పాటి మ్యాప్ (Map) వంటిది పరిచివున్నది! — ఆ టేబుల్‌చుట్టూ నాలుగువేపులా హిమాలయ పర్వతాలలోని పహాడీలు కొండజాతి గిరిజనులు ధరించే పొట్లంలాంటి టోపీలు ధరించి చర్మంలాంటి దళసరి కేన్వాస్ గుడ్డతోచేసిన పొడుగాటి బురఖాలువేసుకొని దాదాపు 8–9 మంది నిలబడివున్నారు! వాళ్ళ పోలికలు గుర్తుపట్టడానికే వీలులేకుండా టోపీలు కిందికి మొహంమీదికి లాగబడివున్నాయి! టేబుల్ మధ్యలో ఒక కొబ్బరిపెంకుతో చేసిన చిప్పలో కరిగిపోతున్న మైనం పేరుకొని వెలుగుతున్నది. ఒక లావాటి కొవ్వొత్తి గాలికి రెపరెపలాడుతూ! గుడారం నాలుగు వైపులా టిబెటన్ లామాలు తయారుచేసే కస్తూరి, జవ్వాది, అగరువత్తులు అడుగున్నర పొడుగువి దట్టమైన పొగచిమ్ముతూ గుడారం అంతటా పరిమళాలు చిమ్ముతున్నాయి! అంతలో ఆజానుబాహువైన ఒకవ్యక్తి పొడుగాటి మీసాలు, గడ్డంచివర కొద్దిపాటి వెంట్రుకలు, పెరిగిన పిల్లిగడ్డంతో గాజుగోళీలవంటి కళ్ళు తళుక్కున మెరుస్తుంటే టేబుల్‌మీద మార్గదర్శిపటాన్ని చూస్తూ అన్నాడు!

మనమిప్పుడు ఎవరెస్టు శిఖరానికి దక్షిణలోయ పాదపీఠం మొదట్లో వున్నాం! ఎవరెస్ట్ శిఖరం ప్రపంచంలోకల్లా ఎత్తైన పర్వతం అని మీకందరికీ తెలుసు! 29 వేల అడుగులుపైగా వున్నదికదూ!

“ఎవరెస్టు ఎత్తు — 29వేల అడుగులకంటే పొడవుకదా!” అంటూ మధ్యలో ఎవరో అడ్డుతగులుతూ ప్రశ్నించాడు తన తెలివితేటలు ప్రదర్శించటానికి అన్నట్లు! మిగతావాళ్ళు కొంచెం విసుగ్గా ఆయనమీద



“గౌరీ-శంకర్” - ‘ఎవరెస్టు’ శిఖరం

కలిగిన చికాకుతో — "మీరు కాస్త నిదానించండి! మన లీడరు చెప్పే మాటలు విందాము!" అన్నారు.

దాంతో ఆజానుబాహువైన వ్యక్తి టేబుల్‌మీద పరచివున్న విశాలమైన మ్యాపుకేసి చూస్తూ తన చూపుడువేలుతో ఒకచోట చూపించి —

"మనమిప్పుడు ఇక్కడవున్నాం. అంటే హిమాలయశిఖరానికి దక్షిణ ముఖంగా 25 వేల అడుగులఎత్తు ఎగుడుగావున్న విశాలమైన లోయ మనముందు వున్నది. దానిని దాటి అవతలికి వెళ్ళాలి! అంటే ఇటు నుండి కష్టపడి వేలఅడుగుల మందం పేరుకుపోయిన మంచుజలపాతం లోంచి నడచి ఆపైన గడ్డకట్టేసిన గంగానదిపైన ప్రయాణించి ఎవరెస్టు శిఖరాన్ని చేరుకోవాలి. లేదా కుడివైపున తూర్పుగా ప్రవహించే గంగోత్రి ప్రవాహందాటి ప్రదక్షిణంగా హిమాలయ పర్వతపంక్తి బుజములపైనుండి అవతలకి దాటి ఎవరెస్టుకు ఉత్తరంగా ప్రయాణించాలి. రెండూ కష్టంతో కూడిన ప్రయాణమే.

ఒకటి దూరము. ఇంకొకటి నడవాల్సిన దూరము తక్కువైనా ప్రతీ నూరుఅడుగులకూ, ఐదువేల అడుగులఎత్తు ఎక్కుతూ వెళ్ళాలి! ప్రతీ అడుగు ఊపిరితీసుకోవడం కష్టంగా వుండేంత ఎత్తు ఎక్కాలి!! మన సామాను బరువు అంతటినీ మోస్తూ శ్రమపడాలి. ఇందులో ఏది సుఖం, ఏది సులభం అన్నదే మన ముందరవున్న సమస్య. ఇందులో మీఅందరి అభిప్రాయాలూ నిర్మొహమాటంగా చెప్పాలి. అందరం కలసి ఒక నిర్ణయం తీసుకోవాలి".

ఇలా సాగుతోంది ఆ టెంట్‌లోని సాహసయాత్రికుల చర్చ.

ఆ చర్చలో పాల్గొనకుండా గుడారంబయట ముదురు నీలం రంగు కీనీడలో — బోర్లించిన ఓ పీపామీద కూర్చుని పొడుగాటి పైపుతో పొగ పీలుస్తూ రైలింజన్‌లాగా గుప్పుగుప్పుమని పొగత్రాగుతున్నాడు చార్లెస్ బెల్! ఆయనకేమీ పట్టినట్టులేదు — ఆ గుడారాలలో వాళ్ళ చర్చలు! ఇలా గంటా, రెండుగంటలు సాగింది.

వేరే చిన్న చిన్న టెంట్‌లలో కొండజాతి షేర్పా వంటవాళ్ళు గాడిపొయ్యిలు తవ్వి దుంగలతో నెగడువేసి వంటలు చేస్తున్నారు. వణికించే చలిలో వెచ్చటి మంట సెగ తగులుతూంటే ఆనందిస్తూ పొగ పీలుస్తున్నాడా వ్యక్తి. ఇంతలోకే 'భోజనాలకి వేళైందని' పిలుపొచ్చింది. హడావిడిగా బల్లలు శుభ్రంచేసారు. బిలబిలమంటూ అందరూ డైనింగ్‌టేబుల్ చుట్టూ నిలబడి ప్లేట్‌లో ఉడుకుతున్న పులుసును జుర్రుకుంటూ, చేతికంటిన పులుసును చప్పరిస్తూ రుచిని ఆస్వాదిస్తున్నారు.

“మీరెక్కడికి వెళ్ళారు! ఇప్పటిదాకా? మీరు కనిపించలేదే! అయ్యో! మన బృందంలో అందరమూ ఈ సాహసయాత్రలోని తరువాత మజిలీ గురించి ప్రోగ్రాంవేస్తూంటే! అసలు కథానాయకులు మీరు రాలేదేమిటి!” — అంటూండగా గుడారాల వెనుకనుంచి ఓ బోర్లించిన పీపామీదనుంచి లేచి తన పైపునుండి పొగవదుల్తూ వచ్చాడు చార్లెస్ బెల్ మహాశయుడు! ఆయన్ని చూసి అందరూ విస్తుపోయారు. ఆశ్చర్యంగా ప్రశ్నించారు. ఇప్పటిదాకా వేడి వేడిగా జరిగిన చర్చలో ఈ సాహసయాత్ర కథానాయకుడు, అపరాధ పరిశోధకుడు చార్లెస్ బెల్ మహాశయుడు పాల్గొనకపోవడం వారికి వింతగా తోచింది. దానికతడు తాపీగా —

డైనింగ్‌టేబుల్‌మీద తన ప్లేట్‌లోని వేడిపులుసు చప్పరిస్తూ ఇలా అన్నాడు!

"మీరు మాట్లాడుతున్నది అంతా నాకు బయటికి వినిపిస్తూనే వున్నది! నేను ఈ టెంట్ వెనకాతలే కూర్చుని విన్నాను!"

"చీకట్లోనా? పైగా ఈదురుగాలి, చలి" అంటూ అందరూ ఒక్కసారిగా విస్తుపోయారు!

"కాదు! ఇక్కడికన్నా బయట చాలా వెచ్చగావున్నది. నేను కూర్చున్న చోట!"

"అదెలాగ!"

"బయట వంటలుచేస్తున్నవాళ్ళు రెండు గాడిపొయ్యిలమధ్యన — వేడి, సెగలు వెచ్చగా తగులుతూవుంటే హాయిగా నాపైపు పొగపీలుస్తూ మీచర్చలు వింటున్నాను. నాపనే మేలుకదా?" అన్నాడు చిలిపిగా నవ్వుతూ! దాంతో ఆశ్చర్యపోయిన మిత్రబృందం ఒక్కసారిగా తలఎత్తి చూసి — "మరి మన చర్చలలో మీ సలహా ఏమిటి? రేపటినుంచి వారంరోజులు నడవాల్సిన మనం ఎదురుగా వెళ్లి ఎవరెస్టుశిఖరాన్ని దాటాలా? లేక కుడివైపునుంచి తూర్పుగావెళ్ళి హిమాలయాల భుజం మీదుగా దాటి — ఎవరెస్టుకు ఉత్తరంగా ప్రయాణించి ఈశాన్యంగా మళ్లీ, ప్రయాణంచేయాలా?"

అందరూ ఆత్రుతగా, చార్లెస్ బెల్ మహాశయుడి ప్లాన్ ఏమిటా? అని ఆసక్తిగా వింటున్నారు.

ఆయన తన ప్లేటులోని భోజనం వేడివేడిగా వుండగానే తాపీగా

చప్పరిస్తూ తినడం పూర్తిచేసి ప్లేట్‌లోకి స్పూన్‌ను ముందుకు తోసేస్తూ పక్కనేవున్న చేతిగుడ్డతో చేతులూ, మూతి తుడుచుకుని — తాపీగా తన భోజనం పూర్తిచేశాడు.

పొడుగ్గా ఊపిరి తీసుకుని — ఒక సన్ననిపుల్లతో తన పైపులోకి పొడుస్తూ బోర్లించి, టేబుల్‌మీద కొట్టి అలా పైప్‌లోని బూడిద ఖాళీ చేస్తూ ఆతరువాత మళ్ళీ పైప్‌నింపుకొని పీలుస్తూ నిదానంగా చుట్టూవున్న వారివంకచూశాడు.

"ఏమిటలా నిమ్మకునీరెత్తినట్టు కూర్చునివున్నారు! మన ఎదుట వున్నది అతి కష్టతరమైన ఏడురోజుల సాహసయాత్ర విఫలంకావడమో లేక గమ్యానికి చేరుకోవడమో — అన్నది, మన ప్రోగ్రామ్‌మీదే ఆధారపడి వున్నది బెల్ మహాశయా!"

దీనికాతడు తను కూర్చొనివున్న బోర్లించిన పీపాని వెనక్కి తన్నేస్తూ మోకాళ్ళమీద కూలబడి, మోకాళ్ళు నేలకి ఆనించి కూర్చొని చేతిలోని పదవాటి చాకుతో మట్టినేలపైన ఓ యంత్రంలాగా కొన్ని గీతలుగీశాడు! అందరి కళ్ళూ ఆసక్తిగా అటువైపేవున్నాయి. చకచకా నిలువుగా త్రిభుజాలు నాలుగు గీసి, వాటికి జతగా, వాటిపైగా బోర్లించిన త్రిభుజాలు మూడు — అలాగే నేలపై గీశాడు! "ఇవేమిటో తెలుసా?" అన్నాడు తలపైకెత్తి తనచుట్టూ నిలబడి వున్న సాహసబృందాన్ని చూస్తూ.

"అది శ్రీచక్రం గదా!" — అందరూ ముక్తకంఠంతో కోరస్ లాగా పల్లవితో అరిచారు!

"కాదు! — మీరంతా అక్కడే పప్పులో కాలేశారు! ఇది మీ

పూజారులు గుడిలో పూజలో రాగిరేకుమీద గీసిన త్రిభుజాలు వేసిన శ్రీచక్ర యంత్రం చిత్రం — అనికదూ! మీరనుకునేది?"

"కాదామరి!" — ఇంకేమంటారు మీరు?

తాపీగా లేచి నిలబడి చేతిలోని పైపుతో ఎవరెస్టుకు వాయవ్య దిశగా చూపిస్తూ — "సరిగ్గా ఆదిక్కుగా అరవైమైళ్ళు దూరంలో వున్న స్ఫటికపర్వతం గురించి మీకెవరికైనా తెలుసా?"

"స్ఫటికపర్వతమా? ఈ చుట్టూ వున్నవి మంచుకొండలేకదా? స్ఫటికపర్వతం అంటారేమిటి మీరు? వింతగా వుందే! మేమెక్కడా వినలేదుకూడాను!"

సరిగ్గా అదే మనకి ముఖ్యమైన రహస్యస్థావరం! పైకి మంచు శిఖరంలాగే గాజులా ఇటునుంచి అటు కనిపించేలాగ మంచుకొండల రంగులో కలసిపోతూనే — అర్థచంద్రాకారంగా చుట్టూ వ్యాపించివున్న మంచుకొండల మధ్యగావున్న దేవాలయశిఖరం వంటి ఎత్తైన కొండ — అంతా ఓ స్ఫటికంతో ఏర్పడివున్నది!

అది మంచుకాదు స్ఫటికం!! అంటే యోగులు జపమాలను తయారుచేసుకునే పూసల వంటి వస్తువే స్ఫటికం! వేసవికాలం ముదర గానే దానిచుట్టూ వున్న మంచు కరిగిపోయి ఈ స్ఫటికపర్వతం బయట పడుతుంది. ఇది ఎండకు కరగదు. మరింత తేజస్సుతో దీపం వెలిగించి నట్టు వెలుగుతూ ఒక జ్యోతిలాగ ఎండవేడికి విపరీతంగా మరింత వేడెక్కుతుంది — మంచుపర్వతం అయితే ఇలా అవదుకదా?

దీనినే టిబెట్, హిమాలయ, భూటాన్ ప్రాంతంలోని యోగులు సగౌరవంగా 'స్ఫటికపర్వతం' అని దూరంనుంచే నమస్కారం పెట్టుకుంటారు.

"స్ఫటిక పర్వతమా?" అంటూ ఇంకా ఆశ్చర్యంగా విస్తుపోతున్న మిత్రబృందంవంక చూడకుండా పైప్‌ను నేలమీదకి, చూపిస్తూ అన్నాడు — సరిగ్గా ఆ స్ఫటికపర్వతంచుట్టూ వున్న మంచు తవ్వించేస్తే ఒక సొరంగమార్గం నిటారుగా భూగర్భంలోకి వంద అడుగుల లోతుకి దిగుడుమెట్లు కనిపిస్తాయి. దాని ముఖద్వారం స్ఫటికం రాతిపలకతో మూసివుంటుంది. ఆ రాతిపలక సంవత్సరమంతా మంచుతో కప్పబడి ఎవ్వరికీ — అది, అసలు ఎక్కడవున్నదో కూడా అంతుబట్టదు. అది సంవత్సరంలో ఒక్కరోజే బయటపడుతుంది.

దానికి ఖగోళం, జ్యోతిషం తెలియాలి. తెలిస్తేనే నేను చెప్పే దాని అర్థం బోధపడుతుంది! జాగ్రత్తగా వినండి! నేను చెప్పేటప్పుడు మధ్యలో అడ్డుపుల్లలు వెయ్యకుండా వినండి!"

"సూర్యుడు మేషప్రవేశంచేసే ఏప్రిల్ 15వ తేదీనుండి — సరిగ్గా పదిరోజులకు పరమోచ్చ డిగ్రీకి చేరతాడు. సరిగ్గా అదేరోజున పూర్ణిమ కూడా రావాలి. అలా కొన్నేళ్ళకుగానీ రాదు. అలాగ రవి మేషం పదవ డిగ్రీలో వున్నప్పుడు వచ్చిన పౌర్ణమినాడు ఎండ కిరణాలు తీక్షణంగా ఏటవాలుగా పడి ఆ స్ఫటికపర్వతం ముఖద్వారంమీద వున్న మంచు కరిగి — దాని ద్వారం బయటపడుతుంది. అది యోగులకు, పరమ గురువులకు మాత్రమే తెలుసు ఈ ప్రత్యేకమైన రోజు!

"ఆరోజు ఎలా తెలుస్తుంది?"

"అడ్డుపుల్లలు వెయ్యొద్దన్నానా?"

"సరే... మహాశయా! చెప్పండి!"

"ఇలా కొన్నేళ్ళకొకసారి ఏర్పడే 'మేషం పరమోచ్ఛ' డిగ్రీలో సూర్యుడు వుండగా వచ్చే పౌర్ణమినాడు స్ఫటికపర్వతం పునాదివద్ద ముఖద్వారం బయటపడి ఆ స్ఫటికం కొండక్రిందన — ఒకమూల లోతుగా నెట్టబడి గిర్రున ఇరుసులా తిరిగే ఓ ద్వారం తెరచుకుంటుంది.

కాగడాలతో దిగి భూగర్భంలో వంద అడుగుల దిగుడుబావిలా పోయి ప్రయాణిస్తే కుడివైపుగా ఈశాన్యంవైపునకు చూస్తూ వెళ్ళే సొరంగ మార్గం కనిపిస్తుంది. దానిలోకి దిగి ప్రయాణిస్తే మీరు కోరిన ఎవరెస్టు శిఖరం అవతలిప్రక్కకు — నాలుగు రోజులలోనే చేరుకోవచ్చు!

అటునుంచి మళ్లీ ఈశాన్యందిక్కుగా వెళితే నేనిక్కడ నేలమీద గీసిన మీరన్న శ్రీచక్రం అనే ఆ ప్లాన్‌తో వున్న స్ఫటికపు ఆలయశిఖరం వంటి గర్భాలయం — మీకు కనిపిస్తుంది.

దాని ఎత్తు కోణములు అతి పదునుగా చెక్కబడివుంది, ముక్కోణపు స్ఫటికపలకలు ఒకదానిపైన ఒకటిగా పేర్చి నిర్మాణం కాబడింది. దానిపైబడిన సూర్యకిరణాలు వెలిగితే ఏడురంగుల కాంతి చిమ్ముతూ కళ్ళు మిరుమిట్లుగొలిపి గుహలో చీకటిని పటాపంచలు చేస్తాయి! అప్పుడే మీకు శంబల-ప్రభుని కాలి అచ్చులు చెక్కిన శిలాఫలకం వద్దకు చేరుకోవచ్చు — మనకి కావలసిన నిగూఢమైన రహస్యములు ఎన్నో దానితోనే ముడిపడివున్నాయి!"

అంటూ చార్లెస్ బెల్ గిరుక్కున వెనక్కితిరిగి తన గుడారంలో! వెళ్ళి తెరవేసుకుని — నిద్రలోకి ఉపక్రమించారు వేరే చర్చలకు తావు లేకుండా!

అర్ధాంతరంగా అలా ముగిసిన ఆ చర్చ ఆశ్చర్యంగానూ, అద్భుతం గానూ విన్నవారు ఎవరి గుడారాలకు వారు చేరుకుని రాత్రి నిద్రకు ఉపక్రమించారు.

అప్పటికే చలికోసం వేసిన నెగడు ఆరిపోయి ఎర్రటి మందారపు రంగు నిప్పుకణికలు కణకణ ప్రజ్వలిస్తున్నాయి తెల్లవారుజాము కావస్తున్న సూచనగా!

◆

12

వేట-కుక్కలు !

అలా, నాలుగురోజులపాటు సాగిన మా పర్వతారోహణ కార్యక్రమంలో ఒక మజిలీ వేయాల్సివచ్చింది. అదెలా జరిగిందో తలుచుకుంటే ఆశ్చర్యంగా వుంటుంది.

మా సాహసయాత్రా బృందం దాదాపు వారంరోజులు కఠిన ప్రయాసలతో దిగుతూ ఎక్కుతూ 'గౌరీ-శంకర్' శిఖరానికి ఉత్తరంగావెళ్ళి పదివేల అడుగులు అగాధం వంటి లోయలోకి నిటారుగా దిగాల్సివచ్చింది! అప్పుడుగాని తెలియలేదు మాకు — ఎత్తైన పర్వతాన్ని ఎక్కడం ఎంత కష్టమో దాదాపు నిటారుగావున్న కొండచరియమీంచి కిందకి దిగుతూ పోవడం అంతకన్నా ఎక్కువ కష్టమని! పైనుంచి కిందకిచూస్తే ఒక అగాధంలాగా చుక్కలు కనిపించేటంత ఎత్తునుంచీ మాకు గిర్రున కళ్ళు తిరుగుతున్నాయి! అలా చూస్తూనించుంటే తూలి కిందపడబోయే పరిస్థితి

కూడా వస్తుంది. అందుకే మేము — ఆగకుండా కిందకి నడుస్తూ లోయలోకి ప్రయాణం సాగించాం! దీంట్లో ఇంకో ఇబ్బందికూడా మాకు ఎదురైంది, కిందకి దిగేప్పుడు! ఎవరో వెనుకనుంచీ మమ్మల్ని ముందుకి తోసేస్తున్నట్టుగా అప్రయత్నంగానే వేగాన్ని పుంజుకుంటోంది! క్రమంగా మనకే తెలియకుండా అలా అడుగులువేస్తూ దిగుతూపోతే చివరికి ఓ పరుగులాంటి నడకతో, పల్లంలోకి తోసేస్తున్నట్టుగా తూలుతూ ముందుకి ఆపుకోలేనంత వేగాన్ని పుంజుకుంటున్నాం! దీనికితోడు కాళ్ళక్రింద గత రాత్రి కొత్తగా కురిసిన మంచు బరువుకు దిమ్మిసా చేసినట్టు చదునుగా తళతళా మెరిసే నున్నటి గాజుటేబుల్‌లాగా — మరింత జారుడుగా వున్నది, కాలు జారడానికి ఎంతో అనువుగా! ఇది చాలదన్నట్టు — దీనికితోడు కిందనే నోరుతెరుచుకునివుంది అగాధంలా లోయ!! కాళ్ళు జారినవారిని కబళించడానికా అన్నట్టు ఇక్కడి షేర్పాలు కథలుగా చెపుతూ వుంటారు. నిజమో, ఊహాగానమో తెలియదుగాని ఇలాంటి అగాధాల లోనూ నిటారుగా పల్లంగా కిందకుదిగే లోయల్లో 'గాలిపిశాచాలూ', మబ్బులమీద సవారీచేసే భూతాలూ, కొండదెయ్యాల వంటివి కూడా సంచారం చేస్తుంటాయని మాలాగ పర్వతాలను దిగే ప్రయాణీకులలో వీలుగావున్నవారిని కబళించడానికి ఎదురుచూస్తూవుంటాయని!

ఇది విన్నది — కథలాగేవున్నా అనుభవిస్తూంటే మాత్రం నిజంలాగే వుంది — మమ్మల్ని ఎవరో కిందకి తోసేస్తున్నట్టుగా!! అడుగడుగునా మేం ఉక్కుకడ్డీలతో తూలి ముందుకుపడకుండా ఆపుకుంటూ గడ్డపారల్లాంటి మంచుగొడ్డలిని నేలలోగుచ్చి మావేగాన్ని అదుపుచేసుకుంటూ — అంగుళం అంగుళం ఆచితూచి అడుగువేయాల్సి వచ్చింది! ఇలా

నాలుగైదుగంటలు ప్రయాణించాలంటే అరికాలి మడమలనుంచీ మోకాలి వెనుక, తొడలకింద నరాలు బిగదీసుకొనిపోయి కాళ్ళలోని నరాలు కొంకర్లుతిరిగి కాలు మడతపడకుండా నిటారుగా బిర్రబిగుసుకొని చచ్చుబడిపోయినట్లుంది. దానికితోడు విపరీతమైన చలిగాలి విసురుగా కిందలోయలోంచి కుడివేపునుండి ఎడమదిక్కుగా వీస్తూ మమ్మల్ని పక్కకి తోసేసి లోయలోకి పడతోస్తుందా? అన్నంత భయంవేసింది.

ఈ కష్టాలు చాలదా అన్నట్టు ఎండ విపరీతమైన వేడితో మా వీపులపైన మండిస్తూ, చలికోసం వేసుకున్న దళసరి స్వెట్టర్లూ, చర్మాల వంటి కాన్వాస్ జర్కిన్లూ, స్వెట్టర్లూ వీపంతానూ దిగచెమటతో తడిసి పోయినాయి! అలానే నెత్తిన ఇనుపటోపీలు ఎండకి వేడెక్కి దోసెల పెనంలా కాలుతుంటే — గుండ్రంగా తలచుట్టూ చర్మంలో వాతలా పడింది!

అలాగే నట్టుకుంటూ, తడుముకుంటూ ఆరుగంటలు ప్రయాణించే సరికే మాలో ప్రతీఒక్కరికీ కొనవూపిరి వచ్చేసింది ఆయాసంతో. దానికి తోడు సాయంత్రం సూర్యాస్తమానం కావచ్చింది. కాస్సేపటిదాకా ఎండ మాడిపోయే తీవ్రతతో కాసిన వేడి ఉన్నట్టుండి — తెర తీసినట్టు విడిపోయింది — సూర్యుడు ఎత్తైన హిమాలయాల చాటుకి దాక్కుని కృంగిపోగానే! క్షణంలో నీలంగా కొండశిఖరాల కీనీడలు మాదారికి ఏటవాలుగా వ్యాపిస్తూ — లాంతరు చేతిలోపట్టుకొని నడిచేవాడి కాళ్ళ నీడలాగా కుడినుంచి ఎడమవైపు చక్రాకారంగా తిరుగుతూ ఒకగంటలో ఎదురుగుండా మేం దిగబోయే లోయమీదకు వ్యాపిస్తూంటే ముదురు నీలంరంగు ఛాయతో నిండిపోయింది; అలా చూస్తుండగానే వైలెట్‌లోకి,

ముదురు వంగపండురంగులోకి మారుతూ! ఎదురుగా హిమాలయ శిఖరాలు దూరాన బంగారుకాంతితో మిరుమిట్లుగొలిపిన సాయంత్రం సంధ్యవెలుగులో కరిగించిన బంగారంలా మెరిసిపోతున్నాయి. పక్కనే నీలం, ఆకుపచ్చ ఊదారంగులతో వాటి నీడలు ఆ లోయకు వెన కాతలగా, ముదురు నెమలిపింఛం రంగుతో ప్రతిబింబించాయి! అలా రాత్రికావస్తున్న నీలాకాశం క్షణక్షణానికీ రంగును మారుస్తూ చివరికి సిరారంగుతో ముదురునీలివర్ణంతో ప్రకాశించింది!

“ఆహా!! ఏమి! ఈ ప్రకృతి చిత్రకారుడి రంగుల కలయిక! చూసారా? ఆ బంగారు శిఖరాలు రంగురంగుల వెలుగు నీడలతో కన్నులు చెదిరే పంచరంగుల చిత్రంలా ఈ దృశ్యం” అంటూ చిత్రకారుడైన నికోలాస్ రోరిఖ్ రాతిశిల్పంలా నిలబడిపోయి ఆశ్చర్యంతో అందమైన ఆ దృశ్యాన్ని తన్మయత్వంతో చూస్తూ! అతడు సహజంగానే చిత్రకారుడు. క్షణంలో భగవంతుడు చిత్రించిన రంగురంగుల చిత్రాన్ని అలా ప్రతీ క్షణం రంగులుమార్చుకుంటూ ఒక నెమలి పురివిప్పి నాట్యం చేసినట్టు సమ్మోహనకరమైన అందంతో ప్రకృతి ఎటువంటి వారికీ హృదయాన్ని పులకింపజేస్తుంది. ఇక చిత్రకారుడి హృదయం గంతులువేసి నాట్యం చేయడంలో ఆశ్చర్యం ఏముంది?

“అయ్యా! మీరు చిత్రకారులు! రంగుల కలయికను ఎంతగానైనా మెచ్చుకోగలరు. కాని మేము విపరీతమైన చలినిమాత్రం ఇలా అకస్మాత్తుగా కిందనుంచీ కాళ్ళలోకి వ్యాపించే కాళ్ళతిమ్మిరిని మెచ్చుకోలేకపోతున్నాం! మీరు చెప్పిన దృశ్యాన్ని చూస్తూగనక ఇలాగే కూర్చుంటే

— మావంటివాళ్ళు దబ్బున తూలి తలక్రిందులుగా ఈ అగాధంలోకి తూలిపడడం ఖాయం!'' అన్నాడు సహజంగానే సుఖప్రాణుడైన వైష్ణవ బ్రాహ్మణుడు — శ్రీనివాసచక్రవర్తి బిక్కముఖంపెట్టి! ఆశ్చర్యంగా అందరం వెనక్కితిరిగి చూశాం! అందరికంటే వెనగ్గా నిలబడివున్నాడు — ఆ ప్రయాణంలో వెనకబడిన 'చక్రవర్తి!' అతను కష్టపడలేడు. ఏదో ఆసక్తి కొద్దీ మాబృందంలో చేరాడుగాని తేలిగ్గా ఇట్టే అలిసిపోతాడు. ఇంతలో మాలో ఇద్దరుమిత్రులు వెనక్కివెళ్ళి శ్రీనివాసచక్రవర్తినే జగదీశ్చంద్రబోస్‌ను, బెంగాలీ బ్రాహ్మణుడైన మేఘనాథ్‌సాహాను, కూడా సాయంగావుండి జతగా నిదానంగా ఆసరాఇస్తూ చివరికి ఎలాగోఅలాగ — కొండదింపి లోయలో నిలబడ్డాం!

మాఎదురుగా కుక్కలు భయంకరంగా అరుస్తూ మామీదకు దూసుకువచ్చాయి. అవి మామూలు ఊరకుక్కలవంటివి కావు! కొండలలో షేర్పాలు గొర్రెలమందను రక్షించుకోడానికి రాత్రిళ్ళు తోడేళ్ళ ప్రమాదాన్ని ఎదుర్కోడానికీ పెంచిన వేటకుక్కలు! వాటిని దేశీయభాషలో "రేచుకుక్కలు'' అంటారు! అలా మా మీదమీదకి ఎగురుతూ భయంకరంగా మొరుగుతున్న ఆ కుక్కల్ని చూస్తూ మేమంతా అలాగే నిలబడిపోయాం ముందుకీ వెనక్కీ అడుగులువేయకుండా! "ఇవి వేటకుక్కలు! ఎవ్వరూ కదలకండి! వాటి యజమానిని పిలుస్తాను"-అంటూ షేర్పాలతో బాగా పరిచయంవున్న నికోలాస్ రోరిఖ్ గబగబా ముందుకునడిచి 'షేర్పా'ల భాషలో పోట్లాడుతున్నట్టుగా గందరగోళంగా ఏదో మాట్లాడాడు! మా చెవులకు అది ఆ కుక్కల భయంకర గర్జనలాగే వినిపించింది, కాని ఫలితం — వెంటనే కనిపించింది! కొండజాతి షేర్పాగొర్రెలను తోలు

కుంటూ తనచేతిలోని ఎత్తైన కర్ర నేలకి తాకిస్తూ ఆ కుక్కలను చూస్తూ బూతులు తిట్టసాగాడు. అవి మరుక్షణమే ప్రశాంతంగా చెవులువాల్చి తోకలాడిస్తూ మాచేతులూ కాళ్ళూ నాకటం మొదలుపెట్టాయి. కాని, అవి ఎంత ప్రేమ చూపించినాసరే అందరికీ కడుపులో బెదురుగానే వుంది. లేనిధైర్యం నటిస్తూ వాటి పలకరింతకు ఎటూ స్పందించకుండా వెడల్పుగా నవ్వుతూన్నట్టుగా ఇబ్బందిగా ముఖంపెట్టి నవ్వుతున్నట్టు నిలుచున్నాం. ఇలా సాహసయాత్రీకులం అంతా లోయ దిగువభాగానికి చేరుకున్నాం ఆ సాయంత్రానికల్లా!

◆

13

వెళ్లాల్సిన-మార్గమేది ?

మేము చేరుకున్నది ఒక "లద్దాకీ"ల గ్రామం! కాని అందులో నేపాలీలూ, "భూటాన్"వాసులూ, సిక్కిమ్‌వారూ నివాసం ఉంటున్నారు! అందులో ఎక్కువమంది బౌద్ధమతస్థులే! గ్రామంలోకి ప్రవేశించే ఓ రచ్చబండవంటి ఎత్తైన అరుగుమీద ఒక విచిత్రమైన 'మత-చిహ్నం' వంటి గుర్తుచూశాం. అది ఎవరో చిత్రకారుడు తయారుచేసిన నమూనా లాగా — అడుగున నలుపలకల అరుగూ, దానిపైన గుండ్రటి గోళాకారమూ దానిమీద అర్థచంద్రాకారంగుర్తూ! దానిమధ్యలో ఓ గుండ్రని చంద్రబింబంవంటి చిహ్నం వేసివున్నాయి. దానివంకే తేరిపారచూస్తున్న మా మిత్రబృందాన్ని చూస్తూ 'లామా' మహాశయుడు అడిగాడు మమ్మల్ని —

"ఏమిటల్లా చూస్తున్నారు? వింతగా! దీనినెప్పుడూ చూడలేదా?

ఇది ఇక్కడ ఈ హిమాలయపర్వతాలలో తరచూ కనిపించే "ఖర్టన్" అనే దైవచిహ్నము. ఇది ఈ సమస్త సృష్టికీ ఆధారభూతమైన పంచ తత్వాలను సూచించేదీ ఆధ్యాత్మికచిహ్నము" — అన్నాడు. ఆతర్వాత దానిగురించి ఇంకా ఇలా వివరించాడు.

"ఈ గుర్తుకు అడుగున అరుగులాగా చతుష్కోణాకారంగా వున్న ఇటుకవంటి 'వేదిక', పంచభూతాలలోకీ స్థూలమైన 'భూమి-తత్వా'నికి గుర్తు! అర్ధచంద్రాకారంగా వుండే చంద్రవంకవంటి చిహ్నాం, జలతత్వానికి గుర్తు! పొడుగ్గా రింగురింగులుగా ఒక మరమేకులావున్నది — అగ్నితత్వానికి గుర్తు! పైభాగంలో గోళాకారంగా తాజ్‌మహల్ శిఖరంలా బోర్లించిన గుమ్మటంలా వున్నది — 'ఆకాశ-తత్వా'నికి గుర్తు. ఈ 'ఖార్టన్'లు ఈసృష్టికి చిహ్నాలుగా హిమాలయాలలో అనేకచోట్ల మీకు కనబడతాయి" అన్నాడు 'లామా'.

"దీనికింద ఇక్కడ ఏదో శాసనంవంటి, టిబెటన్ భాషలో రాసివున్నది ఏమిటీ దానిఅర్థం?" అంటూ ప్రశ్నించాడు నికోలాస్ రోరిఖ్.

"అది రానున్న అవతారబుద్ధుడి గురించిన మూలమంత్రం! దీనిని సంస్కృతంలో ఉచ్చరించాలంటే

"ఓం మణి పద్మ హుంమ్"

అన్న పరమపవిత్రమైన టిబెటన్ బౌద్ధమూలమంత్రం ఈ "ఖార్టన్" గుర్తూ ఈ మంత్రమూ తరచూ ఈ హిమాలయాలలో అనేకచోట్ల కనిపిస్తాయి మనకి.

“ఇవి అన్నిగ్రామాలలో లేవే? మనం మిగతా వారంరోజులలోనూ దాటివచ్చిన అనేక గ్రామాలలో వీటిని చూడలేదు! ఏవో నిర్ణీతమైన కేంద్రంవంటి పర్వతశిఖరాల మధ్యనే వీటిని స్థాపించారు. దీనికి ఏమైనా అర్థంవున్నదా?” అన్నాడు చార్లెస్ బెల్ అనుమానంగాచూస్తూ ఆరిపోయిన తన పైపును మళ్ళీ వెలిగిస్తూ!

సమాధానం కోసం లామా క్షణకాలం మౌనంవహించి అంతా జాగ్రత్తగా గమనిస్తున్నట్టు తన చుట్టూచూస్తూ అన్నాడు. “ఇది ఒక దేవరహస్యం! హిమాలయపర్వతాలలోని కొండచరియలు అన్నీ తిరిగి చూసినవారికి దేశపటం మ్యాప్‌మీద వీటిని ఎక్కడెక్కడ దర్శిస్తామో గుర్తులుపెట్టుకుంటూపోతే — అవన్నీ కలిసి ఒక “దారి”గా ఏర్పడి ఒక నిర్ణయమైన దిక్కుగా చీమలబారులాగా పోతూ కనిపిస్తాయి.

“ఎందుకిలా? ఇవన్నీ కలిపితే ఏర్పడే దారివెంట ఈ గుర్తులను కలుపుకుంటూపోతే — ఎక్కడికి చేరుకుంటాం?” అందరం కలిసి ప్రశ్నించాం ఆసక్తిగా.

“దీన్ని ఖచ్చితంగా ఎవరూ ఇదమిద్ధంగా తేల్చిచెప్పలేం! అలాంటి ప్రయత్నంకూడా ఇంతవరకూ ఎవరూ చేసివుండరు.”

“అలాగని అనిపించడంలేదు ‘లామా’ మహాశయా! ఇక్కడ చాలా కాలంనుంచీ తరతరాలుగా జీవిస్తున్నవాళ్ళకి వీటి ‘రహస్యాలు’ — తెలీకుండా వుండవు! కాని ఈ రహస్యాలుగుట్టు విప్పిచెప్పడానికి ఎవ్వరికీ ఇష్ట ముండదు — కారణం ఏదో నిగూఢమైన దేవరహస్యం వీటివెనుక ముడిపడివున్నదని నా గట్టి అనుమానం!” — అంటూ అనుమానంగా

ఆ గ్రామంలోని గుర్తులవంకా, మాకు మార్గదర్శకుడుగా వస్తున్న 'లామా' వంకా మార్చిమార్చి చూస్తూ అడిగాడు చార్లెస్ బెల్ అనుమానంగా! చివరికి అలెగ్జాండర్ రొటోవిచ్ ఇలాఅన్నాడు —

"నేను రష్యానుండి రాయబారిగా భూటాన్‌కు, సిక్కింకు, రధాక్‌కూ ప్రయాణించాను చాలాసార్లు. అనేకచోట్ల ఇలాంటి ఆధ్యాత్మికచిహ్నామైన గుర్తులు "స్థూపాల"వంటివి ఇంకాపెద్దవి కట్టబడివున్నాయి గమనించాను! కాని అన్నిచోట్లా ఇలాలేవు. ముసలి బౌద్ధభిక్షువులను, లామాలను ప్రశ్నించాను! కాని అందరూ ఇలానే సరైన సమాధానం చెప్పడానికి ఇష్టపడరు. బహుశా దీని అంతటివెనుకా ఏదో నిగూఢమైన రహస్యం వుండివుండాలి. అంతేకాదు అదేదో మతసంబంధమైన ఆధ్యాత్మిక రహస్యమో లేక దేవరహస్యమో అదీకాకపోతే ఏదైనా భవిష్యత్తులో జరగబోయే రానున్నకాలంలోని భవిష్యాల జోస్యాలకు సంబంధించిన దేవరహస్యమైనా అయివుండాలి" అన్నాడు. అప్పుడు బైటపడ్డాడు 'లామా' మహాశయుడు.

"ఇంతవరకూ మీరే గ్రహించారుగనుక నాకు తెలిసింది చెపుతాను. ఇలాంటి "గుర్తులు" మూడేసి గ్రామాలకు ఒక్కచోట నాలుగుబజార్లు కలిసేచోట ఒక దేవతావిగ్రహమూ ప్రతిష్ఠించబడివున్నాయి! అదేమిటని అడిగితే అది "రానున్న-మైత్రేయబుద్ధుడి" విగ్రహమని చెపుతారు. ఆయన భవిష్యత్తులో అవతరించబోయే "జ్ఞానబుద్ధుడు!" అని. ఈ కలియుగాంతానికి ఆయన అవతరిస్తాడని ఇక్కడ మంచుకొండలమీద ఎంతకాలం నుంచో ప్రజలు నమ్మే గాఢమైన విశ్వాసం."

"కాని నాకో సందేహం కలుగుతోంది" అనుమానంగా ప్రశ్నిస్తూ 'చార్లెస్ బెల్' అందుకున్నాడు.

"మీరు చెప్పినట్టు ఇవన్నీ భవిష్యత్తులో రాబోయే బుద్ధదేవుని అవతారమైన "మైత్రేయబుద్ధుడి" విగ్రహాలనుకుంటే — ఈ విగ్రహాలకు ఇలా నాలుగుచేతులు కనిపిస్తాయిగదా! నాలుగుచేతులూ, సామాన్యంగా విష్ణుమూర్తి అవతారాలకే వుంటాయి. ఇవన్నీ కలిపి ఆలోచించగా ఈ విగ్రహాలు — ఈ "కలియుగాంతా"నికి అవతరించే విష్ణుభగవానుని దశావతారాలలో ఆఖరిదైన "కల్కిభగవాను"ని — అంటే "శంబల ప్రభువు" విగ్రహాలై వుండాలి".

"నిజంగా చెప్పండి! లామామహాశయా! ఏదీ దాచకుండా!" అంటూ హిమాలయాలలో "కులూ-లోయను" తన మకాముగా చేసుకుని నివసిస్తున్న "రోరిఖ్ఛ్" మహాశయుడు ప్రశ్నించాడు సాలోచనగా!

"మీరు చెప్పిన కారణాలనుబట్టి చూస్తే నిజమేననిపిస్తోంది! ఎందుకంటే ఇక్కడ ఈ మంచుకొండలలో నివసించే ప్రజలు 'శంబలప్రభువు' భవిష్యత్తులో అవతరిస్తాడనీ, తమ కష్టాలను తీరుస్తాడని నమ్ముతారు. నమ్మటంమాత్రమే కాదు — పొరుగూరువెళ్ళిన తమ బంధువు ఇంటికి తిరిగివస్తాడన్నంత భరోసాతో — అంతటి ధైర్యంతోవున్నారు ఈ శంబల ప్రభువు భూమికి తిరిగివస్తాడనీ, ఆయన అవతరించగానే ప్రపంచంలోని మతాలన్నీ కలిసిపోయి ఒకేఒక్క మతంగా "మహాసత్యం" మాత్రమే మిగులుతుందని పూర్వకాలం ఋషుల భవిష్యాలలో రాసివుందట!"

అలా మాట్లాడుతూనే నడుస్తూ ఆ గ్రామం నడిబొడ్డునవున్న ఒక

బౌద్ధదేవాలయం ముందుకు చేరుకున్నాం.

ఎత్తైన గోపురంలాంటి శిఖరంతో బోర్లించిన ఓపెద్ద గంటవంటి ముఖద్వారం చూస్తే అది ఒక బౌద్ధదేవాలయం! వాకిట్లో ఆ మహాద్వారానికి రెండువేపులా ముష్టివాళ్ళూ, అడుక్కునే భిక్షకులూ కూర్చునివున్నారు. దేవాలయంముందు వీధికి రెండువేపులా రకరకాల వస్తువులుఅమ్మే దుకాణాలు బారులుతీర్చి రెండువరుసలలోనూ వున్నాయి. అందులో జపమాలలూ, గంటలు, టిబెటన్ దీపారాధన ప్రమిదలు, శంఖములు, స్పటికములూ అమ్మే దుకాణాలు. వాటిమధ్యనే మరుగుతున్న బాయిలర్ వంటి పాత్రలో, వేడి "టీ"-కలుపుతున్న "టీ షాపులు" కూడావున్నాయి. వీధిలో టిబెటన్ స్త్రీలు చేతిలో జపంచేస్తూ ఫకీర్లుతిప్పే ఇరుసువంటి ప్రార్థనాయంత్రం తిప్పుతూ పట్టుకువెళుతున్నారు. మరికొందరు చేతిలో జపమాలను వేగంగా తిప్పుకుంటూ మౌనంగా నడుస్తున్నారు. అది ఒక ప్రాచీన బౌద్ధదేవాలయమని తెలిసింది. దాని ఆకారమూ కట్టే శిల్పం తీరూ, ఆవరణలోని కట్టడాల వాస్తూ చూస్తే అది "టిబెటన్-హిందూ" నేపాలీ దేవాలయాల కలగలుపు వాస్తును పోలివున్నది! అప్పటికే బాగా సాయంకాలం పొద్దువాలిపోయింది. చీకటికూడా చిక్కబడుతున్నది నీలంగా! వీధుల్లో చల్లటి చలిగాలి వీస్తున్నది. ఆలయంలో ఎక్కడైనా రాత్రి గడపడానికి ఆతిథ్యం లభిస్తుందేమో అనుకుంటూ లామా మహాశయుడి సాయంతో గుడిలోని పూజారులను కలిసాం! వాళ్ళు మేము చాలాదూరం నుంచి ప్రయాణం చేసివస్తున్న యాత్రీకులమని గమనించి — ఆరాత్రికి బస. మాకు భోజన సదుపాయమూ చేయడానికి సంతోషంగా అంగీకరించారు. సామాన్యంగా హిమాలయపర్వతాలలో ఎంత బీదవాళ్ళైనా

అతిధులువస్తే ఎంతో గౌరవంతో ఆహ్వానిస్తారు. తమకు కలిగినదాంట్లోనే తృప్తిగా భోజనంపెట్టి వెచ్చగా చలికాచుకునే పొయ్యితోపాటు దళసరి "రజాయి" రాత్రికి బస, భోజనము తప్పక లభిస్తుంది — వీరి ఆతిధ్యంలో! అలాగే మాకూ అట్టే ప్రయత్నం లేకుండానే ఆరాత్రికి బస, భోజనవసతి చలిమంటకు — అడవుల్లో కొట్టితెచ్చిన దుంగలూ లభించాయి! అప్పటికే బాగా అలసిపోయిన మాకు ఆతిధ్యంతో ప్రాణాలు లేచివొచ్చినట్టయి అందరం మా సామానులు అన్నీ అక్కడే గదులలో సర్దిపెట్టుకొని రాత్రికి బసచేయడానికి సిద్ధపడుతున్నాం సందడిగా!

ఎవరికివారు బడలికతో అలసిపోయిన మా శరీరాలని విశ్రాంతి కోసం జార్లాపడి హాయిమంటూ అన్నీమరచిపోయాం. ఆతరువాత ఒకటి రెండు గంటలలో మాకు వంటలు పూర్తికావచ్చినాయి. మమ్మల్ని భోజనానికి సిద్ధంకమ్మని పిలుపూ వచ్చింది!

పనివాడు తెచ్చిన ఉడుకునీళ్ళతో చేతులూ ముఖం కడుక్కుని వేడినీళ్ళతో నోరు పుక్కిలించి దుమ్ముకొట్టుకున్న బూట్లను విడిచి టిబెటన్ గృహస్థులు ఇండ్లలో ధరించే చెప్పులవంటివి కాళ్ళకు వేసుకుని అందరం భోజనానికి సిద్ధమయ్యాం! మాఅందరి అలసటనూ ఆకలిగా వుండటాన్నీ గమనించి వంటలు త్వరగా పూర్తిచేసి వేడివేడిగా వడ్డన సిద్ధంచేసి భోజనాలకు లెమ్మని పిలిచారు.

అదేమీ బ్రహ్మాండమైన విందుభోజనం కాదుగాని అలిసిపోయిన మాకు కడుపులో ఆకలి దంచేస్తున్నందున కడుపునిండా వేడిగా పుష్టినిచ్చే ఆహారం తిన్నంత పుష్కలంగా వడ్డించారు సంతోషంగా! భోజనాలలో

వంటకాలతోపాటు ఇక్కడ ప్రత్యేకంగా మాకు కొండలలో లభించే బాదమ్, అక్రూట్, పిస్తా వంటి డ్రైఫ్రూట్స్ పెద్దచెక్క ఢేక్సాలలో తెచ్చి మాముందుపెట్టారు. క్షణాలమీద ఖాళీచేసాం! ఆతరువాత యాపిల్‌పండు, "ఏప్రికాట్లూ" కమలాపండ్లరసం తేనెతో కలిపి వెచ్చగా తాగడానికిచ్చారు. దీనితో అలసట పటాపంచలైంది.

అలా ఓగంటసేపటిలో అందరం భోజనాలు ముగించుకున్నాం! వేడివేడి టిబెటన్ టీతాగుతూ మా పడకలవద్ద చేరుకున్నాం విశ్రాంతి కోసం.

ఉదయమే 'గం గం!' అని పెద్ద ప్రతిధ్వనితో ఆలయంలోని గంట మోగితే మెలుకువవచ్చింది. వెంటనే మా ప్రయాణాలకు అందరం ముందుగా సిద్ధంకావడం మొదలుపెట్టాం! హాలుమధ్యలో ఒకవెడల్పాటి టేబుల్‌మీద మేము ప్రయాణంచేసే కొండల-లోయల-చిత్రపటం-ప్లాను తెరచి దారిలో మేం దాటివచ్చిన బౌద్ధాలయాలు, విగ్రహాలు "ఖార్టెన్"ల వంటి గుర్తులు కనిపించిన గ్రామాలన్నీ ఈ దేశ చిత్రపటంలో గమనిస్తూ గుర్తువేస్తూ చర్చ చురుగ్గా సాగుతున్నది.

"మనం నడచివచ్చిన హిమాలయపర్వతాల దిక్కులనుచూపే పటం ఇది! ఇదిగో!! ఇది మనం దాటి నడచివచ్చిన పర్వతాలలోని కొండదారి ఇక్కడ మనం విగ్రహాలు "ఖార్టెన్" గుర్తులూ చూసాం. ఇలా ఇంకా దిగువకువెళితే 'డార్జిలింగ్'కు పోయేదారి వస్తుంది! అక్కడినుండి ఇలా కుడివేపుకు మళ్ళితే మాండూ రాజభవనం చేరుకుంటాం. అక్కడినుంచి ఇదిగో! ఈ కనిపించే "ఘాట్‌రోడ్"లో చియ్యాస్ నదివెంబడే ఇలా

మనం ప్రయాణించివచ్చాం! ఇదిగో ఇది "పఠాన్-కోట్" అంటే మేం ఇంతవరకూ నడిచివచ్చినదారిని చూపిస్తూ అందరికీ తెలిసినా — మళ్లీ అంతా లామామహాశయుడితో చర్చించుకుంటున్నాం. మేం సరైన మార్గం లోనే వెళుతున్నామా లేదా? అని.

"ఇంతవరకూ మనం నడిచివచ్చినదంతా బాగానేవున్నది — ఇక వెళ్ళాల్సిన మార్గమేది? అదే తేలాలి! అన్నాడు నికోలాస్ రోరిఖ్ — మ్యాప్‌ను పరిశీలనగా చూస్తూ!

"మిత్రులారా! హిమాలయాలలోని శిఖరాలు, లోయలు, బౌద్ధ దేవాలయాలు చూపించే ఈ చిత్రపటం బ్రిటీషువారు తయారుచేసిన ప్రభుత్వపటమా లేక ప్రాచీన టిబెటన్ భూటానీ వర్తకులు ప్రయాణించే "బండ్ల-దారు"లను చూపించే పురాతన చిత్రపటమా? అంటూ అందరిలో చర్చ మొదలైంది.

"ఇందులో హిమాలయాలలోని రహస్యస్థావరాలు ఆధ్యాత్మిక కేంద్రాలు, గుహలు, లామాసరీలు గుర్తించబడివున్నాయా? లేదా చూడండి!" అలా అన్నివివరాలు గనకవుంటే — ఇది మనం ప్రయాణించాల్సిన గమ్యంగురించి వివరాలతో సహాయపడుతుంది. లేదంటే ఇందులో మనకి తెలిసినవే వుంటాయి. తెలియనివేవీ వుండవంతే! ఇది మనకేసాయం అందించదు! అనుకుంటూ అందులో గుర్తించిన రహస్య స్థావరాలు గురించిన చర్చ మొదలైంది.

"ఇదిగో ఇవన్నీ మనం దాటివచ్చిన పర్వతశిఖరాలు. ఇదిగో దిగువకు వెళితే మనం దాటివచ్చిన "కైలాస"-పర్వతం! దానిప్రక్కనే —

ఇదే, మానససరోవరం! ఇదిగో గౌరీకుండం. ఇదిగో ఈమధ్యగా ముక్కోణాకారంలో గుర్తించినదే "ఎవరెస్ట్"-శిఖరం! దానిచుట్టూ వంకర టింకరగా గుర్తులుగా కనిపించేదే కొండలలో ప్రయాణించే "రహస్య-మార్గం"! ఈమార్గంలో ఏవేవి కనిపిస్తాయో వివరాలు జాగ్రత్తగా చిత్రాన్ని పెద్దగా చేసిచూపించే భూతద్దంలో చూడాలనుకుంటా! ఎవరికివాళ్ళు ఆ టేబుల్ అంతా పరుచుకున్న కాన్వాస్‌గుడ్డపై గీసిన హిమాలయ పాదపీఠంలోని దారులూ, కొండలూ చూపే పెద్దచిత్రం ఒకటి చూపుడువేలుతో పటంలోని దారిని గుర్తిస్తూ — చార్లెస్ బెల్

"ఇదిగో! మనమిప్పుడు ఇక్కడేవున్నాం" అంటూ మేంవున్న బౌద్ధ దేవాలయం నిలబడివున్నచోటును చిత్రంలో చూపించారు అందరికీ. చాలామందికి అప్పటిదాకా మనస్సులో పీకుతున్న సందేహంపోయి మనం సరైనమార్గంలో ప్రయాణిస్తున్నామన్న ధైర్యం కలిగింది.

"ఇహ మనం వెళ్ళాల్సిన మార్గం మనం అనుసరించాల్సిన దారీ — మనం ఏదిక్కుగా వెళతామో ఎలావెళితే దగ్గరదారి వస్తుందో — ఎటునుంచిపోతే కొండలు ఎక్కటంలో సులభంగా శ్రమలేని దారికోసం" వెతుకుతూ చర్చించసాగాము ఆసక్తిగా వేడిగా!

◆

"కైలాస" - శిఖరం నీరెండ-బంగారు తళుకులంతా!

14

కైలాస-పర్వతం ! - కైవల్య పర్వతం !!

"అదుగో! అదే కైలాసపర్వత శిఖరం! దీన్నే **మౌంట్ కైలాస్** పర్వతం అంటారు — ఇంగ్లీషువారి భాషలో! ఇది హిందువులకు అతిపవిత్ర దేవతా స్థలము! దానిమీదే పురాణాలలో వర్ణించబడిన వెండికొండమీద కైలాస పర్వతశిఖరంపై శివపరమాత్ముడు కొలువుతీర్చి శాశ్వతనివాసంగా వుంటాడు — దీని చుట్టూరా ప్రదక్షిణం చేసినవారికి — ఇదే ఆఖరు జన్మట! మళ్ళీ ఇంకో జన్మ ఎత్తక్కరలేదు!"

కైలాస శిఖరానికి వెళ్ళే లోయలో ఎత్తుగా ఆకుపచ్చటి పచ్చల ఉంగరంలాగా మెరుస్తూ వుండే నీళ్ళతో నిర్మలంగా అడుగున నేల కనిపించే కోనేరువంటి చెరువు మనకి కనిపిస్తోందే! అదే గౌరికుండం!

లోకమాత అయిన పార్వతి హిమవంతుడి పుత్రికగా జన్మించి — ఈ గౌరీకుండంలోనే రోజూ స్నానంచేసి శివుని భర్తగాకోరి పూజించింది!!" అంటూ చెప్పాడు షేర్పాలబృందంలోని కులపెద్ద!

ఇంతలోకే ఒకడు — బానపొట్ట, మిడిగుడ్లువున్నవాడు తూగుతూ! ఆ సాహసయాత్రికుల బృందంలోంచి ఒకడు వెటకారంగా నవ్వాడు — భళ్ళుమని పగలబడి! దాంతో అందరూ తుళ్ళిపడి అతనివంకే చూశారు — వెనక్కితిరిగి! అతడి చేతిలో పొడుగాటి సారాగ్లాసునిండా మద్యంపోసి త్రాగి తూగుతూవున్నాడు. గుప్పున కల్లువాసన అతని చెమటకంపుతో కలసి దుర్గంధంగా వ్యాపిస్తూ అందరినీ అసహ్యంగా ఏవగింపుకు గురి చేసింది.

"ఎందుకు మీరు అలాగుడ్డిగా నవ్వారు? — కైలాసపర్వతం గురించీ గౌరీకుండం గురించి ఆయన చెపుతుంటే మీకు నవ్వెలా వచ్చింది?"

అంటూ ఒక్కసారే ఐదారుగురు అతడిని చుట్టుముట్టి రోషంతో ప్రశ్నించారు! అతడు మళ్ళీ పగలబడినవ్వి ఇంకొంచెం సారాయి తాగి తాపీగా సమాధానం చెప్పాడు.

"మీ హిందువులు మనుష్యులకే కాకుండా రాళ్ళకీ రప్పలకీ కూడా స్త్రీపురుషబేధాలు అంటగట్టి చెపుతారు! మీరు కైలాసపర్వతం అని పిలిచేది ఒట్టి రాయిగుట్ట — అన్ని కొండలవంటిదే కదా! అదేమో శివుడా? గుండ్రంగావుంది కాబట్టి అది శివలింగాకారం అంటారా? దానిని పురుషాకారంగా భావించి పూజిస్తారా? వాహ్వా! ఇది చాలదన్నట్టు



"గౌరీ"-కుండం శివపరమాత్మునికై తపస్సుచేసి 'పార్వతిగా' శివుని చేరుకున్న -
తపస్సుకు ముందు స్నానం చేసిన గౌరీదేవి సరస్సు!

దాని ఎదురుగావున్న ఈ కోనేరు — ఈ ఆకుపచ్చటి నీళ్ళతో నిండిన పసరుగుంట స్త్రీరూపమా? పైగా అది గౌరీకుండమట!

ఈ చెరువేమో స్త్రీలింగమా? ఆహా! ఏమి మతమండీ మీది? రాళ్ళనూ, రప్పలనూ పూజించే కాఫిర్లు అని మిమ్మల్ని ఎందుకు అంటారో నాకిప్పుడు బోధపడింది" అరిచి చెప్పాడు.

ఇంతలో పదిమంది షేర్పాలు చుట్టూరాచేరి — "ఇందులో మీరు నవ్వేందుకు ఏముంది? మీకు నమ్మకం లేకపోతే లేకపోవచ్చు! కాని దీంట్లో... అసహజత ఏముంది?" — అన్నాడు, గులాబ్‌సింగ్ అనే ఒక పంజాబీ హిందువుడు పొడుగాటి గడ్డము, మీసము, భుజాలమీదికి వేలాడే జుట్టు, కళ్ళు ఎర్రగా కోపంతో ఎర్రబడివున్నాయి.

"వింతకాదా మరి! రాళ్ళల్లో స్త్రీపురుష బేధం ఏమిటి? ఒకే కొండలో ఎత్తుగావుంటే శివలింగమా? అదేకొండ లోతుగా గుంట ఏర్పడితే అది దేవీస్వరూపమా — ఒకటి లింగము, ఇంకొకటి పానవట్టమా? ఈరెండూ కలిస్తే శివలింగమా? ఏమి హేతువాదమండీ ఇది!"

వెంటనే కైలాసపర్వతాన్ని పూజ్యభావంతో చూసే పెద్దాయన కత్తి దూసి ముందుకువచ్చాడు ఆ నిరసన, వెటకారం భరించలేక — "మీకు చెట్లలోను, పూవులలోను స్త్రీపురుష బేధం వున్నదని వృక్షశాస్త్రం, బాటనీ సహితం అంగీకరించలేదా? ఇదీ అంతే!

ఒక మందారపూవు చూడండి! లేదా గుమ్మడిపూవు చూడండి. దాని చుట్టూరా వుండే కేసరాలు పురుషబీజానికి అవయవాలుగా ఏర్పడ్డవి.

మధ్యన బొడ్డుగా వుండేది అండా శయము లేక ఓవరీ — ఆ పువ్వుకు గర్భాశయం వంటి స్త్రీలింగ చిహ్నంగాదా? ఇలా ఒకే పువ్వులో చుట్టూరా పురుషాకారంగానూ మధ్యన లోతుగా వుండే బొడ్డులో అండాశయం, మాతృత్వం చిహ్నంగాలేదూ! పువ్వంతా ఒకటేకదా! పర్వతాలలోనూ అంతే! అదే విషయం మా ఋషీశ్వరులు కైలాసపర్వతం విషయంలోనూ దర్శించారు ఒక మహాసత్యాన్ని!"

ఐనా దాంతో ఆ చర్చను విడిచిపెట్టలేదు ఆ తాగుబోతువాడు!

"మా మతంలో అల్లా స్త్రీపురుష బేధంలేనివాడు. ఒక ఆకారం లేనివాడు. ఆకాశంలాగా, కాలంలాగా సర్వత్రా వ్యాపించివుండే విశ్వవ్యాపకుడు అల్లా — భగవంతుడు! ఆయనకు స్త్రీ అవయవాలుగానీ, పురుష అవయవాలు గానీ ఎలా ఏర్పడతాయి? మీ మతం దీనిని గురించి ఎలా సమాధానం చెపుతుంది?

"మీ మతంలో అల్లాకు ఆకారంలేదు సరే! మీమతంలోని మనుషుల్లో స్త్రీ, పురుషులు వేర్వేరుగా లేరా? ఒక పనికోసం మానవుడు యంత్రాలలో ఒక పనిముట్టును తయారుచేస్తున్నాడు, ఈనాడు మిషినరీ అన్నపేరుతో! పనియొక్క అవసరాన్నిబట్టి పనిముట్టు ఆకారం దాని నిర్మాణంలోని రసాయనాలు మార్చుకుంటూ రకరకాల యంత్రాలను మార్చుకుంటున్నాడా? లేదా? ఇనుము ఒక్కటే! దానితో రకరకాల నిర్మాణం చేస్తున్నాడుగదా! అలానే భగవంతుడు ఒక్కడే — ఒప్పుకుంటాను!

మా హిందూమతంలో కూడా పరమాత్ముడు స్త్రీపురుష బేధాలకు

అతీతుడు, నిర్గుణ స్వరూపుడు. అయినప్పటికీ సృష్టి నడవడం నిమిత్తం పువ్వులు, కాయలు, జంతువులలో స్త్రీలనీ, పురుషజంతువులనీ సృష్టించలేదా? ఆత్మ ప్రాణం, జీవం రెండింటికీ ఒకటేఅయినా సృష్టి నడిచే అవసరంకోసం వేర్వేరు ఆకారాలతో అవయవాలను స్త్రీపురుష లింగాలుగా నిర్మించలేదా? శిలలో అయినా పర్వతంలోఅయినా వృక్ష, జంతు, పశు పక్ష్యాదులలో ఐనా, — ఇదే సూత్రం సృష్టిఅంతటా వున్నదని గ్రహించారు, వేదంలోని ఋషీశ్వరులు!!

ఏకరూపుడైన భగవానుని గురించి రెండురకాల స్త్రీపురుష అవయవాల నిర్మాణం ఎలా జరిగింది? మీరు కాలం ఒక్కటే అన్నారుకదా — రాత్రి చీకటిగానూ, పగలు వెలుతురుగానూ వేర్వేరుగా ఏర్పడ్డట్టే మీ బైబిలులోనూ, ఖురానులోనూ కూడా రాత్రికి చంద్రుడు, పగలుకి సూర్యుడు అంటూ ఆదమ్‌ని పురుషుడుగానూ, హవ్వాని స్త్రీగానూ, ఆదిమను మాతృకగా సృష్టించలేదా?" — అన్నాడు!

దానితో అతడు సంతృప్తిపడక "దీనికి ప్రత్యక్షంగా ఋజువు కావాలి!" అన్నాడు తూలుతూ!

ఇదంతా దూరంగా కూర్చుని చూస్తూ, మంచుమైదానంమీద నిశ్చలంగా ధ్యానం చేసుకుంటున్న ఓ టిబెట్‌యోగి లామా వింటున్నాడు. ఆయన కళ్ళుతెరిచి చిరునవ్వు నవ్వి తనచేతితోనే వాదులాడుకుంటున్న ఆ ఇద్దరినీ సంజ్ఞచేసి పిలిచాడు.

ఆశ్చర్యపోతూ ఇద్దరూ ఆయనను సమీపించారు — "ఏం చెపుతాడా? ఎలా చెపుతాడా?" — అని! ఎందుకంటే ఆయన పన్నెండేళ్ళ

నుంచి మౌనవ్రతం — అంటే మాట్లాడడు!! మరి వీళ్ళ వాదనను విన్నాడే రమ్మని సైగచేసాడే? సమాధానం ఏంచెపుతాడు? ఎలా చెపుతాడు?" అని విస్తుపోతున్న వారిద్దరినీ పిలిచి చేతిగుర్తుతోనే ఒక కాగితం ఇమ్మన్నాడు. బహుశా ఏదో బొమ్మగీసి చూపిస్తాడేమో అనుకొని జేబులు వెతుక్కుని ఒక తెల్లకాగితం యిచ్చారు. దానిని ఆయన అడ్డంగా, నిలువుగా మధ్యకు దాన్ని మడచి, వీళ్ళు చూస్తుండగానే అంచులు పైకి మడచిపెట్టి, ఒక కాగితపు పడవ తయారుచేసాడు! దాన్ని తన మూడువేళ్ళతో పైకెత్తి చూపించాడు.

"అయ్యో! కాగితపు పడవ చేశాడు! ఇదేమిటి? ఇక్కడ నీళ్ళులేవు కదా! ఈ పడవ ఎందుకు చేశాడు?" అనగానే ఆయన పడవను అరచేతిలో నిలబెట్టి కుడిచేతి చూపుడువేలుతో పడవ మధ్యన ఎత్తుగా వున్న కోసులాంటి కోణం వేలుతో చూపించాడు. దానినే కలిపి కైలాస పర్వతం వంక చూపి 'ఇది పురుషచిహ్నం' అన్నట్టు సైగచేశాడు.

ఆశ్చర్యంనుంచి వీళ్ళు తేరుకొనేలోగా పడవను చటుక్కున తలక్రిందులు చేసి పడవ అడుగునవున్న మడతలోని లోతైన పల్లం చూపిస్తూ చూపుడువేలితో మధ్యవేలుతో దాన్ని పాయలుగా విడతీసాడు, ఒక చేప ఆకారంలాగా! మరుక్షణమే గౌరీకుండంవైపు చూపించి ఇదే స్త్రీరూపం అన్నట్టుగా పడవను పైకి, క్రిందికీ చూపిస్తూ — ఒకేపడవ ఇటువైపు స్త్రీరూపం, అటువైపు పురుషాకారం — అంటూ మాటలేకుండా తెలియజెప్పి తటాలున పడవ మడతలు విప్పి — తెల్లకాగితం సాపుచేసి చేతిని గుండ్రంగా చక్రంలా తిప్పుతూ ఆకాశంవైపు చూపించాడు.

నిరాకారం నిర్గుణమైన అనంతరూపం నిర్గుణం భగవంతుడని — మౌనం గానే తెలిపాడు.

ఆశ్చర్యం! ఒక్క కాగితపు పడవ ఉదాహరణతో స్త్రీగాని, పురుషుడు గాని కాని ఒక తెల్లకాగితం మడచి భగవంతుడిని — ఇటు పురుషాకారంగానూ, అటు స్త్రీ గర్భాశయంగానూ సృష్టియొక్క అవసరంకోసం చేస్తున్న ఈ ఆట! ఒక లీలావినోదమే ఈ కైలాసపర్వతం — ఈ గౌరీకుండం వెనుకగల స్త్రీపురుష రహస్యం! అదే శివశక్తితత్వం!! అర్థనారీశ్వరతత్వం! — అని, తన మౌనం వీడకుండానే వీళ్ళ తగాదా తేల్చేసాడు.

దాంతో అందరూ తలదించుకొని నోరుమూసుకుని గుడారంవైపు చేరుకున్నారు, నెమ్మదిగా!

ఇప్పుడందరికీ కైలాసపర్వతం అవతలికిపోయేది ఎలా? శంబలకు పోయే మార్గం పట్టుకునేదెలాగ? అన్న ప్రశ్నకు శివపార్వతుల తత్వం తెలిసి — సంశయం లేకుండాపోయింది! అలా దాంతో శంబలకు మార్గం ఏర్పడింది!!

అందుకే సత్యయుగం వచ్చినపుడు — అన్నిమతాలూ ఇలా ఒక్కటవుతాయి — అది ఇలాగేనేమో మరి!

"ఆరు మతములొక్కటౌను" — అంటే ఇదా?

II

“ఓ” లామా గురుదేవా! మీకీ మంచుపర్వతాలన్నీ మీ అరచేతిలోని గీతలు తెలిసినంతబాగా ఎరిగివున్న ప్రదేశంగదా! బహుశా ఇదంతా మీ చిన్నతనంలోను మీరు యువకులుగావుండగానూ ఈ మంచుకొండల మధ్య ఎన్నో సాహసయాత్రలుకూడా చేసివుంటారుగదా?” అంటూ ప్రశ్నించాను. దానికి లామా మహాశయులు సమాధానంగా :

‘సాహసయాత్ర’ అంటే — మీలాగ మంచుగొడ్డళ్ళూ, చర్మాలతో చేసిన చొక్కాలూ ధరించిచేసే సాహసయాత్రలు మేము చెయ్యం! మాకు హిమాలయాలంటే ఎంతో పవిత్రమైన “దేవతాత్మ” వంటి స్థానం! ఇక్కడ ప్రతీ లోయా, ప్రతీ శిఖరమూ, ప్రతీఒక్క కొండచరియా కొన్నివేల సంవత్సరాలనుండీ మహామునులు, యోగులూ శరీరాన్ని మరచిపోయి భగవంతుని ధ్యానంలో తేలిపోతూ తపస్సుచేసిన పుణ్యభూములుగదా! అలాంటి చోట మనలాంటివాళ్ళు — అంటే స్వార్థమూ, భయమూ, ద్వేషమూ ఏమాత్రం చావని ఈ “కలియుగం” — మనుషులం — మన కాళ్ళుపెట్టి తొక్కి అపవిత్రంచేయ్యటమే ఒక మహాపాపం! అలాంటిది తోళ్ళతో కుట్టిన చెప్పులుధరించీ, చచ్చిన జంతువుల చర్మాలతోకుట్టిన కోట్లూ, అంగీలూధరించి వాటిపై ప్రయాణం చేయ్యడమంటే ఇక్కడి హిమాలయాలను మనం అపవిత్రం చేయ్యడమేకదా! ఇక్కడి చలికీ, ఎత్తైన ఈ మంచుపర్వతం వాతావరణానికీ ఇలాంటి రక్షణ అవసరం అని, మీరు భావించవచ్చు! కాని మనయొక్క మనస్సునీ శరీరాన్నీ పవిత్రంచేసుకొని — యోగసాధనతోనూ దివ్యప్రభావం కలిగిన మూలికా

శక్తితోనూ మంత్రశక్తితోనూ మనిషి తన శరీరాన్ని వజ్రశరీరంగా చేసుకొనే ప్రక్రియలు మా హిమాలయాలకు పురాతనకాలంనుంచీ — పిత్రార్జితంగా వస్తున్న విద్యలు!

అంతెందుకు? ఇక్కడి కొండలమీది ప్రతీఒక్క మూలికా, ప్రతీ ఓషధీ, పవిత్రమైన ప్రతి సాలగ్రామశిలా మునులు తపస్సుచేసిన జలపాతం లోని నీరూ అన్నీ — మాతో మాట్లాడుతున్నట్టే అనిపిస్తుంది! అవి తమ పవిత్రగాధను వినిపిస్తున్నట్టే, సెలయేళ్ళలోనూ, గాలిలోనూ ఆ జగన్మాత మాకు జోలపాటలు పాడుతున్నట్టే ఓ లాలిపాటలాగ వినిపిస్తూవుంటుంది! ఎవరైనా తల్లిస్పర్శ తగలకుండా శరీరానికి రక్షణకవచాలు ధరిస్తారా? అందుకే అన్నాను మా లామాల దృక్పథం వేరు! — మాకు ఈ హిమాలయ పర్వతాలు కేవలం కొండలుకాదు. రాతిగుట్టలు మాత్రమేకాదు. ఇదంతా ఒక “దేవతాత్మ!” ఈ హిమవంతునికి ఒక “ఆత్మ” వున్నది. ఈ హిమగిరిని నివాసంచేసుకొని పరమశివుడే కాదు, అనేకమంది శివ యోగులూ, ఆకాశంలో ప్రయాణం చేయగలిగిన సిద్ధపురుషులూ, అవధూత చక్రవర్తులూ నిత్యం సంచరిస్తుండే “స్వర్గం” వంటి ప్రదేశం ఈభూమిమీద! అంతెందుకు ఇక్కడ — ఈ పంచభూతాలైన గాలి, నీళ్ళూ, అగ్నీ, ఆకాశములలో కలిసిపోయి — మన మనస్సుకి ఏమీ గోచరంకాకుండా అవధూత రూపంలో అదృశ్యంగా సంచరించే శ్రీ “దత్త ప్రభువు” గురించి మీరు వినలేదా? ఆయన ఎప్పుడు ఎక్కడ ఏరూపంలో మనకి తారసపడతాడో అని భయంగా లేదూ?” — అంటూ లామా మహాశయుడు ఈమాట ఎత్తగానే సాహసయాత్రీకులందరూ ఆశ్చర్యం తోనూ, భయంతోనూ త్రుళ్ళిపడ్డారు.

"చాలు! చాలు! మీ పవిత్రదృక్పథం మాకు అర్థమైంది! ఇంకా వివరించి చెప్పనక్కరలేదు మాకు. మాకూ కలిగాయి కొన్ని భయం కలిగించే ఆశ్చర్యకరమైన అనుభవాలు — ఇప్పటికే ఎన్నో! అందుకే మీముందర నోరెత్తి మాట్లాడలేకున్నాము" అంటూ సర్దుకున్నాడు శ్రీనివాస చక్రవర్తి సగౌరవంగా, చర్చల్లోంచి!

ఆరోజుకి ఇంక మాలో ఎవ్వరికీ ఆ 'లామా' మహాశయుడితో ఇంక ఏవిషయంమీదా మాటలుపెంచే ధైర్యంగానీ చర్చను కొనసాగించే సాహసంగాని లేకపోయింది.

అందరం అలా మౌనంగా నడుస్తూ మంచుకొండలు ఎక్కుతూ, దిగుతూ మాశ్వాసలే మాకు వినిపించేలా కుక్క ఆయాసపడ్డట్టుగా రొప్పుతూ నడవటంతో సరిపోయింది. ఈ కఠినమైన కొండచరియలు ఎక్కడం దిగడంతో మాప్రాణాలు కడబట్టినట్టై ఇక మాలో మాట్లాడే ఓపికగాని, శక్తిగాని లేక మనస్సునీ, శరీరాన్ని ప్రయాణంమీదనే ఏకాగ్రత చేయడంతో సరిపోయింది, మిగతా మూడురోజులూ.

తిరిగి నాలుగైదురోజుల తర్వాతగాని మా సాహసయాత్రాబృందంలో ఎవ్వరికీ చర్చించే విరామంగాని 'లామా' మహాశయుడికి తీరుబడిగాని లభించలేదు, ఏవిషయమూ తీరుబడిగా చర్చించడానికి!

* * *

15

కొండ దెయ్యాలు!

ఇది మా హిమాలయ సాహసయాత్రలో ఐదోరోజు! పొద్దున్నే లేవగానే నల్లటి కారుమబ్బు మూసుకుని-వచ్చింది — వెనకవైపునుంచి!

ఐమూలగా ఈదురుగాలులు — ఎముకలుకొరికే చలితో మా చర్మాన్ని చీల్చుకుంటూ — వీస్తోందా అన్నట్టు! ఎంత పర్వతారోహకులైనా కష్టాలకు తట్టుకొనే ఎంతటి మోటుశరీరాలైనా ఆ జడివాన చినుకులు వాడి శూలాల్లా మా వీపులమీద కొరడాలతో చావబాదినట్టు బరబరా వర్షిస్తుంటే — మాలో ప్రతీఒక్కడూ తూలి, ముందుకు పడబోయాడు — ఆ వానజడికి!

అలా, ఒక పావుగంటసేపు — అక్కడే నిలబడి, తలవంచి 'పర్వతాత్మ' అయిన ఆ కొండదేవుడికి మనసారా పూజ్యభావంతో శరణాగతి చేసినట్టు నమ్రతతో ప్రార్థిస్తూ నిలబడ్డాము!

అంతే! మంచివాడి కోపంలాగ మరుక్షణమే ఆగిపోయింది జడివాన! ఫెళఫెళా పెద్ద ట్యూబ్‌లైట్లకంటే మందంగా వెలిగే మెరుపులతో చైనీస్ సైనికుల మరఫిరంగుల పేలుళ్ళను మించిన పిడుగులు వెళ్ళి కొండల్లో పడుతుంటే లోయంతా ప్రతిధ్వనించింది — ఒకపెద్ద బ్యాండుమేళం భాజాలు లోయ వీపుమీద భజంత్రీలుగా మోగిస్తున్నట్టే! అలా దడదడా పిడుగులు, ఉరుములు వాటి మేళతాళాలు పూర్తిచేశాక మేం భయం భయంగా ఒకరివంక ఒకరు బిక్కచచ్చిపోయినట్టు చూసుకున్నాం, పెద్దవాళ్ళ ఆగ్రహానికి బెదిరిపోయిన చిన్నపిల్లల్లా — ఎందుకు కోప్పడ్డారో? ఎందుకు మానేశారో, అర్థంకాకుండా తెల్లబోయినట్టుంది మా పరిస్థితి ప్రకృతి ప్రళయతాండవానికి!

మరుక్షణంలో ఫకాలున నవ్వాడు నా ప్రక్కవాడు! నాకూ భళ్ళున నవ్వొచ్చింది! మరుక్షణమే అందరం పగలబడి నవ్వుకున్నాం! మా బెదురు చూసి మాకే నవ్వొచ్చింది. “మనిషీ! ఓ మనిషీ! ఎవరు నువ్వు? ఓ హీరోవా? చంద్రునిపై గ్రహాలపై సాహసయాత్రచేసే సాహసవీరుడివా? లేక భయంకర హిమప్రళయం ముందు పర్వతాలు దద్దరిల్లే గర్జన ముందు గడ్డిపోచవలే భయంతో ఊగిపోయే జీరోవా? ప్రకృతి ప్రళయ తాండవం ముందు మనిషి ఎంత?

ఎందుకని మన ప్రాచీనఋషులు ఎంతో వినయంగా శరణాగతి భావంతో ఈ పర్వతాలను పూజించారో, ఈ హిమాయలపర్వతాల వెనక నుంచీ గర్జించే ఉరుములవెనుక ఆ పర్జన్యదేవుడైన ఇంద్రుని సూక్తులు ఎందుకు దయకై అనుగ్రహంకోసం గానంచేశారో మాకిప్పుడే అర్థమవు

తున్నట్టు అనిపించింది! ప్రకృతి ప్రళయతాండవం — విరబూసే చిరునవ్వు, అందాలపూలతోట పసిబిడ్డ నవ్వువంటి లేతవెన్నెలా — వీటిమధ్య బెదిరిపోయిన పసిపిల్లాడివలే మనిషిహృదయం కవిత్వంతో గానంచేస్తుంది, ఈ ప్రకృతి ఒడిలో తల్లిఒడిలో — తల్లిచేసే విన్యాసాలు చూసి మురిసిపోయే పసిబిడ్డలా!

"అమ్మా! ప్రకృతిమాతా! మేము నీ బిడ్డలం! మమ్మల్ని అదిలించకు! భయపెట్టకు; అలాఅని తోసెయ్యక ప్రేమించు!" అంటూ ఈ పర్వత రాజపుత్రికయైన జగన్మాతను దేవీసూక్తంలో, వేదంలో కాలపురుషుడినీ కాలికాస్త్రీనీ ఎందుకు గానంచేశారో అర్థంచేసుకోవడం కష్టంకాదు! ఈ వాతావరణంలో జీవిస్తే గొర్రెలకాపరిని సహితం కవిగా మార్చేస్తుంది ఈ ప్రకృతి! కట్టుకున్న భార్యలా కన్నకూతురిలాగా ప్రళయభయంకర పిశాచశక్తిలా భద్రకాళిలా ఎన్నోరూపాలు — ఈ ప్రకృతిమాతవి!

"బాబూ! జాగ్రత్త!! మీరేదో ఈ ప్రాంతాలకు కొత్తవారిలా కనిపిస్తున్నారు! నిర్భయంగా నడచివెళుతున్నారు. మీరు చేరుకోబోతున్నది **"పిశాచాల లోయ!"** దీని పేరుచెపితేనే మాకొండవాళ్ళు నిద్దట్లోకూడా హడలి చస్తారు! ఊరికే మాటల్లో దీనిపేరుచెప్పినా భయంతో మలమూత్ర పర్యంతం అవుతుంది; ఈ భీకరప్రదేశాన్ని దీన్ని తలచుకుంటే!" అంటూ మమ్మల్ని హెచ్చరించాడు! ఎవరా అని మా మంచుప్రయాణం ఆపి కుడివేపుగా తిరిగి చూస్తే ఓ ఎత్తైన చెట్టుమీదనుంచి పొడుగాటి గడకర్రతో కొడవలికట్టిన దోటీతో ఏవో పూలో పండ్లో కోస్తున్నాడు, కింద వున్న మేకల మందకు కాబోలు! ముక్కుకూ చేతుల మడతల్లోను, మోచేతులకూ,

వెండికట్లు కంకణాలుగా వున్నాయి, ఈ షేర్పా గొర్రెల కాపరికి! బహుశా ఇతడే మమ్మల్ని హెచ్చరించివుంటాడు అనితోచి :-

"ఏమిటిబాబూ మీరు చెప్పేది? దెయ్యాలలోయా? దెయ్యాలెక్కడ వున్నాయి? అసలీ ప్రపంచంలో దెయ్యాలు నిజంగా వున్నాయా? మేమి లాంటివేమీ నమ్మం! మీలాగా పల్లెటూరివాసులంకాము మేము! నాది రష్యాలోని పీటర్స్‌బర్గ్‌నగరం! నాపేరు నికోలాస్-రోరిఖ్! ఈయనది ఇంగ్లండులోని లండన్‌నగరం! ఆయనది పాటియాలా రాజధాని — ఆయన ఒక మహారాజు! ఇంకా ఈపక్కన తుపాకీతో వస్తున్నది, పులి వేటగాడు, గుండెలుతీసిన బంటుఐన జిమ్ కార్బెట్! మామధ్యగా నడుస్తున్న వ్యక్తి ఓ సైంటిస్ట్, గొప్ప జంతుశాస్త్రజ్ఞుడు! మాతోనా? నీవు భయపెట్టేమాటలు చెపుతున్నది? అన్నాం! ఆశ్చర్యంగా అందరం ఒకే కంఠంతో!

వాయవ్యదిక్కునుండి ఏటవాలుగా కిందకి దిగుతున్న కొండచరియ మీదుగా నడుస్తూన్న, మా సాహసయాత్రికుల బృందంలోని మిత్రులందరం అకస్మాత్తుగా వాతావరణం మారిపోవడం గమనించాము! కీచుమని చెవులు చిల్లులుపడే రొదవంటి శబ్దంతో గాలి — ఓ దుమారంలా వేగంతో వచ్చి వాళ్ళ ముఖాలకు తగిలేలా లోయ క్రింద నుంచీ వీస్తూ వాళ్ళ పాదాలకిందకి దూరి పైకెత్తి పడేస్తున్నంత వేగంతో విసురుతోంది. అంతటి కాకలుతీరిన పర్వతారోహకులూ, క్షణం ఆశ్చర్యపడి అలా నిలబడిపోయారు! "ఏమిటీ ఈ విపరీతమైన గాలి? పైగా ఆకాశంలో ఏమీ మబ్బులు లేకుండానే ఎండ తెరవేసినట్టుగా, చీకటి

వ్యాపించింది లోయంతా! మరి మాచుట్టూ కారుమబ్బులుకాని, ఉరుములు, మెరుపులుగాని ఏమీ లేకపోయినా భయంకరమైన ఈదురు గాలులు వీస్తూ ఇలా కాళ్ళను అడుగునుంచీ పైకిఎత్తి తలక్రిందులుగా పడతోసేంత వేగంగా వీస్తోందే?" అనుకుంటూ ఒకరినొకరు ఆశ్చర్యంగా చూసుకున్నాం ప్రశ్నార్థకంగా!

చివరికి, అపరాధపరిశోధకుడైన చార్లెస్ బెల్‌మీదనే అందరిదృష్టి కేంద్రీకరించారు ప్రశ్నార్థకంగా!

అతడు చిత్రంగా ఆకాశంవైపు చూస్తూ గట్టిగా తన టోపీని అదిమి పట్టి కళ్ళమీదకు లాక్కుని దృష్టి తీక్షణంగాచేసి కళ్ళు చికిలించి పైకి చూసాడు — పైపు సరిచేసుకుంటూ!

'ఆశ్చర్యం! పైపు ఆరిపోయిందే?' అనుకుంటూ అపుడే వెలిగించిన తనపైపు ఎర్రటి చింతనిప్పుల్లా వెలుగుతూ గుప్పుగుప్పున ఇంజనుపొగ లాగా వస్తూనే అకస్మాత్తుగా ఆరిపోయి పొగరాజుకుంటూ నిటారుగా రింగురింగుల పొగ పైకే లేస్తోంది. "ఇదేదో విచిత్రంగా ఉన్నదే! నాకు అంతుపట్టడంలేదు! ఆకాశమంతా నిర్మలంగానే వుంది. అయినప్పటికీ సూర్యరశ్మి లేదే? మసక చీకటి సర్వత్రా వ్యాపించింది ఎలాంటి మేఘములూ లేకుండానే! ఈదురు గాలి విపరీతంగా వీస్తోంది."

"ఒకనాడు లండన్‌లోని డోవర్ సమీపంలో నేనొక దెయ్యాల కొంపను పరిశీలించడానికి వెళ్ళినప్పుడుమాత్రమే ఇలాంటి వాతావరణం ఎదుర్కొన్నాను. స్వతహాగా నాకు సైన్సు దృక్పథం హేతువాదంతో క్రమశిక్షణగా అలవాటుపడ్డ నాకు — దెయ్యాలన్నా, పిశాచాలు, భూతా

లన్నా పెద్దగా నమ్మకంలేదు. ఐనా, ఇప్పటి ఈ వాతావరణం — నాకు మళ్ళీ అప్పటి డోవర్ కేసు పరిస్థితిని గుర్తుకుతెస్తోంది!" అన్నాడు చిత్రంగా పైకిచూస్తూ ఆరిపోయిన తన పైపును వెలిగించుకుంటూ.

ఇంతలోనే వెనకనుండి మా సాహసయాత్రీకులలోనుంచి ఒకరు ఆశ్చర్యంగా కెవ్వున కేక వినిపించి — అందరం చటుక్కున వెనక్కితిరిగి చూశాం ఆశ్చర్యంగా! ప్రఖ్యాత జంతుశాస్త్రజ్ఞుడు "లంకాస్టర్" తలపైన టోపీ గాలిలో గజంఎత్తున పైకిఎగిరి ఏ ఆధారం లేకుండానే అలాగే నిలబడివుంది అలా పదిహేను ఇరవైసెకన్లు నిలబడి అటూఇటూ వూగి తిరగబడి మరొకరి మొఖాన వెళ్ళిపడింది, గట్టిగా గాలి విసిరేసినట్టు!

ఆ టోపీని తీసి తిరగేసిచూస్తే సన్నని పంచదారవంటి మంచు ఇసుకపొడితో నింపబడివున్నది అందరూ విస్తుపోయారు.

"ఇదేదో కొండజాతి మాంత్రికుల లోయలో తాంత్రిక మేజిక్కులతో మనల్ని భయపెట్టడానికి చేస్తున్నారా ఎవరైనా?"

ఈసారి హిమాలయ పర్వతాలలో సగం జీవితం గడిపి మంచు కొండలలోని వింతలూ, విశేషాలను జీర్ణించుకున్న రష్యన్ శాస్త్రజ్ఞుడు నికోలస్ రోరిఖ్ఛ్ మాటలు అందరినీ ఆశ్చర్యపరచాయి.

"ఓ నికోలాస్ మహాశయా! — మీకు ఇలాంటి మంత్రాలన్నా మాయలన్నా నమ్మకం వున్నదా? ఇలాంటివి మీరెప్పుడైనా చూశారా? ఏమిటీ విపరీతాలు మనకి?" అందరికళ్ళూ ఆయనవైపే కేంద్రీకరించాము ప్రశ్నార్థకంగా!

ఇలాంటివి సామాన్యంగా జరగవు! ఎంతో అరుదుగా ఎక్కడో ఎప్పుడో తప్ప!" — అన్నాడు!

"అంటే! ఇలాంటి ఆశ్చర్యాలు, అద్భుతాలు మీ అనుభవంలో అసంభవం కాదన్నమాట! ఇవి ఎవరైనా చేశారా? లేక వాటంతట అవే జరుగుతాయా?"

సాధారణంగా రోడ్డుప్రక్కన కనికట్టువిద్యలు చేసే గారడీవాళ్ళే భారత దేశంలో ఇలాంటి మ్యాజిక్‌లు చేయడంచూశాను! మీరూచూసే వుంటారు ఇలాంటి ట్రిక్కులు! తాడును గాలిలో ఎగరవేసి పాముబూరా వూదితే అది నిటారుగా పైకివెళ్ళి గాలిలో నిలబడడం, ఎండిపోయిన మామిడిటెంకని నేలలో పాతేస్తే అప్పుడే అది పదినిమిషాలలో మొక్క మొలిచి చిగురించి పుష్పించి మామిడికాయ కాయడం, చూస్తుండగానే, అది పండి, ఫలంగా మారితే గారడీవాడు తన దగ్గరవున్న చాకుతో దానిని ముక్కలుగా కోసి మా అందరికీ తినబెట్టడం. తిరిగి మళ్ళీ ఆ మొక్కపైన కంబళీ కప్పి ఏవోమంత్రాలు చదివి, కంబళీ తీసిచూస్తే ఏమీ వుండదు. కాని — ఇప్పటి ఈ వాతావరణం చూస్తుంటే అలాంటివాటిలాగా కనిపించడంలేదు. ఈ ప్రకృతిలో ఏవో, క్షుద్రశక్తులు తిరుగాడుతూవుండి వుంటాయి. ఇలాంటివి నేను పాతకాలపు రష్యాలో — ఎవరైనా మాంత్రికులో, లేక క్షుద్రశక్తులను పూజించేవారో, చనిపోతే — వారి సమాధివద్ద ఇలాంటి చిత్రాలు చూశాను. అవిచూసి ఎంతకాలమైనా అవి తలచుకుంటేనే శరీరం జలదరిస్తోంది!

ఇలా మాట్లాడుకుంటూనే మా మిత్రబృందం అంతా ఆ లోయ

దిగి, దిగువకు నడుస్తూ నెమ్మదిగా ఓదట్టమైన చెట్లగుంపును సమీపించాం. గుబురుగా పెరిగిన ఆ ముదురుఆకుపచ్చ చెట్లసందులలోంచి ఒక పాతకాలంనాటి బంగళా! విరిగిపోయిన దూలాలూ, పగిలిపోయిన కిటికీల అద్దంపెంకులూ, వేల్లాడుతున్న బూజుతో, పగలే కీచురాళ్ళతో బిగుసుకునివున్న ద్వారంతో వున్న ఓ కొంపను సమీపించినవాళ్ల. అప్పటికే అందరూ బాగా అలిసిపోయాం! ఇక — సాయంత్రం కావస్తూండటంవల్ల ఇక్కడే విశ్రాంతి తీసుకుంటే మంచిదని అందరం కలిసి నిర్ణయించుకున్నాం!

అలా, ఆ కొండచరియ దిగువకు నడిచి కుడివైపు మలుపు తిరగ్గానే ఒక విరిగిన గేటులాంటిది కనిపించింది. కిర్రున శబ్దం చేసుకుంటూ తెరుచుకున్న ఆ గేటును తోసుకుంటూ లోపలికి ప్రవేశించాం! అప్పటికే కనుచీకటిపడుతోంది! అంతటా దట్టమైన పొగమంచు వ్యాపించింది. అప్పటికే ప్రయాణపు బడలిక వలన అలసటతోవున్న వాళ్లము గనక ఆ ప్రదేశాన్ని అంతగా పట్టించుకోవడం లేదు!

గేటు తీసుకుని పెద్ద దొడ్డివంటి ఆ ప్రదేశంలో అంతటా పాత కాలపు చెక్కలు, దుంగలూ కనిపించాయి. ఎగుడు దిగుడుగావున్న నేలను చూస్తుంటే కొన్ని సమాధులవంటివి కనిపించాయి!

"ఇదేదో గోరీల దొడ్డిలావుంది. ఇక్కడ ఎవరుంటారు? ఇదేదో 'భూత్ బంగళా'లావున్నది" అనుకుంటూ... నెమ్మదిగా ప్రవేశిస్తూంటే...

"హిమాలయ సాహసయాత్రికులకు స్వాగతం! పెద్దలకు వెల్కం (Welcome)!" అంటూ ఒక స్త్రీకంఠం వినిపించడంతో తలతిప్పి చూశాం

ఆశ్చర్యంగా! ఒక డెబ్బైఏళ్ళ ముసలివయస్సులోవున్న మహిళ నిలబడి స్వాగతం మాకు పలుకుతోంది, చేతులు నమస్తేలాగా పైకెత్తి!

ఒక్క క్షణంక్రితం ఆమెను ఇక్కడ చూడలేదే? అని ఆశ్చర్యపోతున్న వారితో ఆమె — తాను ఈ బంగళా యజమానురాలిననీ, ఇక్కడే వుంటూ అతిధులకు, సౌకర్యాలు, సదుపాయాలు సమకూర్చడం చాలా కాలంనుండి వస్తున్న ఆతిధ్యధర్మమని అంటూ — "అతిధులు రావటమే చాలా లాభం మాకు!" అన్నది ఆశ్చర్యంగా!

"ఇక్కడేవుంటూ నేను ఇక్కడికి వచ్చే అతిధులకు అన్ని సౌకర్యాలూ సదుపాయాలూ సమకూర్చడం చాలాకాలంనుంచీ చేస్తున్నాను; ఆతిధ్య ధర్మంగా!" — అంటూ! ఆప్యాయంగా ఆహ్వానిస్తూనే ఆమె చేతులెత్తి నమస్కరించి ఎర్రని పెదిమలు కనిపించేలాగా చిరునవ్వు నవ్వుతూ — "మీలాంటి అతిధులు రావడం నాకు చాలా లాభం! నాకెంతో సంతోషం!" అన్నది!

"పగలంతా మంచులోయలు ఎక్కటమూ, దిగడమూ, ఈదురు గాలికి చలికొట్టుకొని వుండటంవల్ల బడలికతో డస్సిపోయిన మాకు ఆమె ప్రేమపూర్వకమైన ఆహ్వానం మాచెవులకు సంగీతంలా వినిపించింది! ఈరాత్రికైనా మనమంతా హాయిగా వెచ్చగా నిద్రపోవచ్చు" అన్నాడు పాటియాలా యువరాజు వెడల్పుగా నవ్వుతూ మిత్రులందరివంక చూసి!

"మీకోసం వేడి వేడి భోజనంతోపాటు చిక్కని ద్రాక్షవైన్, ఇంగ్లీషు సారాయి ఎదురుచూస్తున్నది! — ఆలస్యం మీదే!" అన్నది. ఇంత శిధిలమైన పాతబంగళాలో ఇలా బూజులు వేళ్ళాడుతూ దుమ్ముకొట్టు

కున్న గదులతో చెక్కసున్నంపెచ్చులు ఊడిపోయిన వరండాలూ వసారాలో గడ్డిమొలిచిన ఈ నిర్మానుష్యమైనచోట మనకి వేడి వేడి ఆతిధ్యం, చిక్కటి ద్రాక్షసారాయీ, ఎక్కడినుంచి తేగలదో?'' అనుకుంటూ విస్తుపోతూనే ఆకలీ బడలికా దంచేస్తుంటే అన్ని సందేహాల్ని పక్కకునెట్టి మా బ్యాగులూ, సంచులు, బరువైన సామానులు అన్నీ ఆ వసారాలోనే కిందపడేశాం — చిందరవందరగా ఏమీ సర్దుకోకుండా! మా అనుమానానికి సమాధానమా అన్నట్టు ఆమె కీచుగొంతుతో పిలిచింది!

“జోన్స్! ఎక్కడ చచ్చావురా? ఇరుగో! అతిధులు వచ్చారు. వీరి పని చూడు!” అన్నది! చార్లెస్ బెల్ వెనక్కితిరిగిచూడగానే ఒక్కసారిగా తృళ్ళిపడ్డాడు అంతటి గూఢచారి! అప్పటివరకూ లేని జోన్స్ తటాలున మావెనక నిలబడివుంటే — ప్రత్యక్షమైనట్టు! వెడల్పుగా నవ్వుతూ పొడుగాటి తన పళ్ళను గారపట్టిన ఎర్రటి చిగుళ్ళనూ చూపిస్తూ నవ్వుతూ తలవంచి సెల్యూట్‌చేశాడు స్వాగతంలా!

మాముందు టేబుల్‌మీద లావుపాటి ఆ కొవ్వొత్తిని వెలిగించి ఎప్పుడుపెట్టాడో — మేము చూడలేదు! ఎర్రగా పచ్చగా వెలిగే కాంతితో ఆ కొవ్వొత్తి చిటపటలాడుతోంది! ‘దీపం దొరికిందికదా కాసేపు డైరీ రాసుకుందాం’ — అనుకుంటూ రష్యన్ చిత్రకారుడు రోరిఖ్ వెనక్కితిరిగి తన బ్యాగులోంచి ప్యాకెట్ నోట్‌బుక్కూ, పెన్సిలూ తీసుకొని టేబుల్ వద్దకుచేరగానే తుళ్ళిపడ్డాడు! టేబుల్‌మీద కొవ్వొత్తిలేదు! అతని వెనకాల కిటికీలోవున్నది! ఇదేమిటా? — ఇంతలోనే ఈ కొవ్వొత్తిని ఇక్కడినుంచి ఎవరుతీశారా? అనుకుంటూ — కిటికీవద్దకు వెళ్ళి నోట్‌బుక్‌నూ పెన్సిలూ

టేబుల్‌మీదపెట్టి పక్కనేవున్న కుర్చీని తెచ్చి కూర్చునేందుకు కిటికీవద్ద వేసుకున్నాడు! ఈసారి ఆశ్చర్యంతో కెవ్వుమని కేకవేయడం అతని వంతైంది! అందరం ఒక్కసారి ఉలిక్కిపడ్డాం — కరెంట్‌షాక్ తగిలినట్టు!

"ఏమైంది? ఏమిటి? ఎందుకలా అరిచారు?" అంటూ ప్రశ్నించారు అందరూ! అతడి ముఖం తెల్లగా భయంతో పాలిపోయివున్నది!

"మైగాడ్! ఈ కొవ్వొత్తి ఇక్కడ కిటికీలో పెట్టాను! అటుతిరిగిచూస్తే మళ్ళీ అది పెట్టినచోట లేనేలేదు! ఇదేదో భయంగా వుంది!"

"బహుశా మీరే వెనకపెట్టుకొని నోట్‌బుక్ తెచ్చుకొని కూర్చునేలోపల ఎక్కడపెట్టానో అనుకుంటూ మర్చిపోయుంటారు!" అన్నాం.

ఈసారి పాటియాలా యువరాజు భయంతో కెవ్వున కేకపెట్టాడు మరుక్షణమే — "అడుగో టేబుల్‌వద్ద జోన్స్! ఇంతకుముందు లేడు!! ఇప్పుడే నీ ఎదుట పొగమంచులా ప్రత్యక్షమయ్యాడు!" అదేమీ పట్టించుకోకుండా జోన్స్ తన పొడుగాటి పళ్ళను ప్రదర్శిస్తూ ఇకిలిస్తున్నట్టుగా నవ్వాడు — టేబుల్ వెనకనుంచి! "మీకేంకావాలి సార్? డ్రింక్ తాగుతారా? రెండుపెగ్గులు తెమ్మంటారా?" అన్నాడు! దాంతో అందరూ ఆశపడ్డారు! కాస్త వేడిగా కడుపులో పోస్తే ఎలాంటి నరాల బెదురూ, పైత్యపు ఆలోచనలు తగ్గుతాయని! — 'సరే! పట్టుకురా!' అనేలోపలే జోన్స్ అక్కడే నిలబడటం చూసి — "ఏం? వినపడ్డంలేదా జోన్స్! వైన్ తెమ్మన్నానుకదా!" అంటూ — ఆ మధ్యలోనే ఆగిపోయాడు నికోలాస్ రోరిఖ్...

ఎదురుగా టేబుల్‌మీద ఓ పొడుగాటి వైన్‌సీసా! రెండు గాజు

పెగ్గులు పెట్టివుండటం చూసి! "అరే! అద్భుత వ్యక్తిలావున్నావే? జోన్స్! నీవు ఇక్కడనుంచి కదలకుండానే టేబుల్‌మీద ఈ వైన్‌సీసా పెగ్గులూ పెట్టావే ఎలాగ?" అంటూ భయంతోకూడిన ఆశ్చర్యంతో జోన్స్‌వంక చూస్తూ అడిగాడు!

కాని, జోన్స్ సమాధానమేమీ చెప్పకుండా తన దంతాల వరస మరింత వెడల్పుగా కనిపించేలా గుర్రం సకిలిస్తున్నట్టుగా నవ్వాడు!

"ఏమిటి? ఇతడు సమాధానం చెప్పడు? క్షణాలమీద అన్నీ టేబుల్ మీద అమర్చేస్తాడు!" అంటూ నిదానంగా కుర్చీని టేబుల్‌వద్దకు జరుపుకొని పెగ్గులు రెండూ నిలబెట్టి — వైన్‌సీసా మూతతీస్తూ అడిగాడు!

"ఇది చాలా పాతవైన్ అనుకుంటా! — ఇది వింటేజ్ వైన్ (Vintage Wine) లాగ వున్నదే చిక్కగా ముదురు ఎరుపురంగుతో! ఇది ఫ్రాన్స్‌లోని ఏంజౌ (Anjou) వైన్‌లావున్నదే రంగుచూస్తే!" అంటూ తీరా తలఎత్తి చూస్తే — ఎదురుగా జోన్స్ లేడు!

"నేనే పెట్టమన్నాను జోన్స్‌ని — మీకోసం ప్రత్యేకంగా ఈ వైన్! ఇది ద్రాక్షసారాయికాదు! ద్రాక్షసారాయిగనక ఐతే ఇంత చిక్కగా ఎందుకుంటుంది?" అన్నది చప్పున పెగ్గులో నిండా ఎర్రటి ద్రాక్షసారాయి పోసుకొని ఒక్క పెగ్గుతో ఖాళీచేస్తూ!

ఆమె పెదవులు ఎర్రగా వికృతంగా రంగు పులిమినట్టు వున్నాయి! పెదవుల సందునుంచి చుక్కలు చుక్కలుగా జిగురుగా వున్న ద్రాక్షరసం వంటిదేదో కిందకు జాలువారుతోంది! తన కంగారును అణచి పెట్టుకోవడంకోసం వేరే టాపిక్ మార్చాలని సంభాషణలోకి దింపాలనే ప్రయ

త్వంలో — "మేడమ్! మీవయస్సు ఎంత వుండవచ్చు? ఇలాంటి ప్రశ్నను మీలాంటి దొరసాని లేడీలను అడగరాదుగాని ఆశ్చర్యమూ, కుతూహలం నన్నిలా అడిగిస్తున్నాయి! ఏమీ అనుకోకపోతే చెప్పండి!" అన్నాను.

"నాకు 700 సంవత్సరాలు! ఎన్నాళ్ళైనా నేను ఇదే వయస్సులో వుంటాను! మాది నిత్య యవ్వనం! వయసు స్థంభించే మూలికలు మందులూ వాడే రహస్య ప్రక్రియలద్వారా మంత్రశక్తితో తయారుచేసిన ద్రావకం ఇది!"

"మీవయస్సూ కూడా నాలాగే అయిదారువందల ఏళ్ళదాకా ఇలాగే స్థంభించేలాగా చేయనా? మనిద్దరం హాయిగా ఇక్కడ చిలకా గోరింకల్లా ఆనందంగా గడపవచ్చు! హాయ్!!" అంటూ వికృతంగా కామచేష్టలు చేస్తూ శరీర అంగాంగ ప్రదర్శనలుచేస్తూ డాన్సులాగా ఊగుతూ మీద మీదకి రాసాగింది!

"మేడమ్! మీకు కాస్త నిషా ఎక్కువైనట్టుంది! కాకపోతే మీ వయస్సు 700 సంవత్సరాలేమిటి? ఇంత చిక్కటి ఎర్రటి జిగురువంటి ద్రావకం మామూలు వైన్లాగా కనిపించదే? ఇది ఏ మూలికలతో ఏయే వస్తువులు వేసి తయారుచేశారో! కాస్త తెలుసుకోవచ్చా?" అన్నాడు బెదురుతూనే! అతడి చేతులు వణుకుతుండటం చూసి ఆమె భళ్ళున నవ్వింది!

"ఆడదాన్ని చూస్తే భయపడే మగాణ్ణి నిన్నే చూశాను! నువ్వు కూడా నాలాగే రెండుపెగ్గులు ఈ ద్రావకం పుక్కిట బిగించావంటే భూమీ ఆకాశం దరువేస్తున్నట్టుగా వుంటుంది! అన్నట్టు అడిగావుగనుక చెప్తాను ఇది ఏం ద్రావకమో!"

“ఏం ద్రావకం?...”

“...”

“... ఇదీ ...” “... ఇదీ ...”

“... ఇదీ ... ఇదీ అంటూ సాగదీస్తారేమిటి? ఏమిటో చెప్ప రాదా?”

ఈసారి నిజంగా వణుకుతున్న కంఠంతో అడిగాడు పాటియాలా యువరాజు — చెమటతో తడిసిన ముఖంతో పాలిపోయి!

“ఇదీ! మనిషి రక్తం! అందులోనూ మనిషి కంఠనాళంలోంచి చిల్లుపొడిచి అతను ప్రాణంతో గిలగిలా తన్నుకుంటుంటే — బ్రతికి వుండగానే తీసిన రక్తం! దాన్ని నూరేళ్ళు సారాయిలా పులియబెడితే నిషా కాక మరేమిటి? ఎప్పుడూ వినలేదా? మనిషి రక్తంతో చేసిన వైన్!” అంటూ వెడల్పుగా నవ్వుతూ ఆమె చిగుళ్ళూ, దంతాలు ఎర్రగా కారాకిళ్ళీ నమిలినట్టుగా భయంకరంగా వున్నాయి!

“మనిషి రక్తమా? బాబోయ్! దేవుడా! మీరేం మనుషులు?” అంటూ తటాలున కుర్చీలోంచి లేవడంతో గభాలున కుర్చీ వెనక్కి దొర్లిపడింది! ... మరుక్షణంలో ఆ దొరసాని మాముందు లేదు! దూరంగా వికృతంగా కీచుగొంతులో నవ్వుతూ మాయమైంది!

“మైగాడ్! వీళ్ళు భూతాల్లా వున్నారే! మనుషుల్లా లేరు! నాయనోయ్! ఎరక్కపోయి చిక్కుకున్నామురా ఈ భూత్‌బంగళాలో! ఈరాత్రి వీరి ఆతిధ్యమా? భోజనమా? మనిషిరక్తంతో చేసిన వైన్‌తో డిన్నరు

ప్రారంభమా? ఇక తినే ఆధరువులూ, వంటకాలు ఏంచేస్తారు!'' అనుకుంటూ!

అందరూ ఏక కంఠంతో తలఎత్తిచూస్తే అక్కడ ఎవరూ లేరు! కాని గాలిలోంచే మాటలు స్పష్టంగా వినపడ్డాయి — మా డిన్నరు మీ మాంసంతోనే? మీ రక్తంతోనే రక్తసారాయి సీసాలు నింపుకుంటాం!

ఏం? భయపడ్డారా? నేను ముందేచెప్పానుకదా! మీరాకవల్ల మాకెంతో లాభమని!!'' అంటూ ఘల్లున గజ్జెలు చప్పుడైనట్లు నవ్విన శబ్దం గాలిలో కలిసిపోయింది!

టైము, అర్ధరాత్రి కావచ్చింది. పగలంతా ప్రయాణంచేసిన బడలికతో విసిగి వేసారి అలసిపోయివున్న మా సాహసయాత్రికులందరం — "భోజనంమాట దేవుడెరుగు — కనీసం ఓ కునుకుతీద్దాం" అనుకుంటూ శిధిలమైపోయిన ఆ బంగళాలోనే మేము తెచ్చుకున్న కేన్వాసుపక్క (Sleeping Bag) లను పరుచుకున్నాం! క్షణాలమీద ఒళ్ళుతెలియని నిద్రపట్టింది. అందరూ అలా గాఢనిద్రలోకి జారుకున్న మరుక్షణమే —

"టక్-టక్!"

మని తలుపుతట్టినట్లు పెద్ద చప్పుడైంది! అందరం తుళ్ళిపడి ఒకరి ముఖాలొకరు చూసుకున్నాం! 'ఎవర్రా ఇంతరాత్రివేళ తలుపుతట్టిందీ' అనుకుంటూ. ఇంతలో రష్యన్ పరిశోధకుడు వెలికోవ్‌స్కీ పరుగెత్తికెళ్ళి తలుపుతీశాడు.

ఆశ్చర్యం! అక్కడెవరూ లేరు! ఒక్కక్షణం అందరం ఆశ్చర్యపోయాం! మాగదిలో చూస్తే మా సాహసబృందంలోని అందరూ గదిలోనే వున్నారు. 'మరి తలుపుతట్టిందెవరు?' అనుకుంటూ, 'బహుశా వాచ్‌మెన్

గానీ మనకేమైనా కావాలేమో కనుక్కుందామని తట్టివుంటాడు'; అనుకుని తలుపుతీసి ద్వారంగుండా బయటకు పరుగెత్తాడు. బయట గాఢాంధకారం! కన్నులు పొడుచుకున్నా కంటికేమీ కానరాని కటిక చీకటి. పెద్ద కీచు గొంతుతో ఎవరో గుక్కపట్టి ఏడుస్తున్నట్టుగా భయంకరమైన రొదతో ఈదురుగాలి — సుడిగుండంలాగ మాగదిలోకి ప్రవేశించింది. కాగితాలూ, నోట్‌బుక్‌లనూ చిందరవందర చేసేసింది. సుడిగుండంలా గుండ్రంగా గిరగిరా తిరుగుతూ పైకి చిమ్మేసింది. 'ఛీ! వెధవగాలి! నా కాగితాలన్నీ కలిపేసింది, ఎగరగొట్టింది!! ముందు — ఆ తలుపువేసెయ్యండి' అంటూ కేకలువేశాడు.

అప్పటికే బయట వందగజాలదాకా పరుగులాంటి నడకతో వెళ్ళిన నొటోవిచ్ టార్చిలైటువేసి అంతా గాలించినా కాంపౌండ్ అంతా మనిషంత ఎత్తు పెరిగిన రెల్లుగడ్డితప్ప ఎవరూలేరు! లైటువేసి చూస్తే గడ్డిపైన — జరజరా పాకిపోతున్న నల్లటి త్రాచుపాములు! బుసబుస శబ్దంతో ఆవిరి పొగలు కక్కుతున్న ప్రెషర్ కుక్కర్‌లా బుస్సుమని శబ్దంచేస్తూ పరుగెత్తినట్టూ! దాంతో విసుగ్గానూ, కొంచెం భయంగానూ వెనక్కి పరిగెత్తాడు చివరికి చేసేదిలేక! అందరం వెనక్కితిరిగి గదిలోకిపోయి పడుకున్నాం! అలా ఒక అరగంట గడిచిందో లేదో — మళ్ళీ పెద్దచప్పుడుతో **'టక్-టక్'** మని మళ్లీశబ్దం!! ఈసారి స్వయంగా నికోలస్ రోరిఖ్ తన తుపాకి భుజాన తగిలించుకుని పరుగెత్తాడు — ఎవరైనా, మనల్ని భయపెట్టడానికో, లేదా దోపిడీ చెయ్యడానికో — కొండజాతి దోపిడీగాండ్లేమో? అన్న సందేహంతో. కాని, మళ్ళీ అదే తీరు! కనుచూపుమేర దూరంలో చూస్తే ఎవరూ కనిపించలేదు.

ఈసారి విరిగిపోయిన చెక్కతలుపులు, బాత్‌రూమ్ గుమ్మానివి, అటు ఇటూ గాలికి దబదబా కొట్టుకుంటున్నాయి. బహుశా ఇదే చప్పుడు — మనం ఎవరో తలుపుతట్టిన చప్పుడనుకొనివుంటాం!! — ఛీ!! బంగారంలాంటి నిద్ర, పాడుచేసింది అనుకుంటూ ఇంటి ఆవరణ బయటవున్న బాత్రూమ్ తలుపులు బిగించాలని లాగి తలుపేసేలోగా ఆ రెండుతలుపులూ ఊడిపోయి, చెక్కలు చేతిలోకివచ్చాయి. ఒక్కక్షణం గుండె ఝల్లుమన్నట్లైంది — ఆ పాడుబడివున్న బంగళాలో పరిస్థితికి.

"హీ! హీ! హీ!" — అని, ఎవరో నవ్వినట్లు, గేలిచేసినట్లు, వెక్కిరించినట్టు, గాలిలోంచి వినిపించాయి — చుట్టూరా ఎవరో బూట్లతో పరుగెత్తిన శబ్దం. నేలమీద పరచివున్న బండలమీద ఎవరో పరుగెడుతున్నట్లుగా వస్తున్న శబ్దం విని, మళ్లీ ఇద్దరు సాహసబృందంసభ్యులం వెంటపడ్డాం!

మళ్లీ, పదిక్షణాలో, ఇరవైసెకండ్లో నిశ్శబ్దం!! దూరంగా కీచురాళ్ళ వలే సుడిగాలివలే, ఎవరో ఏడుస్తున్నట్టూ — గీమనే గొంతుతో గలగల లాడే అందెలపట్టీల పాదాలతో పరుగెత్తిన ఘల్లు ఘల్లుమనే సవ్వడి!! ఈసారి అందరం భయంతో కొయ్యబారిపోయాం! 'ఇదేమిటి? ఇక్కడెవరో స్త్రీలు కాళ్ళకు వెండినగలు, అందెలూ, పట్టాలు, మువ్వలో ధరించి వెళుతున్నట్టుగా లేదూ?

"అవును!! దానివెనుక పట్టుచీరలు కట్టుకుని ఎవరో వడివడిగా నడిచిపోతున్నట్టు బరబరా చీరలసవ్వడి! అదిగో వినండి' అంటూంటే అందరికీ స్పష్టంగా ఓ పాతికమంది స్త్రీలు పట్టుచీరలు కట్టుకుని దొడ్డి

అంతటా తిరిగేస్తున్నట్లు!! మనుషులైతే ఎవరూ కనబడట్లేదుగాని, అందెల పట్టీలశబ్దం మాత్రం స్పష్టంగా వినిపిస్తోంది. ఈసారి అందరూ కలిసి లేచాం! గుంపుగా — 'ఈ వింతలు, విచిత్రాలూ ఏమిటో పరిశోధించాలి! ఎవరో ఇక్కడ ఈ పాతబంగళాలో దాక్కునివుండి మనల్ని వేధించాలనో, భయపెట్టాలనీ ఈ పరుగులసవ్వడి, చప్పుడులు, ఈ వికవికలూ, పకపకలూ — ఇలా ఈదురుగాలిలా గుక్కపట్టి ఏడ్చిన సవ్వడి — చేస్తున్నారు! అంటూ ఆశబ్దంవచ్చిన వెంటనే తుపాకీ అటే గురిపెట్టి సుడిగాలిలా పరిగెత్తాడు — చార్లెస్ బెల్ మహాశయుడే స్వయంగా! ఆయనవెనక మరిద్దరు దట్టించిన తుపాకులు వెంటతీసుకుని — అనుసరించాం!

ఆ శబ్దం అలా అలా దూరంగా పోయి పోయి ఎత్తుగా పెరిగిన ఓ గడ్డిపొదలో దూరి — మాయమైంది!

టార్చిలైటు వెలుగులో తుపాకీగొట్టంతో గడ్డిపొదను గడ్డివొంచిచూస్తే — అడుగున ఒక ఎత్తైన సమాధి! దానిపైన క్రాస్‌వంటి త్రిశూలంలావున్న — గుర్తు! దాంతో నికొలస్, తన టార్చిలైటు సహాయంతో ఆ సమాధిపై వున్న రాతిపలకమీద వున్న శాసనం లాంటి అక్షరాల్ని చదివాడు — ఇలా :

"ఇదేదో 500 సంవత్సరాలకు పూర్వం ఇక్కడ నివసించిన మహారాజు యశోధవళ చక్రవర్తికిచెందిన మహారాణులూ, అంతఃపుర స్త్రీలు, దాస దాసీజనం — అంతాకలిసి, స్వయంగా అగ్నికి ఆహుతై పోయిన వివరాలు! — 'కార్తీకశుద్ధ పౌర్ణమి!' విక్రమశకం — 1895వ

సంవత్సరం'' — అని పంచాంగపు లెక్కలతోసహా తిథి, వారం, నక్షత్రం, ఆనాడు ఆహుతైనవారి వివరాలూ వ్రాసివున్నాయి'' అన్నాడు దాన్ని చదివి :

“నేను చెప్పలేదా? లండన్ సమీపంలో డోవర్‌వద్ద జరిగినకథ గురించి! మరణించిన రాజుల సమాధులవద్ద ఇలా ప్రేతాత్మలు (Ghosts), పిశాచాలు, ఇంకా ఇప్పటికీ అందరినీ భయభ్రాంతులను చేస్తున్నాయి. సరిగ్గా ఇవీ అలాంటివే! ఎందుకైనా మంచిది. మనమీ ప్రదేశాన్ని వొదిలిపెట్టి పోవడమే మేలు.”

“కాని — ఇంతరాత్రి ఎలా? కనీసం మనం తెల్లవారేదాకా కాస్త రెస్టుతీసుకుని పోదాము అందరమూ కలిసే” అన్నాడు భారతీయసైంటిస్టు ‘మేఘనాద్ సాహా’. “అయ్యా! నీకీ విషయాలు కొత్త!! బహుశా నమ్మకం కూడా లేకపోవచ్చు! కానీ, ఇలాంటి దెయ్యాలకొంపలో వుంటే ఏంజరుగుతుందో నీకు తెలియదు. ఇలాంటి కొంపల్లో ఇంతకుముందు జీవించిన మనుష్యులను బలవంతంగా రక్షించేవారులేక దారుణంగా హత్య చేయించితే అలా చచ్చిపోయినవారి ఆత్మలు, కక్షతోనూ, ప్రతీకారంకోసం ఇంకా ఘోషిస్తూవుంటాయి! వారి ఎముకలు భూమి అడుగున నేలలో పాతివున్నంతవరకూ — అవి ఆ ప్రదేశాన్ని విడిచిపెట్టి పోలేవు! పైగా మనుషుల్లాగే మనలా వాటికి విపరీతమైన ఆకలి, దాహం, పిచ్చికోపం, కక్ష కలిగివుంటాయి.

ఇంగ్లండ్ డోవర్ రాజభవనంలో 500 ఏళ్ళనాటి ఇంగ్లీష్ జమిందారుల శవాలు సమాధులలోంచి ఇలాగే లేచి ఇప్పటికీ తిరుగుతూనే,

వుంటాయి! వాటిని పరిశోధించాలని వెళ్ళి ఆరాత్రి అక్కడ రెస్టుగా పడుకుని నిద్రించినవాళ్ళు — మర్నాడు ఉదయమే నౌకర్లు వెళ్లి — వేడివేడి 'టీ' తీసుకునివెళ్ళి వారిని లేపడానికి చూస్తే — దుప్పటి అడుగున వారి ఎముకలు మాత్రమే లభించాయి'' — అన్నాడు చార్లెస్ బెల్, నుదుటపట్టిన చెమట చుక్కలు తుడుచుకుని తన పైప్‌ను మళ్ళీ వెలిగిస్తూ!

"బాబోయ్! మీరు మా రక్తం గడ్డకట్టే విషయాలు చెపుతున్నారే? మాగుండెల్ని భయంతో పిండేస్తున్నారు!" అన్నాను.

"ఎందుకంత భయం? — ఒకప్పుడు వాళ్ళూ మనలాంటి మనుషులే! వాళ్ళేమీ పెద్దపులులుగానీ, విష సర్పాలుకానీ, కరిచే పాములుగానీ కారు!" అన్నాడు పాటియాలా యువరాజు — బహుశా తమ అంతఃపురంలో రాణీ సాహెబాలను తలుచుకుంటూ.

హడావుడిగా తన పైపును తిరిగి వెలిగించుకుంటూ టోపీని కళ్ళమీదకు లాక్కుని లేచాడు చార్లెస్ బెల్!

"బ్రదర్! మనం తక్షణం ఈ బంగళాని విడిచి వెళ్ళిపోవాలి! ఈ చుట్టూ వున్నదంతా స్మశానం! వీళ్లంతా స్పిరిట్స్ (Spirits) ఘోస్ట్ అంటామే ప్రేతాత్మలు! భూతాలు!! మనం దాటివచ్చిన ముందరి ఆవరణలోని విశాలమైన గోతులు సమాధులైన గోరీలు! ఎరక్కపోయి దూరాంగదా? ఈ బంగళాలోకి!

మీకెవరికైనా ఇలాంటి భూతాలు, పిశాచాలతో అనుభవంవుందా! లామాలకూ, యోగులకు వీటిని పారద్రోలే మంత్రాలు తెలుస్తాయంటారు! మీకేమైనా వచ్చా?" అంటూనే బెల్‌మహాశయుడు సమా

ధానం కోసం వేచి చూడకుండా తన ట్రావెలర్స్ బాగ్‌ను వీపుకు తగిలించుకొని ఆరిపోయిన పైపును చేతిలో పట్టుకొని పరుగులాంటి నడకతో బయటకి దారితీశాడు!

దాంతో ఒక్కదెబ్బతో అందరూలేచి నిలబడ్డారు — 'మనమీ ప్రదేశాన్ని తక్షణమే వొదిలిపెట్టి వెళ్ళిపోవాలి! ఎంత రాత్రైనాసరే!

తెల్లారేదాకా ఇక్కడేవుండి ఈ బంగళాలో మనకు మన ఎముకలు కనబడేవరకూ వేచివుండాలని మనమెవరమూ ఆశపడటంలేదు — అంతే!" అంటూ ఒక్కొక్కరూ తమ హైకింగ్ (Hiking) బ్యాగులను వీపున బిగించి, టోపీసర్దుకుంటూ, తుపాకీ పట్టుకుని తలుపులువేసి బయటకు వచ్చాం. ఆ సాహసబృందం మొత్తంఅంతా ఆందోళనా, ఉద్రేకంతో! బయట కురుస్తున్న మంచు, జివ్వున ఎముకలు కొరికే చలిగాలినికూడా ఎవ్వరం లెక్కచేయలేదు.

"మనకా గొర్రెలకాపరి ముందే చెప్పాడు! పాపం! ఇది పిశాచాల కోనబాబూ! భద్రం! అన్నాడు! మనం విన్నామా? లేదు!! — అనుభవించాము" — అంటూ భళ్ళున నవ్వాం అందరం!

II

దూరాన — ఓ లామాసరీ ఆశ్రమం! నిర్మలమైన ఆ హిమాలయ వాతావరణంలో గాలిలో దుమ్మూ, ధూళీ మరేవిధమైన కాలుష్యాలూ లేని కారణంచేత — లోయ దాటి కొన్నిమైళ్ళ తరబడి ఏ చిన్నవస్తువున్నా సరే, ఎంతో స్పష్టంగా కంటికి కనిపిస్తుంది.

ఆకాశం ముదురునీలమూ, వంగపండు రంగూ కలిసిన ఊదా రంగుకాంతితో, మఖమల్‌తెరవంటి రంగులలో మెరుస్తోంది! తెల్లగా, వెన్నముద్దలా వెలుగుతున్నాడు — నీలాకాశంలో శుక్రుడు తూర్పుదిశగా!

పైన నక్షత్రాలు నడినెత్తిన వజ్రాలు పారబోసినట్లు ఎంతో దగ్గరగా వెలుగుతూ కనిపిస్తున్నాయి! చలికి వాతావరణం గడగడ వణికిస్తూ రక్తాన్ని గడ్డకట్టించేస్తోంది. వెన్నులో నరాల లోపలినుంచీ చలి జివ్వున కరెంటుషాక్‌లాగ లాగేస్తోంది! అయినా బైట వాతావరణం ప్రశాంతంగానే వుంది.

"బహుశా తెల్లవారవస్తున్నది! సమయం మూడున్నర నాలుగు గంటలు అయిందేమో!" అనుకుంటూ తన వాచీ చూసుకున్నాడు. చీకట్లో వెలుగుతున్న రేడియం అంకెలలో టైము ఎంత చూపిస్తోందో! అని! సరిగ్గా — తెల్లవారుజామున 3.45–గంటలయ్యింది!

"దూరంనుంచీ కనిపించే ఆ పెద్ద దీపస్తంభంలాంటి వెలుగు ఏమిటి?" అన్నాడు వెలికోవ్‌స్కీ! నికోలస్ రోరిఖ్ అతని వెనుకగా వచ్చి నిలబడి చేతులు అడ్డుపెట్టుకుని దూరంగా చూస్తూ — "అదేదో టిబెటన్ 'లామాసరీ' ఆశ్రమంపైన వెలిగే శిఖర దీపంలా వుంది"! అన్నాడు. దాంతో అందరికీ ఆశలు పుంజుకున్నాయి. ఉత్సాహం ఒక్కసారిగా ఉరకలు వేసింది, 'పోనీ అక్కడికైనా వెళదామా! ఈ మిగతారాత్రైనా ప్రశాంతంగా వుండవచ్చు, భయంకర పిశాచాలు ప్రేతాల బెడదలేకుండా?" అనుకుంటూ.

"అది నిజంగా టిబెటన్ లామాసరీ దీపమేనా? లేక అదికూడా

ఈ పిశాచాలు, దెయ్యాలుచేసే ఇంద్రజాలం కాదుకదా!" అన్నాడు బెంగాలీ వృక్షశాస్త్రజ్ఞుడు జగదీష్-చంద్రబోస్ వింతగాచూస్తూ.

"అది నిశ్చయంగా లామాసరీ ఆశ్రమంపైన వెలిగే దీపమే! ఎందుకంటే అది టిబెటన్ జడలబర్రె యాక్ (Yak) ల వెన్నతో చేసిన — దీపారాధన! పెద్దవెలుగుతో స్పష్టంగా పెద్ద బంగారురంగుకాంతితో నిలిచి వెలుగుతోంది! దానిచుట్టూ వాతావరణంకూడా నిర్మలంగా స్ఫటికంలా వుంది — ఇది నిశ్చయంగా లామాసరీ ఆశ్రమమే."

"లామాసరీలో ఇంత రాత్రికూడా దీపాలు వెలిగించి వుంచుతారా?" — అంటూ సాహా మహాశయుడు వింతగా ప్రశ్నించాడు!

"ప్రతి లామాసరీ ఆశ్రమంలోనూ — ఒక గంటస్థంభం వుంటుంది. దానిని మోగిస్తే చుట్టూరా వందమైళ్ళదూరం వినిపిస్తుంది, దూరానవున్న లామాసరి ఆశ్రమాలలో అన్నింటికీ వినిపించేలా! ఆ గంటస్థంభంపైన బోర్లించిన లాంతరు వంటి దీపం వుంటుంది. అందులో కరిగించిన యాక్ బర్రెల వెన్నతోపెట్టిన దీపం వుంటుంది! దీనినే 'అఖండ దీపారాధన!' అంటారు! లేదా లామాసరి ఆశ్రమంలో ఎర్రగా వెలిగే 'శిఖరదీపం!' అంటారు! ఇలా దీపం వెలుగుతూవుంటే అక్కడ లామాసరీ ఆశ్రమంలో సరిగ్గా జపధ్యానములు, తపస్సు, జ్ఞానంకోసం అన్వేషణా వుంటాయని సూచన! అంతేగాక ఈ దీపం వెలుగులో టిబెట్ ముఖ్య పట్టణం 'లాసా'కు వెళ్ళేదారికూడా కనిపిస్తున్నది.

'లాసా' టిబెట్‌కి రాజధాని. టిబెట్‌ను పరిపాలించిన దయాచక్రవర్తి బుద్ధదేవుడు నివసించిన 'పోతాలా-మహల్' (Potala) వుంటుంది అక్కడ!

"పోతాలా" అంటే ఒకపెద్ద కోటమాత్రమేకాదు — దాదాపు పదివేలమంది ముసలిలామాలు, తొంభైఏళ్ళకుపైబడ్డ పెద్దలూ, తెల్లవారుజామునే లేచి సస్వరంగా మంత్రాలను గానంచేస్తూ వుంటారు! అందుకని, మనం ఆ దీపస్తంభం కనిపించే దిక్కుగా వెళ్ళడమే మంచిది" — అన్నాడు నికోలస్ రోరిఖ్! లోయలోకిదిగే కాలినడకకు సిద్ధం అవుతూ. "అక్కడ ఇలాంటి భూతాలూ, పిశాచాల గొడవేం వుండదా?" అన్నాడు ఆందోళనగా పాటియాలా యువరాజు.

సమాధానంగా ఒక్కసారిగా ఫళ్ళున నవ్వారు నికోలాస్-రోరిఖ్, చార్లెస్ బెల్, ఔస్పెన్‌స్కీ ముగ్గురూ.

"అది అతిపవిత్రమైన యోగుల తపోభూమి! అంటే లామాల ఆశ్రమం! అందులోని లామాలు గొప్ప తాంత్రికులూ, మంత్రశాస్త్రం లోనూ, యోగశాస్త్రంలోనూ సిద్ధహస్తులు. వీరు ఎలాంటి భూతాలనూ, పిశాచాలనూ లెక్కచెయ్యకుండా వాటిని సీసాలలోనూ, జాడీలలోనూ పెట్టి బంధించివేస్తారు!"

"ఇంతేనా?" చార్లెస్ బెల్ వింతగా పైకిచూస్తూ — "మీరు శ్రీచక్రం అంటారే, అలాంటి యంత్రాలు గీతలతో వేసినవి మంత్రించి, ఆ రక్షలతోనే, ఇలాంటి క్షుద్రశక్తుల ఆటలు కట్టించి దిగ్బంధిస్తారుకూడా — ఈ లామాలు!"

"అయితే పోదాం పదండి — అక్కడికి!" అంటూ మాట్లాడకుండా పగలబడి నవ్వారందరూ!"

◆



16

లామా-‘దోర్జీ చోగ్యాల్‌తో సమావేశం!

“ఇదిగో! ఇటు చూడండి! ఈ మ్యాప్ (Map) లో చూపించిన కొండదారిగుండా మనమిప్పుడు “ఎవరెస్టు” శిఖరానికి దక్షిణముఖాన్ని చేరుకున్నాము! మనము ఇదివరకే మనయాత్ర ప్రారంభంలోనే అనుకున్న ప్లానుప్రకారం మనమీ ఎవరెస్టు దాటి దాని ఉత్తరముఖంవైపుకి చేరుకోవాలి. అందువల్ల మనమీ ఎవరెస్టు పర్వతాన్ని పైకిఎక్కి క్రిందికి దిగి శ్రమపడవలసిన అవసరంలేకుండా కొండచరియకు కుడివైపునుంచీ ప్రదక్షిణంగా తిరిగి తూర్పుగా యాభైకిలోమీటర్లు ప్రయాణించి అక్కడ్నుంచి ఉత్తరంగా ఇరవైఐదు కిలోమీటర్లు వెళ్ళాక — మరి ముప్పైకిలోమీటర్లు

గనక నడిస్తే — ఎవరెస్టు శిఖరాన్ని దాటి దాని ఉత్తరదిశగా చేరుకుంటాము. కాని, ఈమార్గం చాలా కఠినమైంది! వాతావరణం బాగుండక మంచుతుఫానులు చెలరేగకుండావుంటే కూడా ఊపిరితిత్తులు బద్దలైపోయేటంత ఆయాసం కలిగించే నిటారుగా ఎక్కిదిగే కఠినమైన దారి ఇది! అంతేకాదు! మనం ఈ ఎవరెస్టుశిఖరం అవతలికి జేరుకునేసరికి పూర్తిగా అలిసిపోతాము. ఇక ఒక్క అడుగుకూడా తీసి అడుగుపెట్టలేనంతగా అలసటపడిపోయి శ్రమతో నీరసించిపోతాము — అలా అంత దూరం ప్రదక్షిణంగా తిరిగిగనక మనం ప్రయాణిస్తే!

కాబట్టి — ఇప్పుడు మనముందున్నది ఓ కఠినమైన నిర్ణయం — మనమీ శిఖరంపైకి ఎక్కిదిగి అవతలికి వెళ్ళటమా? — అలాచేస్తే ప్రయాణించిన దూరము తక్కువే ఔతుంది! లేక ఇదంతా శ్రమగనక శిఖరంచుట్టూ ప్రదక్షిణంగా చుట్టుదిరిగి వెళ్ళటమా? ఇది టైము ఎక్కువ తీసుకుంటుంది! ఇందులో ఏది మనం చెయ్యాలో నిర్ణయించాల్సిన ఘట్టం మన ప్రయాణంలోని 'గర్భసంధి' వంటి చిక్కుముడిని సమీపించాము. ఇప్పుడు మన సాహసబృందంలోని సభ్యులందరం కలిసి ఏది మంచిదో, ఏంచెయ్యాలో నిర్ణయించాల్సిన దశ! అంటూ అంతా తమ ముందున్న సమస్యగురించి చర్చించుకున్నారు — ఇక ఒక నిర్ణయం తీసుకోవటం తరువాయి.

చార్లెస్ బెల్ మహాశయుడు తటాలున వెనకనుంచి ముందుకు తోసుకువచ్చి 'లామా' మహాశయుడిముందు నిలబడ్డాడు! ఈ అదను ముందుగానే పసిగట్టిన 'లామా' మహాశయుడు — తానూ ఈ నిర్ణయం

కోసమే ఎదురుచూస్తున్నట్టుగా తటాలున లేచినిలబడ్డాడు తాను కూర్చున్న చోటునుంచి.

"లామా మహాశయా! కొన్నిరోజులక్రితం మిమ్మల్ని మేము హిమాలయ పర్వతాలలోని వింతలగురించి అడిగాం! అప్పుడు సమయం రానందువల్ల మిమ్మల్ని వివరాలు అడగలేదు. ఇప్పుడు మీసహాయం అవసరం వచ్చింది" అన్నాడు.

"చెప్పండి! ఏంకావాలి? నేను మీకు చెయ్యాల్సిన సహాయం ఏమిటి?" అన్నాడు 'లామా' వేగంగా తన జపమాలను కుడిచేతిలో తిప్పుతూనే. "మిమ్మల్ని మేము ఇదివరకులా కాకుండా సూటిగా అడుగుతున్నాం — ఇప్పుడు! చెప్పండి ఈ హిమాలయ పర్వతాలలో రహస్య మార్గాలు మీకు తెలిసినవి ఖచ్చితంగా వుండివుంటాయని మా విశ్వాసం! అందువల్ల ఈ హిమాలయపర్వతాలలో భూగర్భంలోని సొరంగాలలో ప్రయాణించే 'రహస్యమార్గం' గూర్చి ఏదైనా వివరాలు మాకు తెలియజెయ్యండి!" అన్నాడు చార్లెస్ బెల్ సూటిగా నిలదీస్తున్నట్టుగా ప్రశ్నిస్తూ.

"ఔను! నేనూ విన్నాను! రహస్యమైన ఒక భూగర్భ సొరంగమార్గం — ఇక్కడే ఎక్కడో వున్నదని! చెప్పండి? ఇప్పుడేం చేద్దాం?" అన్నాడు లామా, రహస్యంగా తన జపమాలను తిప్పుతూనే.

"ఏంచేద్దాం? అని మీరే మమ్మల్ని ప్రశ్నిస్తే ఎలా? మీరు మా సాహసయాత్ర బృందానికి మార్గదర్శకులుగా ప్రమాణస్వీకరాం చేశారు, బోధిసత్త్వుని సాక్షిగా! భూగర్భ సొరంగమార్గం గురించి మీకు తెలుసని మాదగ్గర ఖచ్చితమైన భోగట్టావున్నది. గతంలో కొందరు సాహసయాత్రి

కులు మీరు పనిచేసే బౌద్ధదేవాలయంపద్దనుంచే ఈ రహస్య సొరంగ మార్గంగురించి వెళ్లేదారి తెలుసుకున్నారని విన్నాం!''

"మహాశయా! దయచేసి చెప్పండి ఇక ఈ రహస్యమార్గంలో ప్రవేశించే ద్వారం ఎక్కడవున్నదో; దాన్ని గుర్తించటం ఎలాగో! ఇది మా మొదటిప్రశ్న! రెండవది — ఈ గుహ ముఖద్వారం మనకిగనక కనబడితే అది తెరుచుకునేదెలాగ? ఇది మా రెండవప్రశ్న!

"గుహలో ప్రవేశించాక ఎంతకాలంనుంచో మూతబడిపోయివున్న ఆ సొరంగంలోని బిలంలో గాలిలేకుండా, మనుష్యులకు ఊపిరికూడా ఆడకుండా మనల్ని ఉక్కిరిబిక్కిరిచేసే ప్రమాదం ఉండవచ్చు — దానికేమిటి — ఉపాయం? దయచేసి వివరంగా దాని రహస్యాలు గుట్టువిప్పి — విశదంగా చెప్పాలి మీకు తెలిసిందంతా!

అలాంటి రహస్యమార్గములలో ప్రయాణించే అనుభవజ్ఞులైన బౌద్ధలామాలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారో కూడా మీరు చెప్పటం కాదు — మాకు శిక్షణనివ్వాలి!'' అంటూ చేతులెత్తి ప్రార్థనాపూర్వకంగా నమస్కరించారు అందరూ.

లామా మహాశయుడు వారి భక్తికి శ్రద్ధకూ చలించిపోయాడు! నెమ్మదిగా తన చుట్టూరావున్న యాత్రికులవంక చూస్తూ ఇలాఅన్నాడు — "మీ అభిమానానికి ఆత్మీయతకూ ఎంతో చలించిపోయాను. అసలు ఈ ప్రయాణం మొదట్లో నేను ఈ రహస్యాలను గురించి ఎవ్వరికీ బహిరంగ పరచకూడదని — ప్రాచీనకాలంనాటి "దేవరహస్యాలు" ప్రకటించి అపచారం చెయ్యరాదనీ నిశ్చయించుకున్నాను. కానీ, ఇప్పుడు

నా అభిప్రాయం పూర్తిగా మార్చుకున్నాను, ఇష్టంతోనే! మాకు ఆ వివరాలలో వున్న శ్రద్ధను నేను గమనించకపోలేదు. అంతేకాదు మీరు ఈ యాత్ర ఎందుకు చేస్తున్నారో ఊహించలేనంత తెలివితక్కువవాడినేం కాదు, మీరు చెప్పకపోయినా. ఇప్పుడు మీరు అందరూ నేను చెప్పేది జాగ్రత్తగా వినండి!"

"ఎవరెస్టు శిఖరానికి దక్షిణముఖానికి ఆగ్నేయంగా వెళితే ఒక లోయవున్నది పదివేల అడుగుల దిగువగా. ఇక్కడినుంచి ఈశాన్యంగా పద్ధెనిమిదివేల అడుగుల ఎత్తుకువెళ్ళే ఓ కాలిబాటవంటి మార్గం వున్నది. ఆ కాలిబాట ప్రారంభించే మొదట్లో కుడివైపున ఒకచిన్న దేవాలయం కనిపిస్తుంది. అది చాలాచిన్నదిగా ఒక గ్రామదేవత దేవాలయంలాగే వుంటుంది. ఆ గుడి గర్భాలయంలోని గౌతమబుద్ధుడి విగ్రహం పద్మాసనంలో కూర్చుని ఉత్తరదిక్కుగా తిరిగివుంటుంది. ఆ విగ్రహం కుడిచెయ్యి "**అభయ–ముద్ర**"లోనూ, ఎడమచెయ్యి పాదంపైనుంచి క్రిందికి నేలను తాకుతూ కనిపిస్తుంది "**భూమిస్పర్శ**"–ముద్రలో!

"ఇలా '**భూమిస్పర్శ**'లో వుండే బుద్ధవిగ్రహాలు చాలాచోట్ల వుంటాయి కదా?" అన్నాడు జగదీశ్‌చంద్రబోస్! "ఉంటాయిగాని ఇక్కడి బుద్ధవిగ్రహం ఎడమచేత్తో ఉపదేశముద్రను పట్టి మధ్యవేలు ఉంగరంవేలును భూమివైపునకు చూపిస్తూవుంటాయి. సరిగ్గా ఆ విగ్రహం చూపించే దిక్కుగానే వున్నది "రహస్యమార్గం"లోకి ప్రయాణించే సొరంగంయొక్క ద్వారం! అది మామూలుగా సంవత్సరంపొడవునా దట్టమైన మంచుతో కప్పబడి వుంటుంది. అందువల్ల ఆ సొరంగానికి ద్వారం ఎవరికీ కనపడకుండా రహస్యంగా వుంటూవచ్చింది గత ఐదువేల సంవత్సరాలుగా.

కులు మీరు పనిచేసే బౌద్ధదేవాలయంవద్దనుంచే ఈ రహస్య సొరంగ మార్గంగురించి వెళ్లేదారి తెలుసుకున్నారని విన్నాం!"

"మహాశయా! దయచేసి చెప్పండి ఇక ఈ రహస్యమార్గంలో ప్రవేశించే ద్వారం ఎక్కడవున్నదో; దాన్ని గుర్తించటం ఎలాగో! ఇది మా మొదటిప్రశ్న! రెండవది — ఈ గుహ ముఖద్వారం మనకిగనక కనబడితే అది తెరుచుకునేదెలాగ? ఇది మా రెండవప్రశ్న!

"గుహలో ప్రవేశించాక ఎంతకాలంనుంచో మూతబడిపోయివున్న ఆ సొరంగంలోని బిలంలో గాలిలేకుండా, మనుష్యులకు ఊపిరికూడా ఆడకుండా మనల్ని ఉక్కిరిబిక్కిరిచేసే ప్రమాదం ఉండవచ్చు — దానికేమిటి — ఉపాయం? దయచేసి వివరంగా దాని రహస్యాలు గుట్టువిప్పి — విశదంగా చెప్పాలి మీకు తెలిసిందంతా!

అలాంటి రహస్యమార్గములలో ప్రయాణించే అనుభవజ్ఞులైన బౌద్ధలామాలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారో కూడా మీరు చెప్పటం కాదు — మాకు శిక్షణనివ్వాలి!" అంటూ చేతులెత్తి ప్రార్థనాపూర్వకంగా నమస్కరించారు అందరూ.

లామా మహాశయుడు వారి భక్తికి శ్రద్ధకూ చలించిపోయాడు నెమ్మదిగా తన చుట్టూరావున్న యాత్రికులవంక చూస్తూ ఇలాఅన్నాడు — "మీ అభిమానానికి ఆత్మీయతకూ ఎంతో చలించిపోయాను. అసలు ఈ ప్రయాణం మొదట్లో నేను ఈ రహస్యాలను గురించి ఎన్నటికీ బహిరంగ పరచకూడదని — ప్రాచీనకాలంనాటి "దేవరహస్యాలు" ప్రకటించి అపచారం చెయ్యరాదనీ నిశ్చయించుకున్నాను. కానీ, ఇప్పుడు

“అంటే ఇప్పటికి ఐదువేల సంవత్సరములక్రితం, అంటే ఈ కలియుగం ప్రారంభించకముందునుంచీకదా! అప్పటినుంచీ ఇంకా ఇప్పటిదాకా ఈ భూగర్భంలోవున్న సొరంగం ఎవ్వరూ కనిపెట్టలేదా?” మధ్యలోనే అడ్డుపడుతూ అడిగాడు రష్యన్ పరిశోధకుడు ఔస్పెన్స్కీ.

“కొందరు కనుగొనటమూ, దానిగుండా ప్రయాణించటంకూడా జరిగింది. కని ఎంతో గుప్తంగా అలా ప్రయాణించినవారిలో ముగ్గురు నూతన శకానికి ప్రారంభకులైన ప్రవక్తలైన గురువులు! ఇందులో మొదటివారు గౌతమబుద్ధుడు. అంటే అహింసాజ్యోతి శాక్యమునిగా ప్రపంచములో “ధర్మ-చక్రాన్ని” తిప్పిన బుద్ధదేముడు! ఇకపోతే రెండవవాడుగా మళ్ళీ అలా ప్రయాణించిన వ్యక్తి పడమటిదేశాలలో కొత్త మతప్రవక్తగా పూజలు అందుకుంటున్న మీ “ఏసుక్రీస్తు” అనబడే యోగి ఈశా రెండవవాడు. మళ్ళీ అలా ప్రయాణించినవారిలో పరమపవిత్రమైన కార్తీకపౌర్ణమినాడు జన్మించిన గురునానక్ మహాశయుడు.

ఈ ముగ్గురూ ఆ బిలమార్గాన్ని, గుహను ఎలా తెరిచారు? ఎలాగ సొరంగం లోపలికి ప్రవేశించారు? అసహనంగానే ప్రశ్నించాడు చార్లెస్ బెల్.

తొందరపడకండి! అన్నాడు. ఈ ముగ్గురూ ఎవరెస్టు శిఖరానికి అడుగునుంచీ వాయవ్యదిశగా వెళ్ళే సొరంగముయొక్క ద్వారము తెరవకుండానే ప్రవేశించారు. అందువల్ల వారికి సొరంగ ముఖద్వారము తెరిచి ప్రయాణించాల్సిన అవసరము లేకపోయింది.

“ఏమిటి మీరనేది? మహాశయా! ఎవరెస్టు శిఖరం అడుగునుంచి

సారంగమార్గంలో ప్రయాణించారని చెబుతారు — మళ్ళీ మీరే సారంగ మార్గంలో ప్రవేశించే ద్వారాన్ని తెరవలేదంటారు. ఏమిటి ఈ పరస్పర విరుద్ధమైన వ్యాఖ్యలు అంటూ ప్రశ్నించాడు రష్యన్ రాయబారి అలెగ్జాండర్ నోటోవిచ్.

"మీకు కలిగిన అసహనాన్ని, చికాకును నేను అర్థంచేసుకోగలను. ఎందుకంటే రహస్య సారంగమార్గంలో ప్రయాణించాలంటే ఎవరైనా దానిలోకి ప్రవేశించి గుహ ముఖద్వారము తెరిచేవెళ్ళాలి నిజమే!

కానీ నేను చెప్పిన పైముగ్గురు మహాయోగులు, యోగసిద్ధులు. పసిపిల్లల ఆటలలాగ చాలా తేలిక వారికి. అందుకే గుహ ముఖద్వారం రాతిబండలతో మూసివున్నా దానిని తెరవకుండానే వారు ఒక కీనీడ గాజుగోడమీద ప్రయాణించినట్లు గుహలోకి ప్రవేశించి మెరుపులాగ సారంగంలో ప్రయాణించి అవతలికి చేరుకుంటారు. ఎందుకంటే వారు ముక్త పురుషులు. భగవంతుడు ముందే నిర్ణయించిన ప్రకారం వారు అలా ప్రయాణించగలిగారు ప్రయాణించవలసిన మార్గము మూసివున్నా. కానీ మనం సామాన్యులము! దేవుడి ప్రవక్తలముకాదుకదా! కనీసం యోగ పురుషులంకూడా కాదు. గట్టిగా శ్వాసబిగిస్తే వుక్కిరిబిక్కిరితో కిందామీదై పోతాము. అలాంటి మనం వారితోసాటిగా ప్రయాణించడం అసాధ్యం. అందుకనే మనం ఆ గుహలో ప్రవేశించే రహస్యమార్గాన్ని కనుగొని దానిని తెరవాలి.

"అది ఎలాగ తెలుస్తుంది!" ప్రశ్నించారు అందరూ ఏకకంఠంతో.

అది నేను చెబుతున్నాను అందరూ మీదపడకుండా ప్రశాంతంగా

నేనుచెప్పేది జాగ్రత్తగా వినండి అంటూ ప్రారంభించాడు.

నేను ఇంతకుముందు చెప్పిన గ్రామదేవతలాంటి మందిరం కనిపిస్తుంది. అందులోని బుద్ధుని విగ్రహం భూమి స్పర్శముద్రలో నేలను చూపేదిక్కుగా పరిశోధిస్తే సరిగ్గా బుద్ధుని చూపుడువేలు నేలవైపు చూపించే దిక్కుగానే ఆ సొరంగమార్గం తెరుచుకునే ద్వారం కనిపిస్తుంది. ఇక్కడికింత చాలు! మిగతాది అక్కడికి చేరుకున్నాక చూసుకుందాం! అనవసర విషయాలు, అక్కరలేని రహస్యాలు ఇక్కడ బహిరంగంగా చర్చిస్తే అపచారం. దుర్మార్గుల చేతిలోపడితే మనకి ప్రమాదం అంటూ ఆ లామా ప్రసంగాన్ని అంతటితో కట్టిపెట్టి భోజనానికి లేచాడు. వెంటనే మా సాహసబృంద యాత్రికులందరూకూడా భోజనానికి లేచారు ఆ సమావేశాన్ని అంతటితో ముగిస్తూ!

◆

17

తాషీ-లామా

హిమాలయ సాహసయాత్రీకుల బృందం అందరికీ దడా, వణుకూ పట్టుకుంది — ఊహించని ఘోరమైన అనుభవాలకు తట్టుకోలేక.

“ఏదైనా పులి, ఏగోలం (Leopard) లేక మంచుపులి వంటి ఎంతటి ప్రమాదకరమైన అడవిమృగాన్నైనాసరే లెక్కలేకుండా కాల్చిపారేస్తాను నా తుపాకీతో! కానీ ఇవి జంతువులూ కాదు, మనుషులూ కాదు — అటు ప్రాణమున్న మనిషి-శత్రువూ కాదు. మనుష్యుల్లా కన్పించే మరణించినవారి ఆత్మలట!

ఇలాంటివి నేనెప్పుడూ కలలోనైనా ఊహించలేదు ఛీ!” అనుకుంటూ జిమ్‌కార్బెట్ మహాశయుడు తన తలపైనుంచి క్రిందకీ, భుజాలవైపునుంచీ అడ్డంగానూ, ఏసుక్రీస్తును స్మరించుకుంటూ, “క్రాస్ గుర్తు” వేసుకున్నాడు తనకు రక్షణగా భయపడుతూనే!

భళ్ళున నవ్వాడు, వారి వెనకాలే నడుస్తున్న టిబెటన్ లామా — దోర్జీ మింగ్యార్ దోండప్ మహాశయుడు.

“ఏమిటి మీకంత ఆనందం కలిగించే ఆవిషయం?” — ఉక్రోషం తోనే అడిగాడు జిమ్ కార్బెట్, చిరాకుపడ్డట్టుగా!

“ఏమీ లేదు! — ఇక్కడి పిశాచాలకోనలోని దెయ్యాలకూ, భూతాలకూ మీ శిలువ గుర్తు ఏమీ రక్షించదుకదా! అని!! అదే మీరు రక్షగా వేసుకుంటే నాకు నవ్వువచ్చింది” అన్నాడు అతివేగంగా చేతిలో జపమాల తిప్పుకుంటూనే దోర్జీ మింగ్యార్ దొండఫ్!

“ఏమీ? ఎందుకు పనిచేయదు? ఈ దెయ్యాలు అంత శక్తివంతమైనవా? — మా ఏసు ప్రభువును కూడా ధిక్కరించేటంతటివా?”

“లేదు! — అలాగని కాదు, ఈ భూత్ బంగళాలో నివసిస్తున్న పిశాచాలన్నీ మీ ‘క్రిష్టియన్’ వ్యక్తుల ఆత్మల భూతాలేకదా! వాళ్ళు చనిపోయినప్పుడు ఎవరో క్రైస్తవఫాదరీయో, లేక బిషప్‌వంటి మతగురువో బైబిలు చదివి వారి శవంమీద శిలువగుర్తులు వేసిమరీ సమాధి చేస్తారు కదా! ఇంత జరిగినా వాళ్ళు చెక్కుచెదరకుండా — “మాకు 700 సంవత్సరాల వయస్సు” అంటూ నిర్భయంగా ఎదురుపడి మీకే చెప్పారు కదా? ఇంకేం శిలువ, నాబొంద!” అంటూ మళ్ళీ భళ్ళున నవ్వాడు.

దానితో ఒక్కసారిగా మా బృందంలోని నలుగురు క్రైస్తవసభ్యులూ ఆశ్చర్యంతో లామా దోర్జీ చోగ్యాల్‌వైపు తిరిగి ఆశ్చర్యంతో నోరుతెరిచి, కళ్ళు రెప్పవేయకుండా చూడసాగారు అతడి మాటలకు ఏమీ సమాధానం దొరకక...

“నిజమే! వాళ్ళు, మావాళ్ళే!! అవి క్రైస్తవదయ్యాలే!! ఏమిటో!!! నాకేమీ అంతుపట్టడంలేదు...” అనుకుంటూ చటుక్కున మెరుపు మెరిసినట్టు ఏదో కొత్త ఆలోచన మనస్సులో కలిగినట్టుగా తుళ్ళిపడి ఆ లామా వంక తిరిగి ఆశగా కళ్ళు వెలిగిపోతూంటే — “ఇటువంటి భూతప్రేత పిశాచాలకూ, — లేక ‘చేతబడులు’, స్మశానిక తాంత్రిక ప్రయోగాలకీ విరుగుడు బహుశా మీ లామాసరీ లోని పండి, అనుభవంతో పరిపాకం వచ్చిన యోగులైన లామాలు ఏమైనా చెప్పగలరేమో! టిబెటన్ మతంలో తాంత్రికం, స్మశానికి పూజలు వుంటాయని విన్నాను... అందుకే అడిగాను, దయచేసి నిజం చెప్పండి, దాచకుండా” అన్నాడు.

మిగిలిన సభ్యులు కూడా అతనితోపాటే ఆశగా చూపులు కలిపి బ్రతిమాలుకున్నట్లుగా చూస్తూ ప్రాధేయపడుతున్న స్వరంతో అడిగారు. దానితో ఆ లామా మహాశయుడు కొంచెం మెత్తబడి, ముందుకు నడుస్తూనే చకచకా జపమాల వేగంగా తిప్పుతూ చెప్పుకుపో సాగాడు.

“మామూలు మాటలతో కాలక్షేపంచేసే బదులు వీలైనంత త్వరగా ఈ పిశాచాలకోన దాటి, ఈ లోయదిగిపోయి — ఎదురుగుండావున్న మంచు మైదానం దాటి, ముందుగా అదుగో ఆ కనబడే దీపస్తంభంలైటు వెలుగుతున్నదే, ఆ లామాసరీకి చేరుకుందాం! అక్కడి ఆ గురువునే, పీఠాధిపతినే అడుగుదాం!

అలాంటివారిని టిబెటన్ లామాల్లో ఉన్నత పీఠాధిపతిగా, **‘రింపోచి’** (Rimpoche) అనీ, **‘తాషీలామా’** అనీ సగౌరవంగా పిలుస్తారు! సాష్టాంగ పాదనమస్కారంచేసి మరీ — వారిని సంభోదించాలి! అలాంటి మహాను

భావులు దశాబ్దాలతరబడి దివ్యమంత్రాలను జపించి, మంత్రసిద్ధిని పొంది తమ నరనరాలలోనూ ఆ మంత్రసిద్ధిని జీర్ణించుకుని వుండటమేకాక — ఆ మంత్రాధిష్టాన దేవతను తన ఆత్మలో ఐక్యంకూడా చేసుకుని వుంటారు. అలాంటివారిని కేవలం మహాపురుషులుగా భావించం! మా టిబెటన్ లామాలు శరీరం ధరించిన దేవతలు — అనీ, కొందరినీ, 'ప్రత్యేక-బుద్ధుడు' అనీ మరికొందరిని 'తుల్కూ'అనీ, లామాయొక్క మంత్రశాస్త్ర పద్ధతిలో పిలుస్తారు. ఇవన్నీ మీరుకూడా టిబెట్ గురించిన మీ ఇంగ్లీషులోని గ్రంథాలలో చదివేవుండవచ్చు! లేదా మా దలైలామా గురించి వ్రాసిన అనేక గ్రంథాలలో కూడా ఇలాంటి విషయాలు పూర్తి వివరాలతో వ్రాశారు" అంటూనే చకచకా తన చేతిలోని ప్రార్థనా చక్రాన్ని గిరగిరా తిప్పుతూ నడుస్తున్నాడు 'లామా' మహాశయుడు.

దాంతో హిమాలయపర్వతాలలోని ఆధ్యాత్మిక వ్యక్తులూ, మంత్రాలూ, సిద్ధపురుషులూ అంటే ఆసక్తితో చెవికోసుకునే నికొలాస్ రోరిష్చ్ షాకతిన్నట్టు ఉలిక్కిపడి — పరిగెత్తుతున్నట్టు లామాగారి ముందుకివచ్చి ఆసక్తిగా అడిగాడు. "మహాశయా! మీరు చెప్పినవన్నీ యదార్థం అని నాకూ, తెలుసు. కాని, నాకిన్ని వివరాలు తెలియవు! దయతో నా సందేహాలకు మీరు రహస్యం ఏమీ దాచకుండా వివరించాలి — ఈలోగా మనం శ్రమ తెలియకుండా ఈ "**పిశాచాలకోన** దాటి మంచు మైదానంకూడా దాటిపోవచ్చు" అన్నాడు.

"అంతేకాదు! మనం ఆ కనిపించే 'లామా-సరీ' సింహద్వారం ముందుకి కూడా చేరుకున్నా చేరుకోవచ్చు". ఆసక్తితోవున్న వేగంతోపాటూ

మనవెనక తరుముకుని వస్తున్న ప్రమాదంగురించి కాస్త దృష్టిలో పెట్టుకుంటే చాలు!" అన్నాడు రష్యన్ ఆధ్యాత్మిక పరిశోధకుడైన P.D. ఔస్పెన్స్కీ.

"మా టిబెటన్ మతంలో ఒకే దేవుడుండడు — మీ క్రీస్తులాగా లేక మహమ్మదులాగా! ఎవర్నో నమ్ముకుంటే అన్నికష్టాలూ పోతాయనీ, ఇక్కడి ప్రజలు నమ్మరు! వారికి కలిగే కష్టాలూ సుఖాలూ, అదృష్టమూ దురదృష్టమూ, రోగాలూ అనారోగ్యమూ, ఆనందమూ శుభకార్యాలూ ఇలాంటి సుఖదుఃఖాలన్నీ — ఒక వ్యక్తి చేసుకున్న మంచీ, చెడు కర్మలమీదే ఆధారపడి జరుగుతాయి.

'కర్మసిద్ధాంతం' భారతదేశంలోనే కాదు, బుద్ధదేవుడు తన "ధర్మచక్రం"లో భాగంగా ఇటు "కాలచక్రాన్నీ" అటు 'కర్మచక్రాన్నీ' రెండూ కూడా శాశ్వత సత్యాలని గుర్తించాడు. ధర్మమే చక్రంలా తిరుగుతూ కాలాన్ని ఒక ఇరుసులాగ, రథచక్రంలాగా దొర్లించుకుంటూ పోతుంది!

చక్రం తిరుగుతుంటే ఏం జరుగుతుందో — సరిగ్గా అదే జరుగుతుంది కాలంలో కూడా! చక్రం అడుగునవున్న ఆకులు తిరిగి తిరిగి పైకి ఎత్తుకు చేరతాయి! అలాగే — ఎత్తునవున్న ఆకులు తిరుగుతూ చక్రం అట్టడుగుకి చేరతాయి! అలానే కాలచక్రం మన కర్మనుకూడా ఓ చక్రంలా తిప్పుతూ, ఎవరు చేసిన కర్మలకు ఫలితాన్ని వారికి టైము ప్రకారం వర్షిస్తుంది! దీనిని ఎవరూ తప్పించలేరు — ఏ క్రీస్తు అయినా సరే, మహమ్మదు అయినాసరే, చివరికి బుద్ధదేవుడయినా కూడా, మన కర్మలనుంచీ తప్పిస్తానని ఆయన ఎవరికీ చెప్పలేదు!

"చాలా ఆసక్తిగావుందే! మీరు చెప్పేది! మరి లామాలు బుద్ధ దేవుడిని శరణుపొందేదెందుకు?" అన్నాడు సాహసయాత్రికులలో మేధావీ, అపరాధ పరిశోధకుడైన గూఢచారిగా పదునుపెట్టిన తెలివిగల చార్లెస్ బెల్.

"బుద్ధదేవుని శరణుపొందేది ఆయన మనకు తాను కనుగొన్న సత్యాలను నిర్భయంగా ఉపదేశించాడు, ఏమీ దాచకుండా — అందుకు! అందులో మొదటిది 'కర్మసిద్ధాంతం'. రెండవది — మనిషి అనేక జన్మలెత్తి తాను చేసిన మంచీ చెడు కర్మలను అనుభవించి, చివరకు సత్యమూ ధర్మమూ ఆచరిస్తూ నిజమైన శాంతితో, ఏ ఇతర జీవులకూ నొప్పీ, బాధా కలిగించని అహింసా సూత్రాలను ఒక వ్రతంలాగా చేస్తే, ఒక రోగి నిత్యం మందులు వాడినట్లుగా — కొన్నాళ్ళకు రోగంలాగే తగ్గిపోతుందికదా! అలానే మనిషి చేసిన కర్మలు రెండూ, అంటే మంచీ చెడూ పూర్తిగా అరిగిపోతాయి! చివరికి — కరిగిపోతాయి! అప్పుడు వారి ఆత్మపరిశుద్ధమై నిర్మలమైన ఆకాశంలా — ఒక స్ఫటికంలాగా తయారౌతుంది. అంటే అనవసరమైన క్రోధాలూ, అర్థంలేని అహంకారమూ, పిచ్చి మమకారమూ, అనవసర భయాలూ, వాటివల్ల ఇతరులకు చేసే అపకారంవల్ల కలిగే దుఃఖాలూ మొదలైనవేవీ వుండవు.

అలాంటివారే 'బోధిసత్త్వుల'వుతారు — అంటే నిర్మలమైన జ్ఞానం, అంటే సత్యమేదో, మూఢవిశ్వాసమేదో తన వివేకంతోనే విచక్షణతో తెలుసుకోగలుగుతారు. అలాంటివారికి ఏ మతగ్రంథమూ అక్కరలేదు. తన ఆత్మయే తనలోని గురువు! తన జీవితానికి మార్గదర్శి — తనలోని

జ్ఞానమే!! అలాంటివాడు పూర్వమే అనేక జన్మలనుంచీ ఒక లక్ష్యంతో దీక్షగా పెట్టుకుని, సత్యాన్నే మనస్సులో ధ్యానిస్తూ — అహింసనే తన నిత్యజీవితంలో ఒక నిష్ఠగా ఆరాధిస్తూ జీవిస్తాడు!

"తిరిగే కాలచక్రం గిర్రున తిరిగిపోతూ — కత్తులూ చాకులూ సానపట్టేవాడి చక్రంతో సానపట్టేవాడి చేతిలో పదునుపెట్టబడినట్టే — ఆ బోధిసత్త్వుని మనస్సూ, ఆత్మా కాలంతో పదునెక్కి అనుభవంతో యదార్థసత్యాన్ని గ్రహించగలుగుతుంది! ఆతరువాత అతడికి "కర్మ" వల్ల ఏభయంలేదు. కాలచక్రం తిరుగుతున్నా అతడు కాలానికిపైన వుండే తపోలోకాల్లో — అంటే నిత్యముక్తులూ అవతార బుద్ధులూ వుండే దివ్యలోకాల్లో ఒక హైడ్రోజన్ బెలూన్‌లాగా పైలోకాల్లోకి తేలిపోతూ — అలా కర్మనూ, శరీరాన్నీ దాటిపోతాడు! అలాంటివాడు — ఇక తిరిగి జన్మ ఎత్తడు.

"అదేనా మోక్షం అంటే? నిర్వాణం అని మీ బౌద్ధులు చెబుతారే అది ఇదేనా?"

ఆసక్తిగా ప్రశ్నించాడు నికోలాస్ రోరిఖ్.

ఆగండాగండి! — "అతడు భూమిమీద తిరిగి జన్మించడు" అన్నానుగానీ, పైలోకాలలో జన్మించడని అనలేదే? కర్మఅనేది ఒక్క భూలోకంలోనే కాదు, పైలోకాలలో వుండే దేవతలకూ, గంధర్వులకూ, కిన్నర కింపురుషులకూ, విద్యాధరులకూ, మహనీయులైన పుణ్యజీవు లందరకూ కూడా వర్తిస్తుంది! చివరకు మనం పారిపోయివస్తున్న ఈ భూత్‌బంగళాలోని దెయ్యాలకు కూడా — ఆ కర్మసిద్ధాంతంవలననే

వారికి ఇలా సమాధులనంటిపెట్టుకుని పడివుండవలసిన గతి — ఏర్పడింది! అప్పుచేసినవాడు అప్పుతీర్చేదాకా జైల్లోవుండాలి కదా! లేకపోతే మంచిగా శ్రమచేసి మిగిల్చిన లాభంతో అప్పుతీర్చేసి ముందుగా జైలు నుంచి బయటికి రావచ్చు!

సరిగ్గా ఇలాగే ఆ పైలోకాల్లో వుండే ప్రత్యేక బుద్ధులూ, బోధిసత్త్వులూ దయతో తమ తపశ్శక్తినీ, పుణ్యాన్నీ భూలోకంలో జీవిస్తూ బాధపడే మనలాంటి జీవులకు ధారపోస్తారు! — అర్హులైనవారికేనండోయ్! దొంగలందరికీ సాయంచెయ్యరు!"

"వారెవరికి సాయంచేస్తారో మనకి ఎలా తెలుస్తుంది!" అడిగాడు జీవశాస్త్రజ్ఞుడు ప్రొఫెసర్ రే. లంకాస్టర్ తనకు తెలిసిన పరిణామ సిద్ధాంతాన్నీ, జీవుల ఆత్మయొక్క పరిణామం గురించీ, తన మనస్సులోనే నెమరువేసుకుంటూ, ఆశ్చర్యంగా.

"తన స్వార్థంకోసమూ లేదా తన మంచికోసం ఇతరుల మంచిని చెడగొట్టేవాడూ — లేక ఇతరుల కీర్తి, సుఖం, ఆనందం — ఇంకా తనకు లేనివి ఏవైనా చూసి బాధపడేవాడూ, అసూయపడేవాడూ తానింకా కర్మనుండి పరిపాకం పొందలేదు, అని అర్థం! అలాంటివారు వెంటనే ఇతరులకు అపకారం చెయ్యకపోయినా, ఇతరుల మంచిని సహించలేరు. అలాంటివారికి కాదు, ఈ బోధిసత్త్వుల, లామాల అనుగ్రహం, సహాయం!"

"బాధలోవున్న మనిషిని చూడగానే సహజంగా జాలి కలగాలి. మంచివారిని చూడగానే సహజంగా ప్రేమకలగాలి! "ప్రేమ" అంటే

ఇది మీ ఇంగ్లీషుసినిమాలలో చూపించే శారీరక కామం కాదు! ఒక పసిబిడ్డను తల్లి పాలుపట్టి, ఆడించి, వాడి పెరుగుదలను ఎలా కాంక్షిస్తుందో అలాగ — ఇతరుల మేలుకోరి వారికి సహాయంచేయడమే నిజమైన ప్రేమ! మనకీ ప్రపంచంలో ఇలాంటివారూ కనిపిస్తారు అరుదుగా! వీళ్లే నిజమైన పుణ్యాత్ములు! వారికి ఎంత నష్టంకలిగినా, బాధకలిగినా, కోపంవచ్చినా ఇతరులకు హానిచేయడం వీరికి చేతకాదు!

అంటే మానవజాతిలో పసిబిడ్డల వంటి నిర్మలమైన ఆత్మలు వారివి. ఇది వయస్సుతో వచ్చేది కాదు. కేవలం పూర్వపుణ్యం వల్లనే ఇటువంటి అంతరాత్మ జన్మతః మనుషులకు లభిస్తుంది — అట్టివారికే పరమగురువులు సాయంచేస్తారు. మానవజాతి పురోగతికి కదా? — వారు తమ శక్తినీ, తపస్సునీ ధారపోస్తామని ప్రతిజ్ఞచేసింది?”

“... అన్నట్టు మాటలలోనే వచ్చేశాం!! — మనం మంచుఎడారి దాటి. అదుగో, ఆ బంగారువాకిలి కనిపిస్తున్నదే! నగిషీలతో, పద్మాలతో, సింహాలు, ఏనుగుల శిల్పాలు చెక్కబడివున్నదే! అదే **‘లామా-సరీ’** ఆశ్రమం. అమ్మయ్య! వచ్చేశాం ఎలాగోఅలా. ఇక మన కష్టాలు తీరి నట్టే” అంటూ పరుగులాంటి నడకతో ‘లామా’ మహాశయుడు తన వెనకాలే వస్తున్న సాహసయాత్రికుల గుంపును వదిలివేసి — లామాసరీ లోకి నేరుగా ప్రవేశించి ముఖమండపంలోని పెద్ద కంచు-గంటను మోగించాడు **‘ఖంగ్గ్!’** మనే శబ్దంతో!

దానిని “ధర్మగంట” అంటారు. ఎవరికైనా కష్టాలు, బాధలు కలిగితే ఆ గంటను మోగిస్తారు; అక్కడి గురువుల ఆశ్రయంకోసం!

ఇవతలే వున్న మా సాహసయాత్రికుల బృందం ఆ లామాసరీలోని నిశ్శబ్ద ప్రశాంత వాతావరణానికీ — జంకిపోయినట్టుగా కాస్త వెనక్కితగ్గి — లోపలికి ప్రవేశించే సాహసం లేక సింహద్వారం బయటే నిలబడ్డారు, తమ లామా మిత్రుడు తీసుకొచ్చే మంచివార్త కోసం!

◆

18

దత్తప్రభువు దర్శనం !

“మీరీరాత్రి చూచినది — మామూలుతాంత్రికుని ‘ఛోడ్’ హోమ ప్రక్రియ మాత్రమేకాదు. మీరు చాలా అదృష్టవంతులు. మీరు బయలు దేరిన సంకల్పం శుద్ధమైనదీ, పవిత్రమైనదీ అయివుండాలి! లేకపోతే మా లామాసరీలోని ముసలి లామాలకు సైతం దర్శనందొరకని సిద్ధ పురుషులూ, పరమగురువులూ, సిద్ధగురువైన “మహాశోభనం” అనబడే శాశ్వత చిరంజీవపురుషుడు మీకు దర్శనంఇచ్చాడు. ఆయనను మీ భాషలో భారతీయులు “దత్తప్రభువు” అంటారు. ఆయన గురించిన కథలూ, గాథలూ ఇక్కడ టిబెట్‌లోని గొర్రెలకాపరులకు సైతం తెలుసు. ఎప్పటికప్పుడు, ఆయన అకస్మాత్తుగా దర్శనమిస్తాడని ఇక్కడ మా టిబెట్ లోని వారందరూ వూహిస్తుంటారు. కానీ ఆయనను ప్రత్యక్షంగా చూసిన వారు ఈమధ్యకాలంలో కనబడలేదు! — ఇవాళ మీరు చూశారు!

అదృష్టవశాత్తూ మీరు తొందరపబడి ఏ తెలివితక్కువపనీ చేయలేదు కదా?" — లామాసరీలోని తాషీలామా తన బంగారు ధర్మసింహాసనంపై కూర్చుని ఆ సాహసబృందాన్ని చూస్తూ అన్నాడు. ఆయన చేతిలో జపమాల వేగంగా తిరుగుతోంది, ఆయన మాట్లాడుతుండగానే "మేం అంతపనీ చేసేవాళ్ళమే! మా తుపాకీలను దట్టించాంకూడా, ఇంకా నయం, పేల్చాంకాదు!" అన్నారు అందరూ ఏకకంఠంతో.

భళ్ళున నవ్వాడు ముసలి తాషీలామా గురుదేవులు. తుళ్ళిపడ్డారు సాహసబృందం. "లామా! మా తెలివితక్కువతనానికి మీరు నవ్వుతున్నారా?" అన్నాడు నికోలస్ రోరిఖ్ — టిబెటన్ లామాలన్నా, ఆశ్రమాలన్నా అభిమానంకలవాడు.

తాషీలామా వుక్కిరిబిక్కిరిగా నవ్వుతూ, శ్వాసఅందక నిదానంగా అన్నాడు. "మీరు తుపాకీపేల్చినా ఏమవుతుంది? ఏమీకాదు!"

"ఏమీకాదా? పదిమందిమి ఒక్కసారిగా తుపాకీలుపేల్చినా?!" అన్నారు అంతా ముక్తకంఠంతో.

"అవును! ఆ దత్తప్రభువును కనీసం తాకనైనాలేవు మీ ఆయుధాలు! ఎందుకంటారా? ఆయన శరీరం వుండేది ఈ పంచభూతాలలో కాదు — భూమీ, నీరూ, నిప్పు, గాలీ అనే ఈ పంచభూతాలకు పైనవుండే 'పరమాకాశతత్వం'లో — శాశ్వతరూపంలో నిలిచివుంటారు ఆ యోగినాధులు! అందుకే మా టిబెటన్ లామాలుసైతం ఆయనపేరు చెబితే మోకాళ్ళపై కూర్చుని, మోకరించి ప్రార్థిస్తారు! దత్తప్రభువు శంఖం వినిపిస్తే, తుఫానువర్షం కూడా ఆగిపోవాల్సిందే. మంచుపడటంకానీ, ప్రచండంగా

ముంచుకొస్తున్న మంచుతుఫానుకూడా ఆగిపోవాల్సిందే. అలాగే నిలబడి పోవాల్సిందే.

అంతెందుకు? నా చిన్నతనంలో ఒకసారి, నేనింకా పదేళ్ళ పిల్లవాడిగా వున్నప్పుడు టిబెట్‌లోని నదివొడ్డున ఆడుకుంటున్నాను. నాకిప్పుడు తొంభైఏళ్ళు దాటింది. నదివొడ్డున రాయిమీద ఒక పిచ్చివాడు కనిపించాడు. నేను వెళ్ళి ఆయనను బెదిరింపుగా ఏదో మాట్లాడబోయాను. అంతే! మరుక్షణమే ఆయన నిలుచున్న బండరాయి పక్కనేవున్న కొండలోకి చేతినిదూర్చి భుజందాకాచొప్పించాడు. ఆశ్చర్యం! అంత బండరాయీ, వెన్నపూసలా దారిచ్చింది, అతని చేతికి! ఏం జరిగిందో తెలిసేలోగా నా ఊపిరి ఆగిపోయింది! తటాలున ఆ శిలలోంచి ఒకపెద్ద శంఖం బయటకుతీశాడు. అది అడుగున్నర రెండడుగుల పొడుగున్న కుడివైపు ప్రదక్షిణగా తిరిగిన 'దక్షిణావర్తశంఖం'! నన్ను చూసి వికటంగా నవ్వి, ఆ శంఖాన్ని 'భం!' అని పూరించాడు.

"ఆశ్చర్యం!!! నాకళ్ళను నేనే నమ్మలేను! మరుక్షణమే గలగలా ప్రవహిస్తున్న నది వెనక్కితిరిగి వ్యతిరేకంగా ప్రవహించింది, ఆయన దిక్కుగా! తరువాత ముందుకు ప్రవహించడం మానేసి గుండ్రంగా సుడిగుండంలా ఆయన పాదాలచుట్టూ ప్రదక్షిణచేసి నిలబడిపోయింది, శంఖం వూదినంతసేపూ. ఆ శంఖం ధ్వనించగానే పట్టపగలే ఆకాశంలో నక్షత్రాలు కన్పించాయి. తూర్పుపడమరలుగా సూర్యుడూ, చంద్రుడూ ఒక్కసారేవెలిగారు. మరుక్షణమే ఆయన అన్నీమాయంచేసి చేయివూపుతూ నన్ను దగ్గరికి పిలిచాడు. తలపైన అతని అమృతహస్తం వుంచి ప్రేమగా

“తాషీలామా! తాషీలామా!” అంటూ మూడుసార్లు మంత్రంలా ఉచ్ఛరించాడు. నాకేమీ అర్థంకాలేదు. ఇప్పుడు వెనక్కితిరిగి చూచుకుంటే, ఆయన నేను భవిష్యత్తులో ఈ లామాసరీకి పీఠాధిపతిగా ఈ తాషీ లామాగా సింహాసనాన్ని అధిష్టించడాన్ని తెలిపే భవిష్యత్తును సూచించాడని తెలుస్తుంది.

మా గురుదేవులు చెప్పేవారు — దత్తప్రభువు జరగబోయేదానిని చెప్పడం మాత్రమేకాదు — ఆయన ఏంచెబితే అదే జరుగుతుంది! ఆయన సిద్ధపురుషుడు! — కాదు కాదు, మాట్లాడే భగవంతుడు! అతడే ‘చెన్‌రెజీ’-దేవుడు. ఈ టిబెట్ రక్షకుడైన ‘వజ్రపాణి భోదిసత్త్వుని’ అవతారం! మీ జన్మలు తరించాయి! మీ సాహసయాత్ర దిగ్విజయం కానున్నది! మీకు దత్తప్రభువు ఆశీస్సులు లభించాయి! ఇక మీరు నిశ్చింతగా మీ ప్రయాణాన్ని కొనసాగించవచ్చు, ఈరోజునుంచే” అంటూ తాషీలామా తనపక్కనేవున్న పెద్దగంటను మోగించాడు.

పరుగున నలుగురు బ్రహ్మచారులు వచ్చి ఈ సాహసయాత్రికులకు వేడివేడి టిబెటన్ త్సాంపా ఇచ్చారు, ఇంకా రొట్టెలవంటి ఆహారాన్ని పెట్టి వినయంగా ముందుకువంగి నమస్కరిస్తూ — వెనక్కి వెనక్కే నడుస్తూ సెలవుతీసుకున్నారు, గౌరవసూచకంగా!

◆

19

అఘోరమూర్తి !

మాతాతగారి వందఏళ్ళనాటి సాహసయాత్ర చదువుతూవుంటే — అది ఒక గాథ చదువుతున్నట్టుగా అనిపించలేదు. మొదటిపేజీ చదవటం ప్రారంభించిన క్షణంనుంచి — వేరే ప్రపంచములోకి అడుగుపెట్టినట్టు నాచుట్టూరావున్న పరిసరాలను మరిచిపోయే ఒక మాయాజాలము మంత్రదండముతో మంత్రించి సృష్టించిన మాయాలోకములోకి అడుగు పెట్టినట్టు నా పరిసరప్రపంచమును మరచిపోయాను. హిమాలయాలలో అడుగుపెట్టి నడకసాగిస్తున్న ఆ రిపోర్ట్‌ని చదువుతూవుంటే అది మా తాతగారి సాహసబృందయాత్ర కథలాగ లేదు! చదువుతున్న నేనూ — రివ్వున ఆకాశంలో ఎగిరి ఆలోచనలమీద తేలిపోతూ మరోప్రపంచంలో సాహసయాత్రచేస్తూ సీతాకోకచిలుకలాగా ఊహాలోకములో విహరిస్తున్నట్లుగా వుంది. కొన్నిచోట్ల అందమైన జలపాతాలు, మంచుపర్వతాలూ

కనిపిస్తే, మరొకపేజీలో భయంకరమైన తాంత్రికహోమాలు, భూతాల, దెయ్యాలకొంపలు నావెన్నులో చలి, భయం పుట్టించి వణికించేస్తున్నాయి.

“ఇది నిజంగా రిపోర్టా? లేక నా అద్భుతమైన రంగురంగుల కలల విచిత్రప్రపంచమా? అనుకుంటూ ఒక్కొక్క పేజీ నమిలేస్తున్నట్టుగా — తననుతానే చదివిస్తోందా రిపోర్ట్. ఇంతలోకే నాకళ్ళు ఠక్కున ఆగి పోయాయి.

అఘోరీ! — అన్న అధ్యాయము చూడగానే. ఓరి భగవంతుడా! ఈ పేరేమిటి వింతగావుంది అనుకుంటూ హిమాలయ సాహసయాత్రికుల బృందము అనుభవాలన్నీ ఆతృతగా చదవసాగాను.

పూజ్య పీఠాధిపతి తాషీలామా గురుదేవులను లామాసరీ ఆశ్రమాన్ని వీడ్కొని ముందుకు సాగిపోతున్నాము. వాతావరణము ప్రశాంతముగా వుంది. ఆకాశము నీలముగా మబ్బులులేకుండా నిర్మలముగా వెలుగుతోంది. ప్రొద్దుటి నీరెండ బంగారుకాంతితో వెలుగులు చిమ్ముతూ గోరువెచ్చగా మా శరీరాలను తాకుతోంది ఎంతో హాయిగా! హూయిమంటూ చల్లని ప్రశాంతవాయువులు మా చెవులను తాకుతూ తలపైనుండి నెమ్మదిగా వీస్తున్నాయి పరమసుఖాన్ని కలిగిస్తూ, ఒక స్నేహితురాలు ప్రేమతో తాకే స్పర్శలాగ! ఉత్సాహంగా అడుగులువేస్తూ చురుకుగా నడకసాగించాము. ఉదయమే లామాసరీ ఆతిధ్యంతో వేడిగా మా కడుపులో నింపుకున్న త్సాంపా జావ వేడివేడి ఫలహారము మాకు ఎంతో అండగా నిలిచాయి. శ్రమ తెలియకుండా అందరమూ నవ్వుతూ, పేలుతూ, పాడుకుంటూ ఉల్లాసంగా నడుస్తున్నాము.

హిమాలయపర్వతాల ఎడమప్రక్కన ఏటవాలుగా క్రిందకిదిగిన కొండచరియ వెంబడే నడుస్తూ అట్టే శ్రమలేకుండానే ఒక విశాలమైన మైదానములోకి చేరుకున్నాము. అక్కడ మంచులేదు. గోధుమరంగు పొడిఇసుక — చందనపుపొడిలాగ గాలికి ఎగురుతూ ప్రశాంతతను కలిగిస్తోంది. మంచుమైదానములో నడిచే శ్రమతగ్గిందికదా అనుకుంటూ ఆనందంగా మేమంతా ఆ మైదానములో చురకుగా నడిచిపోసాగాము.

ఒకగంట అలా దిగి నడవగానే పర్వతములోయ మొదలయ్యి కుడివైపుగా మళ్ళింది ఏటవాలుగా! బంగారురంగు ఎండ అప్పటికే మధ్యాహ్నమవుతోందని సూచిస్తూ గోరువెచ్చగా మా శరీరాన్ని తాకుతోంది.

అకస్మాత్తుగా ఓ చల్లటి గాలితిమ్మెర నాలుకగా వచ్చి మా ముఖాలను తాకింది. 'ఎక్కడిదా ఈ చలిగాలి! గాడ్పులాగ వీస్తోంది అనుకుంటూ పరిశీలించి చూస్తే ఆ లోయక్రింద అడుగున నీలంగా కొండవాగు వంటి నది ప్రవహిస్తోంది. మంచుకరిగిన నీళ్ళు అతిచల్లగా ప్రవహిస్తూ నదిమీద వీచే నీటిగాలి అతిచల్లగా మా మొహాలకు తాకిందని అర్థమయింది. నదివెంబడే అయిదారుమైళ్ళు నడిచివెళ్ళగా దారి కుడివైపుకు తిరిగి ఎత్తుగా శిఖరంవంటి కొండచరియమీదుగా ప్రయాణించింది. ఇంతలో సూర్యుడు అస్తమించాడు. నీరెండ అకస్మాత్తుగా కొండలచాటున మాయమయ్యింది. గోరువెచ్చని హాయి అంతమై చలిగాలి వీచసాగింది.

అప్పుడు గుర్తుకువచ్చింది మాకు హిమాలయ పర్వతాలలో సూర్యాస్తమయము అకస్మాత్తుగా జరుగుతుందని! ఎందుకంటే ఎత్తైన పర్వతాల చాటుకుపోయి చూస్తుండగానే అకస్మాత్తుగా మాయంఅవుతాడు సూర్యుడు!

మరుక్షణమే బంగారుఎండ తెరతీసినట్టు కనుమరుగై నిఠారు నీలినీడలు దారికి అడ్డముగా పొడుగాటి కొండశిఖరాల కీనీడలు చిత్రాలు దారికి అడ్డంగాపడుతూ క్షణాలమీద పొద్దువాలి మరుక్షణమే చీకటిపడుతుంది. అంతే! చల్లని మంచుగాలి, ఎముకలుకొరికే చలి పెద్దశబ్దంతో వీచడం మొదలయ్యింది. దానితో మాకందరికీ అర్థమైంది — ఈరాత్రికి ఉండటానికి బస, తినటానికి భోజనవసతి రాత్రి తలదాచుకోవడానికి నీడ, ఏదైనా ఆశ్రయము ముందే ఏర్పాటుచేసుకోకపోతే మాపాట్లు ఇక కుక్క పాట్లే అని అర్థమయింది! దానికితోడు మా మిత్రబృందముఅంతా గత రెండురోజులుగా చూసిన భయంకర అనుభవాలు, జ్ఞాపకాలు ఇంకా మరచిపోలేదు. హాయిగా వెచ్చగా ఏదైనా లామాసరీగానీ ఏదైనా కొండ గుహలోకానీ తలదాచుకోకతప్పదు. ఎందుకంటే ఇప్పుడు మేము గుడారము బిగించి శిబిరముగానీ, టెంట్‌గానీ ఏర్పాటుచేసుకోవడానికి సమయము చాలదు! దానికితోడు మేమిక్కడ ముందుగా మరి ఏర్పాటు చేకోలేదు. ఇలా అనుకుంటూనే నిటారైన శివలింగాకారములోవున్న గుట్టమీదకి చేరుకున్నాము. దానికి ఇటూ అటూ రెండువైపులా ఎత్తైన పర్వతాలు కోటగోడల్లా ఆకాశానికి అంటుతూ నిలబడివున్నాయి నిరంకుశముగా! ఇంక మాకు మిగిలినది ఒక్కటేదారి. ఎదురుగావున్న గుట్టల మీద ఎక్కడైనా గుహగానీ, ఆశ్రమము వంటి మఠముగానీ వున్నదేమో కనుగొనడానికి ప్రయత్నించాలి. ఇంతలో మాకు ఎదురుగా గొర్రెలకాపరి ఒకడు కొండమేకలను తోలుకుంటూ కొండ దిగువకు పోతున్నాడు. రాత్రి వుండటానికి ఏదైనా నివాసముగానీ ఏదైనా కొండగుహకానీ ఈ ప్రాంతంలో వున్నదేమో అని అతడిని ప్రశ్నించాము. ముందు నడుస్తున్న మేకలని

అదిలిస్తూ కర్రతో నేలమీద తట్టి అతడు —

“అదిగో! ఆ సామి ఉన్నారు ఎదురుగా కనిపించే గుట్ట శిఖరం మీద ఆయన దగ్గరకుపొంది మీకన్నీ లభిస్తాయి — ఆయనకు గనక మీమీద దయకాని కలిగిందా మీదే అదృష్టం, మీకన్నీ లభిస్తాయి” అంటూ పొడుగాటి తన కర్రతో మా ఎదురుగా ఉన్న గుట్టమీదకు చూపించాడు. వెంటనే రష్యన్ చిత్రకారుడు తన బ్యేగులోంచి బైనాక్యులర్స్ వేసి ఎదురుగా కొండచెరియను గాలిస్తూ పరిశీలించాడు.

అదిగో ఎత్తుగా కనిపించే గుట్ట ఎక్కిపోతే దాని శిఖరంమీద నిఠారుగా గోడలా చెక్కినట్టు ఒక గుహలాంటిది కనిపిస్తోంది. లోపల ఎవరైనా ఉన్నారో లేదో బయటకు కనిపించటంలేదుగాని చీకటిగాఉన్న గుహద్వారం లోపలినుంచి ఎర్రగా బంగారురంగు మంట వెలుగుతూ గోడలమీద నాట్యమాడుతూ కనిపించింది. “బహుశా చలిమంట కావచ్చు! లేదా ఏదైనా వంటచేసుకుంటున్న అగ్నిజ్వాల కావచ్చు! మనం వెళ్ళి ప్రార్థిస్తే మనకేదైనా ఆశ్రయం దొరక్కపోదు అంటూ వడివడిగా అడుగులు వేసాము.

ఎంత ప్రయత్నించినా గోడలాగ నిఠారుగా పైకి పెరుగుతున్న కొండచరియ ఎక్కటం దాదాపు అసాధ్యం అనిపించింది. చివరకు కొండ గోడమీద కనిపించే చిన్న చిన్న కన్నాలలోకి మాబూట్లు దూర్చి చేతివేళ్ళతో అందిన బండరాళ్ళను దొరకపుచ్చుకుంటూ ఎగబాకి మాగుండెల్లోని ప్రాణాలు కంఠంలోకి తన్నుకువచ్చేసరికి ఆ కొండగుట్టపైకి చేరుకున్నాము!

గుహ బోర్లించిన అర్థచంద్రాకారముగా ఒక ఏనుగు వీపులాగ

గుండ్రటి ఆకారముతో ఉన్నది. ఆ గుహలో పదిహేను, ఇర్వై అడుగుల లోపలగా ఒక సాధువు కూర్చునివున్నాడు. ఆయన కనుగుడ్లు ఎర్రగా నిప్పుకణికలవలే ఉబ్బరించి ఉగ్రంగా మండుతున్నట్లు మావైపు చూసాడు తలఎత్తి. ఆయనముందు వెలుగుతున్న పెద్ద చలిమంటవంటి నెగడు. అందులో సాంబ్రాణీ, గుగ్గిలము వంటి పొడివేస్తూ మంత్రాలు చదువుతూ రకరకాల మూలికలు, ఏవేవో వింతవస్తువులు మంటలోవేసి హోమం చేస్తున్నాడు — నిశ్శబ్దంగా మంత్రాలు గొణుక్కుంటున్నట్టు చదువుతున్నాడు. మారాక ఆయన ఏకాగ్రతను, నిశ్శబ్దాన్ని భంగపరచిందికాబోలు మావంక ఆయన అసహనంగానూ, క్రోధంతోనూ, చిరాకుగాను చూసాడు. మేమందరమూ సగౌరవంగా నేలకి మా నుదురు తగిలేవిధంగా వంగి మూడుసార్లు దండప్రణామం వంటిది కాళ్ళమీదకూర్చుని చేశాము గుహలో చోటుచాలక. మాలో బాగా మాట్లాడగలిగిన వ్యక్తి నోటోవిచ్ — రష్యన్ రాయబారి కావటముతో ఆయన తన మృదువైన మాటకారి తనముగా మాట్లాడే సంబోధనతో “మహామునులకు నమస్కారము! ఋషీశ్వరులకు ప్రణామము... అంటూ అలా మాట్లాడుతూవుండగానే ఉరుమువంటి కంఠముతో ఆ సాధువు గర్జించినట్లుగా అన్నాడు అతడి మాటలకు అద్భుతగులుతూ ఇలా...

“మీరంతా పర్వతయాత్రీకులు! — అవునా? ఈరాత్రికి మీకు ఆశ్రయం కావాలి — అంతేనా? ఆహారంకావాలి. అది, మీరు చెప్పకనే చెబుతున్నది, దుమ్మూ ధూళీ కొట్టుకునివున్న మీ వాలకముచూస్తే! మీ వేషాలు, బట్టలు చూస్తే మీరంతా పగటివేషగాళ్ళలాగా వేరువేరు దేశాల నుంచి వచ్చినట్లున్నారు. అవునా? సరే! నేను చెప్పినట్టు చెయ్యండి

అన్ని సమకూరుస్తాను — దూరాన లామాసరీనుంచి దీవెన పొంది వచ్చారుగా! నేను చెప్పినట్టు తు.చ. తప్పకుండా చెయ్యాలి!'' అన్నాడు తన మెడలోని రుద్రాక్షమాలను గుంజుకుంటూ. ఎడమచేత్తో పెద్ద సటకా వంటి కర్రను మండుతున్న హోమగుండములోంచి తీసి నేలమీద తాటించి పెద్దశబ్దం చేయడంతో అందరమూ ఉలిక్కిపడ్డాము. ఉరుము వంటి ఆయన కంఠస్వరము విని కఠోరముగా, క్రూరంగా అదిలిస్తున్నట్లు మాట్లాడిన ఆ సాధువు ఒక అఘోరీ అని తరువాత తెలిసింది మాకు! భయంతో బిక్కచచ్చిపోయివున్నాము.

"గురుదేవా! మీరు ఆజ్ఞాపించినట్లే నడుచుకుంటాము! మేము మీరు చెప్పినట్టే తు.చ. తప్పకుండా నడుచుకోగలము'' అన్నాము అందరం ఒకేకంఠముతో మళ్ళీ తల నేలకుఆనించి ప్రణామంచేస్తూ.

"ఖచ్చితంగా నేను చెప్పినట్టే చెయ్యాలి! అలాచేస్తేనే అన్నీ సక్రమంగా జరుగుతాయి. లేకపోతే పరిణామాలు ఎలావుంటాయో ఏం జరుగుతుందో నేను చెప్పను! మీరే అనుభవిస్తారు అన్నాడు ఘర్జించినట్టుగా బొంగురు కంఠముతో. మళ్ళీ ఒక్కసారి ఆయనకు నమస్కరించి ఆసక్తిగా వినసాగాము ఆ అఘోరీ కఠోరమైన ఆజ్ఞ ఎలావుంటుందో భయపడుతూనే.

మీరు చాలాదూరంనుంచి నడిచివచ్చినట్లున్నారు. బడలికతో డస్సిపోయి వుండాలి అవునా!

అవును గురుదేవా! చాలా అలసిపోయాము.

మీకు ఆకలికూడా దంచేస్తోంది. మీ కడుపులో ఎలుకలుకూడా

పరిగెడుతున్నట్లు వున్నాయికదూ — వికృతంగా నవ్వుతూ అన్నాడు అఘోరీ మహాశయుడు.

ఈసారి భయం భయంగానే — ఆకలి వున్నదని అంగీకరించాము.

మీరు ఈ పర్వతగుహకు ఎక్కేదారిలో ఒక చల్లటి నదీప్రవాహం చూసేవుంటారు. అవును గురుదేవా! దిగువనున్న లోయలోంచి ఎడమ వైపుగా ప్రవహిస్తున్నది నది.

"అది పవిత్రమైన మందాకినీనది, దానికి దారిలో అలకనంద, జాహ్నవి నదుల పాయలు కలసి మీరువచ్చే మైదానంలో కలసి గంగా నదిగా ప్రవహిస్తుంది!" మీరు వెళ్ళి చల్లటి ఆ మందాకినీనదిలో హాయిగా స్నానంచెయ్యండి, ఇష్టంవచ్చినంతసేపు!

అలా స్నానంచేస్తూవుండగా నీటిలో కొట్టుకునివచ్చే వస్తువు పైకి తేలుతూ మీకు కనిపిస్తుంది. దానిని జాగ్రత్తగా ఒడ్డుకులాగి భద్రంగా పొట్లంకట్టి పైకి తీసుకురండి అన్నారు. సరే గురుదేవా అన్నాము ఏం మాట్లాడుతున్నామో ఆలోచించకుండానే.

"నేను చెప్పేది అక్షరాలా ఆచరించాలి తు.చ. తప్పకుండా. వింటున్నారా! అంటూ గట్టిగా అరచినట్టు మళ్ళీ అన్నాడు ఏదో విశేషం చెబుతున్నట్టుగా. ఆ నీటిలో కొట్టుకువచ్చిన వస్తువును జాగ్రత్తగా ఒడ్డుకు లాగాలి, నదురుబెదురు లేకుండా. దానిని నీటిలోంచి తీసుకువచ్చి ఆలస్యము చేయకుండా ఈ గుహలో నాముందర పెట్టాలి. ఇది మా హుకుం! అంటే ఆజ్ఞ! ఏమాత్రం తప్పరాదు అంటూ తన చేతిలోని పటకాను నేలపైకొట్టి తన కుడిచేతిలోని శంఖం నోటికి ఆనించి గట్టిగా

పూరించాడు భం... ... అంటూ ఆ గుహఅంతా ప్రతిధ్వనించేలాగ. మంటలోని చితుకులను ఒక్కసారిగా ఎగసం తోసాడు కదిలిస్తూ, జ్వాల ఒక్కసారిగా భగ్గుమని ప్రజ్వలించింది గుహఅంతా వెలిగిస్తూ అప్పుడు చూసాము. ఆయన వెనకాతల నల్లరాతితో చేసిన నిలువెత్తు కాళీమాత విగ్రహము — భయంకరముగా వుంది. విగ్రహం కుడిచేతిలో కొడవలి వంటి భైరవఖడ్గము, మెడలో మనిషిపుర్రెల కపాలమాల ధరించి నాలుక తెరచి తెల్లనికోరలు, నిమ్మకాయలవంటి కనుగుడ్లతో భీకరముగావున్నది. ఆ సాధువు కాళీమాత భక్తుడని మరుక్షణంలోనే మాకర్థమైపోయింది. ఇలాంటివారివద్ద అనేక శక్తులువుంటాయి. ఊహించని భయంకరమైన సిద్ధులుకూడా వీరి వశంలోవుంటాయి. అందుకని భయంగా అందరమూ తలవంచుకుని ఆయన చెప్పిన ఆజ్ఞను తప్పకుండా శిరోధార్యంగా చేస్తామని తరువాతగానీ మాకు తెలియలేదు ఆయన ఆజ్ఞ ఎంతటి గుండెలుతీసిన బంటుకైనా భయం కలిగిస్తుందని.

అప్పటికే బాగా చీకటిపడింది. హిమాలయ లోయలనుంచి చల్లటి ఈదురుగాలి గుహవైపు వీస్తోంది. ఇప్పుడే నిటారుగా గోడవలేవున్న కొండ దిగి జారిపడకుండా పాకుతూవెళ్ళి క్రింద మైదానం చేరుకోవాలి. అక్కడి నుండి అలా సుమారు రెండుమైళ్ళు నడిస్తే ఆ సాధువు చెప్పిన నది వస్తుంది. ఇంక మాస్నానాలు పూర్తిచేసి మళ్ళీ ఈ కొండచరియపైకి గోడమీద బల్లిలాగ ఎగబాకుతూ రావాలి. దేవుడా! అతిప్రయాసమీద కొండదిగి కుక్కలలాగ వగరుస్తూవచ్చి గుహక్రింద మైదానములో నిలబడ్డాము, ఒకరిముఖం ఒకరు చూసుకుంటూ.

ఇంకా ఎందుకు ఆలస్యం? అఘోరీగారి అజ్ఞ విన్నాంకదా! — చచ్చినట్టు ఇంత చలిగాలిలోనూ వెళ్ళి ఆ మంచుకరిగిన గంగ నీళ్ళలో స్నానంచేసి రావాలి. ఏదో తెమ్మన్నాడుకదా? ఏమిటో చెప్పలేదు అనుకుంటూనే ఒకరిమొహంవంక ఒకరు చూసుకుంటూ అయిష్టంగానే బయలుదేరాము.

అలా సుమారు అరగంట, ముప్పావుగంట నడచి నదిఒడ్డుకు చేరాము. అప్పటికే బాగా పొద్దువాలిపోయింది. రాత్రి ఎనిమిదిగంటలు కావచ్చు! నెమ్మదిగా బూట్లు, మేజోళ్ళు, టోపీతీసివేసి నిదానంగా మా డ్రస్సులుఅన్నీ విప్పి ఒడ్డునేపెట్టాము. ఒకరు కాపలాగా కూర్చున్నారు. మిగతావాళ్ళు దిగి నదిలో కాలుపెట్టాక తెలిసింది — జివ్వుమని పీకేస్తున్నాయి కాలినరాలు, నదిలోకి అంటూ పెద్దగా కేకలువేసారు. మాలో సుకుమారంగా వున్న శ్రీనివాసచక్రవర్తి, బెంగాలీ బ్రాహ్మణుడు మేఘనాధ్ సహా ఇద్దరూ ఒకేసారి. ప్రయాణంతో వేడెక్కిపోయిన శరీరాలు చల్లటి నీటిలో మునిగితేలగానే ఈదురుగాలి తగిలి చలికి బిగుసుకుపోయాము వణుకుతూ. గబగబా ఒకరితరువాత ఒకరు నీళ్ళలో మునిగి స్నానం అయిందనిపించాము. చివరకు ఆఖరివాడైన జగదీశ్చంద్రబోస్ వంతు వచ్చింది. అప్పటిదాకా ఆయన మా వస్తువులకు, బట్టలకు కాపలా వున్నాడు. నెమ్మదిగా కాళ్ళు నీళ్ళలో తడవగానే చచ్చానురాబాబూ! అంటూ చలికి కేకపెట్టాడు. ఎలాగో ఆ నీటిలో మూడు మునకలువేసి తనకు అలవాటైన గాయత్రీమంత్రాన్ని గబగబా సంధ్యవార్చినట్టు వార్చి గాలికి ఎండుటాకులా కంపించిపోతూ చలికి బిగదీసుకుపోయాడు. ఆయన ఒడ్డుకు వచ్చిన తరువాత గుర్తుకువచ్చింది మా అందరికీ!

“ఆయన ఏదో తెమ్మన్నాడుకదా! ఏమిటది” అంటూ నీళ్ళవైపు చూసిన మాకు దూరాన తెల్లగా ఏదోవస్తువు నీటిప్రవాహంమీద తేలుతూ కొట్టుకువస్తోంది. అది మాదగ్గరకు రాగానే పట్టుకోబోతే అది మళ్ళీ ప్రవాహంలోకి మధ్యగా వెళ్ళిపోయింది. ప్రక్కనే పడివున్న ఒక గెడకర్రను తీసుకుని ఆ వస్తువును ఒడ్డుకులాగితే మరుక్షణమే ఇద్దరుసభ్యులు నీటిలోకిదూకి ఆ వస్తువును దొరకబుచ్చుకున్నారు. తడిగుడ్డలతో ఒడ్డుకు తీసుకువచ్చిన ఆ వస్తువును టార్చివేసి చూసిన జగదీశ్‌చంద్రబోస్ కెవ్వున కేకవేశాడు భయంతో!

“శవం! అంటూ ఇది చచ్చిపోయిన మనిషిశవం బాబోయ్ నాకసలే శవాలంటే చచ్చేభయం” అంటూ భయంతోనూ, చలితోనూ గడగడ వణికిపోతున్నాడు. ఇంక ఏడుపుఒక్కటే తక్కువఅన్నట్టు. చార్లెస్ బెల్ ముందుకు రెండుఅడుగులువేసి టార్చివేసి పరిశీలనగా చూస్తూ —

ఇది ఒక పసిబాలుడి శవం! తెల్లటి ఎర్రటిగుడ్డలో చుట్టగా చుట్టి ఎవరో నీటిలో పడేశారులాగుంది. కొట్టుకువచ్చింది నదీప్రవాహంలో! అన్నాడు.

దానినా? మన అఘోరీ మహాత్ముడు తన గుహకు తెమ్మన్నది! దేవుడా? ఏమిఖర్మరా! అనుకుంటూ నలుగురం ధైర్యంచేసి ఆ గుడ్డల మూట విప్పిచూస్తే లోపల ఏడెనిమిది సంవత్సరాల వయస్సునిండని ఒక పసిబాలుడి శవం! బాగా కుళ్ళిపోయి వుంది. చేపలు నీటిలో పొడుచుకు తినేసినందువలన ఆ బాలుడి రెండు కనుగుడ్లు లేవు. లోతుగా రెండుగుంటలు కనిపిస్తున్నాయి. నోరు తెరుచుకునివుంది

భయంకరముగా. చచ్చిపోతున్న వేదనలో నాలుక బయటకి చాచుకొని వున్నది. ఆ శవం భీకరంగా కనిపించింది. వెంటనే దాన్ని కేన్వాసుగుడ్డలో చుట్టి ప్యాక్‌చేసి మోసుకుంటూ బయలుదేరాము అందరమూ — మూలుగుతూ. ఇంక ఏడుపొక్కటే తరువాయి అనుకుంటూ!

అలా ఎంతసేపు నడిచామో తెలియదు. అఘోరీ మహాశయుని గుహక్రిందకివచ్చి నేలమీద నిలబడ్డాము నిటారుగావున్న గోడవంటి ఆ కొండగుహలోకి ఎలా ఎక్కాలా ఆచీకట్లో అని ఆలోచిస్తూ!

"అందరూ వచ్చారా? అంటూ గుహలోంచి పులిరంకెవేసినట్టు అరిచాడు సాధువుగారు!" అందరమూ కొండక్రింద హాజరుగా వచ్చి వున్నాము గురుదేవా అంటూ!"

"మీరంతా ఒక్కసారి కళ్ళుమూసుకోండి — నన్ను మీమనస్సులో తలచుకోండి!" అన్నాడు కొండమీదనుంచి.

మేమందరము గట్టిగా కళ్ళుమూసుకున్నాము ముఖ్యంగా చేతిలోని ఆ శవంవంక చూడలేక. తెరవండి కళ్ళు! అందరం కళ్ళుతెరచి ఆశ్చర్యపోతూ మా సాహసయాత్ర బృందసభ్యులు 12 మంది అద్భుతంగా కొండగుహలో నిలబడివున్నాము — గుహలోకి ఎలావచ్చామో తెలియక ఆ సాధువు మహత్యానికి ఆశ్చర్యపోతూ ఏంమాట్లాడాలా అని భయంతో బిక్కచచ్చిపోయివున్న మాతో మీరుఅందరూ కూర్చోండి! రెండువరుసలుగా — మీకు భోజనానికి వేళయింది రెండవ కేకవేసాడు.

అందరం ఒక్కసారి విస్తుపోయాం! అక్కడేమి తినాల్సివస్తుందో భగవంతుడా నీదే భారం అనుకుంటూ! గుహలో వంటలు, భోజనాల

ఏర్పాట్లు, వంటవార్పులూ ఏమాత్రం కనిపించలేదు. మా ఆలోచనలకు తావియ్యకుండా అఘోరీసాధువు — అలా కూర్చోండి మాట్లాడకుండా మీకు భోజనం వడ్డిస్తాను అన్నాడు. చేసేదేమీలేక అందరమూ గుహ గోడకు ఆనుకుని రెండువరుసల్లో కూర్చున్నాము.

మీరు తెచ్చింది ఈమధ్యలో పెట్టండి అన్నారు. భయంతో వణికి పోయాము. నదిలో కొట్టుకువచ్చిన ఆ పసివాడి శవాన్ని ఆ సాధువు ముందు పెట్టాము వణుకుతున్న చేతులతో ఏమంటాడో తెలియక! మళ్ళీ ఇంకొకసారి సిద్ధంగా కూర్చోమన్నాడు. ప్రత్యేకంగా నన్నుమాత్రమే పిలిచాడు చక్రవర్తీ అంటూ! నీవు సాంప్రదాయ బ్రాహ్మణ శ్రీవైష్ణవుడవు కదా! అవునుస్వామీ! మావాళ్ళు సాంప్రదాయ శ్రీవైష్ణవులే — నాపేరు... అంటూండగానే అతడే అడ్డంవచ్చి నీపేరు శ్రీనివాసచక్రవర్తి, నీతండ్రిపేరు శేషాద్రి శ్రీనివాసు. నీతాతగారు శేషాచార్యులు అవునా! అన్నాడు. ఆశ్చర్యంగా నోరుతెరచిన నావంకచూస్తూ. నా వంశవృక్షం ఆయనకి ఎలా తెలిసిందా అని విస్తుపోయాను!

“నువ్వే తీసి వడ్డించు అందరికీ మడిగా అన్నాడు అఘోరీసాధువు ఫెళ్ళున వికృతంగా నవ్వుతూ! ఇక్కడ వడ్డించడానికి ఏమీలేదుకదా అంటున్న నన్ను మధ్యలోనే ఆపి “మీరే తెచ్చుకున్నారుకదా! నదీప్రవాహంలో కొట్టుకువచ్చిన ఆ శవాన్ని అదే అందరికీ వడ్డించు అన్నాడా సాధువు. కళ్ళుతిరిగి ముందుకుతూలి పడబోయాను వికృతమైన ఆ వడ్డన వినటానికికూడా సాహసించలేక. పులిలాగ ఘర్జించాడు క్రోధంగా నావంకేచూస్తూ. “లేచి వడ్డించు! ముందుగా నైవేద్యంపెట్టు మీదేవుడికి!”

అన్నాడు. చచ్చానురా దేవుడా! ఈనాటితో జాతి సంకరమైపోయింది నా వైష్ణవ మడిఆచారం అనుకుంటూ. ఇంతలో ఆ సాధువు అదిగో ఆ అరటిఆకు దానిపైకప్పి ఈ సీసాలోని గంగాజలము దానిపైచల్లి పరిషేచనం చేసి శుద్ధమైన భక్తితో నైవేద్యమివ్వు నిస్సంకోచముగా అన్నాడు. నాకేంచెయ్యాలో పాలుపోలేదు. ముందునుయ్యి వెనక గొయ్యి. నిస్సహాయంగా శరణాగతినే ఆశ్రయించాను వేరే త్రోవ కనిపించక. నా ఆరాధ్య దైవమైన వేంకటేశ్వరప్రభువును ఆపదమొక్కులవాడిగా స్మరించి నా పరమ గురువు రామానుజులను స్మరించి నేనుచేసే దురాచారమును నాతప్పును క్షమించు! — ఈనాడు శవాన్ని నైవేద్యం పెడుతున్నాను అని నమస్కరించి దానిపై గంగాజలం చల్లి చుట్టూరా పరిషేచనం పట్టాను.

ఆకుతియ్యి! అందరూ ఆకలితోవున్నారు. తొందరగా వడ్డించు అన్నాడు.

ఆశ్చర్యం! అరిటాకు తియ్యగానే దానిక్రింద బంగారంలాంటి పచ్చని పుళిహోర, ఘుమఘుమలాడే చక్రపొంగలి, నేతివాసనలు గుబాళించే బూరెలు, వడలు, పాయసం! భయంతో ఆశ్చర్యంతో నిటారుగా నిలబడిపోయాను.

మీ ఆచార్యుల సాంప్రదాయం మట్టికలవలేదుకదా! మీరంతా భయంతోనూ, బాగా ఆకలిగానూ వున్నారు అంటూ ఆ అఘోరీసాధువు వేళాకోళంగా నావంకచూస్తూ చిలిపిగా నవ్వుతూ! అప్పటికీ నా సందేహం తీరక ఒక పుల్లతో కదిపి వాసనచూసాను. ఇది భ్రాంతికాదుకదా అనుకుంటూ భయపడుతూనే (మళ్ళీ శవంగా మారుతుందేమోనని). కంచుగంట

వంటి ఖంగునమోగే కంఠంతో నీదేవుడు శ్రీనివాసప్రభువు ప్రసాదం. మడిగా వండి నైవేద్యం పెట్టబడినది. మీ తిరుమలకొండపైనుంచి వేడివేడిగా పంపించాడు అంటూ ఆ సాధువు పరిహాసమాడాడు. ఆశ్చర్యంతోనూ, ఆనందంతోనూ కడుపునిండా భోజనంచేశాము పీకలదాకా!

అన్నమయితే తిన్నాముకానీ సందేహాలు, అనుమానాలు గుండెలదాకా తన్నుకువస్తున్నాయి. గురుదేవా! ... వాక్యాన్ని పూర్తిచేసేలోగానే అఘోరీ మహారాజు నవ్వుతూ అన్నాడు. నాకర్థమయ్యింది మీ సందేహము. మేము తిన్న ఈ ప్రసాదములు నదిలోంచి తెచ్చిన పసిబాలుడి శవమేనా? అదేగదా మీరు నన్ను అడుగుదాము అనుకున్నది. అవును గురుదేవా! మేమంతా అద్భుతంతోనూ, ఆశ్చర్యంగానూ అన్నాము ఆయనవంకే చూస్తూ. ఆయనను ఏదో అడగబోయిన నన్ను చిన్నపిల్లవాడిని కసిరినట్లే గద్దించాడు. నీవు బ్రాహ్మణుడివికదా! వేదాలు ఎప్పుడూ చదవలేదా? ఈసారి విస్తుపోవటం నావంతైంది. తెల్లారిలేస్తే మాకుటుంబంలోని వైష్ణవ స్వాములంతా చదివేది వేదాలేకదా! ఈయన ఇలా ప్రశ్నిస్తాడేమిటి? అనుకుంటూ.

మీరు చదవలేదా వేదాలను?

“ఏమిటి గురుదేవా?”

అహమన్నం అహమన్నం... అన్న మంత్రాన్ని. దానిఅర్థం ఏమిటి అనుకున్నావు. భగవంతుడే స్వయంగా అన్నస్వరూపం ధరించాడు అని! జన్మించకముందే తల్లిగర్భంలో ఆహారముతోనే పెరిగి మనిషిగా జన్మిస్తాడు — అనిగదా వేదమంత్రాలు చెబుతున్నాయి.

"అవునుకదా?" అన్నాను ఆయన ఏంచెప్పబోతున్నాడో అర్థంకాక! మీరుతెచ్చిన మనిషి శరీరం అన్నమేకదా — తిన్న అన్నముతోనేకదా ఆ శరీరము పెరిగింది — అంటూ ఆయన వివరణకు విస్తుపోతున్న నాతో అఘోరీ ఇలా వివరించాడు —

"రుద్రోవిశ్వే భువనాని కేశ!"

మీ అధర్వణవేదంలో వ్రాసివున్నది ఈ విశ్వము భూమి, ఆకాశము, పర్వతాలు, నదులు, పంచభూతాలు అన్నీ భగవంతుడైన రుద్రుడే! అని, మరి అతనెక్కడ తిరుగుతాడు స్మశానంలోనేకదా! మనిషి భూమిపై జన్మించి, ఎక్కడ తిరిగినా చివరకు ఎక్కడచస్తాడు — ఆ స్మశానంలోనే కదా! అక్కడ కులీలులేరు! ఎలాంటి బాంధవ్యాలు బంధుత్వాలు లేవు! అన్నీ కలిసి బూడిదగా మారిపోతాయి — అంటే పంచభూతాలు వాటి నిజస్వరూపంగా మార్పుచెంది వాటి యధాస్థానాన్ని పొందుతాయి. ఈ పంచభూతాలే మన శరీరం తయారైంది. మనం తినే ఆహారము, ప్రసాదాలు కూడా తయారైంది? — అఘోరీ సాధువు మాకు ఆధ్యాత్మిక రహస్యాలు విడమర్చి చెబుతూవుంటే విపరీతమైన ఆశ్చర్యంతో వింటున్న మేము వాటిని జీర్ణించుకోలేకపోతున్నాము.

గురుదేవా! అంటూ ఏదో అడగబోయేలోగా ఆయన మళ్ళీ ఇలా అన్నాడు. "భేదాలన్నీ మనిషి తాను సృష్టించుకున్నవే!" ఈ భేదాలన్నిటినీ మళ్ళీ కరిగించుకోవాలి భగవత్జ్ఞానంతో. అప్పుడేకదా సర్వమూ భగవంతుడు అనేమాట నిజమై సిద్ధించేది. మీ బ్రాహ్మలు ఈ విషయాలను ఊరికే వల్లెవేస్తారు కావుకావుమంటూ కాకుల్లాగా. మేము నిజంగా

ఆచరిస్తాము, ఆరాధిస్తాము ఈ ప్రపంచములోని పంచభూతాలనే! పంచభూతాలంటే ఏమిటనుకున్నారు? ఆ శివపరమాత్ముని ఓం నమః శ్శివాయ అనే అక్షరాలేకదా? అవే పంచభూతాలూ — మనలోని కన్ను, ముక్కు, చేతులు వంటి పంచేంద్రియాలనూ పంచభూతములే నిర్మించాయి. అందుకే ఆహారంతో తయారైనది ఈ శరీరము.

ఇంకా “అహమన్నం” అన్నమంత్రానికి అర్థము. “నేను అన్న ఆత్మయే అన్నంగానూ, అన్నంతినే జీవుడిగానూ, జీవుడు నివశించే శరీరముగానూ, ఈ విశాలవిశ్వంగానూ నిర్మాణమై వున్నది! అది శుష్క వేదాంతమేమీకాదు! మా గురుదేవులు నిప్పులోపెట్టి కాల్చి మూసలో కరిగించిన బంగారంలా నాలోకి అన్నీ అనుభవంతో కరిగించిపోసారు! అనితరసాధ్యమైన వజ్రసిద్ధిని ప్రసాదించాడు.

“ఈ సిద్ధి ఏ తాంత్రికమూకాదు. శుద్ధబ్రహ్మజ్ఞానముయొక్క యదార్థ రూపము” అంటూ మాకళ్ళముందే ఆ అఘోరీ సాధువు మాయమై పోయాడు.

ఎదురుగా గుహలో ఎర్రటిమంట ఆయన వెలిగించిన ధునిలోని హోమాగ్ని ఇంకా అలా మండుతూనేవున్నది. ఆశ్చర్యంగా అలా వెనక్కి తిరిగిన మాకు ఆ కొండగుహ ద్వారంలోంచి ఉదయిస్తున్న సూర్యుడి బంగారుకిరణాలు అందరి ముఖాలపై పడినాయి — అఘోరీ సాధువు ఉపదేశించిన జ్ఞానకిరణాలవలే! ఆ సాధువు మాయంకావటంవలన ఇంక మాకు సెలవిచ్చినట్లుగా అర్థమైంది. ఆశ్చర్యంగానూ భయంగానూ మా సామానులు, సంచులు, తుపాకులూ సర్దుకుంటూ కొండదారిపట్టాము

చేసేదేమీలేక.

ఆహా! ఈ హిమాలయాలు ఎక్కడచూసినా ఆశ్చర్యాలపుట్ట! అనుకుంటూ! అందరికీ భయంపట్టుకుంది. ఆ కొండగుహలో కనిపించినది అఘోరీ సాధువేనా! లేక ఎవరెస్టు శిఖరానికి దగ్గరగా శివలింగాకారములో వున్న కైలాసపర్వతముమీదవుండే శివపరమాత్ముడా? ఎలా తెలుస్తుంది? — పంచభూతాలతో నిర్మితమైన మా చర్మచక్షువులకు?!"

* * *

20

సాహసబృందంలోకి లామా దోర్జీ-చోగ్యాల్ చేరిక !

ఆరోజు ఉదయమే మా గుడారం బయట ఒకపెద్ద కలకలం వినిపించింది! ఆ సందడికి చిరాకుగా నిద్రమేలుకున్న నాకు 'ఏమిటా ఈ గందరగోళం? నిశ్శబ్దంగా పక్షుల కిలకిలారావాలు కూడా వినిపించ నంతటి ప్రశాంతమైన ఈ హిమాలయపర్వతాల నిశ్శబ్ద వాతావరణంలో — ఏవిటీగోల? అనుకుంటూ నిద్రలేచాను; మత్తు ఇంకా వదలకముందే పెద్దగా ఆవలిస్తూ!

ఒళ్ళు విరుచుకుంటూ బద్ధకంగా ఇటూ అటూ చూసాను. ఏది? పొద్దున్నే వేడివేడి 'టీ' పట్టుకువచ్చి నన్ను నిద్రలేపే షేర్పా బంట్రోతు ? అనుకుంటూ గుడారం తెర తొలగించి బయటకు తొంగిచూశాను.

ఆశ్చర్యం! అప్పటికే మా మిత్రబృందం అందరూ సందడిగా ఒక చోట చేరి కబుర్లు చెప్పుకుంటూ కనిపించారు! హడావిడిగా ఇటూ అటూ పరిగెత్తుతూ మా షేర్పా బంట్రోతు వారికి వేడివేడిగా పొగలు కక్కుతున్న టీకప్పులను అందిస్తున్నాడు! "ఓహో! ఇందుకా? ఇంతదాకా నాకింకా వేడి టీనీళ్ళు కడుపులో పడలేదు!" అనుకుంటూ లేచాను నిద్రపక్కమీంచి! నేనుకూడాపోయి, గుడారం బయటకు వెళ్ళి వంటచేసే గాడీపొయ్యిల మధ్యన గుంపుగా నిలబడ్డ మా సాహసయాత్రికుల గుంపులోకి చేరుకున్నాను — అంత ఉదయాన్నే ఏమిటా ఇంత సందడి అనుకుంటూ!

మరుక్షణమే జనాన్ని తోసుకుంటూ ఆ గుంపులోకి వెళ్ళిచూస్తే ఏముంది ? — ఆ జనం అందరి ఆకర్షణకి కారణం — బోధపడింది! చుట్టూచేరిన మా సాహసబృంద మిత్రులు — చేతులలో వేడివేడిగా పొగలుకక్కే టీకప్పులతో నిలబడి ఉత్సాహంగా మాట్లాడుతున్నారు అందరూ తేనెపట్టుమీద గుంపుగా చేరిన తేనెటీగలమాదిరిగా! ఎవరా మధ్యనున్న అందరికీ మధ్యన కేంద్రంగా, ఇందరినీ ఆకర్షిస్తున్న వ్యక్తి?" అనుకుంటూ నేనూ ముందుకువెళ్ళి — చూసి ఆశ్చర్యపోయాను.

లామా మహాశయులు!

"మీరెప్పుడు వచ్చారు? మేమిక్కడ వున్నామని మీకెలా తెలిసింది? మమ్మల్ని ఇక్కడ ఎలా పట్టుకోగలిగారు?" అంటూ ప్రశ్నలమీద ప్రశ్నలు

గుప్పించాను. అన్నింటికీ ఆయన చిరునవ్వే సమాధానం! చేతిలో గుండ్రటి దొన్నెలాంటి టిబెటన్ బౌల్‌లో వేడివేడిగా కాచిన టిబెటన్ టీ తాగుతున్నాడు. పొగలుకక్కే ఆ దొన్నెలో కరుగుతున్న వెన్నపూస ముద్దను చూసి ఆశ్చర్యపోయాను. అరె! మా షేర్పా వంటవాళ్ళకు మీ టిబెటన్ టీ కాచడంకూడా వచ్చే! అనుకుంటూ!

"అసలు మీరు తాగే టీకన్నా — మా టిబెటన్ టీనే ఈ షేర్పాలు బాగా కాచగలరు! ఎందుకంటే వాళ్ళంతా తాగేదికూడా — అచ్చం మా టిబెటన్ టీనే" అంటూ ఫకాలున నవ్వాడు ఉత్సాహంగా లామా దోర్జీ చోగ్యాల్ మహాశయుడు. ఆనాటినుంచి ఆయన మా సాహసయాత్ర బృందంలోకి మాతో వచ్చిచేరాడని అందరికీ అర్థమయిపోయింది — అడగక్కర లేకుండానే!

దానికితోడు ఆయన సామానులు చాలాతక్కువ. ఒక చెక్కపెట్టెలో జాగ్రత్తగా సర్దిపెట్టిన కంచుపాత్రలు, దీపంపెట్టడానికి ఉపయోగించే దీపపు సెమ్మ్యాళ్ళు, టిబెటన్ బర్రె యాక్‌ల వెన్నతో లామాసరీ తరహాలో వెలిగించే దీపాలు, రెండు!! గుండ్రటి పూజాతీర్థం పోసుకునే దొన్నెలవంటి పాత్రలు, పొడుగాటి స్పూన్‌లవంటి తీర్థం తీసుకునే ఉద్ధరిణెలూ! ఒకకట్ట ఘుమ ఘుమా పరిమళించే టిబెటన్ అగరువత్తులూ!! చుట్టగా చుట్టిన సంచీలో, రెండు జపమాలలు — ఒకటి మెడలోవేసుకునే పెద్దపూసల జపమాలా, రెండవది నల్లటి గుండ్రనిపూసలు కూర్చి — గుచ్చిన చేతితో లెక్కించే జపం చేసుకునే పెద్దపూసల జపమాలా!! లామాలు ధరించే కొన్ని పసుపు, ఎరుపు, కాషాయం వంటి బురఖాలాంటి వస్త్రాలు, ఒక

పొడుగాటి కోసుగా కొండ శిఖరంలావున్న ఎర్రటి లామాలుధరించే టోపీ — అన్నీ తీరుగా సర్దిపెట్టివున్న ఒకే మూటలో ఎంతో నేర్పుతో పేర్చబడి వున్నాయి.

లామాదోర్జీ లగేజీ సామాను ఇంతే! భుజాన తగిలించుకునే ఒక సంచీలో తీర్థంలో వేసుకునే పొడి, కొన్ని మందుచూర్ణాలు (మూలికలతో చేసిన ఆయుర్వేద చూర్ణాల వంటివి), రెండు పొట్టి చెక్కలమధ్య తాడుతో చుట్టగాచుట్టబడిన ఒక తాటి ఆకుల తాళపత్రగ్రంథం! అది ఆయన నిత్యం పూజలో పారాయణగా చేసే వేదమంత్రాలున్న లామాల పూజాస్తోత్రాలూ, మంత్రాలువున్న పుస్తకము! ఇదే మాకొత్త అతిధి లామాదోర్జీ చోగ్యాల్‌గారి సామాగ్రి మొత్తం.

కాని, మాకు అట్టేసేపు పట్టలేదు మా లామా పురోహితుని మనస్సులో మోసుకువస్తున్న విశేషాలు, వింతలు ఎన్నో వందలు వేలు ఆయన జ్ఞాపకాలలో భద్రపరిచివున్నాయని. మిగతా సాహసయాత్ర అంతా దాదాపుగా లామా మహాశయుడి అనుభవాలు, జ్ఞాపకాలు ఇక్కడి కొండలు, గుహలు, రహస్య బౌద్ధఆశ్రమాలలోని వింతలు, విశేషాలు, రాయి రాయికి ఒక వింతకథ! ప్రతి కొండవాడువెనక టిబెటన్‌సిద్ధుల గాధలు, మహిమలు లేక కొండదేవతలు, మంత్రశక్తులు ఎన్నోఅన్ని లోయలో కొండలపై ప్రయాణిస్తున్న ప్రతీరోజు ఒక యాత్రాగ్రంథంలోని అధ్యాయాలు పారాయణచేస్తున్నట్టుగా వినేవాళ్ళం. ప్రతీరోజూ రాత్రి భోజనం అయిన తరువాతగానీ, విశ్రాంతిగా మకాం ఒక గుడారంలో వేసి మజిలీచేస్తే అక్కడ రాత్రి భోజనానంతరం పొద్దుపోయేదాకా లామా

మహాశయుడి అనుభవాలూ, గాథలు వింటూ ఊహాలోకాల్లో తేలిపోతూ — అవే నెమరువేస్తూ అలానే నిద్రలోకి జారుకునేవాళ్ళం.

అంతేకాదు! — మా లామా పురోహితుడి బాల్యం, ఆయన లామాగా శిక్షణపొందిన టిబెటన్ లామాసరీల లోని లామాల గురుకుల విద్యావిధానం — బౌద్ధభిక్షువులకు కఠినమైన క్రమశిక్షణాఅంతా ఆశ్చర్యంగా వింటూ విస్తుపోవడం మావంతు! ఇవన్నీ సమయం వచ్చినప్పుడు సమయానుసారంగా తెలియజేస్తాను.

ఈరోజుమాత్రం మా సాహసయాత్ర బృందానికి అతిథిగా, మాకు మాంత్రిక, దైవిక విషయాలలో పురోహితుడిగా, సలహాదారుడిగా, ఆధ్యాత్మిక రక్షణదారుడిగా ఈ టిబెటన్ **లామాదోర్జీ–చేగ్యాల్** మహాశయుడు ఆనాటినుంచి మాలోఒక్కడిగా కలిసిపోయాడు.

ఆయన ఎంతో నిగర్వి! సులభుడు, పసిపిల్లవానివంటి అమాయకత్వంతో కిలకిలా నవ్వే ఆయన నిండైన నవ్వు! సంతోషంతో మెరిసే ఉదయించే సూర్యునిలాగ తళుక్కుమనే చూపులూ! కంచుకంఠం వంటి లోతైన గంభీరమైన ఆయన కంఠస్వరం — తుమ్మెదనాదంలాగ ఝుమ్మని ఓంకారంలాగ, జోలపాడినట్టు తన్మయత్వంలోకి తీసుకునివెళ్ళే లామా గురుదేవులు జపంచేసుకునే సస్వరమైన మంత్రోచ్ఛారణ — అన్నీ వింటూంటే ఎంతో హాయిగొలిపేది ప్రయాణబడలిక అంతా తీసేసినట్టుగా! ఆయన ప్రక్కనవుంటేనే ఒక ధైర్యం, ఉత్సాహం, సంతోషం, ఏదోతెలియని నిండు తనం మాలో కలిగేవి.

అది ఆయన అద్భుతమైన తపఃశక్తి ఫలితంగా లభించిన పవిత్ర

మైన 'వ్యక్తిత్వమే' అని నిదానంగాగానీ మేము గ్రహించలేదు. ఒక వెచ్చటి చలిమంట ప్రక్కన కూర్చుంటే మనకి తెలియకుండానే ఒక హాయి, వెచ్చదనం, ఆత్మీయత — చుట్టూరా వీచే చలిగాలులనుండి రక్షణా తెలియకుండానే కలిగినట్టుగానే — లామా గురుదేవుల స్నేహంలో మేమంతా ఒక పవిత్రతను అనుభవించేవాళ్ళం, తెలియకుండానే! యోగుల సన్నిధి, తపస్సుచేసుకునే యోగుల సాంగత్యమహిమ బహుశా అలాగే పనిచేస్తుందేమో! మనకేమీ తెలియకుండానే మన వ్యక్తిత్వం — పేరిననెయ్యిని కరిగించినట్టే, మనమూ, కరిగిపోతాం వారి ఆత్మీయతతో!

ఇదంతా వెనక్కితిరిగి చూస్తే ఇప్పుడు అనిపిస్తోంది! కాని, అప్పుడేమీ తెలియలేదు ఆనందించడం తప్ప!

అలా మొదలైంది లామా మహాశయుడు "దోర్జీ-చోగ్యాల్" మాతో వచ్చి మా సాహసబృందంలో చేరటం!

* * *



21

లామా - ఆత్మకథ!

లామా మహాశయా! మీరు డెబ్భైఏళ్ళకు పైబడ్డ వృద్ధులు! అయినప్పటికీ మాకంటే చురుకుగా పర్వతాలమీద నడుస్తున్నారు; బండలపైన బండలు పుక్కించిదాటుతూ పెద్దపెద్ద అంగలువేస్తూ! ఎంత హిమాలయ పర్వతాల పీఠభూమిలో పుట్టినా — చిన్నతనంనుంచీ కఠోరమైన క్రమశిక్షణ గలిగినవారైనప్పటికీ ఎంతో ప్రత్యేకమైన శిక్షణకలిగిన వ్యక్తులుమాత్రమే ఇంత పటిష్టమైన శరీరంతో — ఇంతతేలిగ్గా ఒక లేడిలాగా దుముకుతూ బండలపైనుంచీ ఎక్కిపోలేరు! మీరు ఎంతో చిన్నతనంనుంచీ అంటే బాల్యంనుంచే లామాసరీలో చేరి ఒక బౌద్ధలామాగా చేరిపోయారా ఏమి?

ఎలాంటి సంసారబాధ్యతలూ లేకుండా! దయచేసి మీరు మాకు శ్రమ తెలియకుండా మీ బాల్యంగురించి కొంచెం చెపుతారా? నిగూఢమైన ఆధ్యాత్మిక రహస్యాలేమీ లేకపోతే!" అంటూ ప్రశ్నించాడు, టిబెటన్ లామాలగురించీ వారి యోగశాస్త్రంగురించీ తాంత్రికవిద్యగురించీ, ప్రత్యేకమైన ఆసక్తికలిగిన నికోలాస్ రోరిఖ్ఫ్!

ఇంకొక రష్యన్ ఆధ్యాత్మిక పరిశోధకుడు వెఫ్సెన్సీ కూడా అతనితో జతకలిసాడు —

"మాకందరికీ కూడా ఎన్నాళ్ళనుంచో తెలుసుకోవాలని ఆసక్తిగా వుంది. లామాలు, వారి పవిత్ర జీవనవిధానం, వారికి లామాసరీ ఆశ్రమాలలో ప్రత్యేకంగా ఇవ్వబడే గురుకుల విధానంలో నేర్పే శిక్షణ!" రాత్రి భోజనాలయ్యాక అందరం విశ్రాంతిగా కూర్చుని అడిగిన ఆ ప్రశ్నకు లామా మహాశయుడి ముఖం ఆనందంతో తేజస్సుగా వెలిగిపోయింది. తన మతవిషయాలను గురించి మాకు అంత శ్రద్ధ, ఆసక్తి వున్నందుకు!

"ఇంతమంది మిత్రులు అడుగుతున్నారు గనుక చెప్పక తప్పదు నేను! నాకిప్పుడు 79 ఏళ్ళ వయస్సు! నేనొక మంగళవారంనాడు పూర్ణిమకు ముందువచ్చే టిబెటన్ మాసం మీ ఇంగ్లీషు క్యాలండర్‌లో మార్చికి సమానమైన నెలలో జన్మించాను. మాలో పుట్టిన పిల్లవాడికి తండ్రి ఇంటిపేరుతోసహా అతడి నక్షత్రనామం దానితోపాటు వాడు పుట్టిన వారమూ కలిపి పేరులో పెడతారు. అందుకే నాపేరు మంగళవారం లక్సాన్‌గా మరియ్‌కోచీ అంటారు. రిమ్‌కోచీ అనేది ఒక గౌరవనామం అనుకోవచ్చు. ఒక మతగురువుగా పీఠాధిపత్యము వచ్చినపుడు ఇచ్చే

బిరుదువంటిది. నేను పుట్టగానే ముసలివారైన టిబెటన్‌యోగులు, పెద్దలు సమావేశమై నేపుట్టిన సరైన సమయానికి జాతకము రాసారు. ఇది అనాదిగా వస్తున్న టిబెటన్ ఆచారము. జాతకము అంటే మీలో చాలా మందికి తెలియవచ్చు — ఒకమనిషి పుట్టిన సమయానికి ఆకాశంలోని గ్రహాలు, సూర్యుడు, చంద్రుడు వున్న పరిస్థితితోపాటు సరిగ్గా జన్మించే టైము తూర్పున ఉదయించే రాశి జాగ్రత్తగా గణితంచేసి లెక్కించి తయారుచేస్తారు. ఇక అతడు మరణించేవరకూ — మరణించిన తరువాత కూడా అతడి ఆత్మ ఏలోకాలకు చేరుకుంటుందో తిరిగి మళ్ళీ అతడు ఎక్కడ జన్మ ఎత్తవలసివుంటుందో మొత్తం జీవితయాత్ర కథఅంతా ఈ జాతకాన్నిబట్టి తయారుచేస్తారు.

అలాగా నేనుపుట్టిన జన్మకాలాన్ని నా జాతకకుండలి తయారుచేసి నాకు రాబోయే సుఖదుఃఖాలు జీవితంలో ఎగుడుదిగుళ్ళు, రోగాలు, ఆరోగ్యము గురువుదగ్గర ఆధ్యాత్మిక పురోగతీ అన్నీ ఒకపెద్ద గ్రంథంగా తయారుచేసారు, అధ్యాయాలు, అధ్యాయాలుగా! ఈ జాతకఫలితాలను మా తల్లిదండ్రులను కూర్చోబెట్టి నేను పుట్టిన పదవరోజున నామకరణం టైములో వారికి చదివి వినిపించారుట! నాకుమాత్రం చాలాకాలందాకా నా జాతకంలో ఏమివుందో గుప్తంగా రహస్యంగా దాచివుంచారు. ఎవరిని అడిగినా ఏమీచెప్పరు. నేను నలుగురు అన్నదమ్ములలో మూడవవాడిని! వారాలలో నేను పుట్టినది మంగళవారము. అందుకని నేను వైద్యంలోనూ మూలికలను పోగుచేసి మందులు తయారుచేయడంలోనూ డాక్టరుపనికి అవసరమైన శిక్షణఇచ్చే లామాసరీలో చేర్పించారు. ఇది నా ఏడవఏటనే జరిగింది, చిత్రంగా!

“లామాగురుదేవా! అంత చిన్నతనంలోనే ఏడేళ్ళ పసివాడిగా తల్లిదండ్రులను విడిచిపెట్టి మిమ్ములను గురుకులానికి పంపడానికి మీ ఇంట్లోవాళ్ళు ఎలా ఇష్టపడ్డారు. ఎవరూ అంత చిన్నపిల్లలను బడికే పంపలేరు — ఇక శాశ్వతంగా సన్యాసిగా బ్రహ్మచర్యదీక్షతో జీవించే లామాగా మళ్ళీ తల్లిదండ్రులను తిరిగి చూడకుండా సన్యాసుల మఠం లాంటి లామాసరీకి ఎలాపంపారు? మీరు చెప్పేదివింటుంటే మాకు ఆశ్చర్యంగావుంది అన్నాడు జగదీష్‌చంద్రబోస్ లామావంక వింతగా చూస్తూ!

* * *



22

ప్రవేశపరీక్ష

ఆరోజు నాకు ఏడేళ్ళవయస్సు నిండినరోజు! తెల్లవారుజామునే మాఇంట్లో పనివాడు నన్ను నిద్రలేపి — స్నానము, తేలికపాటి ఫలహారము చేయించి మా టిబెటన్‌లు తాగే టీ వేడివేడిగా ఒకచిప్పలో పోసి అందించాడు.

"త్వరగా తాగు! ఈరోజు నువ్వు గురుకుల పాఠశాలకు వెళ్ళాలి" అంటూ హెచ్చరికచేశాడు. నేను వీలైనంత త్వరగానే ఫలహారం, టీ తాగడం పూర్తిచేస్తూండగానే అతడు చెప్పుకుపోతున్నాడు. ఈరోజు నువ్వు గురుకుల పాఠశాలకు వెళ్ళాలి. అది ఎంతో గొప్పవారి పిల్లలకు మాత్రమే ప్రవేశంవుండే ద్రేప్పాన్లా లామాసరి ఆశ్రమం! ఇక్కడికది చాలాదూరం. అందుకే నువ్వు తొందరగా తయారవ్వాలి అన్నాడు ఆ పనివాడు త్యోజీషిమో అనే ఆ ముసలివాడు. అతను నన్ను చిన్నప్పటినుంచీ ఎత్తుకుని

పెంచాడు. అందుకనే నాపై ఎక్కువ చనువుతో ఆడిస్తూవుండేవాడు. అంతేకాక నాకు నడక నేర్పినప్పటినుంచీ కరాటేపట్లు, కుస్తీపట్లు పట్టడం కూడా ఇతడే నేర్పాడు. చెంగున ఎగిరి దూకడం, ఎదుటివారి దెబ్బను మెరుపులాదూకి తప్పించుకోవడం — నాకన్నా రెండుమూడురెట్లు బరువున్న పెద్దవయస్సువారిని వీపుమీంచి మాయబోల్తా కొట్టించి కరాటేపట్టుతో నేలమీద బట్టఉతికినట్టు పడతోయడం ఇలా రకరకాల కుస్తీపట్లు కుంగ్‌ఫూ, మల్లయుద్ధంలోని నేర్పుతో అతనే నాకు నేర్పాడు. అందుకే నాకంటే వయస్సుమించినవాళ్ళతో పోరాడి గెలుపొందే సాహసం ఏర్పడ్డాయి. నా అవసరాలను కూడా ఇతనే చూసేవాడు. అందుకని త్వరత్వరగా సిద్ధమైన నేను పొడుగాటి క్రైస్తవఫాదరీలు ధరించే గౌనువంటి కుఫ్నీలు ధరించి నడుముకు గుండ్రని బెల్టులాంటి పటకా ధరింపజేసి నన్ను లామాసరికి సిద్ధంచేశాడు.

ఇంతలోకే మానాన్న పొగలుకక్కుతూ హడావిడిగా వచ్చి "ఒరేయ్! లోబ్‌సాంగ్! ఓరి, మంగళవారం కుర్రకుంకా! ఇవేళ నువ్వు డ్రెపాంగ్ లామాసరీ ఆశ్రమానికి వెళుతున్నావు! జాగ్రత్తగా నేను చెప్పేది శ్రద్ధగావిను! నువ్వు ఎంత కష్టపడి అయినాసరే ఆ పవిత్ర బౌద్ధలామాల ఆశ్రమంలో విద్యార్థిగా ప్రవేశం సంపాదించాలి! ఒకవేళ అక్కడి లామాసరీలో నిన్ను చేర్చుకోలేదో — ఇంక నువ్వు ఈ ఇంటికి రానవసరంలేదు! నీదారి నీదే!! గుర్తుంచుకో బాగా!" అంటూ గర్జిస్తున్నట్టు కఠినమైన ఆజ్ఞ జారీచేసి నట్టుగా నావైపుగా చెప్పేసి ఊరిలో ఏదో పనివుందని పనివాళ్ళతో కలిసి బయటకు వెళ్ళిపోయాడు! అది వినగానే ఇది నాకు వీడ్కోలు అని తెలిసి నేను నీరుగారిపోయాను. ఎలాగైనాసరే! చచ్చిచెడి డ్రెపాంగ్

లామాసరిలో విద్యార్థిగా చేర్చుకునేలాగ నేను కష్టపడాలి! కష్టపడి తీరతాను. చేర్చుకోకపోతే ఇంట్లో స్థానంలేదు. నాగుండె జారిపోయింది నా భవిష్యత్ తలచుకుంటే. మావాడు తొందరపెడుతూ బైటకి దారితీశాడు.

మాఇంటిముందర పెద్ద సింహద్వారం, గోపురం లాంటి కలశం, వాకిట్లో ఎత్తైన అరుగులు, హుందాగా ఒక రాజకుటుంబీకుల జమిందారీ కోటలావుండేది. నేను పుట్టినదిక్కడ, పెరిగిందిక్కడ, చిన్నతనంనుండీ ఆడుకున్నదిక్కడ! నాకొక అక్క, ఇద్దరు తమ్ముళ్ళు వున్నారు. అక్కకు తొమ్మిదేళ్ళు, మాఅమ్మగారితోసహా ఇంట్లోవున్న ఆడవాళ్ళు ఎవ్వరూగానీ నాకు కంటికి కనిపించలేదు. ఎవ్వరూ బయటకుకూడా రాలేదు నేను ఎటో వెళ్లిపోతున్నానని తెలిసి. ఇది నాగుండెలు పిండివేసే కాఠిన్యంలా తోచింది అప్పుడు. కానీ ఇప్పుడాలోచిస్తే అదే మంచిదనిపిస్తుంది. ఎందుకంటే తల్లి, అక్క, తమ్ముళ్ళు ఇంకా ఆడవాళ్ళు ప్రేమచూపించి జాలిగా నావంకచూస్తే ఆ పరిస్థితులలో ఇల్లువిడిచి పోవడం అసాధ్యం అయ్యేది.

అలా బయట విశాల ప్రపంచంలోకి రెక్కలుతెగిన పక్షిలా బయట పడ్డాను. మాపనివాడు, నేనూ, మాఇల్లుదాటి బజారులోకి మలుపు తిరుగుతూ మాగ్రామం చివరికి వచ్చేసాం. మాపనివాడు అకస్మాత్తుగా నావైపుతిరిగి — చిన్నబాబూ! నాకు నాన్నగారు కూరగాయలు, వంట సరుకులు తెమ్మని పురమాయించారు. నేను వెళ్ళాలి, నాకు వేరేపని వుంది, వెళ్ళాలి. జాగ్రత్తబాబూ! ఎలా నిర్వహించుకుంటావోమరి! నీవు వెళ్ళి లామాసరీలో ప్రవేశాన్ని గెల్చుకో! గౌరవాన్ని నిలబెట్టుకో! జాగ్రత్త! బోధిసత్త్వుడు నిన్ను సదా చల్లగా కాపాడాలి అంటూ నామీద ప్రేమతో

పొంగివస్తున్న కన్నీళ్ళు ఆపుకుంటూనే వెనుదిరిగి వెళ్ళిపోయాడు.

ఎండ తీక్షణంగా వుంది! వీధిలో తెల్లని బూడిదలాంటి దుమ్ము ధూళి గాలికి ఎగురుతూ నామొహాన్ని కప్పేస్తున్నాయి. మాపనివాడు చెప్పిన గుర్తులనుబట్టి దోవ జాగ్రత్తగా చూసుకుంటూ నడవసాగాను. పొద్దుబాగా పైకిపాకింది. సుమారు పదకొండుగంటల ప్రాంతంలో ఎత్తైన సింహద్వారంతో కటకటాలు బంధించివున్న ద్రెపాంగ్ లామాసరీ ఆశ్రమం గేటువద్దకు చేరాను. అక్కడ ఎవ్వరూలేరు. మనుష్యసంచారం కూడా లేదు. నిశ్శబ్దంగానూ, నిర్మానుష్యంగానూ కనుచూపుమేర అందినంత వరకూ పిట్టపురుగు కనిపించలేదు. ఏంచెయ్యాలో తోచలేదు నాకు. భయం భయంగా వెళ్ళి గేటుకు తగిలించిన గడియను తాళంతో చప్పుడుచేశాను భయంగానే! అలా మూడుసార్లు శబ్దంచేసినా చడీచప్పుడు లేదు. ఇక చేసేదిలేక ఆ లామాసరీ ఆశ్రమం గేటుముందే కూలబడ్డాను. పద్మాసనంలో కూర్చుని, చేతులు ముడుచుకుని ప్రార్థనచేస్తున్న తీరులో. ఒకగంట గడిచింది. నిశ్శబ్దం! ఎండ మాడిపోతోంది. గాలిదుమారంలా లేచిన సుడిగాలి నానెత్తిన, మొహానపడి దుమ్ముధూళితో కప్పేసింది. అలాగ నేను దాహంతోనూ, దిగులుతోనూ ఒకగడ్డిపోచలా వణికిపోతూ కూచున్నాను.

లామాసరీలో చేరితీరాలి! నిన్ను లామాసరీలో చేర్చుకోకపోతే నువ్వు ఇంటికి రానవసరములేదు అన్న నాతండ్రి కఠోరమైన ఆజ్ఞ గుర్తుకువచ్చి నాలోనేనే భయంతో వణికిపోయాను!

మరోగంట గడిచింది. ఎవరో ఇద్దరు ముసలిలామాలు మాట్లాడు

కుంటూ బయటకుపోతూ కనిపించారు. వాళ్ళలోవాళ్ళు పెద్దగా మాట్లాడుకుంటూ నాప్రక్కనుంచి తప్పుకుని, నాకేసైనా చూడకుండానే వెళ్ళారు నన్నుదాటి. నాలో నిస్త్రాణ, నిరాశ, భయం, క్షణక్షణానికి ఆందోళన పెరిగిపోయాయి. ఏమిటి నాభవిష్యత్తు! ఇక్కడ నాగతి ఏమిటి? దాహం! నోరు ఎండిపోతోంది! ఎప్పుడో ఉదయం టిబెటన్ టీ తప్ప మరేఆధారం లేక శోషవచ్చినట్లయింది. సూర్యుడు మధ్యాహ్నం ఒంటిగంట దాటడం వల్ల ప్రచండంగా వెలుగుతున్నాడు. ఎండవేడి భరించలేనంత భయంకరంగా వుంది. గంటలు గడుస్తున్నాయి. నన్ను పట్టించుకునేవాడే లేడు. నాటోపీ తలపైన నిఠారుగా నిలబెట్టి నాలోనేనే ప్రార్థించటం మొదలుపెట్టాను నిరాశగానే! గంటలు గడిచిపోతున్నాయి. సాయంత్రం కావచ్చింది. సూర్యాస్తమయం అవుతూవుండగా ఒక ముసలిలామా లోపలినుంచి వచ్చి నావంక జాలిగాచూస్తూ — “ఇక్కడ ఎంతో కఠినంగా ఉందికదా బాబూ! ఇదంతా నీమీద క్రూరత్వంతోకాదు. ఇది నీకు పరీక్ష! గట్టిగా నిలబడు. విజయం సాధించు!” ఇదిగో ఈ కొద్ది టిబెటన్ జావత్రాగి ప్రాణాలు నిలబెట్టుకో అంటూనే సమాధానంకోసం ఎదురుచూడకుండా కొద్దిగా జావవంటిది పోసి మళ్ళీ లోపలికి వెళ్ళిపోయాడు. అంతే!

అర్ధరాత్రి ఖంగుమని గంటమ్రోగింది లామాసరీ కంచుగంటనుంచి. మరికొంతసేపటికి రెండుగంటలు అలా తెల్లవారబోతున్నట్లు లేతనీలపుకాంతి సంధ్యారాగం ఆకాశంఅంతటా అలముకుంటోంది. నాకు భోజనంలేక, ఆకలి, అలసట, బడలిక, ఒంటరితనం బాధించసాగాయి. ఇక నేను ఇక్కడే మరణించటం ఖాయం! సరే కానియ్, బుద్ధదేవుణ్ణి ప్రార్థిస్తూ ఇక్కడే మరణిస్తానుకానీ, ఇంటికి తిరిగివెళ్ళను అనుకుంటూ పట్టుదలతో

కూర్చున్నచోటునుంచి కదలకుండా రాత్రంతా అలానే మోకాళ్ళమీద కూర్చోవటంవలన మోకాళ్ళు, నడుము, పాదాలు, చీలమండలు విపరీతంగా సలిపేస్తూ నెప్పులు పెడుతున్నాయి. ఇంతలో నా ఎదురుగావున్న ఆ లామాసరీ పెద్దకంచుగేటు తెరుచుకుని ఒక బకెట్‌వంటి పాత్రలో ఆవిరులతో పొగలుకక్కుతూవున్న టిబెటన్ జావను తెచ్చిన ఒక ముసలి లామా కొబ్బరిచిప్పవంటి పాత్రలోవేసి నాకిచ్చి త్రాగు! ప్రాణాలు నిలబెట్టుకో! నీ పరీక్ష పూర్తికావచ్చింది!! పట్టుదలవుంటే విజయం సాధించటం తథ్యం! నువ్వు చూడబోతే గొప్పింటి జమిందారిబిడ్డలాగ కనపడుతున్నావు అంటూ సానుభూతిగా మాట్లాడుతూ వెళ్ళి ఆ కంచుగేటువెనుక మాయమ్యడు. అలా రెండురాత్రులు, రెండుపగళ్ళు గడిచాయి. నాకింక ఓపిక నశించిపోయే స్థితికి వచ్చాను! ఏక్షణాన్నైనా నీరసంతో కళ్ళుతిరిగి భూమ్మీద పడిపోవటం ఖాయం! ఇంతలో ఖంగుమని కంచుగేటు తెరచిన శబ్దం! తలఎత్తిచూసి ఆశ్చర్యపోయాను. ఇద్దరు ఉన్నతాధికారులైన లామాలు పసుపుపచ్చని ఎరుపుఅంచు కలిగిన కాషాయవస్త్రములవంటివి ధరించి చేతిలో దండంవంటిది పట్టుకుని ఒక సన్నగా పొడుగ్గావున్న గుడ్డపీలిక వంటి కండువా తెల్ల శిల్కువస్త్రం తెచ్చి నా భుజానవేశారు.

"ఆశీస్సులు!" అంటూ నీవు ఇక లేవవచ్చు! లామాసరీలోకి త్వరగావెళ్ళి కాలకృత్యాలు సకాలంలో పూర్తిచేసుకుంటే అదిగో గురుకులంలో పిల్లలందరూ ఫలహారాలు చేస్తున్నారు. అది పూర్తిగా అయిపోయేలోగా వెళితే నీకూ ఫలహారం లభిస్తుంది అంటూ వెనుదిరిగారు.

మెరుపులా లేచి పరిగెత్తాలని ప్రయత్నించాను! కానీ కాళ్ళు మొద్దుబారిపోయి తిమ్మిరులెక్కడంవలన లేచి దబ్బున పడిపోయాను.

శరీరంలో కీలుకీలు విపరీతంగా నెప్పెట్టి పట్టేశాయి. అయినాసరే అంత శక్తి ఎలావచ్చిందో నాకే ఆశ్చర్యం! పడిలేచి పరిగెత్తాను. ముసలిలామా గురుదేవులు చూపించిన దిక్కుగా. అల్లరిగా ఏడు, ఎనిమిది, తొమ్మిది ఏళ్ళ వయస్సుగల పిల్లలు చేతిలోని కొబ్బరిచిప్పలతో ఎగబడుతున్నారు. మ్యలో పొగలుకక్కే టిబెటన్ త్సాంపాజావ! నాకు వేరే ప్రోత్సాహం అక్కరలేకపోయింది. నాకు తెలిసేలోగా నేను వారిమధ్యలో నిలబడి నాచిప్పను జాపి ముందుకు తోసుకువెళ్ళాను. రెండుమూడు గరిటెల జావలాంటిది నాబొచ్చెలో పోశారు! ఆత్రుతగా దానివంక చూస్తూవుంటే కడుపులో మాడిపోతోంది. చుట్టూరావున్న పిల్లలు అల్లరిగా అటూఇటూ గోలగా పరిగెడుతూంటే నాబొచ్చె చేతిలోంచి జారి క్రిందపడిపోతుందేమో అనిపించింది. ఎలాగో అందరినీ తోసుకుంటూ ఒకప్రక్కగావున్న ఎత్తైన స్తంభంక్రింద కూర్చుని ఆత్రుతగా తినసాగాను డ్రెపాంగ్ లామాసరీలోని నా మొదటి భోజనం! అలా తెరుచుకుంది నా లామాసరీజీవితం అంటూ ముగించారు! అప్పటికే నిద్రముంచుకువస్తున్న మావంక జాలిగాచూస్తూ.

⁂



23

"లామాసరీ" - గురుకులంలో !

భోజనం కడుపులో పడగానే ప్రాణం లేచివచ్చినట్టయ్యింది. అంత కన్నా ముఖ్యంగా నన్ను లామాసరీలో గురుకుల శిష్యునిగా చేర్చుకున్నారన్న సంగతి రూఢీకావడంతో నాకు వెయ్యి ఏనుగులబలం వచ్చినట్టయ్యింది. "లామాసరీలో చేర్చుకోకపోతే — నువ్వు ఇక ఇంటికి తిరిగి రావలసిన పనిలేదు!" అన్న నాతండ్రిగారి కఠోరమైన శాసనం ఇప్పుడు నన్ను ఏమాత్రం బాధించడంలేదు.

లామాసరీ ఆశ్రమంలో జీవితం క్షణం తీరికలేకుండావుండేది. రెండురోజులపాటు ఎండకీ, గాలికీ లామాసరీద్వారం బయటే డస్సిపోయి

కాచుకొనివున్న నాకు — హాయిగా నిద్రపోయే అదృష్టంకూడా లేనట్టు తోచింది. ఎందుకంటే లామాసరిలో తెల్లవారకముందే నాలుగు గంటలకు గంటమోగిస్తారు! అందరూ వెంటనే బిలబిలమంటూ గురుకులం ఆశ్రమంలోని శిష్యులమంతా పరుగులుపెట్టాలి! — అరగంటలో ప్రారంభమయ్యే శిష్యుల సుప్రభాతప్రార్థనలో ధ్యానంలో కూర్చోడానికి! అంటే ఈలోగా కాలకృత్యాలు, స్నానం, శుభ్రమైన బట్టలు ధరించడం వంటి నిత్యకృత్యాలన్నీ పూర్తిచేసుకొని సిద్ధపడాలి.

నాకు రాత్రి అసలు నిద్రపోయినట్టే అనిపించలేదు. అలా వెన్ను వాల్చానో లేదో తెల్లవారిందన్నట్టు గం! గం! అంటూ మా ఆశ్రమం ముందర వ్రేలాడగట్టబడిన జేగంట మోగుతోంది! ఇద్దరు ముగ్గురు యువకులైన బ్రహ్మచారి లామాలు తాడును గట్టిగా ముందుకీ వెనక్కీ లాగుతూ ఆ సుప్రభాతపు జేగంటను మోగిస్తున్నారు!

ఆశ్రమంఅంతా మేలుకొలిపే శంఖారావం వంటి హెచ్చరిక ఆ జేగంట. అది మోగేసరికి ధ్యానమందిరంలో బుద్ధదేవుడి విగ్రహంముందు బారులుతీర్చి నిలబడతారు, ప్రతీవాళ్లూ తమ తమ వయస్సూ ఆశ్రమంలోని అంతస్థునూ అనుసరించి విగ్రహంముందు నిలబడివుంటారు. ముందుగా 90 ఏళ్లూ పైబడ్డ పీఠాధిపతులైన లామాగురువులూ నిలవాలి! లామాసరి ఆశ్రమం నిర్వహణంతా వీరి ఆజ్ఞలను అనుసరించే నడవాలి.

పొద్దున్నే ప్రార్థన తరువాత — ఆశ్రమంలోని బ్రహ్మచారులకు ప్రసాదమూ వేడివేడిగా పోసే జావవంటి త్సాంపా గంజి ఆతరువాత గురుకులం వంటశాలలో గాడిపొయ్యివద్ద వంటలో వయస్సునుబట్టి తలా ఒక్కోపని చెయ్యాలి. అలా మొదలవుతుంది రోజులో మా దినచర్య!

నా శరీరంలోని ప్రతీ కీలూ, ఎముకా జివ్వున పీకుతూ బడలికతో నెప్పులు పెట్టసాగినాయి — మూడురోజులుగా లామాసరీ గేటుబయట 'ప్రాణాచారం' లాగా కూర్చున్నందుకు! అవి క్రమంగా సర్దుకోడానికి ఒకవారం దాకా పట్టింది. అలా మొదలయ్యింది లామాసరీలో విద్యార్థిగా నా జీవితం!

తరువాత ఒక మంచిరోజున క్రొత్తగా ఆశ్రమంలో చేరిన లామా బ్రహ్మచారుల గురించి లామాసరీలోని 'గురుకుల సదస్యం' జరుగుతోంది! ఈ సదస్యం అతిముఖ్యమైన సన్నివేశం! పిల్లవాడుగా లామాసరీలో చేరిన బ్రహ్మచారి భవిష్యత్తు జీవితం అంతా అప్పుడే నిర్ణయించడం జరుగుతోంది.

"సదస్యం" అంటే చాలామందికి తెలియకపోవచ్చు. అది లామాసరీలో గురువులుగా అనేక విషయాలు బోధించే పీఠాధిపతుల సమావేశం! అందులో యోగం, జ్యోతిషం, టిబెటన్ వైద్యమూ, బౌద్ధగ్రంథాల స్తోత్రాలు, మంత్రాలు బోధించే గురువులు, బ్రహ్మచారి లామాలను వారి పూర్వజన్మ చరిత్రనుబట్టి వేరువేరు తరగతులుగా విభజించడమూ ఇప్పుడే జరుగుతుంది. అందులో కొత్తగా చేర్చుకున్న నన్నుగురించి ఇంకా ఇతర బాలబ్రహ్మచారులైన గురుకులం లామాలగురించిన చర్చ మొదలైంది.

పీఠాధిపతులైన లామాలు ఎత్తుగావున్న అరుగువంటి వేదికపైన గుండ్రంగా చక్రాకారంలో కూర్చునివున్నారు. వారిమధ్యలో తాళపత్ర గ్రంథాలు, నాడీగ్రంథాలూ తీసి చదువుతున్నారు. వారికి ఎదురుగా కొత్తగా చేరిన బ్రహ్మచారులు పుట్టినతేదీ, నక్షత్రం గణితం చేయబడిన జాతకం

పరిశీలించే జ్యోతిషపండితులు కూడా మా జాతకాలను పరిశీలించి ఫలితాలను సరిచూస్తున్నారు. అంతేకాదు వీరిలో దివ్యదృష్టిగల యోగులైన 90 ఏళ్ళకు పైబడ్డ పీఠాధిపతులైన లామాలు అధ్యక్షపీఠంలో కూర్చుని వున్నారు. వీరు ప్రతి బ్రహ్మచారీ గతంలోకి తమ మూడవకన్ను తెరిచి దివ్యదృష్టితో అతని సూక్ష్మశరీరాన్నీ గతజన్మలోని పుణ్య పాపకర్మలనూ అతని పూర్వజన్మ వాసనలనూ నిశితంగా పరిశోధిస్తారు. దాని నేపథ్యంలోనే ఆ విద్యార్థిజాతకమూ అతని భవిష్యత్తూ విశ్లేషించి సరిచూస్తారు భవిష్యత్తులో ఇలాంటివాడు, వాడి జీవితం ఎలా నడుస్తుందో!

నావంతు వచ్చింది — గురువులు నా జాతకాన్ని నిశితంగా పరిశీలించారు. నేను మంగళవారం పుట్టాననీ, నాజాతకంలోని గ్రహాలను సరిచూసి నాకు మూలికలను ఏరటం, మందులను తయారుచేయడం, కషాయాలు, లేహ్యాలు, గుళికలవంటివి తయారుచేసే టిబెటన్ వైద్యంలో ప్రత్యేక శిక్షణను నిర్ణయించారు.

నా జాతకం చూసి — "వీడు :-

"మొదట్లో అనేక కష్టాలు పడవలసివస్తుంది. బాధలు, అనుకోని ప్రమాదాలు ఆత్మీయులనుంచీ ఎడబాటు, ఒంటరిగా జీవించాల్సిరావటం లాంటి ఘట్టాలు ఎదురైనప్పటికీ — చివరికి నేను జీవితంలో విజయాన్ని సాధిస్తానట! నా మధ్యవయస్సులో టిబెట్ విడిచిపెట్టి వెళ్ళిపోవాల్సి వస్తుందని — అయినప్పటికీ హిమాలయ పర్వతాలలో రహస్యంగా గుప్తమైవున్న స్ఫటికపర్వతంలోని, శంబలప్రభువు దివ్యమైన ఆశీస్సులు నాపై వుండటంతో నేను ఆధ్యాత్మికంగా ఉన్నతశిఖరాన్ని అందుకుంటా

నని సంగ్రహంగా నాజాతకంలో రాసిన ఫలితాల సారాంశం!

నాకు ప్రత్యేకంగా ఒక గురువును నియమించారు. అలా అందరికీ వుండదు. చాలామంది బ్రహ్మచారులు ఒక గుంపుగా మందలాగా ఒక పాఠశాల తరగతిలో కొన్నినెలలు విద్యను నేర్చుకోవాల్సివుంటుంది. కాని నావిషయంలో మాత్రం ప్రత్యేకమైన గొప్ప మినహాయింపు ఇది! నాలో ప్రత్యేకమైన ఆధ్యాత్మికశక్తులు దివ్యమైన సిద్ధి, జ్ఞానం వంటివి నిగూఢంగా వుండటంవల్ల నేను పూర్వజన్మలో అధ్యయనంచేసిన అనేకమైన వేదశాస్త్రాలను అతితక్కువకాలంలో నేర్చుకుని సిద్ధిపొందగలనని — అందులో చాలామటుకు నేను గతజన్మలలో పాండిత్యం సంపాదించిన విజ్ఞానమే కావటం వలన నా విద్యాభ్యాసం చాలామటుకు — గతాన్ని నెమరు వేసుకోవటం లాంటిదే, అని పెద్దలైన లామాగురువులు నిశ్చయించి నన్ను మిగతా విద్యార్థులనుంచీ వేరుచేశారు. అలా వెయ్యిమంది బ్రహ్మచారులలో ఒక్కడికిమాత్రమే ప్రత్యేకశిక్షణ ఇవ్వడం సాధ్యపడుతుంది!

దీనివల్ల నాకు ప్రత్యేకమైన కష్టాలు ప్రారంభమయ్యాయి — మొదటిది నాకు విశేషంగా కష్టమైన శాస్త్రాలు అతిచిన్న వయస్సులోనే నేర్చుకోవాల్సివచ్చింది. రోజులో ఎక్కువభాగం గురువులతోనూ నాకు విధించబడిన శాస్త్రగ్రంథాలను చదవటంలోనూ గడపాల్సివచ్చేది. క్షణం విశ్రాంతిలేకుండా! నేర్చుకున్న శాస్త్రాలలో కఠినమైన పరీక్షలుండేవి. ఇవన్నీ ఏడవసంవత్సరంలో లామాసరీ గురుకుల విద్యార్థిగా నన్ను చేర్చుకున్న నాటినుంచీ 14, 15 సంవత్సరాలుదాకా పట్టింది, నావిద్యాభ్యాసం! నా జీవితం నాకు ఎంతో భారంగానూ నాశిక్షణ ఎంతో కష్టంగానూ తోచేది.

నాకంటే వయస్సులో ముసలివారైన పరమగురువులతోనే రోజులో నేను ఎక్కువభాగం గడపాల్సివచ్చేది. దానివల్ల ఆటలకుగానీ, వినోదమూ, విశ్రాంతి నావయస్సు పిల్లలకు దొరికే తీరుబడీ, ఆటవిరుపు నాకు తగ్గిపోయాయి. నేను దాదాపు ఒంటరిగా జీవించాల్సివచ్చేది రోజంతా! చివరకు రాత్రి అలసిపోయి విశ్రాంతికూడా అర్థరాత్రి దాటాకగానీ లభించేదికాదు. అలా పడుకోగానే — ఇలా తెల్లవారినట్టుండేది.

ఇలా మొదలైంది "డ్రెపాంగ్-లామాసరి" గురుకుల పాఠశాలలో లామాగా నాశిక్షణ, నా జీవితం! — అంటూ ముగించాడు తన బాల్యమూ గత జీవితంలోని అనుభవాలనూ ఆశ్చర్యంగా వివరిస్తూ!

అప్పటికే రాత్రి బాగా పొద్దుపోయి వుండటంవల్ల మా గుడారంలో చలిగాలి పెద్దశబ్దంతో వీస్తుంటే డేరాలోని గుడ్డలు, తెరలు టపాటపా కొట్టుకుంటూ వింతగా శబ్దంచేస్తున్నాయి. ఒక్కసారిగా ముక్కూ, మొహం, చేతివేళ్ళూ బిగుసుకుపోయేటంత గడ్డకట్టించే చలితో మంచుకొండల మీంచే వీచే చలిగాలి తగిలింది గుడారంలోంచి బయటకురాగానే! అందరం హడావిడిగా ఎవరి గుడారంలోకి వాళ్ళు వెళ్ళి దళసరి ఉన్ని కంబళ్ళూ, రగ్గులూ కప్పుకొని గాఢనిద్రలోకి జారుకున్నాం!

24

లామాసరీ - ఆశ్రమం

పరమపూజ్యులైన **'తాషీ-లామా'** మహాశయులు క్షణకాలం నిదానించి తనలో తానే ధ్యానంలో మునిగిపోయారు. చేతిలో తిరుగుతున్న జపమాల కూడా ఆగిపోయింది! అలా ఎంతసేపున్నారో కూడా ఎవరికీ గమనిక లేదు.

క్రమంగా ఆయన శ్వాస ఆడసాగింది. ఆయనలోంచి ఉచ్ఛ్వాస నిశ్వాసములు తీరికగా విరామంగా ఆడటం మొదలుకాగా ఆయన కనురెప్పలు కదిలి, నెమ్మదిగా కన్నులు విచ్చుకున్నాయి! ప్రశాంతంగా ఎదుటివారిని చూస్తూ నెమ్మదిగా ఇలా ప్రవచనం సాగించారు.

"మీరు దారిలో ఇక్కడి 'లామాసరీ' ఆశ్రమానికి వచ్చే మార్గంలోని

లోయకు ఎడంపక్కగావున్న "దెయ్యాలకొంప" అనబడే 'భూత్-బంగ్లా'లో, అనేక భయంకర విన్యాసాలు చూసి మీ మనస్సులు, హృదయాలూ బాగా కలతబడ్డట్టున్నాయి! ముందుగా బుద్ధదేవుని ధ్యానించి ఆ బోధి సత్త్వుని దయతో మీకు అన్నిబాధలు ఉపశమించాలని సంకల్పించి ప్రార్థించండి! ఆపైన ఇక్కడ మా ఆశ్రమంలోని బ్రహ్మచారులు మీకు అందించే వేడివేడి టిబెటన్ టీ “త్సాంపా” జావను వెచ్చగా తాగితే మీప్రాణాలు కుదుటపడతాయి. ఆపైన నిదానంగా మీరు అడగాలనుకున్నవి అడగవచ్చు!” అంటూ ఎదురుగావున్న గుండ్రని తలగల పొట్టి వెదురుకర్రతో ఎదుట వ్రేలాడుతున్న కంచుపళ్ళెం వంటి గంటని మోగించాడు. ‘ఖంగ్’మని మోగిన ఆ శబ్దానికి నాలుగుపక్కలనుంచీ ఎర్రటి ఊదారంగు కాషాయవస్త్రాలు ధరించిన ‘లామా-బ్రహ్మచారులు’ చేతుల్లో వేడివేడిగా ఆవిరులు పొగలుచిమ్ముతున్న “త్సాంపా” జావను గుండ్రని కొబ్బరిచిప్పల వంటి దొన్నెలలో పోసినది — పైన నిమ్మకాయంత వెన్నముద్దవుంచి అలసిపోయివున్న ఆ సాహసయాత్రికులబృందంముందు తెచ్చిపెట్టారు! ‘లామాసరీ’ దేవాలయం ముఖమండపంలోవున్న ఆ ‘ధ్యాన మందిరం’లో ఒక్కసారిగా జుంమ్మని ఓ వందమంది లామాలు చేసిన జపించిన ఓంకారం వినిపించింది, తుమ్మెదల ఝుంకారంలా! ఆ మందిరం లావుగా ఒకటిన్నర అడుగుల పొడుగున్న దళసరి సాంబ్రాణి వత్తులు (అగరువత్తులు) ఎనిమిదిదిక్కులా వెలిగించారు! దట్టమైన పొగ ఒక అష్టదళపద్మంలా ఎనిమిదిదిక్కులనుంచి రింగు రింగులుగా లేచి, పైకివచ్చి ఆ మందిరం పైభాగంలో శిఖరంలా ఏర్పడి అక్కడినుంచి ఒకతాడు వేసినట్టు పైకిపోతోంది! క్షణంలో ఆ ‘లామాసరీ’ గదిఅంతా

ఒక ధ్యానమందిరంలా మారిపోయింది! ఎవరికీ మాట్లాడటానికిగానీ, ఊపిరిపీల్చుకోటానికిగానీ ధైర్యంలేదు అక్కడి వాతావరణ నిశ్శబ్దం భంగం కలుగుతుందేమోనని. మనస్సులకు సుఖం, హాయి సర్వత్రా వ్యాపించాయి. ఇదేకాబోలు మహాత్ముల సన్నిధిలో లభించే 'పరమశాంతి' అనుకున్నారు ఆ సాహసబృందంలోని సభ్యులంతా. అక్కడి ప్రశాంతతకి ఆశ్చర్య పోయారు.



అలా ఒక అరగంట గడిచింది. ఇంతలో పీఠాధిపతి తాషీలామా ఆ సాహసబృందాన్ని సంభోదించి — ఇలా అడిగారు ఖంగుమనే కంచుగంట వంటి కంఠంతో : "మీరు ఏం కోరుతున్నారు మానుంచి?

చెప్పండి నిస్సంకోచంగా కావలసిందేదో — అడగండి!" అంటూ!

"మేం గురుదేవా! హిమాలయపర్వతాలను దర్శించాలని యాత్రగా బయలుదేరాం. మాలో అనేక దేశాలవారు వున్నారు. ఇటు రష్యానుంచీ, అటు ఇంగ్లండునుంచీ, ఇంకా బుద్ధదేవుని జన్మభూమి భారతదేశంనుంచీ మాబృందంలోని సభ్యులంతా కలిసి ఈ యాత్ర చేస్తున్నాము! నిన్న దారిలో మాకు ఒక పాడుబడిన బంగ్లాలో భయంకరమైన చేదుఅనుభవాలు ఎదురైనాయి.

"అక్కడ మాకు ఆతిథ్యం పలికిన ఒక ముసలి దొరసానీ! ఆమె పనివాడూ ఇంకా అనుచరగణమూ, మామూలుగా జీవించివున్న మనుషుల్లాగా మాకు కనపడలేదు! మనుషుల రక్తంతో చేసిన సారాయివంటి ద్రావకము త్రాగుతారట! క్షణంలో కనిపించిన కొవ్వొత్తి మళ్ళీ ఆ కనిపించినచోటనుంచి మాయంకావటమూ, రాత్రిళ్ళు ఎవరో స్త్రీలు నడుస్తున్నట్టూ 'కెవ్వున!' ఏడుపులూ, మరుక్షణమే ఎవరూలేని నిర్మాణుష్య ప్రదేశంలోంచి కాలిగజ్జెల సవ్వడి, స్త్రీల అలికిడి, అరగంటకోసారి తలుపు తట్టిన శబ్దం... మేం... ... తీరా, తలుపులుతీస్తే! బైట ఎవ్వరూ లేకపోవటం ఆ ధ్వని వచ్చిన దిశగా మేము పరిశోధించగా రెల్లుగడ్డిపొదలక్రింద కొన్ని సమాధులూ — కనిపించాయి! దాంతో ఈ భయంకర పరిణామాలకు మేమందరమూ బాగా చలించిపోయాం. మీయొక్క రక్షణా, ఆశీర్వాదమూ, అశ్రయమూ — ఈరాత్రికి ఇక్కడ మీ అశ్రమములో ఆతిథ్యమూ కోరి వచ్చాము!" అన్నారు ఇద్దరు, ముగ్గురు సాహయాత్రబృందంలోనివారు ఏకకంఠంతో మాట్లాడుతూ!

"ఈరోజుకి మాత్రమేకాదు — మా సాహసయాత్ర సవ్యంగా దిగ్విజయంగా పూర్తికావటానికి మీదయ, అనుగ్రహం మాకు ఎంతో అవసరం. మేమీ మంచుపర్వతాలలో యాత్ర పూర్తిచేసుకుని క్షేమంగా మాఇళ్ళకు చేరేవరకూ మీరక్ష, దైవకృప, దైవంఆశీస్సులు మావెంటవుండాలి" అంటూ సాహసబృందములోని ప్రతిఒక్కరు తాషీలామా ముందు మోకరిల్లి ఆయన పాదపీఠంపై తలఆన్చి నమస్కరించారు. మూడుసార్లు అలా మళ్ళీ మళ్ళీ నమస్కరించి లేచి ఎవరిస్థానంలో వారు కూర్చున్న తరువాత తాషీలామా ఈవిధంగా ప్రవచనం చేసారు!

"ఓం మణిపద్మ హం!"

— అని ముమ్మారు జపించి వారిపై మంత్రతీర్థం చల్లారు. మరుక్షణమే వారి శరీరమంతా కరెంటు వంటి శక్తి, వెచ్చటి ఆహ్లాదకరమైన సుఖము, ధైర్యము కలిగి వారి ప్రయాణబడలిక, కీళ్ళనొప్పులు చేతితో తీసివేసినట్టు మాయంకాగా ఆ సాహసయాత్ర బృందంలోని సభ్యులందరూ ఆశ్చర్యపోయారు. ఒకరిమొహాలవంక ఒకరు చూసుకున్నారు వింతగా!

"ఓం గురు–పద్మ సంభవాయ నమః"

— అంటూ మళ్ళీ మంత్రించి మావారిపై అందరిమీదా చల్లారు! ఒక ఐదువొత్తులతో దీపాలు వెలిగించిన హారతిసెమ్మ్యాలో వెన్నపూసతో వెలిగించిన దీపశిఖలు బంగారం రంగు కలిసిన అరుణకాంతితో వెలుగుతూవుంటే ఆ పూజాపీఠంలోని అన్ని విగ్రహాలకు ముందు ప్రదక్షిణంగా, సవ్యంగా తిప్పుతూ హారతినిచ్చారు — పెద్దగంటను "గం"

అని మోగిస్తూ!

ఒక్కొక్క దేవుని విగ్రహంముందూ అలా వరుసగా హారతులిచ్చారు. ముందుగా తారాదేవి — తారా తంత్రమునకు ఈమె అధిష్ఠానదైవం. బౌద్ధ తాంత్రిక శాస్త్రాలలో ప్రధాన శక్తిస్వరూపిణి. ఆతరువాత అవలోకితేశ్వరి! ఈమె మణిపద్మస్థుడైన అవలోకితేశ్వరుని శక్తి! ఆతరువాత ఐదుగురు ధ్యానంలో వున్న అనబడే ధ్యానబుద్ధులు — వజ్రసత్వుడు, అమితాభుడు, వజ్రపాణి, పద్మపాణి, అవలోకితేశ్వరుడు అలా అందరికీ వరుసగా ధూపదీపములు, హారతులు సమర్పించారు.

మధ్యనేవున్న ప్రధాన గర్భాలయంలో వేలశిరస్సులు వేలకొద్దీ పాదములు, వేలకొద్దీ చేతులూ, గల **"ఆది–బుద్ధుడు"** అనబడే అవలోకితేశ్వర మూర్తి ముందు చాలాసేపు గంటవాయిస్తూ దీపారాధనను, పైకీ, క్రిందకీ, ఆడిస్తూ అర్ధచంద్రాకారంగా త్రిప్పుతూ — ఐదుగురులామాలు వేద మంత్రాలు చదువుతూ మంత్రించిన జలాన్ని చుట్టూతిప్పి వెనక్కిచల్లారు! ఆపైన ఆ దేవతామూర్తులముందు నైవేద్యమిచ్చిన తియ్యటి అన్నప్రసాదం అక్కడి లామాసరి గురుకులంలో విద్యార్థులైన లామా శిష్యులందరికీ పంచబడింది. ప్రతిఒక్కరూ పద్మాసనంలో కూర్చుని ముందుగా నివేదన పెట్టిన ఆ ప్రసాదానికి శ్రద్ధగా నమస్కరిస్తూ — “ప్రాణము, జ్ఞానము, బలము ఇచ్చుగాక” అని ప్రార్థించారు. ఆతరువాత నెమ్మదిగా ఆ ప్రసాదాన్ని ఆరగించారు. ఇలా అక్కడి పూజ, ప్రార్థనలు పూర్తిఅయిన తరువాత తాషీలామా గురుదేవులు సాహసయాత్ర సభ్యులందరికీ ఆశీస్సులు చెప్పి సెలవు తీసుకోమన్నారు.

అందులో కొందరు ప్రశ్నలు, సందేహాలు అడుగుదామని ఎదురు చూస్తున్న వారితో "మీ సందేహాలు నిర్భయంగా అడగవచ్చు — ఎట్టి సంకోచమూ లేకుండా!" అన్నారు. భూత్‌బంగ్లా గురించి అడిగేలోగా తాషీలామా గురుదేవులు భళ్ళున నవ్వి — 'చేతితో అర్థమైంది' — అని సౌంజ్ఞచేస్తూ ఇలాఅన్నారు.

"మరణించినవాళ్ళ ఆత్మలు వాళ్ళకి తీవ్రమయిన చెడుకర్మగానీ, బలమైన కోరికలుగానీ, వదిలించుకోలేని కామక్రోధాలుకానీ లేక చాలా కాలంగా దాచిపెట్టుకున్న ధనము, సొమ్ముగానీ ఆఖరిక్షణాలలోనైనా విడిచిపెట్టలేకపోతే — అలాంటివారి ఆత్మలు అక్కడేవుంటాయి. వాటినే దయ్యాలు, భూతాలు, పిశాచాలుఅనీ ఇంగ్లీషులో స్పిరిట్ (Spirit) అని అనేకపేర్లతో పిలుస్తారు. ఎలా మరణించారో వారు మరణించిన తరువాత ప్రేతాత్మలు విడిచినబట్టవంటి వారి సూక్ష్మశరీరాలే.

"మనిషి మరణిస్తే అతని ఆత్మ భగవంతునివద్దకు చేరదా?" అంటూ ప్రశ్నించారు భారతీయసైంటిస్టు జగదీశ్‌చంద్రబోస్, మేఘనాధ్ సహాతో సహా ఇంగ్లీష్ గూఢచారి చార్లెస్ బెల్, నికోలస్ రోరిఖ్‌లు కలిసి ఒకేప్రశ్నగా. తాషీలామా గురుదేవులు చిరునవ్వు నవ్వుతూ — "ప్రతీవారి ఆత్మలు నేరుగా భగవంతునివద్దకు వెళితే మోక్షంకోసం మేమందరమూ ఇలా ఆశ్రమాలలోనూ, లామాసరీలు కట్టుకుని ఏళ్ళ తరబడి తపస్సు చేయటమెందుకు? మీకు అర్థమయ్యేలాగ ఒక ఉదాహరణ కథ రూపంలో చెబుతాను.

మీకందరకూ పిల్లలు వున్నారు. వాళ్ళని బడిలో చేర్పిస్తున్నారు

కదా! అలా కొందరిని అక్కడే భోజనం, హాస్టల్‌లోనే నివాసంవుండేలాగ చదువుకోవడానికి పంపిస్తారు. పాఠశాలలో అన్నిపాఠాలు నేర్చుకుంటూ తోటివిద్యార్థులతో కలిసిమెలిసి వుండటం చేతనవుతుందని. అలా సంవత్సరం గడిచాక ఒక తరగతిలోనివారిని వేరొక తరగతిలోనికి చేర్చుకుంటారు. అంటే వారి చదువు ఒక్క తరగతితో పూర్తికాదు! మనుష్యులనుకూడా అలాగే ఆత్మలుగా ఈ భూలోకానికి పంపిస్తారు. ఒక పాఠశాలలోకి పంపిన విద్యార్థులలాగ ఇక్కడ నేర్చుకోవలసిన కర్మపాఠాలు, పాపము-పుణ్యము, సమాజము, కుటుంబము, దేశమూ, తన విద్యుక్తధర్మము, కర్తవ్యాలు, తల్లి, తండ్రి, గురువులను ఎలా గౌరవించాలి? ఆతరువాత ఎలా జీవించాలి? అన్నీ నేర్చుకుంటారు. అలాగే ఈ ప్రపంచంలో దొంగతనం చట్టరీత్యా నేరం, హత్యచేస్తే నేరం, ఇలా నేరం చేసినవారిని ఏంచేస్తారో అలానే ఏనేరం చెయ్యకుండా విద్యపరిపూర్తి అయినతరువాత పూర్తిగా వారి బాధ్యత పూర్తిఅవుతుంది. అలాగే భూమిపై జన్మించే ప్రతీ మనిషి మొదటితరగతిలో చదువుకున్నట్లే చదువు ప్రారంభించి ఒక్కొక్క చర్యతో ఒక్కొక్క తరగతి దాటుతూ వెళ్ళాలి. అందులో అలక్ష్యం అశ్రద్ధ నిర్మూలించి క్రమశిక్షణగావుంటూ పట్టుదలతో పాసవ్వకపోతే మళ్ళీ అదే తరగతిలో చేరాలి. అలా ఏడునుంచి పన్నెండు జన్మలలోపల అనేక విషయాలను నేర్చుకుని తరువాత తరగతిలోని పైలోకాలకు పంపబడతారు జీవులు.

ఈ భూలోకంలో నేరాలు అనేకంచేస్తే వాటికి శిక్ష పోలీసులు, కోర్టులు విధించినట్టే భూతాలుగానూ, పిశాచాలుగానూ ఇంకా ఈభూమికి అడుగునవుండే చీకటిలోకాలైన నరకము జైలువంటి బందిఖానాలోనూ

బాధలు, కష్టాలు అనుభవిస్తూ వుండవలసివస్తుంది. అలాకాక అందరికీ సహాయపడుతూ, అవసరమైనప్పుడు మంచిపనులు చేస్తూ, ఎవ్వరికీ హానిచెయ్యకుండా వున్నాడో వాడు పైలోకాలకు పంపే అభ్యర్థులలో వుంటాడు. కానీ ఇదంతా భూలోకంలో మాత్రమే వుండే ట్రెనింగ్.

అలాగే పైలోకాల్లో కూడా దైవసంబంధమైన విషయాలు శిక్షణగా సాధన, ధ్యానము, జ్ఞానము వంటివి నేర్చుకోవలసిన పాఠములు. ఈ భూలోకంపైన ముఖ్యంగా మూడులోకాలు భువర్లోకము, స్వర్లోకము, మహర్లోకములు ముఖ్యమైనవి. ఇవి యోగులు మాత్రమే చూడగలరు. నిర్మలమైన మనస్సుతో, గాజుగోళీల వంటి దృష్టితో మాత్రమే చూడ గలుగుతారు. ఇలా ఈ మూడులోకాలు పరిశుద్ధఆత్మలు మాత్రమే చేరుకుంటాయి. తరువాతే ఈ విశ్వానికి ఆత్మఅయిన విశ్వాత్మకుని వద్దకు చేరుకుంటాయి. ఏ కోరికలులేనివారు, కోరికలను నియంత్రించ గలిగినవారు మాత్రమే ఈ స్థితిని చేరుకోగలరు. ఇదే నిర్వాణము లేక మోక్షము. మీకు చిన్నపిల్లల కథలాగ సంగ్రహంగా చెప్పాను. ఇందులో అనేక నిగూఢమైన విషయాలు వున్నాయి విస్తరించి చూస్తే. ఇక్కడ లామాసరిలోని విద్యార్థులకు బోధించే విషయాలు సాధనలాగ, జపం తోనూ ప్రత్యక్షంగా నేర్పుతారు. ఆతరువాత గురుకులంలోంచి బయట ప్రపంచంలోకి స్వేచ్ఛగా విడిచిపెడతారు. ఎవరి శక్త్యానుసారం వారు ఈ విశ్వానికి సేవచేస్తారు."

"తాషీలామా గురుదేవా! నమోనమః! మీ అద్భుత ఉపదేశం మాకళ్ళను తెరిపించింది!

తాంత్రికం అంటే ఏమిటి? మంత్రాలతోనూ, తాంత్రిక హోమాలతోనూ, పిశాచాలను, భూతాలను పారద్రోలే ప్రక్రియ గురించి తెలుపుతారా?'' భయపడుతూనే అడిగాడు పాటియాలా యువరాజా!

మీరీ ప్రశ్న ఎప్పుడు అడుగుతారా అని ఎదురుచూస్తూవున్నాను. దానిలో ఇక్కడ శిక్షణపొందిన తాంత్రికలామా "ఛోడ్" అనే స్మశాన ప్రక్రియలో పూర్తిగా శిక్షణపొంది పూర్తివిజయం సాధించాడు. అతనివద్ద నుంచే మీరు ప్రత్యక్షంగా అన్నివిషయాలూ తెలుసుకోవచ్చు. మీ హిమాలయ సాహసబృందములోని సభ్యులందరికీ రేపే మీకు అతను అన్ని విషయాలు బోధిస్తాడు. మీకూడా మా లామా బ్రహ్మచారిని తోడిచ్చి పంపిస్తాను అంటూ లామా గురుదేవులు ఆ సమావేశం పూర్తిఅయినట్టుగా తన ఆసనంపైనుంచి లేచి అవలోకితేశ్వరునికి నమస్కరించి లోపలికి తన మందరంలోకి వెళ్ళి అదృశ్యమయ్యాడు.

ఆరాత్రి అక్కడే మాకు భోజనం, బస మరి రెండు మూడు రోజుల విశ్రాంతి అనుగ్రహించారు తాషీలామా అనిచెప్పాడు మాతోవున్న. ఆ లామా బ్రహ్మచారి. అప్పటికే తెలతెలవారుతున్నది. తూర్పున బంగారు కాంతులతో చంద్రనిప్పుల వంటి వెలుగులు చిమ్ముతూ హిమాలయ సూర్యుడు ఉదయకిరణాలను ఆకాశం నాలుగువైపులా ప్రజ్వలిస్తున్నాడు. ఎరుపు, నీలం, ఊదారంగులలో ఎంత గొప్ప చిత్రకారుడూ చిత్రించలేని రంగులను ఆకాశమంతా అలంకరిస్తూ. అది మాజీవితంలో కొత్త సూర్యోదయమా అన్నట్టు.

◆



25

తాంత్రికప్రక్రియ - 'ఛోడ్!'

అలా మూడురోజులు తాషీలామాగారి ఆశ్రమంలో లామాసరి మందిరంలో పూజలు, జపాలు వింటూ మనస్సు పైలోకాలకు తేలిపోయి నట్టుగా విహరిస్తోంది. హాయిగా బ్రహ్మానందాన్ని అనుభవించాం సాహస బృందంలో అందరం!

దానికితోడుగా ఈ వారంపదిరోజులుగా మంచులోపడి హైరానగా నడిచిన, ఎముకలు నుజ్జుచేసే శ్రమలేదు. చర్మాన్ని చీల్చివేసే చలి గాలులూ లేవు! వాతావరణంకూడా లామాసరిలోని గురువుల మనస్సు లాగ ప్రశాంతంగా ఈ నాలుగురోజులూ, మేఘాలు లేవు! చలిగాలుల

మాటేలేదు. నీలపు స్ఫటికంలా నీలాకాశంలో ఉదయించే సూర్యుడి బంగారుకిరణాలు గోరువెచ్చగా శరీరాలకి తాకుతూవుంటే ఉదయం పూజలలో ప్రశాంతంగా ధ్యానంచేస్తూ గడిపాం! లామాసరి వంటశాల నుండి పొగలుకక్కుతూ ఆవిరులు వచ్చే **'త్సాంపా'** జావ, వేడివేడి భోజనం, కంటినిండా నిద్ర అన్నీ కలిసి క్షణాలమీద మనస్సుకు శరీరానికీ బలంపట్టింది. మూడవరోజు ఉదయమే లేచి బయలుదేరాము తాంత్రిక యోగి ఆశ్రమానికి — లామాబ్రహ్మచారిని తోడుతీసుకుని.

ఉదయమే నడక ప్రారంభించిన మా బృందం నిటారుగా కొండ మెరక ఎక్కుతూ ఊపిరి అందక రెండు మూడుచోట్ల ఆగవలసి వచ్చింది. దానికితోడు హిమాలయపర్వతాలలో ఎండ మా వీపుల్నిమండించేస్తోంది. వేడివేడి పెనంమీద కాల్చిన దోశలాగ మెడ, వీపూ చెమటతో తడిసి ముద్దయిపోయాయి. రెండవవైపునుంచి మంచుపర్వతాలపైనుంచి వీచే చలిగాలి అలా వీస్తూనేవుంది! ఇలా చలి వేడీ — రెండూ చర్మాన్ని చపాతీలు కాల్చినట్టు కాలుస్తూనే చలి వణికించేస్తూంటే మధ్యాహ్నం రెండుగంటలు అయ్యేసరికి ఎత్తైన కొండశిఖరం చేరుకున్నాము. అక్కడికి కాంచనగంగ శిఖరం అట్టేదూరం లేదని చెప్పాడు మాతో సాయంగావొచ్చిన బ్రహ్మచారి లామా! అరగంట విశ్రాంతి తీసుకుని మాతోతెచ్చుకున్న రొట్టెలు, **"త్సాంపా"** జావ భక్షించి అరగంట విశ్రమించి మళ్ళీ ప్రయాణం అందుకున్నాము!

అకస్మాత్తుగా దారి రాళ్ళతోనూ, వొస్తూ పోతూ లారీలు, ట్రక్కులూ, గాలిలోకి చిమ్మే ధూళి దుమారంతోనూ, వాతావరణమే పూర్తిగా మారి

పోయింది. మధ్యాహ్నం నాలుగు గంటలకు టీకోసం కాసేపు ఒక షేర్పా టీ దుకాణంవద్ద ఆగి భారతదేశపు వేడివేడి టీ పొగలుకక్కుతూనే తాగేశాం! మళ్ళీ దారివెంబడే పదిమైళ్ళునడచి కుడివేపుగారోడ్డుదిగి మైదానం వంటి లోయలోకి నడకపుచ్చుకున్నాం. అదంతా దుమ్ముతోనూ, గులకరాళ్ళతోనూ నిండిన మైదానంలాంటి ఓ నిర్మాణష్యమైన, విశాలమైన ప్రాంతము. దారికి ఎడమప్రక్కగా ఎండిపోయిన చెట్టు-మోడులు, కొమ్మలుకూడా వంకరతిరిగిపోయి వికృతంగా వున్నాయి. వాటిమీద కూర్చుని పెద్దపెద్ద రాబందులు ఘోరంగా అరుస్తూ శవాల ఎముకలను ముక్కుతో పొడిచి బొమికలకు అంటుకొనివున్న సగం కుళ్ళిన మాంసాన్ని రబ్బరులా పీక్కొని తింటున్నాయి. కొంచెందూరం వెళ్ళగానే వెదురుగడ, కర్రదుంగలాంటి దళసరి ఎముకలు, అస్థిపంజరాలూ, చిందరవందరగా అంతటా పడివున్నాయి.

అవి చూడగానే మా మనస్సు ఒకరకంగా వికారమయిపోయింది.

“ఇక్కడేదో శవాలను పీక్కుని తింటున్నట్టున్నాయి ఈ రాబందులు! ఇదేమైనా స్మశానమా! అన్నాడు పాటియాలా యువరాజా చీదరించుకున్నట్లుగా ముఖంచిట్లిస్తూ! కూడావస్తున్న లామాసరి బ్రహ్మచారి ఏదో రహస్యం చెబుతున్నట్టు నెమ్మదిగా —

“ఇది మరణించిన టిబెటన్‌ల శవాలను పడవేసే స్మశానభూమి” అయినా, మీకూ తెలుసనుకుంటాను. ఇక్కడ మా టిబెటన్‌ల ఆచారం ప్రకారం చనిపోయిన మనుషుల శవాలను అగ్నిలో కాల్చరు. భూమిలో పాతిపెట్టడం కూడా జరగదు. అలాచేస్తే మనిషి శరీరంలోని మాంసము,



రక్తము విలువైన ధాతువులతో నిండివున్నదంతా వృధాచేయడమవుతుందని — జీవకారుణ్యం, భూతదయా, ప్రధానంగాగల బాధ్యతాయుత దృక్పధంతో ఆలోచిస్తారు. ప్రకృతిలో ఆహారంకోసమే, ఈ స్మశానాన్ని అంటిపెట్టుకుని బ్రతికే జీవులు అనేకం! మానవశరీరాన్ని వాటికి ఆహారంగా వేస్తే కొన్ని జీవులకైనా ఆకలితీర్చినవారిమౌతాము. మన శరీరంతో అన్నశాంతి; భూతదయగా, మన శవాన్ని రాబందులకు, అడవి నక్కలకూ, తోడేళ్ళకు, గుడ్లగూబలకు ఆహారంగా విసిరివేస్తాం!

“ఇలా మరణించినవారి శవాలు స్మశానంలో గద్దలూ, రాబందులూ తినేలాగ విసిరివేస్తే — ఆ ప్రదేశంఅంతా భూతాలకు, పిశాచాలకు స్థావరముగా మారదూ?” అంటూ భయంతోకూడిన కుతూహలంతో ప్రశ్నించాడు జగదీశ్ చంద్రబోస్ అనే భారతీయ సైంటిస్టు. ఆయన ముఖంచిట్లిస్తూ బాధతోనూ, జుగుప్సతోనూ ఆయన ముఖం ముడతలు పడింది. ఆయన బెంగాలీబ్రాహ్మణుడు కావటంచేత భారతీయ వేదమతం ప్రకారము బ్రాహ్మణులు మరణించినవారి శవాలను మంత్రాలతో దహనం చేయటం ఆచారంగాగల ఆ సంస్కృతికి అలవాటుపడ్డాడు. అలాంటి వాడికి సహజంగానే చనిపోయిన మనుషుల శరీరాన్ని కాకులకూ, గద్ద

లకూ ఆహారంగా వేస్తూంటే అసహ్యం కలిగివుండవచ్చు. బాధగానూ అనిపించవచ్చు!

"ఇక్కడ శవాలను విరక్కొట్టే — 'పల్లకాటి జీతగాళ్ళు' వుంటారు!" లామాసరీనుంచి వచ్చిన బ్రహ్మచారి చెప్పుకుపోతున్నాడు. వాళ్ళ పని శవాల శరీరంలోని ఎముకలను విరక్కొట్టి ముక్కలుచేసి తలలోని పుర్రె పగలకొట్టి లోపలి మెదడు, నాలుకను, గొంతులోని నరాలను మీరు కొబ్బరి పీచు పీకినట్టు పీకిపారేసి చుట్టూరా విసిరివేస్తారు.

ఇలాంటి స్మశానంలో వైద్య-లామాలు కూడా కుతూహలంతో గుంపులుగా చేరతారు. మనిషి శరీరంలోని అవయవాలు కోసి వైద్యశిక్షణ పొందడానికి, ఇక్కడే వైద్య లామాలకు — వైద్యంలో కావలసిన శిక్షణ కోసం టిబెటన్‌ల శరీరంలోని అవయవాలు తీసిచూపిస్తారు — మనిషి గుండెకాయ ఎలావుంటుందో చూపిస్తారు — యదార్థంగా పేగులు, కనుగుడ్లు, మెదడులోని నరాలూ అన్నీ ఇలా ఒక్కొక్కటే అరచేతిలో గీతల్లా ప్రత్యక్షంగా చూపించి మానవశరీరంతో వైద్యశాస్త్రాన్ని నేరుగా బోధిస్తారు. అలాంటి వైద్యవిద్యార్థులకూ — ఈ స్మశానం ఎంతో అనుకూలము.

"ఇకపోతే మూడవరకం విద్యార్థులుకూడా ఈ స్మశానంలో తిరుగుతూవుంటారు. వాళ్ళే **"తాంత్రికులు!"** అంటే స్మశానంలో కూర్చుని భూత, భేతాళ, పిశాచ, యక్షిణీ దేవతలను ఆహ్వానించి వారిమధ్య నిర్భయంతో ధైర్యంగా నిలబడి ఆ తాంత్రికహోమంలో పిశాచాలతో పోరాడి, ధైర్యం పోగొట్టుకోకుండా నిలబడి మంత్రాలుచదువుతూ —

మంత్రసిద్ధికోసం తపస్సుచేస్తారు.

ఇలాంటివారు సాధారణంగా రాత్రివేళ మాత్రమే ఈ స్మశానంలో వుంటూ అలా దాదాపు ఒకటి, రెండు సంవత్సరాలు ఈ స్మశానంలోనే నివశిస్తూ సాధనచెయ్యాలి. అలా గురువు ఉపదేశించిన మంత్రము సిద్ధి పొందాక స్మశానం అంటే భయంపోయాక రాత్రిళ్ళు శవాలను పూడ్చివేసే గోతులలో పడుకుని నిద్రిస్తారు — నిర్భయంగా!"

"మరికొందరు — చచ్చిపోయిన మనిషి కపాలంలోని పుర్రెలోనే దప్పికకు దప్పికకు నీళ్ళుకూడా త్రాగుతారు. అన్నం వండుకుని అందులోనే తింటారు. అంతెందుకు? — మనిషి కపాలంలోనే భిక్షచేస్తారు. ఏం! వింటూవుంటే మీకు భయంకరంగానూ, అసహ్యంగానూ, జుగుప్సగానూ అనిపిస్తోందా?

మీ హిందూమతంలో కూడా మీ శివపరమాత్ముడు స్మశానంలోనే నివశిస్తాడనీ, ఆయనవెంట రుద్ర, పిశాచ, భూతప్రేతగణాలు వుంటాయనీ చెబుతారుగదా! ఇంకా స్మశాన-రుద్రయాగంలో నాట్యంచేస్తూ రుద్రతాళం వేస్తూ ఆయన చేతిలో డమరుమోగిస్తూ — చితిలో కాలుతున్న శవం మీద కూర్చుని అలానే ధ్యానంచేస్తాడనీ, ఆ శవాల్ని కాల్చిన బూడిదనే శరీరంమీద పూసుకుని విభూదిగా ధరిస్తాడనీ — అఘోర్శైవంలో రాయ లేదూ! అదిఅంతా స్మశాన తాంత్రికములో సాంప్రదాయమే!"

అంటూ ఆశ్చర్యపోతున్న భారతీయసైంటిస్టు అడిగిన ప్రశ్నకు సమాధానపరచడానికి ప్రయత్నిస్తూ అన్నాడు. అప్పటికి పొద్దువాలి చీకటి పడసాగింది. మా సాహసబృంద సభ్యులలో ఆపాటికే సాహసం నీరుకారి

పోయింది. ఈ స్మశానంలోని బూడిదలో నడుస్తూవుంటే కాలికి తగిలిన పుర్రెలు బంతుల్లా ఎగిరిపడుతున్నాయి దుమ్మురేపుకుంటూ!

కనుచీకట్లు ఆ స్మశానాన్ని ఆవరించుకున్నాయి చీకట్లో పొగకీ కనిపించక శవాల కాళ్ళుచేతులూ మా కాళ్ళకిందపడి మెత్తగా తగులుతూ వుంటే ఆ చీకట్లో నడవటం కూడా కష్టమైపోయింది! ఇక రాత్రి ఎలా వుంటుందో? మిత్రమా! ఈ స్మశానంనుంచి వెళ్ళిపోదామా? అన్నారు నలుగురైదుగురు సాహసబృంద సభ్యులు ఐక్యకంఠంతో! వారి ఆశ్చర్యానికి, భయానికి పెద్దగా పట్టించుకోకుండా వింతగా చూస్తూ లామాసరీ నుండి మావెంటవచ్చిన బ్రహ్మచారిలామా — ఇలా అన్నాడు... ...

"మీరు తాంత్రిక మాంత్రికుణ్ణి చూడాలనుకుంటే ఆయన అర్థరాత్రికి మాత్రమే ఈ స్మశానంలోకి వస్తాడు. మిగతా సమయాల్లో ఎక్కడెక్కడో తిరుగుతాడు. ఆయనను పట్టుకోవడం కష్టం. మనం ఇంకో రెండు, మూడు గంటలు ఇక్కడే కాలక్షేపంచేస్తే — అర్థరాత్రికి ముందే ఇక్కడికి వస్తాడు! తప్పక మీకు పరిచయంచేసి నాదారిన నేను వెళతాను. లేకపోతే మా గురుదేవుల ఆజ్ఞను ధిక్కరించినవాడినవుతాను. వారి అనుగ్రహమే నాకు రక్ష" — అంటూ ఆ స్మశానం అవతలప్రక్కవున్న రోడ్డుదాటి, అవతలికొండ అంచునవున్న టీషాపుకు దారితీశాడు.

ఒక పంజాబీవ్యక్తి నడుపుతున్న టీషాపు అది. అందులో ఇద్దరు గూర్ఖాలు, ఒక షేర్పావ్యక్తీ, ముగ్గురు టిబెటన్ నౌకర్లు గిన్నెలు తోమడానికీ, పొయ్యివెలిగించి టీనీళ్ళు మరిగించడానికీ, సాయంగా వున్నారు. రాత్రి బాగా చీకటిపడింది. చలి వణికించేస్తోంది. బడలిక, శ్రమతోనూ,

చెమటమీద పేరుకున్న దుమ్మూధూళితోనూ, అలసటతోనూ డస్సపున్న వారికి ఎర్రగా మండుతూ టీగిన్నెకింద వెలుగుతున్న మంట చలిమంటలా ప్రశాంతతనిచ్చింది. పదినిమిషాలలో టీ కలిపి టీతోపాటు ఫలహారంకోసం రొట్టెలు, బిస్కట్లూ తెచ్చి వారికి ప్లేట్లలోపెట్టాడు. కానీ అవి ఏమాత్రమూ వారికి తినాలని రుచించక రొట్టెలుకాని, ఫలహారాలుకానీ తినాలనిపించ లేదు. అప్పటిదాకా స్మశానంలో చూసిన ఎముకలు, శవాలు, రాబందుల విన్యాసాలూ, ఇంకా వారి మనస్సులను వికారంగా పీడిస్తున్నాయి! ఇంతలో చార్లెస్ బెల్ తటాలున తన చేతిమీద వాచీ చూసుకుంటూ “మైగాడ్! పదకొండు కావస్తున్నది, త్వరగా టీతాగేసి వెళ్ళి మన స్మశాన తాంత్రికుడ్ని కలవాలి! పదండి!!” — అన్నాడు నిదానంగా టీ తాగుతున్న మిగిలిన మిత్రులను తొందరచేస్తూ!”

అర్ధరాత్రి కావస్తూండటంతో టీ తాగడం పూర్తిచేసి ఆ మిత్రబృందం అందరం కాళ్ళీడ్చుకుంటూ అటువైపువున్న స్మశానందారి పట్టి తాంత్రిక హోమం “ఛోడ్” చూడాలన్న ఆసక్తితో నీరసంగా నడిచాము.

II

పొట్టిగా, కుదిమట్టంగా వున్నాడావ్యక్తి! మాసినగడ్డమూ తెలుపూ, నలుపూ కలిసి బూడిదరంగుతేలిన వెంట్రుకలూ కళ్ళు బెదురుతున్నట్టూ, ఆశ్చర్యంగానూ ఒకరకమైన పిచ్చివాడికళ్ళలో కనిపించే వికృతమైన చూపూ! అన్నీ — చూస్తే కొంచెం భయంకలిగిస్తుంది — ఎవరికైనా! ఎత్తైన ఎముకలు, బలమైన దృఢమైన దవడఎముకలూ; ఇంటిచూరులా

ముందుకి పెరిగిన నుదురూ, విశాలంగా బల్లపరుపుగా వున్న ఛాతీమీద చిన్న చిన్న ఎముకలూ జంతువుల కోరలవంటి దంతాలూ అన్నీ దండగా గుచ్చి ఓమాలగా వేసుకున్నాడు! పైపంచెగానీ, కండువాకానీ మరే ఆచ్ఛాదనాలేని శరీరం! బలంగా, దృఢంగా తిరిగిన కండలతో ఎముకలు పైకే కనిపిస్తున్నాయి. మోకాళ్ళవరకూ ధరించిన అంగవస్త్రం, లేక తువ్వాలు వంటి పొట్టివస్త్రం ధరించివున్నాడు. అప్పుడే రాత్రి కావస్తున్నది. అతను నిత్యసాధనకు ఉపక్రమించబోతుండగా — మాతోవచ్చిన 'లామాసరీ' బ్రహ్మచారి మమ్మల్ని పరిచయం చేశాడు.

"వీరిని పూజ్యగురుదేవులు 'తాషీలామా' పీఠాధిపతులు మీవద్దకు పంపారు! వీరు ప్రపంచంలో ఎక్కడెక్కడో మారుమూలదేశాలనుంచీ ఎన్నో దేశాల వాళ్లు కలిసి, ఎన్నో కష్టాలకు ఓర్చి, శ్రమపడి ఓయాత్రగా వచ్చారు — తాంత్రికవిద్యలు తెలుసుకోవాలని! అందుకే మీవద్దకు 'తాషీలామా' గురుదేవులు వీరికి నన్ను తోడిచ్చి పంపారు" — అన్నాడు సగౌరవంగా నమస్కరిస్తూ.

"వీరికి నాగురించి తెలుసా? నేనెవరినో, ఎటువంటివాడినో, నేను చేసే తాంత్రికపూజలు, స్మశానంలో శవాలమధ్యలో జరిపే **"ఛోడ్" "భైరవ తాండవమూ"** — అన్నీ వీరికి తెలుసా?" అన్నాడు ఆశ్చర్యంగాచూస్తూ. అసలీ ప్రపంచంలో తనకోసం ఎవరైనా చూడటానికి వస్తారంటే నమ్మలేనట్టుగా ఆశ్చర్యంగావుందతని ధోరణి.

మామూలుగా అయితే అతడెవరితోనూ మాట్లాడడు! ఎవ్వరు పిలిచినా పోడు!! ఇల్లూ, వాకిలీ, భార్యా, బంధువులూ అంటూ అతనికి

ఎవరూలేరు. ఒక్కడే! ఏకాకి! పైగా అతడి నివాసం స్మశానంలో!

"వీరు ప్రత్యేకించి మీరుచేసే తాంత్రికహోమాన్ని, 'ఛోడ్' అనే తంత్రయోగ తాండవాన్నీ చూడాలని ఆసక్తితో వచ్చారు. ఇదుగో! వీరిని మీకు పరిచయం చేశాను — ఇక నేను సెలవు తీసుకుంటాను!'' అన్నాడు తన బాధ్యత వదిలిపోయినట్టుగా. ఆ ఇద్దరిమధ్యా ఇటూ అటూ మార్చి మార్చి చూస్తూ ఆతృతగా నిలబడ్డాం! మా సాహస యాత్రికుల బృందం, ఏం జరుగుతోందో అంతుపట్టక!

"మీరేం చూడాలని వచ్చారు?'' అన్నాడతను, 'లామాసరీ' నుంచి వచ్చిన యువకుడు — వెళ్ళిపోయాక!

"మీరిక్కడ అరుదైన తాంత్రిక-పూజలు చేస్తారనీ, స్మశానంలో పిశాచాలు, భూతాలు, భేతాళములవంటి మహాశక్తులను ఆవాహన చేసి వాటిని మీ వశంలో నిగ్రహించిపెట్టుకుని జరిపే "భేతాళ-తాండవం" గురించికూడా విన్నాము! కాని కళ్లారా నిజంగా చూడాలని వచ్చాము''; అన్నారు ఓస్పెన్ స్కీ, పాటియాలా యువరాజూ, చార్లెస్ బెల్ నేనూ మరి ముగ్గురూ — అంతా ఏకకంఠంతో! మిగిలినవారంతా అంగీకారంగా తలలాడించారు — తాము ఏం చూడాల్సివస్తుందో అర్థంకాక!

"నేను జరిపేది — 'ఛోడ్' అనే తాంత్రికపూజా తాండవ ప్రక్రియ! అది, ఒక్క అమావాస్యనాడే చేస్తాను, అన్నిరోజులూ చెయ్యను! ఇలాంటివి — అమావాస్య ముందరి తిథి 'చతుర్దశి' ఎప్పుడైతే అర్ధరాత్రికి ముందుగా అంత్యమౌతుందో — సరిగ్గా అలాంటి ఘోర-నిశిరాత్రి, అంటే చతుర్దశీ-అమావాస్యలు కలిసే 'కాళరాత్రి' 'సంగమ-కాలం'లోనే ఈ స్మశానంలోని

భూత భేతాళశక్తులు విజృంభిస్తాయి! అప్పుడే వాటిని ఆహ్వానించి 'ఆవాహన' చెయ్యడం సాధ్యపడుతుంది! కాని, అది చూడాలంటే ఎంతో గుండెబలమూ, ధైర్యం కావాలి. చాలామంది ఈ తాంత్రికప్రక్రియలో దిగి పిచ్చివాళ్ళైపోయినవారూ మతిభ్రమించి యావజ్జీవం సంకెళ్ళతో బంధించబడి జీవితమంతా ఏకాంతంలో గడుపుతున్నవాళ్లూ, వున్నారు! మనస్సు దిటవులేకపోతే వాటికన్నిటికీ — మీదే బాధ్యత! ఇవన్నీ తెలిసి కూడా మీరు "ఛోడ్"-తాంత్రికప్రక్రియ — చూడాలని కోరుతున్నారా?" — అన్నాడు.

"అందుకే గదా! ఈరోజు అర్థరాత్రినుంచే అమావాస్యకదా అని మేం ముందే లెక్కించుకొని మా ప్రయాణాన్ని ఈరోజుకు కుదిరేలాగా ఏర్పరచుకున్నాం" అన్నాడు నికోలాస్ రోరిక్ మహాశయుడు. అతడు అదంతా విన్నాక — "సరే! మీఇష్టం! చూడండి! అంతా ఇక్కడే నిలబడి" — అని తన పనిలో తాను మునిగిపోయాడు! ఒక గంటసేపు విశ్రాంతిగా వేచి వుండమని తాను తన పూజాప్రయత్నాలు ఆరంభించాడు.

చుట్టూరా నిశ్శబ్దం — కీచురాళ్ల రొద వినవస్తోంది. ఓ గంట గడిచింది! అర్థరాత్రి కావస్తోంది. దూరంనుంచి నక్కలు కెవ్వుమని ఊళ పెడుతున్నాయి. స్మశానం సరిహద్దున చెట్టుమీదనుంచి రాబందులూ, గుడ్లగూబలూ వికృతంగా అరుస్తున్నాయి — రాబోయే తాంత్రిక కార్యక్రమం కోసం ఎదురు చూస్తున్నట్టుగా!

ఇంతలో — ఎవరో గొల్లున ఏడ్చిన శబ్దం! ఏడుస్తూ ఓవ్యక్తి ఆవెంట ఐదారుగురు మనుషులూ ఒక శవాన్ని మోసుకునివచ్చి కింద

పెట్టారు! చాలాసేపు అలా గుండెపగిలేలా — బంధువులు విలపించాక ఆ శవానికి చెయ్యాల్సిన కర్మకాండ జరిపించి, మంత్రాలు, పూజలు పూర్తిచేసి — ఆ శవానికి భారతీయ సాంప్రదాయం ప్రకారం ఎత్తుగా కట్టెలుపేర్చి ఓ చితిని అమర్చారు — శవంపైన కట్టెపుల్లలు గుట్టగా పోగుపెట్టి!

అందులో ఒకరు శాస్త్రోక్తవిధిలో మండుతున్న కొరకంచుతో ఆ శవానికి, తలకు నిప్పంటించారు. నిముషాలమీద మంటలు జ్వాలలుగా రెచ్చిపోయి చితి అంతా చంద్రనిప్పులతో సెగలుకక్కుతూ మండిపోసాగింది! అలా ఒక గంటసేపు వేచివుండి — విచారంతోనే వెనక్కి తిరక్కుండా మిగిలిన బంధువులు ఇంటిదారి పట్టారు.

మరో అరగంట దాటింది! చితిలోని మంటలు నిప్పుకణికలుగా మారి శవం — కపాలంపేలిన "ఠఫ్" మన్న శబ్దంతో నిప్పులు పైకెగిరి పడ్డాయి!

అప్పుడు లేచాడు — తాంత్రికపూజలు చేసే ఆ సాధువు! ఆ శవాన్ని కాలబెట్టే చితిలోంచి మండుతున్న ఓ కాలితొడని తీశాడు! దానిని భుజంమీద గదలా పెట్టుకుని మైదానం మధ్యకు తీసుకునివెళ్ళి ఓ వేదికమీద పెట్టి — అగ్నిస్థాపన మంత్రాలు గట్టిగా చదువనారంభించాడు చితుకులు కుప్పగా పోసి ఆమంట ఆరిపోకుండా చూస్తూ రాజుకునేలా చేస్తే నిముషాలమీద పెద్ద-మంటరాజుకుంది!

అప్పుడా సాధువు లేచి ఓ చిన్న రేకుడబ్బాలోంచి నల్లటి బొగ్గుపొడి, తెల్లటి ముగ్గూ, ఎర్రటి కుంకుమా, పసుపుపొడీ — తీసుకుని ముందుగా

బొగ్గుతో ఒక అష్టదళపద్మం వేశాడు, ఎనిమిది దిక్కులకూ ఎనిమిది కోణాలు ఏర్పాటుగా వుండేలా! దానిపైన ఐమూలగా పసుపుతోనూ, దానికి ఐమూలగా — ఈశాన్య, నైఋతి కోణాలకు వంగివుండేలాగ కుంకుమతోనూ ముగ్గులువేశాడు!! దానికి రెండుపక్కలా — తెల్లని ముగ్గుతోనూ, నల్లని బొగ్గుపొడితో రెండుపాములను — చిత్రించాడు! దానిచుట్టూ మండలాకారంగా అన్నిరంగులతోనూ ముగ్గులావేస్తూ ఆ ముగ్గులతో ఓ "యంత్రం" లాంటిది, వేశాడు! దానిమీద టిబెటన్ భాషలో ఏవో బీజాక్షరాలు వ్రాసి ఆ రెండుపాముల తలలపైనా రెండు దీపారాధనలు పెట్టి, వెలిగించాడు!



ఆ దీపారాధన ఓ మనిషి కపాలంలోని ఒక ఎముకను ప్రమిదలా చేసి మనిషికొవ్వుతో దాన్ని వెలిగించాడు.

‘‘కాలభైరవుడి!’’ కరాళనృత్యం - “ఛేడ్!”

అలా నాలుగువైపులా దీపాలు వెలిగించాక, వాటిమధ్యన ఒక్కొక్క నిమ్మకాయకూ పసుపూ, కుంకుమా అద్ది మంత్రించిపెట్టాడు. ఆపైన దూరంగావున్న తన గుడిసెవంటి కుటీరానికి వెళ్ళి ఒకపెద్ద తాటిమట్ట వంటి మనిషి తొడఎముకను తెచ్చాడు. దానితో గుండ్రంగా అప్రదక్షిణగా తిప్పుతూ మంత్రాలు చదువసాగాడు. 'ఓం రక్త చాముండాయై నమః', 'హ్రీం స్మశాన భద్రకాళ్యై నమః', 'ఓం ఠం ప్రత్యంగిరాభూతధాత్ర్యై నమః', 'ఓం హ్రీం కపాల మాలికాయై నమః', 'ఓం ఠం వనదుర్గాయై నమః', 'ఓం హ్రీం స్మశాన మాతంగియై నమః' అంటూ ఉగ్రమైన బీజాక్షరసంపుటితో భయంకరమైన క్రోధదేవతలను ఆవాహనచేస్తూ పూజకు ఉపక్రమించాడు.

ముందుగా చర్మాసనం తీసి దక్షిణదిక్కుగా పరచి పద్మాసనంలో కూర్చున్నాడు. సాహసయాత్రికులం పరిశీలనగా చూసి అది మనిషి శవం నుంచి వొలిచి తీసిన చర్మమని తెలిసి, జడుసుకున్నాం! ఆ శవానికి తీసిన చర్మానికింకా — ఒకపక్క జుట్టూ, నాలుగుపక్కలా కాళ్ళూ, చేతులూ పులిచర్మానికిలాగే కనిపిస్తున్నాయి! ఆ చర్మాసనంమీద కూర్చుని — కొబ్బరిచిప్పలాంటి మనిషి పుర్రెలో పట్టిన రక్తాన్ని తన ముందుంచుకుని జపమాల తీసి మెడలో వేసుకున్నాడు.

"అది మామూలు జపమాల లాగా లేదే?" — అంటూ మేఘనాథ్ సాహా, శ్రీనివాసచక్రవర్తి పరిశీలించి తమ సందేహాన్ని వెలిబుచ్చారు. చార్లెస్ బెల్ జేబులోంచి తన బైనాక్యులర్స్ తీసి పరిశీలనగా చూస్తూ "మైగాడ్! అది మరణించిన మనుషుల దంతాలన్నీ పూసలుగా గుచ్చి తయారు

చేసిన జపమాల!" అన్నాడు, ఆదుర్దాగా పైపును వెలిగిస్తూ! ఇంతలో ఆ మాంత్రికుడు తటాలున లేచి కాలుతున్న చితిలో చెయ్యిపట్టి గుప్పెడు బూడిద తీసి నుదుట అడ్డంగా నాలుగురేఖలు దిద్దుకుని — అదే బూడిదతో ఛాతీమీదా చేతులమీదా అడ్డబొట్టులాగ పెట్టుకున్నాడు. ఆతరువాత లేచి నిలబడి తానుకట్టుకున్న అంగవస్త్రం చింపిపారేశాడు. లోపల ఎర్రటి లంగోటీమాత్రం కనిపిస్తోంది! భుజంపైనుంచి జందెంలాగా వేలాడుతున్న తాడుకు కట్టిన కొమ్ముబూరా తీసి ఓ పెద్ద గర్జనలాగా నాలుగుదిక్కులకూ పూరించాడు ఆ శబ్దానికి. ఒక్కక్షణంలో స్మశానం నాలుగువైపులా వున్న చెట్లమీదినుంచి రాబందులూ, గుడ్లగూబలూ, పక్షులూ సందడిగా ఎగిరి అతడిముందున్న శవంచుట్టూ వాలాయి!

అతడు, పెద్ద కంఠస్వరంతో అరుస్తున్నట్టుగా మంత్రాలు చదువుతూ మరణించినవారి ప్రేతాత్మలను పిలుస్తూ ఆహ్వానించసాగాడు. క్రమంగా లేచి నిలబడి ఆవేశంతో వూగిపోతూ తాండవనృత్యం చేస్తున్నాడు. అర్థరాత్రి అయింది. నక్కలు పెద్దగా కూస్తూ శవంకోసం చుట్టూచేరాయి! అతడి తాండవనృత్యం మరింత వేగం పుంజుకోసాగింది. కళ్ళు ఎర్రగా, చింత నిప్పుల్లా, భయంకరమైన క్రోధంతో ఒక పిచ్చికళతో వికృతంగా ప్రకాశించాయి! ఇంతలో ఆ తాంత్రికునిచుట్టూ అన్నివైపులనుంచీ వికృతమైన అరుపులూ, పిశాచపు కేకలూ, ఏడుపులవంటి వికృతమైన కీచుమన్న అరుపులూ వినిపించాయి! అతడుమాత్రం వాటిని చూడనట్టే అన్నివైపులా ఎగురుతూ అల్లిబిల్లిగా గుండ్రంగా తిరుగుతూ తాండవనృత్యం చేస్తున్నాడు. మధ్యలో కపాలం (పుర్రె) లోని రక్తం తీసి తాగాడు. కొంత తన ఒంటికి పూసుకున్నాడు — అలా తాండవనృత్యం చేస్తూనే, మరికొంత



తాంత్రిక-కాలభైరవ-తాండవం "ఛోడ్"

సేపటికి ఓ తాటికాయలోంచి కల్లుతీసి ఐదారుగుక్కలు తాగాడు. ఎడమచేతితో మనిషి తొడఎముకను అపసవ్యంగా తిప్పుతూ భరత నాట్యం చేసేవారికంటే వేగంగా అడుగులు వేస్తూ లయబద్ధంగా

మంత్రాలు చదువుతూ, తన శరీరంమీద తానే కొట్టుకుని, రక్తంవచ్చేలాగా గాయంచేసుకుంటూ దానిని భూతాలకు బలిగా వేస్తున్నాడు!

"ఆం! హ్రీం! హ్రూం!"

అంటూ పెద్దగా రంకెవేసి అరిచి పులిగోళ్ళవంటి కత్తులతో తన డొక్కచీరుకుని పొడుగాటి రబ్బరువంటి పేగులను లాగి, బలివేస్తున్నట్లుగా తనచుట్టూ విసరసాగాడు! అతడి చేతులూ, పొట్టా అన్నీ అతడి రక్తంతోనే తడిశాయి. అయినా అతడికేమీ తెలిసినట్టు లేదు. ఇంకా ఇంకా గద్దిస్తూ, హూంకరిస్తూ తన చుట్టూరావున్న అదృశ్యశక్తులను రెచ్చగొడుతున్నట్లుగా వాటిమీదకి దుముకుతూ — వాటికి ఆహారం వేస్తున్నట్లుగా తన శరీరంలోని మాంసం ముక్కలు ముక్కలుగా కోసి విసిరివేయసాగాడు. దాంతో మా సాహస యాత్రీకుల బృందానికి కళ్ళుతిరిగిపోయాయి! చూస్తున్న దృశ్యాన్ని ఇక తట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఆదుర్దాగా ఒకరివంక ఒకరు చూసుకున్నాం, ప్రశ్నార్థకంగా! — "మనమిక్కడినుంచీ వెళ్ళిపోదామా బ్రదర్!" అంటూ ముందుగా పాటియాలా మహారాజు ఇతర మిత్రులను ప్రశ్నించాడు.

"ఇంకా ఇక్కడేవుండి చూసేందుకేమి వుంటుంది? — ఈ పిచ్చివాడు ఇలానే అరుస్తూ తనను తాను నరుక్కొని, పీక్కొని ముక్కస్యముక్కా చీల్చి, హింసించుకొని మరణిస్తాడు. అతడిని చూస్తుంటేనే కడుపులో దేవినట్టు వికారంతో తలతిప్పుతున్నట్టుగా వున్నది. తలతిప్పువచ్చి మనం వికారంతో కిందపడినా పడిపోవచ్చు" అన్నాడు రష్యన్ పరిశోధకుడు ఔస్పెన్‌స్కీ. రెండువేళ్ళతోనూ తన కళ్ళను గట్టిగా నొక్కు

కుంటూ! చిత్రకారుడు నికోలస్ రోరిఖ్చ్ తన తల అడ్డంగా విదిలిస్తూ, "ఛీ ఛీ! నాకళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి. ఇదంతా ఏమిటో? ఒక భయంకరమైన ఏకాంతంలో గీమంటున్న ఈ దిక్కుమాలినచోట ఈ స్మశానంలో వచ్చిపడ్డాం! మనలాంటివారికిది చోటుకాదు'' — అంటూ రెండడుగులు వెనక్కివేసి తన వీపున వ్రేలాడుతున్న సీసానుంచీ గటగటా నాలుగు గుక్కలు మంచినీళ్ళు తాగాడు. మిగిలినవాళ్ళు ఎవరం మాట్లాడే స్థితిలో లేము! ఎవరి సామానుబ్యాగులమీద వాళ్ళు కూర్చుండి టోపీలు ముఖంమీదకు దించుకుని, తమ మట్టుకు తాము — భయంతో విచారంతోనూ తలపట్టుకు కూర్చున్నారు —"ఎప్పుడు అయిపోతుందా? ఈ 'భయంకర మారణహోమం' అనుకుంటూ.

"చివరికి ఇతడు ఇలాగే చస్తాడా ఏమిటి? దేవా! మనమీదకి ఇతని హత్యానేరం రాదుకదా?" అన్నాడు తన పైపును వెలిగిస్తూ, అపరాధ పరిశోధకుడు చార్లెస్ బెల్.

"మీరెంతసేపూ నేరాల గురించీ అపరాధాలగురించీ ఆలోచిస్తారేం" అన్నాడు జగదీష్ చంద్రబోస్ నవ్వుతూ — "ఇదేదో తాంత్రికుల హోమంలా వున్నది! మా బెంగాల్‌లో 'అఘోరీలు' అని కొందరు కలకత్తా వద్ద కాళీఘాట్‌లో ఇలాంటి వికృతమైన తాంత్రికకాండలేవో జరిపిస్తారని విన్నాను! కానీ ఇలా ఎన్నడూ చూడలేదు. తలతిరుగుతున్నది'' అంటూ వెనుక గోడకానుకుని నిలబడ్డాడు.

"చూశాంగా! ముచ్చటతీరిందా? అందరికీ చెప్పవచ్చు, మనం చూసిన ఈ వైభవాన్ని!" అంటూ మరో బెంగాలీశాస్త్రవేత్త మేఘనాథ్‌సాహా

వెటకారంగా నవ్వాడు. కానీ ఎవరూ ఆ జోకును ఆస్వాదించే స్థితిలో లేరు.

ఇవేమీ పట్టించుకోకుండానే ఆ తాంత్రికసాధువు మైకంలాంటి తన్మయత్వంలో భరతనాట్యంలాంటి తాండవనృత్యంతో తనచుట్టూ తానే తిరుగుతూ, శివతాండవంలా చేస్తున్నాడు మరింత వేగంతో! — 'హూ! హా!' అంటూ కరాటేవారు గర్జించినట్టుగా అరుస్తూ మధ్యలో చెంగున ఆకాశంలోకిఎగిరి ఎవరో కనిపించని శత్రువుపైకి కత్తి విసిరినట్టు విన్యాసాలు చేస్తూ, ఎడమచేతిలో ఎండిపోయిన మనిషి తోలు డాలు అడ్డం పెట్టుకుని చెంగున వెనక్కిదూకి శత్రువు దెబ్బకాసుకున్నట్టూ, ఏవేవో చిత్రవిచిత్రమైన విన్యాసాలు చేస్తున్నాడు! ఇలా కొంతసేపు — ఎంతసేపు జరిగిందో ఎవరికీ గుర్తులేదు! కానీ ఎంతో జరిగాక, దూరాన ఆ స్మశానంలోనే ఒక మూలపడివున్న తెల్లని మాసినగుడ్డ వంటిది, తాంత్రికుడి కంట బడింది. దానితో అతడు అటువేపు పరిగెత్తిపోయి ఎడమచేత్తో ముసుగులా వున్న ఆ గుడ్డను లాగి విసిరి దూరంగా పారేశాడు.

ఆశ్చర్యం! మావారెవరూ ఇంతవరకూ గమనించలేదు. అక్కడ దూరంగా స్మశానం అంచున ఒక మధ్యవయస్కురాలైన స్త్రీ — గొంతుక్కూర్చుని వుంది! ఆమె తలపై కప్పివున్న ఆ గుడ్డవల్ల వారెవరూ ఆమెఉనికినే గమనించలేదు. ఈ ఘోరతాంత్రికుడు తటాలున ఆవిడ తలపై ముసుగును లాగగానే ఒక్కసారిగా ఊపిరి ఆగిపోయి అందరూ భయపడ్డారు — 'ఈ దుర్మార్గుడు ఆమెనేం చేస్తాడో!' అని.

అలా మేము అట్టేసేపు ఎదురుచూడకుండానే తెలిసింది —

ఏంచేస్తాడో! తటాలున ఎగిరి ఆ స్త్రీపక్క దూకి ఆమె జుట్టును దొరకబుచ్చుకున్నాడు — బరబరా ఆమెనలా ఈడ్చుకునివస్తూ, నిమ్మకాయలంతేసి కనుగుడ్లు — ఎర్రజేసి, క్రోధంతో ఉరిమినట్టుగా ఆమెవైపు చూసి — ఆమెచుట్టూ భయంకరంగాగెంతుతూ ఒళ్లుగగుర్పొడిచే విలయ తాండవం చేశాడు! ఈ విన్యాసాలకు ఆ మహిళ కప్పుకునివున్న చాలీ చాలని దుప్పటివంటి వస్త్రం తొలగిపోయింది! అప్పుడు గమనించాం!!! ఆమెకు ఒంటిపైన నూలుపోగైనా లేదని! పూర్తి దిగంబరిగా భయపడుతూ నిలబడింది — తలవంచుకుని!

ఈ తాంత్రికుడు ఎగిరి, ఆమెను జుట్టుపట్టి బరబరా ఈడ్చుకు వచ్చాడు. ఎర్రగా సగంకాలుతూవున్న శవందగ్గర ఆమె ఆశ్చర్యంతోనూ, భయంతోనూ బిక్కచచ్చిపోయి మాటకూడా పడిపోయిందానిలాగా ఉలుకూ పలుకూ లేకుండా అలా నిలువుగుడ్లతో చూస్తూ నిలుచుంది.

మరుక్షణమే తాంత్రికుడు శవం కాలుతున్న చితిపక్కనే వున్న మనిషిపుఱ్ఱెను తీసి అందులోంచి ఒక్కఊపుతో ఆమె నోట్లోకి త్రోసి తాటికల్లు తాగించాడు. ముందుగా ఆమె తుళ్ళిపడినట్టు ఉలిక్కిపడి రెండుచేతులూ పైకెత్తి వద్దంటున్నట్టుగా అడ్డంపెట్టింది. కాని, ఆమె ప్రయత్నం ఏమాత్రం ఫలించలేదు. ఆమెకు పొలమారేదాకా తాంత్రికుడు ఆమె గొంతులోకి సారకాయబుర్రను మళ్లీ, మళ్లీ తోసి అలా అయిదారు గుక్కలు మింగించాడు. దీనంగా మూలుగుతూ ఆమె కళ్ళుతేలేసినట్లు నీరసంగా సొలిపోసాగింది. ఏంచేస్తుంది పాపం?"

మా సాహసయాత్రికుల బృందం ఇక చూస్తూ ఊరికేవుండి ఆమె

పైన దుర్మార్గాన్ని భరించలేకపోయాం — "బ్రదర్! ఈ చూసిందిచాలు! ఈ దుర్మార్గుడిని ఇప్పుడే షూట్ చేద్దాం తరువాత ఏమిజరిగితే అది జరుగుతుంది!" అంటూ పులివేటగాడు జిమ్‌కార్బెట్ తన తుపాకీని లాగి, తాంత్రికునివైపు గురిపెట్టి నిలబడ్డాడు. మరుక్షణమే పాటియాలా యువ రాజా, రష్యన్ రాయబారి నోటోవిచ్‌లు కూడా తమ తూటాలను దట్టించి సిద్ధంగా నిలబడ్డారు. ఇంతలో మెరుపు మెరిసినట్టు ఎవ్వరూ ఊహించని ఆశ్చర్యం జరిగిపోయింది.

తాంత్రికుడు భయంకరంగా 'హ్రీం', 'హ్రూం' అంటూ గర్జించి, ఆ స్త్రీ రెండుకాళ్ళూ పాదాలదగ్గర దొరకబుచ్చుకుని మెరుపులా ఆకాశంలో గిరగిరా తిప్పి నేలకేసికొట్టాడు, టెంకాయను పగులగొట్టినట్లు. జడిపించే ఆ భయానక దృశ్యాన్ని చూడలేక క్షణం కళ్ళుమూసుకున్నాం అందరం! కొన్ని సెకన్ల తరువాత కళ్ళుతెరిచాక — అతడు నేలకేసికొట్టిన స్త్రీ కనిపించలేదు. ఆమె కాళ్ళుపట్టి తిప్పి నేలకేసి కొట్టిన చోట ఓ వెలుగు వెలిగి భగ్గున జ్వాలవంటిది మండింది. ఎర్రటి పొగ గంధకం, గుగ్గిలం కలిసిన వాసనతో గుప్పుమంది — స్మశానంలోని ఆకాశమంతా వ్యాపించి! ఏం జరుగుతోందా అని ఆశ్చర్యంతో ఓరగా చూసిన మా బృందానికిది ఊహించని ఆశ్చర్యం! — ఆ స్త్రీ ఎక్కడా కనిపించలేదు! ఆమె శవమూ కనిపించలేదు. ఆ పొగమంటలో అన్నీ మాయమై పోయాయి — తాంత్రికుడూ లేడు!

అక్కడ మధ్యలో అతడు ముగ్గుతోవేసిన అష్టదళపద్మం మధ్యన ఒక దివ్యపురుషుడు నిలబడివున్నాడు! ఆయన మనిషిలాగ కనిపించ లేదు, తలకు జుట్టుముడి, రుద్రాక్షలు పూసలవలే తలకి కట్టివున్నాయి.

అరే! ఆశ్చర్యం! ఆయనకు నాలుగువైపులా తలలూ! చుట్టూరా అరటి గెలలవలే ఎనిమిది బాహువులూ! ఎక్కడో దూరాన్నుంచీ శంఖధ్వనీ, మరుక్షణమే గుప్పుమని దివ్యపరిమళాలు, సుగంధపు వాసనలు సర్వత్రా వ్యాపించాయి. ఆయన కుడివైపున్న నాలుగుచేతులలో త్రిశూలం, ఢమరుకం, శంఖం వంటి దివ్యాయుధాలున్నాయి. ఎడమచేతిలో తాళపత్రాలూ, స్ఫటిక జపమాల, జంట తామరపద్మాలూ వున్నాయి! ఆయనకు నాలుగుదిక్కులా వెనుకగా నాలుగు తెల్లటికుక్కలు నిలబడివున్నాయి!

"మై గాడ్!" ఆశ్చర్యంతో పొలికేక వంటిది పెట్టాడు అపరాధపరిశోధకుడు చార్లెస్ బెల్ — మోకాళ్ళపై కూర్చుంటూ! ఇంగ్లీషులో "ఇతడు తాంత్రికుడు కాడు! మనం అన్నట్లు అఘోరీకూడా కాదు. ఈయన **దత్తాత్రేయ ప్రభువు!**" అంటూ — "He is Lord Dattatreya ! — I know it from Pictures of this God !" అంటూ ముందుకు పరుగెత్తబోయాడు. మిగతా మిత్రులందరం బలవంతాన అతడి కోటు కాలర్ పట్టుకుని ఆపాము; ఇంకా ఏంజరుగుతుందో అనుకుంటూ.

మరుక్షణమే పెద్ద శంఖధ్వని! దిక్కులు మారుమ్రోగేలా ప్రతిధ్వనించింది. వెనుకనుంచీ ఏవో మంత్రాలు స-స్వరంగా, వేదమంత్రాలు చదువుతున్నట్టుగా శ్రావ్యంగా వినిపించసాగాయి.

అదే క్షణంలో సర్వమూ శూన్యం! అక్కడచూస్తే మళ్ళీ ఎవరూ లేరు — ఖాళీ స్మశానం మాత్రమే వుంది! పక్కనే కాలుతున్న శవం అలాగే మండుతున్నది!! అలా పదినిముషాలు నిలబడి అందరం నెమ్మదిగా తేరుకుని మావీపులకి తగిలించుకున్న ఫ్లాస్కులుతీసి వేడివేడి కాఫీ తాగి

నెమ్మదిగా వెనక్కు ప్రయాణం కట్టాము — లామాసరీవైపు! "ఈ వింతనూ, దాని రహస్యాన్నీ ఎలాగైనా ఛేదించాలి! ఈ చిక్కుముడిని విప్పాలి!" అనుకుంటూ...

◆

26

నా విద్యాభ్యాస రహస్యాలు !

ఒక వారంరోజులలోపల మా లామాసరీలో పెద్దవారైన పీఠాధిపతులు, పరమాచార్యులు, మింగ్యోర్–గదినుంచి నాకు పిలుపు వచ్చింది. ముదురు నీలం బురఖావంటి అంగీ ధరించి లామాసరీ లోని వార్తలు తెచ్చేవాడు — ఆయాసపడుతూ, రొప్పుతూ, పరిగెట్టుకుంటూ వచ్చాడు మాతరగతి పాఠాలుచెప్పే లామాగారివద్దకి.

వస్తూనే పరమగురువులు కబురు పెట్టినట్లు — "ఉన్నపళంగా వెంటనే రావాలని సందేశం" అందించి — గిరుక్కున వెనుతిరిగి

మెరుపులా అంతే వేగంతో మాయమయ్యాడు. ఒక క్షణకాలం మాతరగతి విద్యార్థులంతా నావైపు ఆశ్చర్యంగాను, కుతూహలంగానూ, చూసారు.

“మన విద్యార్థి లోబ్‌సంగ్ (Lobsang) ఏదో పెద్దనేరమే చేసి వుంటాడు! లేకపోతే మన పెద్దగురువుగారి దగ్గరనుంచి అలా “తక్షణమే రమ్మని” ఆజ్ఞాపించడం ఎలా జరుగుతుంది? అనుకుంటూ విద్యార్థులంతా గోలగా చర్చించుకో సాగారు.

“ష్!! నిశ్శబ్దం! అందరూ నిశ్శబ్ధంగా వుండాలి!” అంటూ మా పాఠశాల గురువుగారు చేతిలో బెత్తంతో ముందువున్న టేబుల్‌వంటి పీఠంమీద కొట్టి చప్పుడుచేశాడు. మరుక్షణంలో అంతా నిశ్శబ్ధం! నేను చేతులుకట్టుకుని నిలబడివున్నాను ఆయన పర్మిషన్ కోసం. నాతరగతి ఉపాధ్యాయుడు ఇలాఅన్నాడు; “ఓ చిరంజీవి లాబ్‌సంగ్ (Lobsang) రాంమ్‌పా? నీకు నా ఆశీస్సులు. నీ చురుకుదనం మన తరగతిలోని విద్యార్థి లామాలందరిలోకీ నీకే ఎక్కువ స్థాయి వుందని తెలిసి నీకు రెండుసంవత్సరాలు ఈ నా తరగతిలోంచి గెంటుతూ — నిన్ను పైతరగతిలోకి బదిలీచేశారు. నీవు రేపటినుంచి నేరుగా పెద్దగురువుగారి వద్దనుంచే విద్యాభ్యాసమూ, శిక్షణా పొందాలి!” అన్నాడు నన్ను ఆశీర్వదిస్తూ. తక్షణమే తేలుకుట్టిన దొంగల్లా నిశ్శబ్దంగా ఊరు కోవడమే మాతరగతి విద్యార్థులవంతు.

నేను లేచినిలబడి మా తరగతికి బోధించే గురువులకు మూడు సార్లు సాష్టాంగ నమస్కారంచేసి నా రెండు చేతులతో కుడిచేత్తో ఎడంచెవీ — ఎడంచేత్తో కుడిచెవీ పట్టుకుని వినయంగా శెలవు తీసుకున్నాను. ఆరోజునుంచీ పరమగురువు, పీఠాధిపతి మింగ్యార్ లామావారివద్ద

నేరుగా నాకు పాఠాలు, శిక్షణాతరగతులూ మొదలయ్యాయి. మాకు ఉత్సాహం, ధైర్యం మరింత బలపడినాయి వారి ప్రోత్సాహంతో.

ఆరోజునుంచీ నాకు ప్రత్యేక శిక్షణ మొదలయ్యింది. అందరికీ బోధించే చిన్నతరగతి పాఠాలు వదిలేసి నాకు ప్రత్యేకించిన — జ్యోతిషం, మూలికావైద్యమూ, రోగాలను గుర్తించడం, రోగులకు చికిత్సచేసే విధానం గురించిన తరగతులు ప్రారంభించారు.

ఎదురుగా గోడమీద చిత్రంలో మనిషి శరీరం బొమ్మవేసి దాని లోపల అవయవాలన్నీ ఏది ఎక్కడ వుంటుందో ఫొటోలాగ చిత్రించి వున్నాయి. మనిషిలోని మెదడు దాని భాగాలు, తలలోపలి నరాలు — అవి కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మమూ వంటి భాగాలకు — నరాలు ఎలాగ వ్యాపించివుంటాయో అంతాకూడా ఆ చిత్రంలో చూపించివున్నది.

అలాగే మనిషి హృదయం దాని భాగాలు; గుండెనుండి మర్రి ఊడలలాగ, కొమ్మలు కొమ్మలుగా వ్యాపించివుండే రక్తనాళాలు శరీరంలోని భాగాలకు ఎలాగ విస్తరించివుంటాయో అంతా వివరంగా బొమ్మలో చూపించారు. ఊపిరితిత్తులు, కాళ్ళు, పొట్ట, చేతులు, మలమూత్ర విధానం, గుండె కొట్టుకొనే క్రమం — చేతిలోని నాడి పరిశీలించే పద్ధతి అన్నీ వివరంగా చిత్రంలో ఫొటోలాగ చూపించారు. అది చూడగానే అర్థమయ్యింది నాకు ఆరోజునుంచి ప్రత్యేకమైన వైద్యశిక్షణలో — "శరీరనిర్మాణం, అంగాలు, అవయవాల గురించిన బోధన ప్రారంభమయినట్టు. నెలరోజులపాటు వైద్యగురువులు టిబెటన్ ఆయుర్వేద భిషక్కులు

నాకు ప్రత్యేకశిక్షణ నిచ్చారు. ఆతర్వాత మా లామాసరీలోని — “వైద్యపు లామాలు శిక్షణపొందే విభాగానికి ప్రధానగురువైన గురువు మహా కాశ్యపునివద్ద నా తరగతులు ప్రారంభించారు. ఆయన యోగశాస్త్రంలో సిద్ధహస్తుడు. ప్రత్యేకించి మనలోని జీవాత్మ యోగదృష్టితో చూస్తే తేజస్సుతో వెలుగుతూ ఎలా కనిపిస్తుందో — దాని స్పందనతోనే మనిషి శరీరంలోని మెదడూ, గుండెకొట్టుకోవడమూ, ఊపిరితిత్తులయొక్క శ్వాసక్రమము, నాడీమండలంలో నాడీస్పందన, ఆయన యోగదృష్టితో పరిశీలించిన పరమాచార్యుడుగా టిబెటన్ వైద్యంలో ధన్వంతరి అంతటి వాడని పేరుపొందిన సద్గురువు, యోగి కూడా.

ఆయన తరగతుల్లో మనిషియొక్క సూక్ష్మశరీరం, కారణశరీరం, జీవాత్మ దానియొక్క స్వరూపం, వెన్నుముక, వెనుకనే వ్యాపించివుండే ఇడా, పింగళ, సుషుమ్నానాడులు, ఇంద్రధనుస్సు రంగులతో వెలిగే షట్ చక్రాలు అనబడే యోగచక్రాలు వాటిగురించి బోధించారు. ఈ విషయాలు అందరి విద్యార్థులకి చెప్పరు — ఉన్నత లామాస్థాయికి ఎదిగే ప్రత్యేక జన్మకలిగిన, పవిత్రఆత్మ కలిగినవారికే ఇలాంటి బోధన ఇస్తారు.

ఆయనవద్ద ప్రతీరోజూ నాశిక్షణ ఎంతో ఆసక్తిగాను, ఉత్సాహం గాను సాగాయి! దానికి కారణం ఆయన నాకు ఇచ్చిన స్వేచ్ఛ. “చిరంజీవీ! లాబ్‌సాంగ్! నీవు ఏ సందేహమైనాసరే సంకోచించకుండా, నిస్సందేహంగా అడగవచ్చు! నీ సందేహం పూర్తిగా నివారణ అయ్యేదాక నీ మనస్సులో ఉదయించే ప్రశ్నలను అణుచుకోకుండా అడుగు! దీనిని మన టిబెటన్‌భాషలో "పరిప్రశ్న" అంటారు.” దాంతో నాకు అపూర్వమైన స్వాతంత్ర్యము లభించినట్లు అయ్యింది.

II

సంగ్రహంగా ఒక్కమాటలో చెప్పాలంటే ఇప్పటి మానవుడు భూమి మీద జంతువులనుండీ పరిణామంతో పుట్టలేదు! అతడు విశ్వాంతరాళం నుండి కాంతినిమించిన వేగంతో ప్రయాణించే 'దేవతలు' అనబడే విమానాలలో ప్రయాణించే 'బుద్ధిజీవుల' సైన్సు ప్రక్రియలద్వారా ఇప్పటి 'క్లోనింగ్'-వంటి విధానంతో మనిషియొక్క జీవకణాలు సృష్టించబడ్డాయి! మొదట్లో చేసిన ప్రయోగం ఫలితంగా పుట్టిన మానవజాతి తక్కువ బుద్ధిబలంతోనూ, ఎక్కువ శరీరబలంతోనూ వుండేవారు! మీరడిగిన ప్రశ్నకు సమాధానం ఇక్కడ లభిస్తుంది. ప్రాచీన టిబెటన్‌లో వాయవ్య దిశగాగనక ప్రయాణిస్తే ఎత్తైన హిమాలయపర్వత పీఠభూములనుంచి, ఇప్పటి "హిందూ-ఖుష్" కనుమలద్వారా వెళితే ఎత్తైన గుహలవంటి మకరతోరణాలతో ఆదిమమానవుడి "నమూనా"-విగ్రహాలు కనిపిస్తాయి! అవి సుమారు 20-అడుగుల ఎత్తువుండి 'మానవజాతి — ప్రథమసృష్టికి' చెందిన రూపాలు దాచబడ్డాయి! 'బామియా' (Bamiya) అనేచోట గుహలలో!

ఆతరువాతగా జరిగిన ప్రక్రియల ఫలితంగా తయారైన మానవజాతి 15 నుండి 12 అడుగుల ఎత్తుండేవారు! మూడవ ప్రయోగం ఫలితంగా సృష్టి ఐవచ్చిన మానవజాతి ఇప్పటి ప్రస్తుతం జీవిస్తున్న మానవులకి పూర్వీకులు!! ఈ గుహలలో వుండే శాసనాలు చదివితే అపుడు నేచెప్పిన మొదటివిషయం — మానవసృష్టి ఈ హిమాలయ పర్వతాలలో జరిగిందన్న సంగతి రూఢిఅవుతుంది. దీనికి గుర్తులుగా

కొన్ని చిన్నమణులు ఇప్పటికీ కనిపిస్తాయి. మానవ మేధస్సును సృష్టించిన కలశంవంటి పాత్రలో జీవకణాలు పెంచానన్నానే ఆ కలశంపేరే "బ్రహ్మ కపాలం!" అంటే బ్రహ్మదేవుడు మానవజాతియొక్క మేధస్సును రూపొందించిన పవిత్రక్షేత్రమే ఈ 'బ్రహ్మకపాలం!' 'బ్రహ్మ' అనగా మేధస్సు అన్న సంగతి మీకు తెలుసుగదా?" — అన్నాడు 'లామా' మహాశయుడు.

'కలశం'లో "సృష్టి"-చేశారంటున్నారే! దీనికేదైనా సాక్ష్యాధారాలు లభిస్తాయా మన ప్రాచీన మతాలలో ఎక్కడైనా?" అంటూ ప్రశ్నించాడు జగదీశ్‌చంద్రబోస్.

"జగదీశ్‌బాబూ! మీరూ, సాంప్రదాయ పరాయణులైన బెంగాలీ బ్రాహ్మణులుగదా! మీలో అనేక శుభకార్యాలలో పురోహితులు పూజలు నిర్వహిస్తారుగదా మీకు తెలిసేవుంటుంది! అందులో మొదటిగా చేసే పనేంటి?" — అన్నాడు 'లామా'...

"కలశప్రూజ" అంటాం దీన్ని!!! అంటే గుండ్రని వెండిపాత్రనుగాని పంచలోహపుపాత్రగాని "కలశం"గా పెట్టి అందులో జలం నిండుగా పోసి ఆ కలశాన్ని పూజిస్తాం!" అన్నాడు.

"మీకు సంస్కృతమంత్రాలకు అర్థం తెలుసునుకదా? — ఆ కలశపూజలో కలశాన్ని ఏమని పూజిస్తారు. సృష్టికి సంక్షేపరూపమైన 'కుంభాకార' రూపంలోని "కలశం" అనిగదూ!

"అవును ఈ విశ్వమే ఒక కలశాకారంగా సృష్టి జరిగిందనీ ఆ మంత్రాలకి అర్థం! ఆ కలశంయొక్క ముఖంలో విష్ణువూ కంఠంలో రుద్రుడు, గర్భంలో సమస్తమైన సముద్రాలు, పవిత్రజలాలు ప్రాణ

చైతన్యంతో నింపినట్టు సరిపోల్చి అందులో నవధాన్యాల విత్తనాలన్నీ వేసి — వనమూలికలుకూడా కలశంలో వేసి “కలశ-పూజ” చేస్తాం! చందనంపొడి గూడా వేస్తాం!” అన్నాడు జగదీశ్‌చంద్రబోస్.

ఆ కలశమే ఇపుడు సైన్సుపరిభాషలో గుండ్రని ‘గాజుసీసా’గా పిలిచే గుండ్రని ‘రౌండ్-ఫ్లాస్క్” వంటి సీసా! ఒకమాదిరిరకం పెద్ద ‘సెంటు-సీసా’ వంటిది, అనుకోవచ్చు! అందులో పరిశుద్ధమైన నీళ్ళుపోసి జీవకణాలను అంటే పురుషబీజాలనూ స్త్రీ జీవకణాలనూ వేసి క్లోనింగ్ వంటి ప్రక్రియతో మానవజీవుల పిండాలను ముందరగా ఇలా కలశంలో సృష్టించారు. ఆతరువాత దాన్ని గర్భాశయంలో ప్రవేశపెట్టి పెంచి పోషించారు. తద్వారా క్రమంగా మానవసృష్టి ఏర్పడింది” — అన్నాడు ‘లామా!’

“మరి వివాహవ్యవస్థ ఎప్పుడు ఏర్పడింది? తెలివిగా ప్రశ్నించానని కాస్తగర్వంగా అడిగాడు నోటోమిచ్ రాయబారి.

“అప్పుడు వివాహంతో పనేమిటి?” తిరిగి ఎదురుప్రశ్న వేశాడు లామా!” నోరుతెరిచి ఆశ్చర్యంతో కళ్ళార్పకుండా చూడటం మావంతయ్యింది. “మరి వివాహం లేకుండా ఎలాగ?” — అందరం ప్రశ్నించాం.

“ఆగండాగండి! — అప్పటి ప్రథమ మానవజాతికి స్త్రీ పురుష భేదం లేదు — అంటే ఒకేశరీరంతో స్త్రీయొక్క అవయవాలూ, పురుషావయవాలు కలిసివుండేవి.”

“దానికి ఋజువేమిటి?”

“మీ హిందువుల దేవాలయంలోకి వెళ్ళిచూడండి. శివాలయంలో

ఏమి కనిపిస్తుంది? శివలింగం, పానవట్టం అంటే అర్థం స్త్రీపురుష భేదం కలిసి ఒకేశరీరంతో ఏర్పడిన జీవరాశి అనిగదా”. “అదెలా అనుకుంటాం. శివలింగం రాతితో చేసిన మతచిహ్నాం కావచ్చు” అన్నాడు. “పోనీ అలా అనుకున్నా — మీ శివుడు అర్థనారీశ్వరుడు గదా. సగభాగం పార్వతిగా మిగిలినభాగం శివుడిగా అంటే సైన్సు పరిభాషలో అర్థం ఏమిటి? మీరు జీవశాస్త్ర పండితులుగదా. మీరు చెప్పండి జగదీశ్‌బాబూ! ఇప్పటికీ వృక్షశాస్త్రములో పురుషావయవాలు, గర్భాశయం ఏర్పడివుండలేదా? అంతే గాక వానపాములు, ఇంకా ప్రాథమిక ప్రాణికోటిలో జీవరాశిఅంతా స్త్రీపురుష భేదాలు కలిగిన శరీరాలతోనేగదా సృష్టించబడింది. ఇది మీ జంతుశాస్త్రజ్ఞులకే తెలుసు. అదే మానవజాతికి కూడా ప్రారంభంలో ఏర్పడివుండేది. ఇదే కథలరూపంలో పురాణాలలో ముందుగా శివపార్వతులు కలిసి అర్థనారీశ్వరుడుగా ఆతరువాత దక్షయజ్ఞం మన్మథుని భస్మం, ఆతరువాత శివుడు రుద్రుడిగా పార్వతి ఉమాదేవిగా స్త్రీపురుషులుగా విడిగా జన్మించడం జరగలేదా. ఇదంతా సైన్సు సత్యాలను కథల రూపంలో అందించిన నీతికథలని మీకు తెలియదా?” అన్నాడు లామా!

మిగతా సైంటిస్టులందరం విస్తుపోవడం మావంతయ్యింది. కేవలం మతఛాందసులైన పురోహితులైన లామా అనుకున్న బౌద్ధగురువుకున్న విజ్ఞానాన్ని చూసి ఆశ్చర్యపోవలసి వచ్చింది.

ఆవిధంగా మానవజాతి మొదటిదశలో స్త్రీపురుష లింగబేధం ఏర్పడకుండా జరిగింది. అందుచేత వివాహవ్యవస్థ ప్రసక్తే లేదు.

ఆతరువాత యుగంలో స్త్రీపురుషుల శరీరాలు వేరై సృష్టి మొదలైంది. ఇదే మన్మథుడి బాణంతో శివపార్వతుల కళ్యాణంగాథలోని

అర్థం. సరే ఈ విషయాన్ని ఇంతటితో వదిలేద్దాం. మీరడిగిన అసలు ప్రశ్నకి వద్దాం. ఈ హిమాలయాలలో వింతలూ, విశేషాలు గురించి అడిగారు. ఇక్కడ జీవించే శిలలువుంటాయి — సాలగ్రామాలు అంటారు.

"అంతేనా! స్పటికములు గూర్చి స్ఫటిక శివలింగాలు గూర్చి వినలేదా?"

"విన్నాం! చూశాంకూడా! మహారాష్ట్రలోని దత్తపీఠాలలో ఒకచోట అడుగున్నర ఎత్తుగల స్పటికంతో సహజంగా తయారైన శివలింగం వున్నది. అలానే కాశీలోనూ మరెక్కడో స్ఫటికంలో చెక్కిన శ్రీచక్రం — అనబడే స్త్రీయంత్రం వున్నదట" అన్నాడు.

"అదెక్కడవున్నదో మీకు తెలియదా?" అన్నాడు అందరం భయంగా అపరాధపరిశోధకుడు షెర్లాక్‌వంక చూశాం! దీనితో సాహసయాత్ర గుట్టు బయటపడుతుందేమోనన్న భయంతో.

లామా మహాశయుడు పెద్దగా నవ్వాడు, మా కంగారు గుర్తించినట్టు వెతకబోయే రహస్యాలు ముందుగానే అడగడం దేనికి? చూడడమే మేలుకదా! ఆనాటి చర్చను అకస్మాత్తుగా ముగిస్తూ తానుకూర్చున్న సోఫాలోంచి లేచాడు.

ఆయనతోటే అందరం లేవక తప్పలేదు. ఆనాటి చర్చ అంతటితో ముగిసింది.

⁂

27

మూడవకన్ను - తెరిపించడం !

"గురుదేవా!" — మీరు మీయొక్క బాల్యంలో జరిగిన 'కాల జ్ఞానం' గురించి చెబుతూ, నీకు — 'మూడవకన్ను' తెరిపించాలి!" అన్నారే, అదేమిటి?

"మూడవకన్ను అంటే జ్ఞాననేత్రం అని సామాన్యులు లోకభాషలో మామూలుగా అనుకుంటారు! కాని, మీరుచెప్పిందాంట్లో మూడవకన్ను — 'తెరిపించడం!' అంటున్నారు. మనిషికి వుండేవి రెండేకన్నులుగదా! ఇవి మొట్టమొదటిగా జన్మించగానే మనిషి కన్నులుతెరిచే ఈ ప్రపంచాన్ని చూస్తాడుగదా! ఇకపోతే ఇంకా ఈ 'మూడవకన్ను' ఎక్కడ? — దానిని

‘తెరిపించడం’ అంటే — ఎలాంటిది? దయచేసి నా అజ్ఞానాన్ని క్షమించి నాకు తెలిసేలాగా వివరించండి. ఈ మూడోకన్ను — భవిష్యత్తులో జరుగబోయే కాలం గురించి సంబంధించిందా? లేక గడిచిపోయిన సంగతుల్ని కూడా ఈ మూడవనేత్రంతోనే దర్శించవచ్చా? అసలీ **‘మూడవ నేత్రం’** ఎక్కడవుంటుంది? — దానిని ‘తెరిపించడం’ అన్నారే, అదెలాగ సంభవం ?”

“అంటూ — లామాసరీలో విద్యార్థిగా వున్నరోజుల్లో మా గురుదేవులను నేను ఆసక్తితో అడిగిన ప్రశ్నలివి! సరిగ్గా అవే ప్రశ్నలు నువ్వా మళ్ళీ ఇక్కడ అడుగుతున్నావు. చెబుతాను విను!”

“పూర్వకాలంలో — అంటే మానవుడు సృష్టించబడిన ఆదికాలంలో మనుష్యులకు ఎన్నో విశేషమైన ఆధ్యాత్మిక శక్తులుండేవి! కంటికి కనిపించనివి, అనేకం చూడగలిగేవారు. ఉదాహరణకు ఒక ఋషి ఆశ్రమంలో లేనప్పుడు, ఎవరైనా కొత్తవారు వచ్చి రహస్యంగా అక్కడి పిల్లవాళ్ళను గానీ, మరేదైనా విలువైన వస్తువులనుగానీ ఎత్తుకుపోతే, వారు తిరిగి రాగానే అది కనిపించక ఎవరినైనా అడగటానికి వేరేవారు లేకా, కళ్ళు మూసుకుని ఒక నిముషం ధ్యానించేవారు — “ఏమైందా?” అనుకుంటూ! అలా ఆ ప్రశ్నతో తమ మనస్సును — వెనక్కి పంపించి చూస్తే అప్పుడు జరిగిన దృశ్యాలన్నీ తెరమీద సినిమాలోలా స్పష్టంగా కనిపించేవి వారికి! దానినే ‘దివ్యదృష్టి’ అని పిలిచేవారు! ఇవన్నీ మీకందరికీ కూడా తెలుసు. పురాణాలలో, రామాయణ భారతాల్లో ఇలాంటి అదృశ్య శక్తులూ, “దివ్యదృష్టి” గురించిన ఉదాహరణలు ఎన్నో కనిపిస్తాయి.

ఇదే నిదర్శనం, ఆది కాలంలో మానవజాతికి మామూలుకళ్ళతో చూడలేనివాటిని చూసేందుకు ఒక అతీంద్రియ శక్తితో పనిచేసే చూపు వుండేదని తెలియడానికి!

ఇప్పుడిప్పుడే సైన్సుతో వైద్యశాస్త్రంలోని రోగుల శరీరాలు ఫోటోతీసి శరీరంలోపల ఏమున్నదో అంతా — ఆ ఫోటోలో పడేలా చేయ్యగలుగుతున్నారు — దేనివల్ల? — కంటికి కనిపించని కాంతి కిరణాలవల్ల! ఈ కంటికి కనిపించని కాంతి వున్నట్టే, ఈ కన్నులు చూడలేని కాంతిని చూడగలిగే — మూడోకన్నుకూడా ఒకటి, వుండటంలో అసహజం ఏమున్నది? జంతువులలో తరచూ ఇలాంటిశక్తి కనిపిస్తుంది. పులి, తనపిల్లలు కనిపించకపోతే వెతుక్కుని (మనస్సుతో), తనబిడ్డను ఎత్తుకునిపోయిన వారిని పసికట్టి, వెంటాడి చంపుతుంది!

అలానే ఆదికాలంలో మానవుడికి, ఈ కంటికి కనిపించని అనేక విషయాలూ, సంగతులూ కాలాన్నీ చూడగలిగే దృష్టి, దానిని ఉపయోగించే కన్నువంటి ఇంద్రియమూ, వుండేవి! క్రమేణా, మానవజాతి తన పవిత్రతను కోల్పోయి, అనేక తప్పులూ, పాపాలు చేసి తన స్వార్థం ఫలితంగా దేవుడిచ్చిన ఎన్నో శక్తులను పోగొట్టుకుంది. అలాంటిదే ఈ మూడవకన్ను!

ఈ మూడవకన్నుతో చూసే విశేషమైన దృష్టిపేరే ‘దివ్యదృష్టి’. ప్రాచీన పురాణాల్లో భారతం, భాగవతం వంటి పురాతనగ్రంథాలలో, మనుషులకూ, జంతువులకూ ఇటువంటి దివ్యదృష్టి వుండేదని ఇప్పటికీ కనిపిస్తుంది! కాని, క్రమేపీ ఈ చూపు పైన పొరకప్పేసినట్టు కప్పబడి

పోయింది! ఈ సంగతి మన టిబెట్‌లోని గురువులకూ, పీఠాధిపతులైన పంచన్‌లామా, దలైలామా, తాషీలామా వంటి సిద్ధగురువులకూ తెలుసు! వారికీ ఇటువంటి శక్తి వుండబట్టే, వారిని చిన్నపిల్లలుగా వున్నప్పుడే గుర్తించి, మామూలు పిల్లలకన్నా విశేషమైన వ్యక్తులుగా గుర్తించి అలాంటివారినే పీఠాధిపతులుగా ఎంపికచేస్తారు. ఇలా 'ఎంపిక చేయడం' వారిలోని దివ్యత్వంవల్లనేగాని, అనేకదేశాలలో రాజకీయ అధికారం కోసమూ, స్వార్థంకోసం, డబ్బుకోసం ఎన్నుకునే ఎన్నికవంటిది కాదు ఈ 'గుర్తింపు!' అలాంటిది, మనిషికి వుండే మూడోకన్ను! ఇది — రెండు కళ్ళకీ మధ్యగా నుదురుమీద యోగపరిభాషలో, — భ్రూమధ్యం అంటారే అక్కడవుంటుంది, అణగారిపోయి!

దానిని ఉత్తేజపరిచి, అభివృద్ధిచేసి, తెరుచుకునేలాగా, పనిచేసే లాగా చేసే ఒక యోగశాస్త్రపరమైన ప్రక్రియ ఒక — దైవకార్యం! ఇది మన టిబెటన్‌ల భాషలో 'మూడోకన్ను తెరిపించడం'గా ప్రచారంలోకి వచ్చింది.

"గురుదేవా! ఇది ఒక్క మన టిబెటన్ జాతివారిలోనే వుంటుందా? లేక ప్రపంచంలో ఇంకా అనేక జాతులున్నాయికదా! వారెవరికీ వుండదా?" అన్నాను ఆశ్చర్యంగా! దానికి గురుదేవులు ఫక్కున నవ్వుతూ, చిత్రంగా నావంక చూస్తూ —

"ఏం! మన టిబెటన్ జాతివాళ్లేం మానవజాతి కాదా? నీ సందేహం నాకర్థమైంది. ఇలాంటి దివ్యదృష్టిని కలిగించే మూడవ కన్ను ప్రపంచంలో అనేకజాతులలో మతగురువులకూ, యోగులకూ, ఋషీశ్వరులకందరికీ

కూడా తెలుసు! అసలామాటకొస్తే, ప్రపంచంలోని ప్రాచీన మతములన్నిటికీ మూలం — ఒక్క బ్రహ్మజ్ఞానమే! ఈ బ్రహ్మజ్ఞానం భగవంతుడిచ్చినది!

సృష్టికర్తకు ఏ పక్షపాతమూ వుండదుకదా! కాళ్ళూచేతులూ, కళ్ళూ ఇచ్చినట్టే, అందరికీ ఇలా దివ్యదృష్టితో చూసే మూడవ నేత్రాన్ని కంటికి కూడా ఇచ్చాడు పరమాత్మ! అందుకనే ప్రాచీన వేదకాలపు ఋషులు తమ శిష్యులకు ఈ "మూడవకన్ను తెరిచే" ప్రక్రియను ఎప్పుడో, కొన్ని లక్షల సంవత్సరాలక్రిందే ఏర్పరిచారు."

"ఏమిటి? ప్రాచీన భారతదేశంలోకూడా దీని సంగతి తెలుసన్నమాట!" ఆశ్చర్యంగా ప్రశ్నించాను గురుదేవులను. "సంస్కృత భాషలో 'నయనం' అంటే కన్ను!! ఈ రెండుకన్నులుకాక విశేషంగావున్న జ్ఞాన నేత్రాన్ని **"ఉప–నయనం"** అంటారు దానిని తెరిచే ప్రక్రియనే ఇప్పటికీ బ్రాహ్మణ బ్రహ్మచారులకు చేసే ఉపనయనం అనబడే ప్రక్రియ!

కానీ ఈ మాటకు అర్థం ఎప్పుడో మరిచిపోయి మూడోకన్ను తెరవడం అనేది వుంటుందనికూడా మరిచిపోయారు ఆదేశంలోని బ్రాహ్మణులు — విపరీతమైన డబ్బుఆశవల్ల! కాని, ఆ పదంమాత్రం వాడుకలో ఇప్పటికీ అదే వాడతారు — "ఉపనయనం" అంటారుగదా? దాని అర్థం ఏమిటో గుర్తించకుండానే! ఉప అంటే అదనపు, నయనం అంటే కన్ను = "ఉపనయనం" అంటే మూడవకన్ను లేక దివ్యచక్షుస్సు అనబడే దివ్యదృష్టి! అనిగదా? తాత్పర్యం — ఆదేశ సంస్కృత భాషలో.

సరే! — నాకు చిన్నతనంలోనే నా గురుదేవులు ప్రత్యేకశిక్షణను



"మూడోకన్ను" తెరిచిన లామాసరీ గురుకులం

అంటు నూయమంటూ!)

ఏర్పాటుచేశారనే చెప్పానుకదూ! నాకు సరిగ్గా ఏడు సంవత్సరాలు నిండే సరికి చంద్రుని కళలు అంటే తిథులూ, నక్షత్రాలూ లెక్కించి, ఒక మంచి ముహూర్తాన్ని నిశ్చయించారు. ఒక వారం ముందుగా నా శరీరాన్ని పరిశుభ్రం చేశారు, అనేక విధాలుగా.

ముందుగా మూలికలతో, ఓషధులతో తయారుచేసిన మూలికల తైలాలు నావంటికి మర్దనాచేశారు. ముఖ్యంగా అరికాళ్ళకూ, అరిచేతులకూ, రొమ్ముమీద, గుండెపైనా, కంఠంవద్దా, పొత్తికడుపు అంటే బొడ్డ మీదా గుండ్రంగా ప్రదక్షిణగా రుద్దారు వేడిపుట్టేలా! ఆతరువాత తలపైన దివ్యమైన మూలికలతో చేసిన తైలం మర్దనాచేశారు నా మెదడుకు ఉత్తేజం కలిగేందుకు.

ఆతరువాత నా ఆహారం క్రమబద్ధం చేయబడింది! తేలికగా జీర్ణమయ్యే ఆకుకూరలూ, మొలకధాన్యం మాత్రమే నాకిచ్చేవారు. ఆతరువాత వైద్యశాస్త్రప్రకారం నాపేగులలో మలాన్ని ప్రక్షాళనచేసి, మందుల కషాయాలతో నాకు "వస్తి" — దీనిని ఇంగ్లీషు వైద్యులు 'ఎనిమా' అంటారే! అటువంటిది చేసి నా కడుపులోని పేగులను ఖాళీగా, శుభ్రంగా చేశారు.

ఆతరువాత వెన్నతో, నేతితో శరీరమంతా మర్దనాచేసి తలంటి స్నానం — అభ్యంగనం చేయించారు. ఇలా అనేక విధాలుగా నా శరీరాన్ని పరిశుభ్రం చేశాక — చివరగా తలపైన వెంట్రుకలన్నీ శుభ్రంగా తీసేసి, గుండు గీయించి తలవెనుక కుంచెవంటి పిలకవంటి — 'శిఖ' పెట్టారు. ఆతరువాత నాతలపైన కరిగించిన నేతితోనూ, మంచి తేనె

తోనూ, పాలతోనూ, టెంకాయ నీళ్ళతోనూ “అభిషేకించి” మంత్రాలతో పవిత్రం చేశారు! అలా ఏడురోజులు ఆ కార్యక్రమం పట్టింది!

నాకేమో గాలిలో తేలిపోతున్నట్టుగా వుండేది! మనస్సు ప్రశాంతంగా, నిర్మలంగా, మేఘాలమీద ఎగిరిపోతూవున్న భావం కలిగేది! అంతేకాదు, నా చుట్టూరా ఏవో లేతగులాబీరంగు మేఘాలు, అతి లేతనీలపురంగు, బంగారురంగు మేఘాలవంటివి హోమంచేస్తే వచ్చే పొగలాగ క్రిందనుంచీ పైకి వ్యాపించేవి!

చెవిలో విచిత్రమైన ధ్వనులు ఏవో వినిపించేవి. దానితో నాకు రాత్రి నిద్ర తక్కువైంది. తెల్లవారకముందే మూడుగంటలకే మెలుకువ వచ్చేది! అప్రయత్నంగా నామనస్సు ధ్యానంలోకి వెళ్ళిపోయేది. అప్పుడు నా శారీరక, మానసిక ప్రక్షాళన అలా పూర్తిచేశాక అప్పుడు నా గురుదేవులు నిర్ణయించిన ముహూర్తంలో నాకు **“మూడోకన్ను తెరిపించే”** కార్యక్రమం మొదలైంది.

మన పసిబిడ్డలకు ఈ కన్ను తెరవగానే అతిసున్నితంగా వుంటుంది! ఒక్కసారిగా వెలుగుచూస్తే మిరుమిట్లుగొలిపేది కనపడితే కన్నుపోవచ్చు! అందుకని నా తలపైన ఓ నల్లటి గుడ్డను కప్పారు. అంతకుముందే మూడురోజులనుంచీ నేను కూర్చున్న పీఠానికి ఐదుదిక్కులా ఐదురకాల ధాన్యం చల్లిన “పాలికలు” ఉంచారు. అలా మొలకెత్తిన ఆ నవధాన్యాలను మంత్రాలతో తీసి, కడిగి నాచేత తినిపించేవారు ఆహారంగా! ఆ ధాన్యం మొలకలుగా ఎదుగుతున్నకొద్దీ నాలో ఏవో దివ్యానుభూతులు కూడా వాటితోపాటే పెరిగిపోసాగాయి!

చివరికి, ముందుగా నిశ్చయించిన శుభముహూర్తంలో నా పరమ గురువు అప్పటి తాషీలామా నా శిరస్సుపైన తన అమృతహస్తాన్ని వుంచి ఆశీర్వదించారు! వారిచేయి తగలగానే జల్లుమని కరెంటువంటి ఏదో ఒక దివ్యశక్తి నాతలలోకి ఆవహించినట్లైంది! క్షణకాలం నామనస్సూ, వెన్నుపూస లోని నరాలూ అంతటా ఒక కరెంటువంటి శక్తి ఆవహించినట్లుగా! నేను కళ్ళుమూసుకునే వున్నప్పటికీ నా తలలో ఏదో లైటు వెలిగినట్లు జిగ్గుమని మెరుపు కనబడింది! అది గురుదేవుల ఆశీస్సుల ప్రభావమని ఆ నా అనుభవమే నాకు తెలిపింది! ఆతరువాత తన చేతితో వారు నా గుండ్రటి తలను సున్నితంగా కదలకుండా పట్టుకుని రెండవచేతితో సున్నితమైన సూదివంటి బంగారు దబ్బనంతో నా నుదుట రెండుకళ్ళ మధ్యా సన్నగా గాటుపెట్టారు! — లోతుగా తెగకుండా చూస్తూ! 'చురుక్కుమంది' క్షణకాలం నానుదురు! వారు సున్నితంగా ఇరువైపులా చర్మాన్ని పాయలుగా విడదీసి పుస్తకం తెరిచినట్లు రెండు పొరలనూ విడదీశారు — మధ్యనే వడ్లగింజ వంటి సందుచేసి!

ఒక్కసారిగా తళుక్కున మెరుపుమెరిసినట్టుగా వెలిగింది వెయ్యి చందమామలు వెలిగినంత కాంతితో — కరిగించిన వెండిలా వెలిగింది! "నెమ్మదిగా! అతినెమ్మదిగా తెరు! నీ మూడోకన్నుతో చూడడానికి ప్రయత్నించు! నేడు నీకు కొత్తచూపు వచ్చింది! రెండుకళ్ళనూ తెరిచినట్టే — దీనితోనూ నీవు ప్రయత్నించి చూడాలి. ముందు మిరుమిట్లుగొలిపే కాంతికి, కన్నులు మూసుకొనిపోతాయి!

అయినప్పటికీ నిదానించి నెమ్మదిగా ఆ వెలుగుకు అలవాటు పడుతూ తెరవాలి నీ మూడవనేత్రం! ఇది నీ జీవితంలోనే అపూర్వమైన

జ్ఞాన-ముహూర్తం! నీ కన్నులు తెరవడంతో నీకు శరీరంతో ఈజన్మ ప్రారంభించినట్టే — ఈ మూడవకన్ను తెరవడంతో నీవింకో లోకాల్లో కంటికి కనిపించని దివ్యదర్శనంలో కనిపించే ఉన్నత లోకాలలోకి జన్మిస్తున్నావు! అందుకే నీకిది రెండవజన్మ!! మూడవకన్ను తెరవడంతో నీకు మూడులోకాలనబడే వాటిలో మూడవదీ, కంటికి కనిపించని 'స్వర్లోకం' కనిపిస్తుంది! చూడు! బాగా తెరు!! నీ మూడవనేత్రాన్ని!" అంటూ నా గురుదేవులు సాయంచేస్తున్నట్లుగా, ప్రోత్సహిస్తూ నా మూడవకన్ను తెరిపించారు!

ముందుగా జిగేల్‌మని, నాకనులు మిరుమిట్లుగొలిపే వెలుతురు! అది క్రమంగా సర్దుకుంది ఒక గంటసేపట్లో. ఆతరువాత బంగారు సూర్యోదయ కాంతిలాంటి సంధ్యారుణకాంతి వెలిగింది!

నాచుట్టూరావున్న యోగులూ, లామాలూ, నాముందే నిలబడ్డ తాషీలామా గురుదేవులనూ చూడగానే ఒక్కసారిగా వాళ్ళందరూ జ్వాలలో మండిపోతున్నట్టుగా వెలిగిపోతూ ఓ అగ్నిహోత్రం మధ్యలో నిలబడ్డట్టుగా ప్రకాశిస్తూ కనిపించారు!

"మంట! — మంట! అయ్యో! మంట! జ్వాలలు! గురుదేవా మీరందరూ కాలిపోతున్నారు" అంటూ అరిచాను భయంతో! సమాధానంగా భళ్ళున నవ్వారు తాషీలామా గురుదేవులు! "మంచిది! మంచిది! నీకు మూడవనేత్రం తెరుచుకుంది! నీకిప్పుడు కనిపించేది మామూలు వెలుతురుకాదు! ఆత్మలచుట్టూ వెలుగుతుందే ఆ తేజస్సు! దానివల్ల నీవు భవిష్యత్తులో ఎవరివంక చూసినా నీ మూడవకంటికి వారి 'సూక్ష్మశరీరం'

కనిపిస్తుంది! అంతేకాదు వారి ఆత్మలచుట్టూ వెలిగే తేజస్సుకూడా నీకు సూర్యునివెలుగులా కనిపిస్తుంది. ఆ తేజస్సురంగులు రకరకాల మనుష్యుల వ్యక్తిత్వాన్నిబట్టి వేరువేరు రంగులలో ప్రకాశిస్తూ కనిపిస్తుంది. అది కొందరిచుట్టూ గులాబీరంగులోనూ, మరికొందరిచుట్టూ ఆకుపచ్చగా వెలుగూ కనిపిస్తే, ఇంకొందరి చుట్టూరా లేత నీలంకాంతి వెలుగుతుంది! 'విద్యుత్తువంటి మిరుమిట్లుగొలిపే తెలుపూ, లేదా కరిగించి పోతపోసిన బంగారువంటి సూర్యోదయకాంతితో వెలిగే తేజస్సు' — ఇది ఎదుటి వారిలో పవిత్రతా, తేజస్సువుంటే కనిపిస్తుంది. క్రమంగా నీవే తెలుసుకో గలుగుతావు నీ మూడవకంటితో కనిపించే దివ్యతేజస్సుయొక్క రంగులనుబట్టి.

ఇది — తెల్లగా ముత్యములవలే తళుక్కున వెలిగే చంద్రవర్ణం! ఎర్రని పగడం వంటి అరుణసూర్యకాంతి!! బంగారురంగు కాంతి!! పచ్చని కాంతి, లేతనీలంకాంతి — ఇలా ఐదురంగులలోనూ

"ముక్తావిద్రుమ హేమ నీల ధవళచ్ఛాయాం"

అని వేదంలో చెప్పబడిన ఐదురంగులతో ప్రకాశించే "పంచతత్త్వాలు" నీ జ్ఞానదృష్టికి స్వయంగా ఐదురంగులుగా గోచరిస్తాయి! నీకిదే రెండవ జన్మ! చిరంజీవ!! ఇవే నీకు నా ఆశీస్సులు!" అంటూ గురుదేవులు దీవించి నా జ్ఞాననేత్రాన్ని రక్షించుకునే మంత్రాలూ, బీజాక్షరాలూ అన్నీ ఉపదేశించి, నాతలపైన ఆ మంత్రాలను ఆవాహన చేశారు రక్షగా! ఆనాటినుంచీ నా గురుదేవులే నాతండ్రి! — నిజమైన తండ్రి!

ఎందుకంటే నా తల్లిదండ్రులు కేవలం నా శరీరానికి మాత్రమే జన్మనిచ్చారు. కానీ నా గురుదేవులు నా ఆత్మకే జన్మనిచ్చారు! ఇది నాకు నిజంగా పునర్జన్మ!! అసలైన జన్మ!

'ఇదే నాకు బ్రహ్మోపదేశం!' అనుకున్నాను.

ఇలా జరిగింది! నా మూడవకన్ను తెరిపించే ప్రక్రియ!" — అంటూ పూర్తిచేశారు నా గురుదేవులు తాషీలామా పీఠాధిపతులు. నాకు వెచ్చటి 'త్సాంపా' జావను నింపిన దొప్పనుఇచ్చి గంటమోగించి తాను చెంగునలేచి లోపల లామాసరీ మఠంలోకి మాయమయ్యారు!

◆

28

శరీరం విడిచి - ప్రయాణం !

ఆరోజు — మాకు కొంచెం తీరికదొరికింది! ఎందుకంటే మా సాహసయాత్రలో ప్రతీరోజూ పర్వతాలు ఎక్కుతూ, దిగుతూ, మంచు తుఫానులకు, చలిగాలికి తట్టుకునే మా కార్యక్రమంలో ఒకరోజు ఆట విడుపుకోసం సెలవుగా విశ్రాంతితీసుకున్నాం అంటే ఆరోజు కొండలెక్కటం, నడవడం కార్యక్రమం వాయిదావేయబడింది. మాకు విశ్రాంతిగా — సెలవుదినంగా!

రోజంతా ఎవరికిష్టమైన రీతిలో వారు తమ తీరికని వినియోగించుకున్నాం. కొందరు ఉడుకునీళ్ళతో శరీరాన్ని కాపాడం పెట్టించుకున్నాం, కీళ్ళనొప్పులు, నరాలనెప్పులు, బాధలు ఉపశమనానికి మరికొందరు

సమర్థులైన మంగళ్ళచేత మా శరీరాలను రుద్ది మాలీషుచేయించాము. ఇందులో కొండల్లో నివశించే షేర్పాలకు ప్రత్యేకమైన శిక్షణవుంటుంది. కాబట్టి వారివద్ద రకరకాల తైలాలు, మూలికలలోనూ ఘాటైన అమృతాంజనం వంటి సుగంధవస్తువులతోనూ తయారుచేసిన తైలాలు, నేతివంటి పూతలతో శరీరాన్ని మర్థించి నెప్పులను లాగేస్తారు. ముఖ్యంగా వెన్ను, నడుము, పాదాలు, మోకాళ్ళు, శిరస్సు వేడిపుట్టేదాకా మర్థనాచేసి గోరువెచ్చని నీటితో ధారలుగా అభిషేకించినట్టు స్నానంచేయిస్తారు. నిజంగా దానివల్ల ఒకనెలరోజులు విశ్రాంతితీసుకున్నా అంతటి హాయి లభించదు అనిపించింది. శరీరంలో దాగివున్న నొప్పులు, నరాలు, కీళ్ళ కొంకర్లు, బెణుకులు, వాపులు వంటివి దాదాపుగా శాంతించాయి. విశ్రాంతిగా మూడు, నాలుగు గంటలు వెచ్చని ఎండలో పడుకుని వుండటంవల్ల శ్రమతగ్గి శరీరానికి మరింత శక్తి, ఉత్సాహము పుంజుకున్నాయి. మళ్ళీ ప్రయాణానికి ఉత్సాహం కలిగింది.

మధ్యాహ్నం పన్నెండుగంటలు కావస్తూంటే మా షేర్పా వంటవాళ్ళు వచ్చి —

"సార్! మీ భోజనాలు వడ్డించమంటారా?" అన్నారు. మాచెవులకది సంగీతంలా వినిపించింది. మా విశ్రాంతి, శరీరాన్ని మర్ధనాచేయటంవల్ల నెప్పులు తీసేయటంతోపాటు ఆకలి విపరీతంగా దంచేస్తోంది. అందుకనే రెండవ ఆహ్వానం అక్కర్లేకుండా — భోజనానికి మమ్మల్ని మేమే ఆహ్వానించుకున్నాం.

వంటకాలు ముఖ్యంగా శాఖాహారం కూరలు, పండ్లు, దుంపలతో

తయారుచేశారు. అల్లము, కొత్తిమీర, పుదీనా వంటి వైద్యలక్షణాలుగల ఆకులతో ఘుమఘుమలాడే వంటకాలు గోరువెచ్చటి చారు, పొగలు కక్కుతూవున్న అన్నము — భోజనం పూర్తయ్యాకగానీ మాకు తెలియదు ఎలా తినేశామో!

కడుపులో ఆకలి శాంతించాక — మనస్సులో ఆకలి నోరుతెరుచుకుంది. తీరుబడిగా అందరం విశ్రాంతిగా భోజనాలయ్యాక వేడిపాలను సుగంధవస్తువులతో కలిపి నిదానంగా త్రాగుతూ లామామహాశయుణ్ణి తన చిన్నతనంలోని శిక్షణగురించి చెప్పటం కొనసాగించమని కోరాం!

లామామహాశయా! ఏకథని మధ్యలోనే నిలిపివెయ్యరాదు అంటారు కదా! ముఖ్యంగా మీలాంటి పెద్దల అనుభవాలు వింటూంటే ఎన్నో విషయాలు పాఠశాలలో నేర్చుకున్నంత వినోదంగానూ, విజ్ఞానానికి ఆశ్చర్యము కలుగుతాయి. మీరు ఇంతవరకు చిన్నతనంలో ఏడేళ్ళ వయస్సుల్లో లామాసరీలో చేరిక, గురుకుల శిక్షణావిధానం, మీ మూడవ కన్ను తెరిపించే ఉపనయన ప్రక్రియ, మీ ఆధ్యాత్మికశిక్షణ కొంతవరకు వినిపించారు. దానితో అలా మా ఆకలి, ఆసక్తి మరింతగా పెంచారు.

మీకు ఆధ్యాత్మిక విజ్ఞానంలో ప్రత్యేకశిక్షణ ఇచ్చివుంటారని మీ ఆత్మకథను వింటూంటే మాకు స్పష్టంగా తెలుస్తోంది. మావంటి ఆధునిక ప్రపంచంలో పుట్టిపెరిగిన వ్యాపారదృష్టిగల సమాజంలో పెరిగినవాళ్ళకు ఈ ఆధ్యాత్మికశిక్షణ అంటే ఏమిటో అర్థంకాదు. అలాంటి విషయాలు మాకు ఏ స్కూలులోనూ, కాలేజీలోనూ బోధించరు. సమాజంలోనూ అలాంటి ఆధ్యాత్మిక వ్యక్తులు సామాన్యంగా తారసపడరు ఎవరికోగానీ.

అందువల్ల మాలో చాలామంది ఆధ్యాత్మికరహస్యాలు తెలుసుకోకుండానే జీవించి తెలియకుండానే మరణిస్తారు అనేకమంది. మనిషిలో సహజంగానే ఎన్నో దైవికశక్తులు దాగివుంటాయి మరి — వాటిని యోగసాధన ద్వారా అంటే శ్వాసను నియంత్రించే ప్రాణాయామం, మనస్సును నిగ్రహించే ధ్యానం, మన ఆత్మలోని స్పందనలు పదునుపెట్టి తీక్షణంచేసే జపవిధానంలోనూ ఇంకా బయటప్రపంచానికి తెలియని 'మూడవకన్ను' తెరవటం అన్న ఉపనయనాన్ని తెరిచే ప్రక్రియద్వారాను ఎన్నో రహస్య శక్తులు ప్రత్యేకించి పరిమళిస్తున్నాయి మానవునికి అంతరాత్మనుంచి! అవి దుమ్ముతో కలిసిన గాలిపీల్చే రద్దీలో బ్రతికే, రణగొణధ్వనిలో జీవించే చేపలమార్కెట్ వంటి జీవితవిధానంలో, డబ్బునుమాత్రమే గౌరవించే వ్యాపారసంస్కృతి, స్వార్థం, అసూయలతో జీవిస్తూ ఒకరినొకరు ద్వేసించుకుంటూ బ్రతికేవారికి ఇలాంటి ఆధ్యాత్మిక వికాసం — సాధ్యపడటం మాట అలావుంచి — కనీసం అర్థంకూడా కాదు చాలామందికి మాలో! అంతేకాక దయచేసి మాకళ్ళు తెరిపించే మీ అనుభవాలద్వారా మాకు బోధించండి అంటూ ఆధ్యాత్మిక విజ్ఞానంలో ప్రత్యేకమైన ఆసక్తి గల సాహసబృందంలోని సభ్యులైన అలెగ్జాండర్ నోటోవిచ్, జగదీష్ బాబు, శ్రీనివాసచక్రవర్తి, లామాదోర్జీ చుట్టూరా ఆసక్తిగా కుర్చీలను ముందుకులాక్కుని ఉత్సాహంతో ప్రశ్నించారు!

మా ఉత్సాహానికి, శ్రద్ధకూ ముచ్చటపడిపోయాడు ఆ లామా మహాశయుడు! ఆకలిగావున్నవానికే కదా — ఆహారం రుచి తెలిసేది! అంటూ ఎత్తుకున్నాడు లామా మహాశయుడు.

నేను నా గురుదేవుల ఆధ్యాత్మిక శిక్షణలో జ్యోతిషము, వైద్యము, తాంత్రిక, యోగరహస్యాలు ఎన్నో తెలుసుకున్నాను. అవన్నీ చెప్పాలంటే ఈ పుస్తకం సరిపోదు — జీవితంఅంతా చెప్పినా తరగదు. కానీ ముఖ్య మైన అంశాలు నామనస్సులో ఎప్పటికీ మర్చిపోనివి, నా గురుదేవులను తలచుకోగానే తలంపుకు వస్తున్నాయి.

ఒకరోజున మాగురుదేవులు తేషూలామా మహాశయుడు నాకు యోగశాస్త్రములోనూ, ఆధ్యాత్మిక సాధనలోనూ శిక్షణాతరగతులను నిర్వహిస్తూ ఆరోజు ఒక కొత్తపాఠం మొదలుపెట్టారిలాగ.

బిడ్డా! బ్రహ్మచారీ! నీకివాళ ఒక కొత్తవిషయాన్ని బోధిస్తాను. మనిషి శరీరంలో నడిచి లేక గుఱ్ఱంమీదనో బండిమీదనో ప్రయాణంచెయ్యటం అందరికీ తెలిసిందే. ఇప్పుడు నువ్వూ నేనూ కొన్ని వేలమైళ్ళ దూరంలో వున్న కాశీని, బుద్ధదేవునికి జ్ఞానోదయమైన బుద్ధగయను చూడాలంటే ఎన్నాళ్ళు ప్రయాణంచెయ్యాలి! ఎంత కష్టపడాలి! కనీసం ఊహించను కూడాలేంకదా! పైగా బోలెడంత సమయము జీవితకాలం వృధా అయి పోతుంది కూడాను. అందువల్ల శరీరములేకుండా ప్రయాణంచెయ్యటం ఎలాగో చెబుతాను.

"ఆశ్చర్యంతో ఎగిరి గంతేశాను గురుదేవుల మాటలకు!" శరీరం లేకుండా ప్రయాణమా ఎలాగురుదేవా? మనిషి చచ్చిపోయినాగానీ శవంలా మిగిలివుంటుంది శరీరం! ఒక్క మరణంతోనేకదా మనిషి శరీరం విడిచి వెళతాడు అన్నాను ఆశ్చర్యంతో!

"అది మరణం అంటాం!" — శరీరం విడిచి ప్రయాణంకాదు

కదా! ఇప్పుడు నీకు చెప్పేది యోగపరిభాషలో — సూక్ష్మరశరీరంతో ఆకాశంలో ప్రయాణించటం అంటారు. ఇది చాలా సహజంగానూ తేలికగానూ కొద్దిపాటి అభ్యాసంతోనూ చెయ్యవచ్చు. అంటూ గురుదేవులు నాకు విశదంగా అర్థమయ్యేలాగ ఇలా వివరించారు — విశ్రాంతిగా నేలమీదగాని, బల్లపరుపుగా ఏర్పరచిన బల్లమీదగానీ శవాసనంలో పడుకొని, శ్వాసను నిదానంగా నెమ్మదిగా మనస్సుతోపాటు పీలుస్తూ సుఖప్రాణాయామం అభ్యాసంచెయ్యాలి. ఆతరువాత మనస్సును మన శరీరంలో రెండుకళ్ళమధ్య కేంద్రీకరించి నేను ఈ స్థూలశరీరాన్ని విడిచి పెట్టి బయటకు ప్రయాణిస్తాను. సరిగ్గా రాత్రి రెండుగంటలకు అన్నీచూసి తిరిగి నాశరీరంలో మూడున్నర, నాలుగుగంటలకు తిరిగి ప్రవేశిస్తాను. అని సంకల్పించి శ్వాసను నెమ్మదిగా కనుబొమ్మలమధ్యనుంచి కంఠం, హృదయం, బొడ్డు లేక నాభివరకు తీసుకువెళ్ళి అరికాళ్ళనుంచి ప్రాణశక్తిని క్రమంగా పైకి మోకాళ్ళు, నడుముదాటి బొడ్డువద్దకు ఆకర్షించాలి. అప్పుడు ఇలా శ్వాసపీల్చాలి అంటూ ఒక ప్రత్యేకమైన శ్వాసతీసుకునే విధానంతో శరీరంనుంచి బయటకు వచ్చేవిధానాన్ని తేలికగా ఉపదేశించాడు.

మేలుకొనివుండగానే శరీరంలోంచి బయటకు వచ్చాను. క్షణకాలం భయంవేసింది. భయపడకు! సూక్ష్మశరీరంతో వుండగా ఏమాత్రం భయం వుండరాదు. శాంతించు, శాంతించు అంటూ ధైర్యంచెబుతూ మంత్రించినట్టు గురుదేవుల కంఠం వినపడింది. ఒక రబ్బరు బెలూన్‌లాగ గాలిలో పైకిలేచాను. ఐదు, ఆరు లేక ఏడు ఇంద్రధనుస్సులాంటి రంగులు వెలుగుతూ ఆరుతూ కనిపించాయి. ఒక సబ్బునీటి బుడగలా నా

శరీరంలోంచి పైకిలేచిన నేను నాసూక్ష్మశరీరంతో పైకితేలి ఆగదిలో పైకప్పువద్దకు చేరుకున్నాను. గోడలు తగుతాయేమోనని భయపడ్డాను. "నీకు గోడలుకానీ, తలుపులుకానీ మరే అడ్డంకులూ ఈ సూక్ష్మశరీరానికి అడ్డంపడవు! నీసూక్ష్మశరీరం నీడలాంటిది. ఒకనీడ గోడమీదనుంచి ప్రయాణించినట్లే నువ్వుకూడా గోడలోంచి అవతలికి ఇంకా గాలిలోనూ ప్రయాణిస్తావు. నీళ్ళు వడపోస్తే గుడ్డలోంచి వచ్చినట్టే నీశరీరంలోంచి విడిపడిన నీవుకూడా పొగలాంటి నీ మనస్సుతో ఏర్పడిన శరీరంతో ప్రయాణిస్తావు. దీనికి ఏవస్తువులు, గోడలు, పర్వతాలు, సముద్రాలు అడ్డుకాలేవు. అంతేకాక ఒక్క సెకండులో నూరవవంతులో ఈ టిబెట్‌నుంచి బయలుదేరి ఈ భూగోళం మొత్తాన్ని చుట్టిరావచ్చు. ఎక్కడెక్కడి ఆశ్రమాలు, గ్రంథాలయాలు చూడవచ్చు. చూసినవి, చదివినవి మనస్సులో చిత్రంలాగ గుర్తుంచుకుని తిరిగి శరీరంలోకి నెమ్మదిగా సూక్ష్మశరీరాన్ని లాగాలి. గాలిపటాన్ని ఎగరవేసేవాడు ఆకాశంలో ఎంతోఎత్తున ఎగిరే గాలిపటాన్ని నిదానంగా తన చేతిలోని దారం చుట్టుకుంటూ సన్నని దారంద్వారా కిందికి లాగినట్లే నీ సూక్ష్మశరీరాన్నికూడా అదురుబెదురు లేకుండా నిదానంగా భౌతికశరీరంలోకి లాగాలి. అప్పుడే నీవు సూక్ష్మశరీరంలో వుండగా చూసినవి విన్నవీ అన్నీ మళ్ళీ తరవాత గుర్తుంటాయి అంటూ నాకు సూక్ష్మశరీరంవిడిచి ప్రయాణం ఎలాచెయ్యాలో ఉపదేశించారు గురుదేవులు తాషీలామా. ఇంకోరోజు — బ్రహ్మచారి లామా! ఈరోజు నువ్వు నేనూ కలిసి సూక్ష్మశరీరాలతో ప్రయాణంచెయ్యాలి. ఇది చాలాదూరం వెళ్ళే ప్రయాణం! అయినా ఏమీ భయంలేదు. నీవెంట సూక్ష్మశరీరంతో నేను వుంటానుకదా! అన్నారు.

“ఎక్కడికి గురుదేవా! చాలాదూరం అంటున్నారు” అంటూ చాలా కుతూహలంతో ప్రశ్నించాను.

ఈరోజు మనిద్దరమూ కలిసి ఈ భూగోళందాటి ఆకాశంలో తేలి పోతూ ఇతర గ్రహాలకు ప్రయాణించాలి అన్నారు గురుదేవులు తాషీ లామా! నేను ఆశ్చర్యంతో విస్తుపోయాను.

“ఇతర గ్రహాలకా! చాలా దూరంకదా”, కొన్ని లక్షలమైళ్ళ దూరంలో వున్నాయనికదా అవి జ్యోతిషపాఠాలు చెప్పిన గురుదేవులు నేర్పించినది అన్నాను ఆశ్చర్యంతో.

“నీకు గుర్తులేదా? సూక్ష్మశరీరంతో ప్రయాణించినప్పుడు దూరానికి పరిమితం అంటూలేదు. అలానే ఇది చాలా దూరప్రయాణం అన్నాను. భూమి ఆకర్షణశక్తిని దాటివెళ్ళాలికదా! నీకు దారిలో దేవతలు, గంధర్వులు, సిద్ధపురుషులు వంటివారు ఆకాశంలో ఎగురుతూ దారికిఅడ్డంగా కనిపిస్తారు.

వారందరినీ తప్పుకుంటూ సగౌరవంగా ప్రదక్షిణచేసుకుంటూ ఎలా వెళ్ళాలో, అందరికీ సాష్టాంగనమస్కారం ఎలాచెయ్యాలో నేను పక్కనే వుంటాను కనుక చూసి నేర్చుకోవచ్చు అంటూ నాగురుదేవులు నాపక్కనే పడుకుని తన కుడిచేత్తో నా ఎడంచేతిని గట్టిగా పట్టుకున్నారు. ఇద్దరమూ శవాసనంలో పడుకుని శ్వాసప్రక్రియను మార్చేసరికి క్షణాల్లో శరీరంలోంచి బయటకు వచ్చేశాం. ఆకాశంలోంచి క్రింద మాఇద్దరి శరీరాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దూరంగా వెలుగుతున్న ఎర్రటి కనకాంబరం రంగులో వెలుగుతూ ప్రకాశిస్తున్న ఒక నక్షత్రాన్ని చూపి “అదిగో చూడు అదే

అంగారకగ్రహం. ఇప్పుడు మనం వెళ్ళేది ఆ కనిపించే అంగారకగ్రహం మీదకివెళ్ళి అక్కడెలావుందో అంతా చూసిరావాలి అన్నారు.

మరుక్షణమే రివ్వున శరవేగంతో ఒక కాంతికిరణంలా ఆకాశంలోకి దూసుకువెళ్ళాము. అలా ఎంతసేపు ప్రయాణించామో గుర్తించలేదు ప్రయాణకాలాన్ని.

భూమ్మీంచి పైకిలేచి శూన్యంలో పైకి ప్రయాణించేసరికి క్రిందకి చూశాను మన భూగోళంవంక! ఆశ్చర్యంగా కనిపించింది నారింజపండులా కుడివైపు ఎండ, ఎడంవైపు ఎర్రటి కీనీడ. ఒకటి రాత్రి, ఒకటి పగలు అని గ్రహించాను.

ఇంకా ఎత్తుకు ఎగిరిపోతుంటే భూగోళం వేగంగా తిరిగిపోవటం కనిపించింది! క్షణాలమీద రాత్రులు నలుపు, పగలు తెలుపురంగులుగా కనిపిస్తూ మాయంకావటము అతివేగంగా తిరిగే చక్రంలో నలుపు, తెలుపురంగులు ఒకదానివెంట ఒకటి ప్రదక్షిణంగా తిరుగుతూ రివ్వున వేగంహెచ్చి ఆ తెలుపు నలుపురంగులు కలిసిపోయి బూడిదరంగు పొగలాగ వేగంగా తిరుగుతూ కనిపించింది భూమి. ఆ వింతదృశ్యాన్ని ఆశ్చర్యంతో చూశాను విస్తుపోతూ! ఇంతలోనే నా గురుదేవుల కంఠస్వరం మనస్సులోంచే వినిపించింది శరీరంలేదుకనుక.

ఇప్పుడు మనం ఆకాశంలో ప్రయాణంచేస్తున్నాం కనుక కాలం వేగం పెరుగుతుంది. పగలు, రాత్రి, క్షణములు అన్నీ ఆ గ్రహకాలం లోకి ప్రవేశిస్తాం. భూగోళంలోని పగలు రాత్రి విడిచిపెట్టి. ఇలా కాంతి వేగంతో ప్రయాణిస్తే, భూమికాలం దాటి అంగారక కాలంలోకి ప్రవేశిస్తాం

అనుకుంటూ దూరంగా ఆకాశంలోకి దూసుకువెళ్ళాం ఇద్దరమూ.

మేము తిరిగివచ్చేసరికి మా లామాసరీ గురుకులంలో తెల్లవారు జామున గురుకులంపిల్లలను మేలుకొలిపే సుప్రభాతాన్ని తెలుపుతూ జేగంట మోగుతోంది. అప్పుడు తెలుసుకున్నాను మేము తిరిగి భూలోకంలోని మామూలు కాలంలోకి, మాశరీరంలోకి తిరిగి వచ్చేశానని. నాపక్కన చూస్తే గురుదేవులు లేరు. నాకంటే చాలాముందే లేచి వారి స్నానం, సంధ్య అనుష్టానంకోసం వెళ్ళారు నన్ను మరికొంత విశ్రాంతికోసం విడిచి పెడుతూ. అలా నేర్చుకున్నాను శరీరంవిడిచి సూక్ష్మశరీరంతో ప్రయాణించే యోగపద్ధతిని. దానివల్ల ఈ చర్మం, ఎముకలు, మాంసంతో తయారైన ఈ శరీరాన్ని ప్రతీచోటుకు తీసుకువెళ్ళకుండా సూక్ష్మశరీరంలో ఎక్కడికైనా వెళ్ళవచ్చని, అలా ఎంతటికాలాన్ని, దూరాన్నైనా జయించటం చూసి ఆశ్చర్యంవేసింది.

◆

29

పై‘లోకాలు’ - “గ్రహమండలాలూ!”

మా సాహసయాత్రలో రెండురకాల అనుభవాలు మాకు నిత్యము రుచి చూపించినట్టయ్యేది! ఒకటి హిమాలయ పర్వతశిఖరాలలో పగలంతా మంచుకొండలు ఎక్కుతూ దిగుతూ నడుస్తూవుంటే చూసే వింతలూ, విశేషాలు, ఆశ్చర్యాలూ ఒకఎత్తు! రెండవది, మధ్యమధ్యలో మాకు తీరిక దొరికినప్పుడు లామదోర్జా మహాశయుడితో ఆయన జీవితయాత్రలోని ఆధ్యాత్మిక అనుభవాలు, వింతలూ తెలుసుకోవటం రెండవయాత్ర వంటిది! ఇలా రెండురకాల అనుభూతులు రైలుపట్టాలవలే మా సాహసయాత్ర పొడుగునా మాకు వింత వింత అనుభూతుల రుచులను కలిగించేవి!

లామా మహాశయుడి ఆత్మకథలా నడిచిన బాల్యంనుంచీ ఆయనకు 'లామాసరీ' గురుకులంలో ఆయన గురువులవద్దనుంచి పొందిన ఆధ్యాత్మిక శిక్షణా, ఎన్నెన్నో వింతలూ విశేషాలు విన్నవీ చూసినవీ తమ గురుకులంనుంచి నేర్చుకున్నవీ మాకు వినిపిస్తూవుండేవాడు! అవన్నీ నిజంగా మాకే జరుగుతున్నట్టుగా కళ్ళకు కట్టినట్టుగా ఆయన చెప్పేది వొట్టిమాటలుకాకుండా మా మనస్సులో సినిమాలాగా చిత్రాలు దృశ్యాలు అనుభవాలుగా ఏర్పడేలాగా వర్ణించిచెప్పేవాడు! అవన్నీ వింటూవుంటే మనిషి జీవితంలో సామాన్య మనుషులైన మనలాంటివాళ్ళు ఎరగని వినని ఆధ్యాత్మికానుభూతులు ఎన్నో — తలచుకుంటే విస్తుపోతాం!

అలా ఒకరోజున మా ప్రయాణంలో ఆటవిడుపులాగా శలవుగా విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు మా యాత్రాబృందంలోని సభ్యుడు భావనగర్ మహారాజా ఇలా అడిగాడు :

"లామా మహాశయా! మీరు మీ గురుదేవుల శిక్షణలో మనిషి శరీరం ఇక్కడనే విడిచిపెట్టి సూక్ష్మశరీరంలో బయటికి ప్రయాణించే అంగారక గ్రహానికి కూడా వెళ్ళి చూశారని చెప్పారుకదా! మన పూర్వ శాస్త్రాల్లో 'పైలోకాలు' (ఊర్ధ్వలోకాలు) అనబడే లోకాలూ, ఈ గ్రహాల మీదకి ప్రయాణిస్తే కనిపించే ప్రదేశాలు రెండూ ఒకటేనా? ఉదాహరణకు ఇప్పటి సైన్సు పరిశోధకులు రాకెట్టుతో చంద్రమండలంమీదకి మనిషిని పంపారుకదా! ఆ చంద్రమండలంమీద కనిపించే తెల్లటి పాలరాయి వంటి చంద్రగ్రహంమీద ప్రదేశము.

పూర్వ శాస్త్రగ్రంథాలలో చంద్రలోకం లేక పితృదేవతలలోకం అని వర్ణించబడిన ప్రదేశము రెండూ ఒకటేనా? లేక రెండూ వేరు వేరు లోకాలా?

మాప్రశ్న వింటూ లామాదోర్జీ తన చేతిలోని జపమాలను మరింత వేగంగా తిప్పుతూ ఇలా చెప్పటం మొదలుపెట్టాడు — తనలోతానే మాట్లాడుకుంటున్నట్టు! మేమంతా ఆశ్చర్యంగా చెవులు రిక్కించి వింటున్నాం అతి నిశ్శబ్దంగా! లామా మహాశయుడు ఇలా అన్నాడు :

"మన పూర్వశాస్త్రాల్లో వర్ణించిన పైలోకాలు వేరు! ఈ భూగోళం చుట్టూరా సూర్యునిచుట్టూ తిరిగే 'గ్రహ-మండలాలు' వేరు! ఒకటికాదు! మరణించినవారి ఆత్మలు పైకి చేరుకుంటాయని చెప్పిన పితృదేవతలు నివశించే 'చంద్రలోకం' వేరు! ఇదే విషయాన్ని ఒకసారి నాగురుదేవులు తాషీలామా పీఠాధిపతులను వినయంగా ప్రశ్నించాను! దానికాయన ఎలా సమాధానం చెపుతారో అని ఆసక్తిగా వింటున్న నాకు — తటాలున లేచి నిలబడ్డారు గురుదేవులు! నేనుకూడా వారితో లేవబోయేసరికి — 'కూర్చో!' అన్నట్టుగా చేతితో సంజ్ఞచేశారు! అలా పద్మాసనంలో ఉత్తరపు దిక్కుగా తిరిగి కూర్చుండబెట్టి — నారెండు కనుబొమ్మలమధ్యన మూడవ నేత్రం వున్నచోట నెమ్మదిగా తాకినట్టు ముట్టుకున్నారు! ఆయన చేయి కమండలువు తీర్థంతో శుద్ధిచేసుకొని అతడిచేత్తో నా మూడవనేత్రాన్ని ఉత్తేజపరిచారు! మరుక్షణమే నాఎదుట ఆకాశమే ఒకపల్చటి ఉల్లిపొర వంటి తెరను తొలగించినట్లైంది! రెండుపొరలూ కుడివైపుకీ ఎడమవైపుకీ తెరుచుకున్నాయి — ఒక నాటకంలో ప్రదర్శన మొదలుకాగానే తెర

రెండువైపులకీ తప్పుకున్నట్టుగా! మరుక్షణమే లేతగులాబీరంగుతో కలిసిన ఊదారంగు అంటే ఆకుపచ్చ నీలము కలిసిన ఒక అద్భుతమైన రంగు వెలిగించినట్టుగా జిగేలుమన్నది! నా మూడవనేత్రం తెరుచుకుందని వెంటనే నాకు అర్థమైంది! అది ఈ భూలోకం కానేకాదు! అక్కడి జీవుల శరీరాలు ఇక్కడి మన శరీరాలవలే పదార్థంతో ఏర్పడివుండలేదు! రకరకాల 'విమానాల'వంటివి కుడివైపునుంచి ఎడమవైపుకూ ఎడమవైపు నుంచి కుడివైపుకూ నెమ్మదిగా తేలిపోతూ కనిపించేవి ఒక నిర్మలమైన చెరువులో తేలుతూవెళుతున్న పడవలమాదిరిగా! అందులో మన దేవాలయ శిల్పాలలో చూసే ఆకారం కలిగిన శరీరంతో అందమైన స్త్రీలు వారితో జతగాతిరిగే పురుషులు స్పష్టంగా కనిపించారు! వారు ధరించిన బట్టలు, ఆభరణాలు చివరికి వాళ్ళ శరీరము అన్నీకూడా గాజుతో చేసినట్టుగా స్పటికంలాగా ఇటునుంచి అటు కాంతి ప్రసరించేందుకు వీలుగా రకరకాల రంగులతో వెలిగిపోతున్నాయి! చేతిలో గంధపుగిన్నె వంటి పాత్రలో చిక్కని తేనెవంటి ద్రవం ఘుమఘుమ పరిమళిస్తున్నది! ఆనందంగా రుచిచూస్తూ అనుభవిస్తున్నారు! వాళ్ళ శరీరాలలోంచో లేక మనసులోంచో సన్నటి వీణానాదంవంటి సంగీతనాదాలు వినిపిస్తున్నాయి! అది వాళ్ళు గానంచేస్తున్న సంగీతం కానేకాదు! వాళ్ళు నివశించే లోకమంతా అన్నిచోట్లనుంచీ ఇలాంటి సంగీతధ్వనులు, నాదములు, స్వరాలు ఎవరో దూరంగా ఆలాపిస్తున్నట్టు వినిపించాయి! ఆకాశం వెలుగుతోంది కాని ఆ వెలుతురు ఈ సూర్యుడికీ ఈ చంద్రుడికీ సంబంధించిన వెలుతురుకాదు! తళతళా మెరుగుపెట్టిన వెండి పళ్ళెంలాగా బంగారు పళ్ళెంలాగా తెల్లటి మెరుపు కొన్నిచోట్ల పసుపువన్నెరంగు కాంతితోనూ

మొత్తం ఆకాశముఅంతా వెలుగుతోంది! అది ఏదో ఒకరకమైన ఆధ్యాత్మిక తేజస్సు అని తర్వాత తెలిసింది! ఇలా మూడు నాలుగురకాల 'ప్రపంచాలు' లామా గురుదేవులు నాకు ప్రత్యక్షంగా చూపించారు! నుదుటి వద్ద నొక్కినపుడు కనిపించిన లోకాలు అక్కడి ప్రజలు వేరే ప్రపంచానికి సంబంధించిన జీవులని గురుదేవులు చెప్పగా తెలిసింది! పైలోకాలలో సూర్యుడు వుండడు! చంద్రుడూ ప్రకాశించడు! మనం ప్రయాణిస్తూవున్న లోకాన్నిబట్టి అక్కడి తేజస్సు ఒక్కొక్కచోట ఒక్కొక్కవిధంగా కనిపిస్తుంది!

"నాయనా! ఇవి ఊర్ధ్వలోకాలు! అంటే భువర్లోకం, సువర్లోకం, దేవలోకం అనబడే పుణ్యజీవులు నివశించే లోకాలు! అక్కడి వెలుతురు ఆలోకం సంబంధించిన తేజస్సునుంచి ప్రకాశిస్తుంది! ఇంకా పైలోకాలను కూడా చూడు! ఇదిగో! అంటూ నుదురుపైనుంచి శిరస్సుపైన తాకి నొక్కగానే తటాలున కళ్ళు మిరుమిట్లుగొలిపే పాదరసంవంటి కాంతి కరిగించిన వెండిలాగా తళతళా మెరిసిపోతోంది! ఇది దేవతలలో ఒక అంతస్థుకు చెందిన పుణ్యదేవతల లోకం! వీరే క్రింది మానవలోకంలోని ప్రతిమనిషీ చేసిన మంచి చెడు పనులను విడదీసి — పుణ్యకర్మగానూ పాపములుగాను చిత్రాలరూపంలో దాచివుంచుతారు! ఇవి ఆ మనుషులు మరణించిన వేలసంవత్సరాలకి కూడా అలానే నిలిచివుంటాయి! ఈ దేవతల్ని కర్మదేవతలని పిలుస్తారు! ప్రతిమనిషి జన్మించేముందు అతడు చేసిన పుణ్యపాపాలు ఇక్కడినుంచే రికార్డుచేయబడి ప్రత్యక్షంగా చూసి తర్వాత జన్మించే అంతస్థు సుఖదుఃఖాలు పుట్టే లోకాలు నిర్ణయించబడతాయి" అంటూ ఈసారి నాకంఠంవద్ద నొక్కారు!

“ఓ శిష్యుడా! లోబ్సాంగ్! ఇది జ్ఞానులుండే లోకం! అంటే జీవులు కేవలం పుణ్యం చేసినంత మాత్రానే ఇక్కడికి చేరుకోలేరు! వారు ఆత్మను నిర్మలంచేసి నిశ్చలమనస్సుతో శాశ్వత సత్యాన్నిగూర్చి అన్వేషిస్తూ ఎంతో కాలం తపస్సుచేసే యోగులు! అలాంటివాళ్ళ తపస్సు ఫలితంగా వారి శరీరంలోవుండే సూక్ష్మశరీరం జ్ఞానంతో వెలుగుతుంది!”

“అదిగో చూడు! ఇక్కడ కనిపించే వెలుగు సూర్యుడికి సంబంధించినదీ కాదు, చంద్రకాంతీ కాదు! అగ్నిహోత్రం తాలూకు వెలుతురూ కాదు! ఇందాకటి లోకాలలో నీవు చూసిన పుణ్యలోకాలలోని వెలుతురూ కాదు! ఇది కేవలం జ్ఞానంతో వెలిగే — తపోజ్ఞానంతో వెలిగే కాంతి! ఇక్కడి కాంతి మానసికం — అంటే మనస్సునుంచి ప్రకాశిస్తుంది! ఆత్మీయం అనగా తపస్సులో యోగసాధనలో ఆత్మపవిత్రం కాబడి అగ్నిహోత్రంలా వెలుగుతుంది! ఆ తపస్సుయొక్క కాంతియే ఈలోకాలలోని వెలుతురు! అందుకే దీనిని ‘తపోలోకం’ అంటారు! ఇక్కడ వెలుతురుకూ జ్ఞానమునకూ భేదంలేదు! ఇక్కడ వెలిగే వెలుతురుయొక్క తీవ్రతనుబట్టి మనం చూసే మహాత్ముల తపశ్శక్తిని వారి ఆధ్యాత్మిక ఉన్నతిని గ్రహించవచ్చు! అంటూ ఇలా మూడులోకాలవరకూ చూపించారు!

ఆపైనవుండే లోకాలు దృశ్యంలాగా కలలోలాగ కనిపించాయి! కేవలం గుణాలకిందనే ఏర్పడివుంటాయి! వాటినే మన ప్రాచీనశాస్త్రాలలో ‘వైరాజలోకాలు’ అని చెప్పబడినాయి! ‘తపోలోకాలు’ ఈ విశ్వానికి చిట్టచివరగావుండే బ్రహ్మలోకంలోని సత్యంయొక్క కాంతిలో వెలిగే

లోకాలివి! ఇక్కడికి చేరుకున్నవారికి ఇక మరణంవుండదు! వాళ్ళు తిరిగి జన్మించడం అసలే వుండదు! వీరి శరీరాలుకూడా మిగతా లోకాలలోని జీవులవలే మనిషిని పోలిన ఆకారంతో కనిపించేవి కావు! భగ్గున మండుతున్న జ్వాలవలే మంటలలోని నాలుకలు క్షణక్షణానికీ మారిపోతున్న ఆకారాలతో కనిపించినట్టే అగ్నిహోత్రంవలే ఆకాశంలో మేఘాలమాదిరిగా చెరువులో అలలులాగా కనిపిస్తాయి!"

"వీటికి ఆకారం వుండదా గురుదేవా?" అని ప్రశ్నించాను!

వీటికి ఆకారం వుండీ వుండనట్టు చెరువులోని అలలవలే మనస్సులోని ఆలోచనలతో ఏర్పడివుంటుంది! ఏదైనా ఆకారం ఏర్పడినంతసేపే వుంటుంది! మళ్ళీ మరుక్షణమే కరిగిపోతుంది! దీనినే సాకార నిరాకారంలోని సగుణ నిర్గుణముల గుణ-సామ్య స్థితియని వేదాలు, పురాణాలు వర్ణించాయి! ఇక్కడనే 'తృషిత-లోకం' అనే చాలా ఎత్తునవుండే దివ్యలోకంలో పద్మాసనంమీద కూర్చుని ధ్యానిస్తూ కనిపించారే — వారే భవిష్యత్తులో భూమికి అవతరించబోయే అవతారమూర్తులు! వీరినే ప్రత్యేక బుద్ధులు అంటారు! రానున్న మైత్రేయబుద్ధుడు, శంబలప్రభువు ఇంకా ఇప్పుడు బలిచక్రవర్తిగావుండి రానున్న కల్పంలో మనుచక్రవర్తిగా వచ్చే సావర్ణికమనువు లక్షలకొలదీ సంవత్సరాలనుంచీ తపస్సుచేస్తూ ఇక్కడ వెలుగుతూవుంటారు ఈ దివ్యలోకంలోనే!

ఇలా చెప్పుకుంటూపోతే నా గురుదేవులు నాకు చూపిన వింతలూ విశేషాలు కొన్ని సంవత్సరాలపాటు చెప్పిన నేను చూడడానికి ఒక్క క్షణంలో కనిపించిన అనుభూతి వర్ణనకూడా పూర్తికాదు! నీవు అడిగిన

ప్రశ్నలకి సమాధానం దీనినిబట్టి గ్రహించవచ్చు — గ్రహాలు వేరు, లోకాలు వేరు!

అంటే మాటలో చెప్పాలంటే మనం తిరిగే ఈ భూగోళం వేరు! భూమి ఇతరగ్రహాలు సూర్యుడు ఏపదార్థంనుండి తయారుఅయినాయో ఆ పదార్థమయ ప్రపంచమంతా భూలోకం, భూగోళం కాదు! అలాగే అన్నీను! తెలిసిందా!'' అంటూ ముగించారు!

“ఇప్పటికే పాపం మీరంతా ఆకలితో మాడిపోతున్నారు నకనక లాడుతూ! ఇంకా ఎక్కువసేపు మిమ్మల్ని భోజనానికి ఆలస్యంచేయడం నాకు ధర్మంకాదు!'' అంటూ లామా మహాశయుడు చివాలున లేచి మా ఎదురుగా ఘుమఘుమలాడుతూ పొగలుకక్కుతున్న వంటకాలవైపు దారితీశాడు!

◆

"అంగారక" - గ్రహాంశ

30

అంగారక గ్రహానికి ప్రయాణం !

ఆరోజు — నా జీవితంలోనే మరచిపోలేని అద్భుతమైన అనుభూతి! శరీరం విడిచిపెట్టి ప్రయాణంచేసే అనుభవాలలో నాగురుదేవులు తాషీలామాతో కలిసి అంగారక గ్రహానికి సూక్ష్మశరీరంతో వెళ్ళటం తలచుకుంటే ఇప్పటికీ కళ్ళకు కట్టినట్టు కనిపిస్తుంది. ప్రతీ చిన్న అంశమూ, ఒక అద్భుతమైన సినిమాలోని దృశ్యంలా గొప్ప సస్పెన్స్‌తో నా జ్ఞాపకాలలో ముద్రించుకుపోయింది!

నా గురుదేవులు తాషీలామాగారు రెండునిముషాలలోగా ఆకాశంలో నిలబడి కనిపించారు. నేను అంత త్వరగా శరీరంలోంచి విడిపడి బయటకు రాలేకపోయాను. ఆయన జాలిగా నావంక జూస్తూ —

“లోబ్‌సాంగ్! నీవు ఇతర గ్రహాలకు ప్రయాణంచేసే ఉత్సాహంలో నీ శరీరాన్ని కింద విడిచిపెట్టడం మర్చిపోయావు! కంగారుగా మామూలుగా శరీరంలో ఉన్నప్పుడు పరిగెత్తినట్లే పరిగెత్తాలని ప్రయత్నంచేస్తున్నావు. ముందు విశ్రాంతిగా శరీరాన్ని పట్లు అన్నీ విడిచేసి సుఖప్రాణాయామం ద్వారా డీలాగా రబ్బరు టైరు గాలితీసివేస్తే ఎలావుంటుందో, అలా వదిలి వేయాలి! నిదానం!! తొందరపడకు!” అనేసరికి నాతప్పు నాకు తెలిసింది. మేం ప్రయాణించేది సూక్ష్మశరీరంతోగదా? అన్న విషయం ఒక్క క్షణకాలం నాకు గుర్తుకురాలేదు. ఈ శరీరంతోనే గురుదేవులవెంట పరిగెత్తినట్టే వారివెంట పరుగెత్తాలని ఆదుర్దాపడ్డాను. అందువల్ల నేను శరీరంతోపాటే లేవడంచూసి ‘తాషీలామా’ గురుదేవులు నాతప్పును నాకు ఎత్తి చూపించారు.

మరుక్షణమే నేను శరీరాన్ని ఒకగాలి తీసేసిన రబ్బరు తిత్తిలాగ జాయంట్లన్నీ పట్టువిడిచి విశ్రాంతిగా వదిలేశాను. శ్వాసను కూడా తీరుబడిగా, నెమ్మదిగా, ఎంతో నెమ్మదిగా — అతినెమ్మదిగా పీలుస్తూ — నేను ఊహించేసరికే నాశరీరంపైన గాలిలో తేలుతూ — పైన ఆకాశంలో నిలబడ్డాను! గురుదేవులు తనపక్కన నిలబడిన నన్నుచూసి — “ఇక పోదామా!” అన్నట్టుగా తలఊపి (మాటలులేవుగా?) రివ్వున బాణంలా ఆకాశంలోకి దూసుకుపోయారు. రెండుచేతులతో నన్ను కనుక తాషీలామా గురుదేవులు గట్టిగా పట్టుకునివుండకపోతే అంతవేగంగా నేను ప్రయాణించగలిగేవాడినే కాదు! మధ్యలో కనిపించే వింతలూ, విచిత్రాలు, వినోదాలు చూస్తూ రోడ్డుమీద అన్నీచూస్తూ వెనక్కితిరిగి తండ్రి చెయ్యిపట్టుకొని వెనకబడుతూ నడిచే పిల్లవాడిలా వెళ్ళివుండే వాడినేమో!

సన్నటి సూది దబ్బనాలవంటి ముళ్ళు ఏవో వెలుగుతూ పొడుగాటి తీగల్లాగా దూసుకుపోతూవుంటే భయంగా నా కుడి, ఎడమప్రక్కలకు ఆశ్చర్యంతో చూశాను! నా ఆలోచనలను చదివినట్టే 'తాషీలామా' గురుదేవులు కొంచెం వెటకారంగా నవ్వుతూ — "లోబ్‌సాంగ్? నువ్వేం భయపడకు! అవి ముల్లూ కాదు, దబ్బనాలూ కావు! కాంతికిరణాలు!! మనం ప్రయాణిస్తున్నది ఆకాశంలో గదా? మనకి చుట్టూరా క్రిందా పైనా అన్నివైపులా లెక్కలేనన్ని నక్షత్రాలు జిగేలుమని వెలుగుతూ మిరుమిట్లు గొలుపుతున్నాయి. అవి నిలబడిచూస్తే వెలిగే చుక్కల్లాగా కనిపిస్తాయి.

కాని, అతివేగంతో ప్రయాణిస్తున్నందువల్ల, ఆ కాంతికిరణాలే మనకి ఆకాశంలో దూసుకుపోయే ముళ్ళపంది వొంటిమీది ముల్లులాగా కనిపిస్తాయి. చిన్నపిల్లవాడిగా నీకూ అనుభవమేకదా! వానాకాలంలో వీధిలో వెలిగించిన దీపాన్ని చూస్తూ కంటిరెప్ప క్రిందకి నొక్కితే ఆ దీపం చుట్టూ కాంతి చీపురుకట్టలాగా లేక ఒక గండుపిల్లి మీసాలవలే ఆ కిరణాలు అన్నివైపులకూ చిమ్ముతూ కనిపిస్తాయి! అవి కాంతికిరణాలే కదా, మీసాల్లా కనిపిస్తాయి. ఇవీ అంతే! మొదట్లో ఇలాగే వింతగా ఉంటుంది. అదిగో ఎదురుగా వచ్చేది ఒక తోకచుక్క లేక ఉల్క!" అంటూ అకస్మాత్తుగా హెచ్చరించారు.

నేను అటు చూసేసరికి పెసరగింజంత వెలుతురు! అకస్మాత్తుగా పెరిగిపోయి క్షణంలో నూరవ వంతులో వెడల్పైన పెద్ద కొండరాయి నాతలవైపుగా దూసుకువస్తూవుంటే భయంతో త్రుళ్ళిపడి ఒక్కగెంతు గెంతాను, పక్కకుమళ్ళీ తప్పించుకోవాలని! మరుక్షణంలోనే భళ్ళున నవ్వారు గురుదేవులు నా ఖంగారుచూసి.

“ఒరే లోబ్‌సాంగ్ ! నువ్విప్పుడు శరీరంలో లేవుకదా? ఇంక భయమెందుకు? ఎంతపెద్ద ఉల్కలుగాని, గ్రహాలుగాని, తోకచుక్కలుగాని నిన్ను ఢీకొన్నా అవి మన శరీరాలను తాకలేవు! ఇప్పుడు మనం దీపకాంతిప్రక్కనే వెలిగే నీడలలాగా ప్రయాణిస్తున్నాము!” — అనగానే నాతప్పు నాకు తెలిసింది. ఎదురుగా వచ్చే ప్రమాదం ఢీకొంటుందని భయపడడం ఓ అలవాటుగా ఏర్పడిపోయింది — శరీరానికి ఉన్న అభ్యాసంచేత!

దీనినిబట్టి నాకు ఒకటి అర్థమైంది — మనం పదార్థంతో ఏర్పడ్డ ఈ మాంస శరీరంతో అలవాటుగా జీవించడంవల్లనే ఈ శరీరమే మనం అనుకొని భయపడే అలవాటును మరిచిపోవడానికి ఎంతకష్టమో? చాలామంది మరణించాక కూడా — ఇలాగే భయపడుతూవుంటారు, తనకి — శరీరం లేదని గుర్తులేక!”

ఇంతలో రివ్వున నూరు అడుగుల ఎత్తున ఓ మండిపోతున్న గోళం మాకు కుడివైపుగా తిరిగి ముందుకు దూసుకుపోతున్నది!”

మళ్ళీ గురుదేవుల కంఠం! “లోబ్‌సాంగ్! మనం బృహస్పతి గ్రహం ప్రక్కనుంచి దూసుకువెలుతున్నాం కాంతివేగంతో! అది మనకి నిలువెత్తుగా కనిపించిందంటే బృహస్పతి గ్రహానికి మనం ముప్పై-లక్షలమైళ్ళ దూరం నుంచి దూసుకుపోతున్నాం — తెలిసిందా! భయపడి తప్పుకోనక్కరలేదు!” అన్నారు నా భయానికి వేళాకోళంగా! నాకెంతో చిన్నతనం అనిపించింది నా అజ్ఞానానికి!

ఈ శరీరంలో అనేక జన్మలుగా నివాసంగా వుండటంవల్ల ఇలాంటి

భయాలూ, ఆశలు, స్నేహాలూ, ద్వేషాలు — దీర్ఘరుగ్మతల లాగా అలవాటుగా మారి మన మనస్సును పట్టుకొని పీడిస్తాయి. ఆ భయాలను, భ్రాంతులను జయించిన తాషీలామా గురుదేవుల దివ్యానుభవానికీ — ఆయన విజ్ఞానానికీ, వివేకానికీ, నేనెంతో ఆశ్చర్యపోయాను.

"మనం ఎడంవైపుగా మలుపు తిరగాలి! గుర్తులేదా? బృహస్పతికి, శుక్రుడికి మధ్యన తిరుగుతూవుంటాడు — అంగారకుడు అనిగదా? నీకు జ్యోతిషం చెప్పిన గురువు 'చోగ్యాల్ రింపోచీ' బోధించింది?" అంటూనే నా ప్రయత్నం లేకుండానే సర్రున ఎడమవైపు తిరిగి మరింత శరవేగంతో ముందుకు దూసుకుపోయారు గురుదేవులు.

మరికొంతసేపటికి మాఎదురుగా ఒకపెద్ద గుండ్రని మండిపోతున్న అగ్నిగోళంలాంటి వెలుగుతూవున్న చక్రంలాంటిదేదో కనిపించింది. సెగలు కక్కుతూ, పొగలూ కక్కుతూ!!! భయంకరంగా వెలుగుతున్న — ఆ బింబం ఆశ్చర్యంగా చల్లగానే వుంది!

అప్పుడు గుర్తుకువచ్చింది మేం ప్రయాణించే ఈ సూక్ష్మశరీరాలకి వేడిగాని, చలిగాని, ఏవీ స్పర్శకు ఏమాత్రం తగలవు! ఎదురుగావున్న ఆ అగ్నిగోళాన్ని చూస్తుంటే మేము సూర్యుడిలోకే వెళ్ళి పడిపోతున్నామేమో అన్నంత భయం, కంగారూ కలిగాయి నాకు!

"నాయనా! లోబ్‌సాంగ్! అదిగో! వచ్చేశాం!! ఆ ఎదురుగా కనిపించే ఎర్రటి అగ్నిగోళమే — మనం చేరవలసిన అంగారక గ్రహం! "అంగారకుడు" అంటే సంస్కృతభాషలో — నిప్పులు అని అర్థం! ఇప్పుడు మరికొద్ది నిముషాలలో మనం ఆ అంగారక గ్రహంమీదకి వెళ్లి దిగుతాం! నాచేతుల్ని మరింత గట్టిగా పట్టుకో!"

అంటూనే తటాలున తల క్రిందకీ, కాళ్ళు పైకీ వొచ్చేలాగ పెట్టి పల్టీకొట్టినట్లు పిల్లిమొగ్గ వేసి — గిర్రున తిరిగి నిలబడ్డారు గురుదేవులు! ఎందుకా? అని ఆశ్చర్యపోయేలోగా ఆయన కంఠం స్పష్టంగా నాతలలోనే వినిపించింది — ఆలోచనలతోనే కదా వారు మాట్లాడేది? అని గుర్తుకు వచ్చి ఆశ్చర్యపోయాను.

పెద్ద పెద్ద ఇటుక రంగులో ఎర్రటి పర్వతాలు మాకు కుడివైపునా, ఎడమవైపునా ఆకాశానికి అంటుతూ పైకి పెరిగినట్టు ఎత్తుగా కనిపించాయి! నేలమీద ఎర్రటిరాళ్లూ, దుమ్మూ, ఎర్రధూళీ, గాలికి దుమారంలా ఎగురుతోంది. అక్కడ నేలంతా ఒక్క చుక్కనీరులేకుండా పొడిగా బండ రాళ్ళతో నిండి వుంది! మెత్తని మైదాపిండివంటి కనకాంబరం రంగు ధూళి — కనిపించింది, ఎక్కడ చూసినా!

భూమికన్నా అతివేగంగా తిరుగుతున్నది కుజగ్రహం!! రాత్రిళ్ళు, పగళ్ళు పొట్టిగావున్నాయి. ఆకాశం ఎర్రగా విచిత్రంగావుంది. మన భూమి మీదలా నీలాకాశం లేదు. అప్పుడు గుర్తుకువచ్చింది ఏగ్రహం మీద వాతావరణాన్నిబట్టి అక్కడి ఆకాశం రంగు మారిపోయి కనిపిస్తుందని!

కొన్ని క్షణాలలో అంగారక గ్రహంచుట్టూ ప్రదక్షిణంగా తిరిగి ఎన్నో వింతలు, విశేషాలు చూశాను. పందికొక్కుల కన్నాలవంటి బొరియల లాగా నేలలోకి కన్నాలున్నాయి. ఎక్కడా నీరు చుక్కఅయినా కనిపించ లేదు — మచ్చుకుకూడా! ఇక్కడ మన భూమికన్నా ఎంతో చలి — మళ్ళీ రెండవవైపు సూర్యరశ్మిపడేచోట విపరీతమైన ఎండవేడితో — వడగాడ్పులతో ఇక్కడ ఈ గ్రహంచుట్టూ వాతావరణం భూమిలాగా

ఉండదు!'' అంటూనే కుజగ్రహంచుట్టూ తిరిగే చందమామల వంటి ఉపగ్రహాల్ని చూశాం! ఇంకా ఎన్నో వింతలు, విశేషాలు ఆ గ్రహంమీద నాకు కనిపించాయి. అన్నీ సరిగ్గా గుర్తులేవు.

అంగారక గ్రహంమీద వెళ్ళి దిగామన్న ఉద్రేకంవల్లా, ఆ ఉత్సాహంవల్ల నీకు సూక్ష్మశరీరంతో ప్రయాణించడంలో అనుభవం తక్కువ కావడంవల్లా, నువ్వు చూసిన వింతలన్నీ కలల మాదిరిగా అల్లుకుపోయి, కలిసిపోయి సరిగ్గా గుర్తుకురావు! ఈసారి ఇంకొకమారు అంగారక గ్రహానికి యాత్ర చేసినప్పుడు నువ్వు ఒక్కడివే వొచ్చి — అన్నీ తీరుబడిగా చూసి గుర్తుపెట్టుకొని మళ్ళీ భూమికి, తిరిగి వద్దువు గాని!''

అక్కడ భూమ్మీద మన లామాసరీ వద్ద తెల్లవారుతోంది! బయలు దేరుఇంక! మనం పరుగెత్తాలి!''

అంటూ నా సమాధానంకోసం చూడకుండా తేషూ లామా గురు దేవులు నాప్రక్కనుంచే దూసుకుపోతూ దూరంగా నక్షత్రంలా వెలుగుతూ మాయమయ్యారు.

వారి వెనకాతలే మంచు కొండలమీద స్కేటింగ్‌చేసే వారిలాగా దూసుకుపోతూ వెంబడించి మా లామాసరీలో ఉన్న శరీరంలోకి దూర టానికి నాకు కాస్త ప్రయాసపడ్డాను.

అప్పటికే మిగతా బ్రహ్మచారులుఅంతా మా లామాసరీలో ప్రతి రోజులాగే నేను ఇంకా లేవలేదని గమనించి లేపడానికని వచ్చారను కుంటా — తుళ్ళిపడి లేచాను — ఈ భూగోళంమీద!

(ఇంకా వున్నది II-భాగంలో!)

⁂

పూజ్యశ్రీ వేదవ్యాస గురుదేవుల - రచనలు

I. క్రొత్త విడుదలలు

1.	**Hinduism in the Space Age** (Paper Back) (700 g)	**200/-**
2.	**Hinduism in the Space Age** (Hard Bound) (850 g)	**300/-**
3.	**Astronomical Dating of the Mahabharata War** (720 g)	**300/-**
4.	**Science of Time** (Paperback) (850 g)	**360/-**
5.	**Science of Time** (Library Edn.) (1050 g)	**500/-**
6.	**Vedic Sciences — What are they ?** (500 g)	**120/-**
7.	**A Concise Text Book of Vedic Hinduism** (400 g)	**72/-**
8.	**University of Vedic Sciences — Syllabus & Prospectus**	**30/-**
9.	**SUPARNA — E. Anantacharya** (670 g) Foreword by **Dr. Vedavyas**, IAS, Ph.D., D.Litt.	**190/-**
10.	**Word of God** (200 g)	**60/-**
11.	దేవాలయ ప్రసాదాల - వంట రహస్యాలు! (220 g)	**40/-**
12.	'శంబల' - ప్రభువు! — Part I (అచ్చులో)	
13.	**నా జీవితంలో-అదృష్ట ఘడియలు** శ్రీవేదవ్యాస గురుదేవుల ఆధ్యాత్మ-కథ (Paper Back)	**96/-**
14.	**నా జీవితంలో-అదృష్ట ఘడియలు** శ్రీవేదవ్యాస గురుదేవుల ఆధ్యాత్మ-కథ (Hard Bound)	**150/-**

II. పారాయణ గ్రంథాలు '

15.	**శ్రీగణేశ పురాణం**-I (hard bound) (615 g)	**150/-**
16.	**శ్రీగణేశ పురాణం**-II (hard bound) (675 g)	**150/-**
17.	**శ్రీ భాగవత రసామృతము** (ప్రథమ, ద్వితీయ, తృతీయ స్కంధములు) (900g)	**150/-**
18.	**శ్రీ భాగవత రసామృతము** (చతుర్థ, పంచమ, షష్ఠ స్కంధములు) (900 g)	**210/-**
19.	**శ్రీ భాగవత రసామృతము** (అష్టమ, నవమ స్కంధములు) (800 g)	**150/-**
20.	**శ్రీ భాగవత రసామృతము** (దశమ స్కంధము-ప్రథమగుచ్ఛము) (800 g)	**150/-**
21.	**శ్రీ భాగవత రసామృతము** (దశమ స్కంధము-ద్వితీయభాగము) (800 g)	**150/-**
22.	**శ్రీ భాగవత రసామృతము** (ఏకాదశ-ద్వాదశ స్కంధములు) (340 g)	**78/-**
23.	**శ్రీవేంకటేశ్వర వైభవం**-I (1/8 Demmy) (420 g)	**75/-**
24.	**శ్రీవేంకటేశ్వర వైభవం**-II (430 g)	**96/-**
25.	**శ్రీవేంకటేశ్వర వైభవం**-III (430 g)	**96/-**
26.	**శ్రీవేంకటేశ్వర వైభవం**-IV (430 g)	**96/-**

పూజ్యశ్రీ వేదవ్యాస గురుదేవుల – రచనలు

27.	శ్రీరామానుజ వైభవం-I (300 g)	60/-
28.	శ్రీరామానుజ వైభవం-II (360 g)	70/-
29.	1999–కలియుగాంతం – కాలజ్ఞానం-I (320 g)	60/-
30.	1999–కలియుగాంతం – కాలజ్ఞానం-II (270 g)	39/-
31.	1999–కలియుగాంతం – కాలజ్ఞానం-III (320 g)	60/-

పూజాగ్రంథాలు

32.	గురుగీత (40 g)	10/-
33.	నిత్యపూజకు చదువవలసిన స్తోత్రాలు (90 g)	15/-
34.	పురుషసూక్త – రహస్యం (280 g)	42/-
35.	శ్రీసూక్త – రహస్యం (90 g)	36/-
36.	శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రం (130 g)	30/-
37.	శ్రీలక్ష్మి సహస్రనామ స్తోత్రం (80 g)	20/-
38.	యదార్థ భగవద్గీత (తెలుగు భగవద్గీత) (hard bound) (375 g)	45/-
39.	ప్రాచీన భగవద్గీత Vol. I (Revised Edition) (290 g)	65/-
40.	ప్రాచీన భగవద్గీత Vol. I & II (hard bound) (revised edition) (650 g)	116/-
41.	శ్రీ విష్ణుసహస్రనామ నవనీతవ్యాఖ్యానము Vol.-I (260 g)	120/-
42.	శ్రీ విష్ణుసహస్రనామ నవనీతవ్యాఖ్యానము Vol.-II (300 g)	120/-
43.	మన్యుసూక్తవిధాన శివపూజా రహస్యములు (300 g)	75/-
44.	గాయత్రీ మంత్రానుష్ఠాన విధానము (220 g)	50/-
45.	శ్రీ సత్యనారాయణవ్రత రహస్యం–అంతరార్థం (120 g)	25/-
46.	నవగ్రహ శాంతి విధానం (120 g)	20/-
47.	సత్సంగం (70 g)	15/-
48.	సాయినాథ చరిత్ర (పారాయణ గ్రంథం) (270 g)	60/-
49.	తిరుప్పావై (ధనుర్మాసవ్రత పారాయణగ్రంథం) (210 g)	45/-
50.	వినాయక చతుర్థి – గణేశ మంత్రాలు (50 g)	10/-

III. మన సంస్కృతికి దర్పణాలు

51.	మనదేశం – మనసంస్కృతి (235 g)	60/-
52.	మన – పండుగలు (200 g)	40/-

పూజ్యశ్రీ వేదవ్యాస గురుదేవుల – రచనలు

53. మన సనాతన ధర్మం–జాతీయవిద్య (జాతీయ వాచకం) (675 g)	96/-
54. అణుయుగంలో హిందూమతం (200 g)	50/-
55. శ్రీ విద్యారణ్యస్వామి చరిత్ర (హిందూరాష్ట్ర స్థాపకుడు) (180 g)	25/-
56. శ్రీ వేదవ్యాస మహర్షి – దివ్యచరిత్ర (340 g)	60/-

సాధనాగ్రంథాలు

57. నిత్యజీవితంలో యోగసాధన (135 g)	30/-
58. సాధనా రహస్యాలు (180 g)	36/-
59. మంత్రశాస్త్ర రహస్యాలు (85 g)	45/-
60. వ్యాసపీఠం (120 g)	25/-
61. 'మాస్టరు C.V.V.–గారి ఎలక్ట్రానిక్ యోగం' (340 g)	73/-
62. వ్యాసవాణి (వేదవ్యాసగురుదేవుల అమృత సందేశాలు ప్రవచనాలు!) (300 g)	60/-
63. వ్యాసగీత (80 g)	18/-

IV. పరిశోధనా గ్రంథాలు

64. యుగపురుషుడు (శ్రీకృష్ణునిపై చారిత్రక–పరిశోధనా గ్రంథం) (190 g)	39/-
65. మహాభారత కాలనిర్ణయం — (Ph.D.) (180 g)	45/-
66. పరాశర జ్యోతిషం Vol.-I (310 g)	64/-
67. పరాశర జ్యోతిషం Vol.-II (310 g)	54/-
68. పరాశర జ్యోతిషం Vol.-III (430 g)	110/-
69. జ్యోతిష గణితబోధిని (అచ్చులో)	
70. వేదాలలో హిందూమతం Vol.-I (270 g)	62/-
71. వేదాలలో హిందూమతం Vol.-II 'సనాతన హిందూమతం'లో పునర్జన్మ! (270 g)	62/-
72. వేదాలలో హిందూమతం Vol.-III అవతార సిద్ధాంతం (270 g)	62/-
73. వేదాలలో హిందూమతం Vol-IV 'సాధనా మార్గాలు'! (270 g)	62/-
74. వేదాలలో హిందూమతం Vol.-V 'దేవతార్చన - పూజావిధానం'! (270 g)	62/-
75. 'అదృష్ట-రేఖ' (430 g)	51/-
76. హస్తసాముద్రికం (240 g)	50/-
77. జ్యోతిషం సైన్సా? – మూఢవిశ్వాసమా? (215 g)	30/-
78. హజీవారీష్ అలీషా దివ్యచరిత్ర (షిర్డీ సాయినాథుని గురువు) (190 g)	30/-

పూజ్యశ్రీ వేదవ్యాస గురుదేవుల – రచనలు

79. ఇండియాలో – జీసస్? (కాశ్మీరులో క్రీస్తు సమాధి (270 g) జీసస్ జాతకం... వంటి అద్భుత పరిశోధనల గ్రంథం)	50/-
80. నివేదిత (80 g)	20/-
81. ఆయుర్వేద హృదయం (170 g)	40/-
82. శ్రీరామ చరితామృతం (180 g)	36/-
83. భగవంతుని దీపాలు (210 g)	25/-
84 . ఏరిన ముత్యాలు (150 g)	25/-
85. సోవియట్ రష్యాలో ఆధ్యాత్మిక పరిశోధనలు (230 g)	40/-

V. మీ అదృష్టాన్ని మలిచే గ్రంథాలు

86. మీ ఇంటినిబట్టి మీ అదృష్టం (75 g)	15/-
87. మీ జీవితంలో అదృష్ట ఘడియలు (75 g)	15/-
88. మీ జన్మతేదీలో మీ అదృష్టం (75 g)	15/-
89. నవ్వితే నవరత్నాలు (90 g)	20/-
90. సంఖ్యాశాస్త్రం (అచ్చులో)	

VI. ENGLISH BOOKS

91. **1999 - End of Kali Yuga** (290 g)	**75/-**
92. **Dr. Vedavyas - The Saint of the Space Age** (150 g)	**35/-**
93. **Wisdom of Longevity (Ayurveda)** (200 g)	**60/-**
94. **Master-C.V.V. And His Electronic Yoga** (Paper Back) (400 g)	**96/-**
95. **Master-C.V.V. And His Electronic Yoga** (Hard Bound) (470 g)	**105/-**
96. **Making and Unmaking of India — As a 'Nation'** (300 g)	**60/-**
97. **Everything And Nothing** (1600 g)	**360/-**

కాపీలకు : పుస్తకం ఖరీదు + పోస్టేజి కలిపి **Y. సాంబశివరావు,** హైదరాబాదు పేర D.D. తీసి ఈక్రింది అడ్రసుకు పంపాలి.

"శుభవార్త"–ఆధ్యాత్మిక మాసపత్రిక (విడిప్రతి : రు.7/-, సంవత్సర చందా : రు.84/-)

రు.84/- లు సెక్రటరీ, USCEFI, Hyderabad పేర D.D. తీసి ఈక్రింది అడ్రసుకు పంపాలి.

For Copies : **Smt. Sikha Pushpavati**, No. 5/2, Chandramouli Nagar,
Gunturu - 522 001. Ph : (0863) 2351108

త్వరలో విడుదల



'శంబల' - ప్రభువు!

రెండవ భాగం

ఇందులో...

- ◆ తెల్ల గుఱ్ఱం అర్థం!
- ◆ ధర్మ శరీరుడు !
- ◆ వజ్రశ చక్రం మేఖువు

'శంబల' - ప్రభువు!

'పరిశోధనాత్మక నవల'

ఈ భూమ్మీద అన్యాయం పెచ్చుపెరిగి అధర్మం జడలు విదిల్చి దుర్మార్గం విషం కక్కుతూ అమాయకులకూ, సాధు సత్పురుషులకూ, ఇతర్లకేమీ అపకారం చేయకుండా జీవించే సాధుజీవులకూ ప్రమాదంవాటిల్లినపుడూ - ఈ సృష్టికి కర్తా, అధికారీ, తండ్రివంటి రక్షకుడూ, ఐన శ్రీవిష్ణుభగవానుడు - భూమికి అవతరించి తిరిగి ధర్మాన్ని స్థాపించి దుర్మార్గులను సంహరించి సమాజంలోని అన్యాయాలనూ అక్రమాల్నీ రూపుమాపి 'ధర్మరాజ్యాన్ని' స్థాపించుతాడు.

వ్యాస వాల్మీకులు గతించిన అవతారాల గాథమాత్రమే కాకుండా రానున్న "శంబల ప్రభుని" దివ్యావతారగాథను కూడా ఇలాగే అందించారు. భవిష్యత్తును 'కాలజ్ఞానం' ద్వారా దివ్యదృష్టితో చూసి - రాబోయే 'భవిష్యపురాణం' రూపంలో! చదవడం - తెలుగులో ఇంకా 'శంబలప్రభువు' పరిశోధనా - రహస్యాల్ని. ఇంకా :-

ఇందులో...

- శంబల ప్రభువు
- జీవించే - 'నడిచే-శిల' "చింతామణి!"
- గుఱ్ఱంమీద వీరుడు !
- 'శంబల'కు - మా సాహసయాత్ర!
- మంచు-పులి
- 'దేవతాత్మ' - ఈ సిద్ధుల తపోభూమి!
- కైలాసపర్వతం ! - కైవల్యపర్వతం !!
- శరీరం విడిచి - ప్రయాణం !
- వేట-కుక్కలు !
- 'స్పటిక'-పర్వతం !
- దత్తప్రభువు దర్శనం !
- అంతర్జాతీయ 'అంతరిక్ష-సంస్థ' "నాసా" - 'శిఖరాగ్ర సమావేశం!'
- "నదిక్రింద సొరంగంలో" !!
- లామ - ఆత్మకథ !
- తాంత్రికప్రక్రియ - ఛోద్
- పై'లోకాలు' - "గ్రహ-మండలాలూ!"
- అంగారక-గ్రహానికి ప్రయాణం !

చిత్రవిచిత్రమైన - పరిశోధనా నవలిక

డా. వేదవ్యాస D.Litt. గారి - ఇతర ఆధ్యాత్మిక ప్రచురణలు లోపలి పేజీల్లో...